శనివారం 16-11-2024


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 235

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరీస్ భారత్ కైవసం

సౌతాఫ్రికాతో జరిగిన 4వ టి20లో సామ్సన్, తిలక్ వర్మ సెంచరీలు.. -17లో



అన్షుల్... 10కి 10 వికెట్లు

రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో హరియాణా బౌలర్ అన్షుల్ కంబోజ్ అరుదైన ఘనత -17లో



ఆదివాసీలను ఆరాధిస్తున్నాం

ఆదివాసీ సమాజాన్ని తాము ఆరాధిస్తున్నామని.. గిరిజన జాతికి తగిన గుర్తింపు ఇవ్వాలని సంకల్పించామని ప్రధాని మోదీ తెలిపారు.

వివరాలు 6లో ▸



700 కిలోల డ్రగ్స్ స్వాధీనం

గుజరాత్‌లోని పోర్బందర్ తీరంలో సుమారు రూ. 3,500 కోట్ల విలువైన 700 కిలోల డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వివరాలు 6లో ▸



మంత్రిగా వ్యాక్సిన్ల వ్యతిరేకి

అమెరికా ఆరోగ్య మంత్రిగా వ్యాక్సిన్ వ్యతిరేక ఉద్యమకారుడు రాబర్ట్ ఎఫ్. కెనెడీ జూనియర్‌ను నియమించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

వివరాలు 6లో ▸



శ్రీలంకలో ఎన్‌పీపీ విజయం

శ్రీలంక పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌పీపీ కూటమి 225 సీట్లకుగాను 159 సీట్లు గెలుచుకుంది. 61% ఓట్లు పొందింది.

వివరాలు 6లో ▸

దేశంలో అత్యధిక సర్క్యులేషన్ పత్రికల్లో 8వ స్థానంలో సాక్షి



'సాక్షి' రోజువారీ సర్క్యులేషన్

12,47,492

తొలి స్థానంలో దైనిక్ భాస్కర్ (హిందీ)

రెండో స్థానంలో దైనిక్ జాగరణ్ (హిందీ)

మూడో స్థానంలో అమర్ ఉజాలా (హిందీ)

నాలుగో స్థానంలో టైమ్స్ ఆఫ్ ఇండియా (ఇంగ్లిష్)

ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ వెల్లడి

- వివరాలు 14లో



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్)

నోటికాడి కూడు తీసుకుంటారా?

"తరాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న మాకు భూములే జీవనాధారం. వ్యవసాయం తప్ప మరో పని చేయడం మాకు తెలియదు. ఇప్పుడు ఫార్మా విలేజ్ పేరిట మానోటి కాడ కూడును తీసుకుంటామంటున్నారు. అదే జరిగితే మా కుటుంబాలు రోడ్డు మీద పడి ఆగమవుతాయి. మూడు పంటలు పండే బంగారం లాంటి భూములను ప్రభుత్వానికి ఇచ్చేదిలేదు. ఇక్కడ ఉన్న ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తామంటున్న పరిహారం ఏ మూలకూ సరిపోదు.



- బేగరి విఠల్, రైతు, దప్పూర్, సంగారెడ్డి జిల్లా

ఫార్మాకు 'భూ'గ్రహణం!

జీవనాధారమైన భూముల్ని ఫార్మా విలేజ్‌లకు అప్పగించబోమంటున్న రైతులు

- బీఆర్ఎస్ ప్రభుత్వం తలపెట్టిన ఫార్మా సిటీకి బదులు పదిచోట్ల ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు కాంగ్రెస్ సర్కారు నిర్ణయం
- తొలి విడత ముచ్చర్ల 'ఫార్మా సిటీ'లో రెండు, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఒక్కొక్కటి ఏర్పాటుకు నిర్ణయం
- ఎక్కడికక్కడ స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయన్న యోచనలో ప్రభుత్వం
- అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నది ప్రభుత్వ వాదన
- ఫార్మా పరిశ్రమలతో గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతాయంటున్న స్థానికులు
- తమ విలువైన భూములకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏ మూలకూ సరిపోదంటూ అభ్యంతరం
- వికారాబాద్, సంగారెడ్డిలో రైతుల ఆందోళన.. ఇటీవల లగచర్లలో కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులపై దాడి
- భవిష్యత్తులో భూసేకరణ కష్టంగా మారొచ్చు: అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఫార్మా రంగంలో భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ సమస్య తగ్గించవచ్చనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సమీకృత గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల (ఫార్మా విలేజీలు) ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ సవాలుగా మారుతోంది. భూ సేకరణకు జారీ చేస్తున్న నోటిఫికేషన్లపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. తమ గ్రామాల్లో ఫార్మా చిచ్చు పెట్టొద్దంటూ రైతులు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. వ్యవసాయమే జీవనోపాధిగా బతుకుతున్న తాము భూములు అప్పగించేది లేదని తేల్చి చెబుతున్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుతో గాలి, భూ గర్భ జలాలు విషతుల్యమవుతాయని, తాము కాలుష్యం కోరల్లో చిక్కుకుంటామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ విలువైన భూములకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఏ మూలకూ సరిపోదని కూడా అంటున్నారు. బహిరంగ మార్కెట్లో భూమి ధరలతో పోలిస్తే ప్రభుత్వం ఇవ్వజూపుతున్న మొత్తం చాలా తక్కువగా ఉందని పేర్కొంటున్నారు. తమ పిల్లల భవిష్యత్తును పణంగా పెట్టే ప్రతిపాదనలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భూముల పరిశీలనకు, అభిప్రాయ సేకరణకు వస్తున్న అధికారులను

మిగతా 8వ పేజీలో ▶



శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ కోటి దీపోత్సవం ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

గడువులోగా పూర్తి చేయాలి

సమగ్ర సర్వేపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం

ఏ ఒక్క ఇంటినీ వదలకుండా సర్వే నిర్వహించండి

ఆటంకం కలిగించేవారిని ఉపేక్షించొద్దు.. ప్రజల అభ్యున్నతి కోసమే వివరాల సేకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం సీఎం క్యాంపు కార్యాలయంలో కుటుంబ సర్వే జరుగుతున్న తీరుపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. సర్వే ప్రక్రియలో జాప్యం లేకుండా చూడాలని, నిర్దేశించిన కాలపరిమితిలో పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించామని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. మొదటి దశలో చేసిన నివాసాల లిస్టింగ్ ప్రక్రియలో భాగంగా 1,16,14,349 ఇళ్లకు స్టిక్కరింగ్, మార్కింగ్ చేశామని తెలిపారు. వాటిలో ఏ ఒక్క ఇంటినీ వదిలేయకుండా.. ప్రతి ఇంటిలో సమగ్రంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పౌరుల అభ్యున్నతి కోసమే వివరాల సేకరణ జరుగుతోందని చెప్పారు. సర్వేను రాష్ట్ర గవర్నర్ వివరాల సేకరణతో

మిగతా 14వ పేజీలో ▶




త్వరలో కేసీఆర్, హరీశ్‌ల విచారణ?

- కాళేశ్వరం బరాజ్‌లపై క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలవనున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- 21న రాష్ట్రానికి వస్తున్న పీసీ ఘోష్.. 22 లేదా 23 నుంచి విచారణ ప్రక్రియ
- తొలుత ఐఏఎస్ అధికారులు, తర్వాత ప్రజాప్రతినిధులు

- వివరాలు 7లో▶



మాటలు ప్రజలకు.. మూటలు కాంగ్రెస్‌కు..

ఇక్కడ గ్యారంటీలు అమలు చేయకుండా.. మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు: కిషన్‌రెడ్డి

- అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- రైతు భరోసా లేదు.. పింఛన్ల పెంపు లేదు.. బోనస్ ఇవ్వట్లేదు
- రైతులపై కేసులు పెట్టి జైలుకు పంపేంతగా ప్రభుత్వం దిగజారిందని మండిపాటు

8లో

నేడు బీజేపీ మూసీ నిద్ర

- ➤ 20 ప్రాంతాల్లో పార్టీ నేతల బస
- ➤ అంబర్‌పేట తులసీరాంనగర్‌లో కిషన్‌రెడ్డి.. ఎల్‌బీనగర్ ద్వారకాపురి కాలనీలో ఈటల

- వివరాలు 7లో▶



వదిలి పెట్టేదే లేదు!

రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లను చాలా మందిని చూశాం: కేటీఆర్

- మేం అధికారంలోకి వచ్చాక ఏం చేయాలో తెలుసు
- రాబందుల్లా పేదల భూములు కొల్లగొడుతున్నారు
- లగచర్ల బాధితులను పోలీసులు క్రూరంగా హింసించారు
- ఈ రోజు కొడంగల్ తిరగబడింది.. రేపు తెలంగాణ తిరగబడుతుందని వ్యాఖ్య
- సంగారెడ్డి సెంట్రల్ జైల్లో లగచర్ల బాధితులతో ములాఖత్ అయిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

- వివరాలు 8లో▶

ఇదంతేనా!



వాళ్లేమో మనల్ని ధనవంతుల మిత్రులంటున్నార్సార్!!



రూ.100 కోట్లు.. 'గాడిద పాలు'

గాడిద పాల వ్యాపారం పేరిట 'ది డాంకీ ప్యాలస్' మోసం

- లీటర్ రూ.1,600 చొప్పున కొంటామని మాయమాటలు
- ఫ్రాంచైజీ కోసం లక్షలు ముట్టచెప్పామని బాధిత రైతుల గగ్గోలు
- ఐదు రాష్ట్రాల్లో 400 మంది బాధితులు
- ప్రభుత్వాలు న్యాయం చేయాలని వేడుకోలు

సాక్షి, హైదరాబాద్: 'గాడిద పాలకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. గాడిదల ఫామ్ పెట్టుకుంటే మీ నుంచి లీటరు గాడిద పాలను రూ.1,600 చొప్పున మేమే కొంటాం. మంచి లాభాలు ఆర్జించవచ్చు'అని నమ్మించి ది డాంకీ ప్యాలస్ సంస్థ ప్రతినిధులు తమను మోసం చేశారని ఏపీలోని గుంటూరు జిల్లాకు చెందిన సాయిబాబు, మరికొంత మంది బాధితులు ఆరోపించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి జిల్లా ముక్కడల్ గ్రామంలో 'డాంకీ ప్యాలస్'అనే సంస్థ ఉంది. వీళ్లు గాడిదలు, గాడిద పాల వ్యాపారం చేస్తారు. గాడిద పాలతో లాభాలు ఆర్జించవచ్చని యూట్యూబ్‌లో బాగా ప్రచారం చేశారు. దీనికి ఆకర్షితులైన

మిగతా 7వ పేజీలో ▶

‘లోక్‌మంథన్’కు భారత రాష్ట్రపతి

ఈ నెల 22న వేడుకలను ప్రారంభిస్తారు : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారతీయ సంస్కృతి..ఏకత్వాన్ని సమున్నతంగా ఆవిష్కరించే ద్వైవార్షిక సాంస్కృతిక మహోత్సవమైన ‘లోక్‌మంథన్’కు భారత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము హాజరవుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేటలోని పర్యాటక భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజ్ఞాభారతి అఖిల భారత కన్వీనర్ నందకుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నవంబర్ 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు శిల్పకళావేదిక, శిల్పారామంలో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. 22వ తేదీ ఉదయం 9.30 గంటలకు ‘లోక్‌మంథన్ వేడుకలను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ప్రారంభిస్తారని చెప్పారు. అంతకంటే ముందు 21వ తేదీన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు శిల్పకళావేదికలో ఎగ్జిబిషన్, సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. వసుధైక కుటుంబమని ప్రపంచానికి చాటిచెప్పిన భారతీయ సాంస్కృతిక విశిష్టతను ఈ వేడుకల్లో వీక్షించొచ్చని పేర్కొన్నారు. జాతీయవాద ఆలోచనాపరులు, ఆచరణీయులు, కళాకారులు, మేధావులు, విద్యావేత్తలు ఈ వేడుకల్లో భాగస్వాములవుతారని కిషన్‌రెడ్డి చెప్పారు. నందకుమార్ మాట్లాడుతూ దేశవిదేశాల నుంచి 2,500 మందికి పైగా ప్రతినిధులు తరలిరానున్నట్టు చెప్పారు. లిథువేనియా, అర్మేనియా, ఇండోనేసియా తదితర దేశాలకు చెందిన విశిష్ట కళారూపాలను ఈ సందర్భంగా ప్రదర్శిస్తారన్నారు. లోక్‌మాత నాటకంతోపాటు కాకతీయ సామ్రాజ్యాన్ని ఏలిన మహారాణి రుద్రమదేవి నాటక ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ముగింపు ఉత్సవాలకు ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, కేంద్రమంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, నిర్మలాసీతారామన్‌లు పాల్గొంటారని చెప్పారు.

- ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ వేడుకలు ఇప్పటివరకు భోపాల్, రాంచీ, గువాహటిల్లో జరిగాయి.‘లోక్–అవలోకన్, లోక్ విచార్–లోక్ వ్యవహార్’అనే ప్రధాన థీమ్‌తో ఈసారి లోక్‌మంథన్–2024 వేడుకలను నిర్వహిస్తున్నారు.
- ఈ వేడుకల్లో ప్రదర్శనలు వీక్షించేందుకు ప్రతి రోజూ లక్ష మందికి పైగా సందర్శకులు తరలిరానున్నట్టు అంచనా.1,500 మందికి పైగా కళాకారులు సుమారు వెయ్యి కళారూపాలను ప్రదర్శించనున్నారు.
- ఫొటో జర్నలిస్ట్ అంధేకర్ సతీష్‌లాల్ వనవాసీ సంస్కృతి, జీవనశైలిపైన తీసిన ఫొటో ఎగ్జిబిషన్ తోపాటు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే కళారూపాలను ప్రదర్శిస్తారు.

మా వేతనాల్లో కోత వద్దు

- అధికారులకు హోంగార్డుల వినతి
- మహారాష్ట్ర ఎన్నికల బందోబస్తుకు వెళ్లే 3,000 మంది హోంగార్డుల వేతనంలో కోత

సాక్షి, హైదరాబాద్: ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల బందోబస్తు విధులకు హాజరయ్యే తమకు సొంత రాష్ట్రంలో ఇచ్చే వేతనాల్లో కోత విధించవద్దని హోంగార్డులు పోలీస్ ఉన్నతాధికారులకు విన్నవించారు. ఎన్నికల డ్యూటీల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఆ రాష్ట్ర పోలీస్‌శాఖ నుంచి అలవెన్స్ ఇస్తున్నారని, అదే సమయంలో ఇక్కడ విధుల్లో లేనందున తమ వేతనాల్లో కోత పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు విధుల కోసం తెలంగాణ నుంచి మూడు వేల మంది హోంగార్డులు వెళ్లనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల విధులకు వెళ్లేందు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ఎన్నికల విధులకు వెళ్లిన హోంగార్డులకు అక్కడ ఇచ్చే బిల్లులతోపాటు సొంత రాష్ట్రంలో రోజువారీ వేతనం రూ.921ని కటింగ్ లేకుండా ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు. డిసెంబర్ 6న హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాలు రాష్ట్రమంతటా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘కేజీబీవీల టీచర్లను రెగ్యులర్ చేయాలి’

సాక్షి, హైదరాబాద్: కేజీబీవీ మహిళా ఉపాధ్యాయుల సర్వీస్‌ను రెగ్యులర్ చేసి, మినిమమ్ టైం స్కేల్ అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్ రావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్.. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు టెట్ మినహాయింపుపై చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఏబీఆర్‌ఎస్‌ఎం ప్రతినిధి సూరం విష్ణువర్ధన్‌రెడ్డి, సహాధ్యక్షురాలు బెండి ఉష, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య తదితరులున్నారు.

తిరుపతి రైల్వేస్టేషన్‌లో ‘ఆపరేషన్ నార్కోస్’

నిషేధిత పదార్థాల గుర్తింపు

తిరుపతి (అలిపిరి): నార్కోటిక్ పదార్థాల అక్రమ రవాణాను నిరోధించడానికి రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) ఆపరేషన్ శుక్రవారం తిరుపతి రైల్వేస్టేషన్‌లో నార్కోస్‌ను ప్రారంభించింది. ఆర్పీఎఫ్, జీఆర్పీ భద్రతా బలగాలు లగేజ్ కౌంటర్లు, పార్శిల్ ఆఫీస్, రైళ్లు, ప్లాట్‌ఫారమ్‌ల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల సమయంలో ఆర్పీఎఫ్‌కు చెందిన ప్రత్యేక శిక్షణ పొందిన కుక్క ‘వాయు’ప్లాట్‌ఫారమ్ నంబర్ 4, 5లో నిర్లక్ష్యంగా వదిలిపెట్టబడిన ట్రాలీ బ్యాగ్, కాలేజ్ బ్యాగ్‌లో నిషేధిత పదార్థాలను గుర్తించింది. తిరుపతి అర్బన్ మండల రెవెన్యూ అధికారి పెద్ది రెడ్డి భాగ్యలక్ష్మి 15.124 కిలోల గంజాయి (విలువ సుమారు రూ.3,78,100)ను స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే ‘లెండి’ని పట్టాలెక్కిస్తాం

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మంత్రి ఉత్తమ్ హామీ



ముఖేడ్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఉత్తమ్

సాక్షి ముంబై: కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తే తెలంగాణ, మహారాష్ట్ర ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న లెండి ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. మహారాష్ట్రలో నవంబరు 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉత్తమ్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)ల మహావికాస్ ఆఘాడి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. శుక్రవారం నాందేడ్ జిల్లాలోని ముఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల రైతులకు ప్రయోజనం చేకూర్చే ఈ కీలకమైన ప్రాజెక్టు మూడున్నర దశాబ్దాలుగా మూలన పడిందన్నారు. 90 శాతం తెలంగాణ, 10 శాతం మహారాష్ట్ర పరిధిలోకి వచ్చే ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఇరు రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అందుకే కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపడతామన్నారు.

శ్రీవారికి 15 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విరాళం



విరాళం డీడీని అదనపు ఈవోకు అందజేస్తున్న దాతలు

తిరుమల: తిరుమల శ్రీవారికి హైదరాబాద్‌కు చెందిన పెరల్ మినరల్స్ అండ్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సి.వెంకటనాగరాజ శుక్రవారం 15 టీవీఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు. ముందుగా ఆలయం వద్ద ఈ వాహనాలకు జరిగిన పూజలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ఈ వాహనాల ధర దాదాపు రూ.22 లక్షలు ఉంటుందని దాత తెలిపారు.



ఎవడు అంతరమున సుఖము పొందుచున్నాడో, అంతరమున ఆత్మారాధన చేయుచున్నాడో, ఎవని లోపల జ్ఞానాగ్ని జ్యోతివలె వెలుగుచున్నదో అట్టివాడు బ్రహ్మయోగియై బ్రహ్మమునే పొందును.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 16 నవంబర్ 2024

షాకిస్తున్న ట్రంప్ ఎంపికలు!

అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ రెండోసారి ఏలుబడి ఎలా ఉండబోతున్నదన్న చర్చలు ఒకపక్క సాగుతుండగా ఆయన తన టీం సభ్యుల పేర్లను వరసబెట్టి ప్రకటిస్తున్నారు. ఆ పేర్లు కొందర్ని ఆశ్చర్యపరుస్తుంటే, మరికొందర్ని దిగ్భ్రాంతిలో ముంచెత్తుతున్నాయి. తొలి బోణీ స్పేస్ ఎక్స్, టెస్లా సంస్థల అధిపతి ఎలాన్ మస్క్ కాగా, ఆయనతోపాటు వరసగా వివేక్ రామస్వామి, తులసీ గబార్డ్, మార్కో రుబియో, మాట్ గెట్జ్ వంటివారు కీలక పదవుల్లో కుదురుకోబోతున్నారని తేలింది. వీళ్లంతా వ్యాపారవేత్తలు, ఐశ్వర్యవంతులు... అన్నిటికన్నా మించి 'వెలుపలివారు' అయినందువల్ల తన ప్రభుత్వం సమర్థవంతమైన కార్పొరేట్ దిగ్గజంగా వెలిగిపోతుందని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు అరుణ్ శౌరి ఆధ్వర్యంలో పెట్టుబడుల ఉపసంహరణ శాఖ ఉండేది. దాని పని నష్టజాతక పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయటం. ఆ క్రమంలో సవ్యంగా నడుస్తున్న సంస్థలు సైతం ప్రైవేటుకు దక్కాయన్న విమర్శలుండేవి. ఇప్పుడు ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలతో ట్రంప్ అటువంటి పనే చేయించబోతున్నారు. మస్క్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సామర్థ్య విభాగం(డీఓజీఈ) ఏర్పడుతుంది. దానికి వివేక్ 'వెలుపలి సలహాదారు'గా ఉంటారు. వచ్చే ఏడాది జూలైకల్లా ప్రభుత్వ వ్యయంలో 2 లక్షల కోట్ల డాలర్లు కోత పెట్టడమే ధ్యేయంగా వీరిద్దరూ నిర్ణయాలు తీసుకుంటారు. ప్రభుత్వోద్యోగుల సంఖ్య అపరిమితంగా ఉన్నదనీ, ఇందులో భారీగా కోతపెట్టడంతోపాటు ఉద్యోగాలన్నీ తాత్కాలిక ప్రాతిపదికనే ఉండటం అవసరమనీ తొలి ఏలుబడిలోనే ట్రంప్ తరచు చెప్పేవారు. అయితే సహచరుల హెచ్చరికతో ముందడుగేయ లేకపోయారు. అందుకే కావొచ్చు... గతానుభవం లేనివారినే ఎంచుకున్నారు.

అయితే ట్రంప్-మస్క్‌ల సఖ్యత ఎంతకాలం నిలుస్తుందన్నది అనుమానమే. ప్రభుత్వోద్యోగుల పని తీరుపై ట్రంప్, మస్క్‌లకు ఏకాభిప్రాయం ఉంది. అయితే కార్పొరేట్ సంస్థలు అన్యాయంగా సిబ్బందిని తొలగిస్తున్నాయన్న ట్రంప్ అభిప్రాయానికి మస్క్ వ్యతిరేకం. కార్మిక హక్కులు కాలరాయడాన్ని నిరసిస్తూ ప్రచారపర్వంలో చేసిన ప్రసంగాల వల్ల పలు కార్మిక సంఘాలు ట్రంప్‌కు అనుకూలంగా మారాయి. ఆయన విజయానికి దోహదపడిన అనేక అంశాల్లో ఇదొకటి. మస్క్ విషయానికొస్తే ఆయన ట్విట్టర్ (ఎక్స్)లోనూ, అంతకుముందు టెస్లాలోనూ భారీ యెత్తున ఉద్యోగులకు ఉద్వాసన పలికారు. దానిపై జాతీయ కార్మిక సంబంధాల బోర్డులో కేసులు కూడా నడుస్తున్నాయి. ఇక చైనాపై మస్క్‌కున్న ప్రేమ ఎవరికీ తెలియంది కాదు. 2020లో షాంఘైలో టెస్లా విద్యుత్ కార్ల కర్మాగారం మొదలయ్యాక ఒక్క చైనాలోనే మస్క్ ఆరు లక్షల కార్లు విక్రయించారు. పర్యావరణ పరిరక్షణ పేరిట పెట్రోల్, డీజిల్ కార్లకు బదులు విద్యుత్ కార్లు తీసుకురావటం పెద్ద కుట్రని ట్రంప్ అభిప్రాయం. దానికితోడు ఆయనకు చైనాపై ఉన్న వ్యతిరేకత మస్క్ వ్యాపార ప్రయోజనాలను దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. విదేశాంగమంత్రిగా ఎంపిక చేసుకున్న మార్కో రుబియో చైనాకు తీవ్ర వ్యతిరేకి, ఇజ్రాయెల్ అనుకూలుడు.

ట్రంప్ హయాంలో వేధింపులు దండిగా ఉంటాయని అటార్నీ జనరల్‌గా మాట్ గెట్జ్ ఎంపిక వెల్లడిస్తోంది. తన ప్రత్యర్థి కమలా హ్యారిస్ మొదలుకొని ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ, 2021 నాటి మూకదాడి కేసు విచారణలో ప్రముఖపాత్ర పోషించిన లిజ్ షెనీ వరకూ చాలామందిపై ఆయన ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. అందుకే మైనర్లతో లైంగిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగంవంటి ఆరోపణలున్నా ఉద్దేశపూర్వకంగా గెట్జ్‌ను ట్రంప్ ఎంపిక చేశారు. ట్రంప్‌పై నేరారోపణలు ముసురుకొని కేసులు వచ్చిపడిన తరుణంలో ఆయన వెనక దృఢంగా నిలబడటం గెట్జ్‌కున్న ఏకైక అర్హత. రిపబ్లికన్లలోనే వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఎంపిక సెనేట్‌లో గట్టెక్కుతుందా అన్న సందేహాలున్నాయి. అమెరికా త్రివిధ దళాధిపతుల కమిటీ చైర్మన్‌తో సహా సైనిక జనరల్లను తొలగించాలని కోరే ఫాక్స్ న్యూస్ ప్రెజెంటర్ హెగ్సెత్‌ను రక్షణ మంత్రిగా ఎంపిక చేయడం కూడా అత్యధికులకు మింగుడుపడటం లేదు. వైవిధ్యత పేరిట సైన్యంలో మైనారిటీ వర్గాలకూ, స్త్రీలకూ ప్రాధాన్యత పెరగటాన్ని చాలాకాలంగా హెగ్సెత్ ప్రశ్నిస్తున్నారు. గతంలో సైన్యంలో పని చేసిన హెగ్సెత్‌వల్ల ప్రభుత్వంతో సైన్యానికి ఘర్షణ తప్పదని అనేకుల అంచనా. ఇక సైన్యంలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పనిచేసిన తులసి గబార్డ్ వెనిజులా, సిరియా, ఉక్రెయిన్, రష్యా వ్యవహారాల్లో అమెరికా విధానాలు తప్పని అంటారు. ఆమెకు ఏకంగా 18 నిఘా సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షించే నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ బాధ్యతలు అప్పజెప్పటాన్ని ఎవరూ జీర్ణించుకోలేక పోతున్నారు.

ట్రంప్ ఏలుబడిలో వలసదారులను శ్వేతజాతి దురహంకారం బెడదతో సహా అనేకం చుట్టుముడతాయి. దానికితోడు వీసా సమస్యలు, ఉద్యోగాల కోత తప్పవు. ఇక 'అమెరికా ఫస్ట్' అమలైతే వాణిజ్యయుద్ధం ఏ స్థాయిలో ఉంటుందో తెలుసు గనుక చైనాతో సహా అనేక దేశాలు ఆత్మరక్షణ విధానాలకు సిద్ధపడుతున్నాయి. డాలర్ దూకుడు అంచనాతో అమెరికా మార్కెట్లు వెలిగిపోతుంటే విదేశీ మార్కెట్లు వెలవెలబోతున్నాయి. ట్రంప్ టీంలో మార్కో రుబియో, హెగ్సెత్, ఉపాధ్యక్షుడు కాబోతున్న జేడీ వాన్స్‌తోసహా అందరూ ఉక్రెయిన్ యుద్ధం ఆపటమే తమ తొలి లక్ష్యమని ఇప్పటికే ప్రకటించారు గనుక ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీకి గత్యంతరం లేదు. నాటో దేశాలు ట్రంప్‌తో గతంలో ఉన్న అనుభవం వల్ల ఇప్పటికే దిక్కుతోచక ఉన్నాయి. మొత్తానికి ట్రంప్ రాకతో ఇంటా బయటా యథాతథ స్థితి తలకిందులు కాబోతోంది.

హానికరమైన కొత్త జాతీయవాదం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

2024 నవంబర్ 11న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'ఏక్ రహేంగే తో సేఫ్ రహేంగే' అనే విచిత్రమైన నినాదాన్ని ఇచ్చారు. ఇదొక భాషాపరమైన కొత్త క్రీడ అని చెప్పాలి. మోదీ నినాదం ముస్లింలకు వ్యతిరేకంగా ఉందనుకొని, కొందరు దాన్ని మతపరమైనదిగా వ్యాఖ్యానించారు. కానీ ఈ నినాదం కుల గణన ప్రచారాన్ని వ్యతిరేకించేది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్నది. భారతీయ సమాజాన్ని కుల గణన చీల్చుతుందనే ప్రచారం చేస్తున్నారు గానీ, ప్రతి కులం వాస్తవ స్థితి తెలియాలంటే కుల గణనే ఆధారం. కుల గణనతో కూడిన సామాజిక ఆర్థిక గణన ఇప్పటి అవసరం.

నరేంద్ర మోదీ ఇచ్చిన 'ఏక్ రహేంగే తో సేఫ్ రహేంగే' నినాదంలోని భాషను చూద్దాం. ఏక్ అనేది ఐక్యతకు హిందీ పదం. సేఫ్ అనేది ఆంగ్ల పదం. దీని అర్థం మనకు తెలుసు. మహారాష్ట్రలో ఒక నినాదంలో సేఫ్ అనే ఆంగ్ల పదాన్ని ఎందుకు ఉపయోగించారు? ఆ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆంగ్ల భాష వ్యాప్తి చెందడం వల్లనే. అదే ఉత్తరప్రదేశ్ అయివుంటే, బహిరంగ సభలలో కూడా ఒక ఆంగ్ల పదాన్ని మోదీ తన నినాదంలో ఉపయోగించరు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాషను ప్రవేశపెట్టడానికి మోదీ, ఆయన పార్టీ వ్యతిరేకం. అదే హిందుత్వ మద్దతుదారులు నిర్వహిస్తున్న అగ్రశ్రేణి కార్పొరేట్ పాఠశాలలు ఆంగ్ల భాషను ధనికులకు అమ్ముతూ అత్యున్నత వ్యాపారాన్ని చేస్తున్నప్పుడు మాత్రం మౌనంగా ఉంటారు.

నిజమైన లక్ష్యం

ఇంతకుముందు యోగి ఆదిత్యనాథ్ 'బటేంగే తో కటేంగే' నినాదం ఇచ్చారు. ఈ నినాదాన్ని ఆర్ఎస్ఎస్ ఆమోదించింది. ఇప్పుడు మోదీ దాన్ని మిశ్రమ భాషతో వాడుతున్నారు.

2014 ఎన్నికల నుండి బీజేపీ, ఇతర వెనుకబడిన తరగతుల నుంచి తెలివిగా ఓట్లను రాబట్టుకోవడం ప్రారంభించింది. ఆరెస్సెస్, బీజేపీ 2014 ఎన్నికల నుండి కుల సమీకరణను అంగీకరించాయి. దాంతో గుజరాత్ నుండి ఓబీసీ అయిన మోదీని ప్రధానమంత్రి అభ్యర్థిగా తేవడంతో పాటు, చదరంగం లాగా తెలివిగా కుల క్రీడను ఆడటం మొదలెట్టాయి. యూపీలో యాదవుల వంటి శూద్ర అగ్రవర్ణ సమాజం పాలకులుగా ఉన్న రాష్ట్రాల్లో, పాలక కుల నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న దిగువ ఓబీసీలను సమీకరించారు. ఆ విధంగా రెండుసార్లు ఆ రాష్ట్రంలో మెజారిటీ ఎంపీ స్థానాలను, అధికారాన్ని కైవసం చేసుకోగలిగారు.

చాలా కాలంగా శూద్ర పాలక కులాలుగా రెడ్డి, వెలమలు ఉన్న తెలంగాణలో 2024 ఎన్నికల్లో 'ఈసారి బీసీ ముఖ్యమంత్రి' అనే నినాదంతో మున్నూరు కాపులు, ముదిరాజ్‌లపై బీజేపీ దృష్టి సారించింది. సాధారణంగా తెలంగాణలో రెడ్లు కాంగ్రెస్‌తో, వెలమలు బీఆర్ఎస్‌తో ఉన్న సంగతి తెలిసిందే. మాలలు కాంగ్రెస్‌లో ఉన్నందున దళితుల్లో మాదిగలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మాదిగల ఓట్లను రాబట్టేందుకు, ప్రత్యేక మాదిగ బహిరంగ సభలో ప్రధాని స్వయంగా ప్రసంగించారు. ఈ సమావేశంలోనే ఆయన మాదిగలకు సుప్రీంకోర్టులో న్యాయపరమైన అడ్డంకిని అధిగమించేందుకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందువల్ల ఎస్సీ రిజర్వేషన్లలో ఉపకులాల విభజన రాజ్యాంగ విరుద్ధం కాదని సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ ముందు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దాంతో రాజ్యాంగబద్ధంగా ఏదైనా సంక్షేమ ప్రయోజనాలు అందించే రిజర్వేషన్ల కోసం ఉపకుల వర్గీకరణను



సుప్రీంకోర్టు సమర్థించింది.

కుల గణనతోనే రిజర్వేషన్లు

ఇలాంటి విభజన రాజకీయాలు ప్రమాదకరమని ఆరెస్సెస్, బీజేపీ శక్తులు భావించడం లేదు. వారు తమ కుల ఆధారిత విభజనలను జాతీయవాదాలుగా ప్రదర్శిస్తారు. అయితే ఆ తీర్పును అమలు చేయాలంటే, అంతకుముందటి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, భారత దేశం అంతటా ప్రతి ఉప కులానికి సంబంధించిన వస్తుగతమైన, ధ్రువీకరించదగిన డేటా తప్పనిసరి. ఈ ఉప కుల రిజర్వేషన్ తీర్పు అనేది, రిజర్వేషన్లు వర్తించే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలలో న్యాయమైన వాటాను అడిగే అన్ని ఉప కులాలకూ వర్తిస్తుంది. అందువల్ల రాజ్యాంగ సంస్థ అయిన 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' సేకరించిన జాతీయ కుల గణన డేటా లేకుండా సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయడం సాధ్యం కాదు.

అయినా రాబోయే జాతీయ జనాభా గణనలో కుల గణనను చేపట్టాలని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కోరుకోవడం లేదు. అందుకే సుప్రీంకోర్టు తీర్పు, మోదీ ప్రభుత్వం రెండూ రాష్ట్ర ప్రభుత్వాలకు కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టాయి. ఎందుకంటే అనేక ఉపకులాలు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని అడుగుతున్నాయి. కానీ, విశ్వసనీయమైన కుల డేటాను సేకరించడానికి కేంద్రం సుముఖంగా లేదు.

ఈ నేపథ్యంలోనే కుల గణన భారతీయ సమాజాన్ని చీల్చుతుందనే ప్రచారాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్, ముఖ్యంగా రాహుల్ గాంధీ, కుల గణనను సమాజానికి చెందిన సామాజిక ఆర్థిక వివరాలకు సంబంధించిన ఎక్స్‌రేగా ప్రచారం చేస్తున్నందున, దీన్ని అగ్ర వర్ణాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆరెస్సెస్, బీజేపీ ప్రయోజనాలు ఉత్తర భారతదేశంలో ఎక్కువగా ఐదు అగ్ర కులాలతో ముడిపడి ఉన్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు బీజేపీ 'ఏక్ రహేంగే తో సేఫ్ రహేంగే' ప్రచారాన్ని ప్రారంభించింది. అయితే, 2024 ఎన్నికల నుంచి మోదీ, అమిత్ షా ఓబీసీ ఓట్లను తామే నిలుపుకోవడం కోసం, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఓబీసీ రిజర్వేషన్లను తగ్గించి ముస్లిం రిజర్వేషన్లు పెంచుతారని ప్రచారం ప్రారంభించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు అన్ని ప్రయోజనాలను కోల్పోతారని బహిరంగంగానే చెబుతున్నారు. వారు భారతీయ ముస్లింలకూ, మిగిలిన జనాభాకూ మధ్య స్పష్టమైన రేఖను గీయాలని అనుకుంటున్నారు. ఎందుకంటే ముస్లింలు చాలా కాలంగా ఓట్ల పరంగా కాంగ్రెస్‌తో జతకట్టారు.

కుల గణన ముస్లింలకు ఎలా ఉపయోగం?

భారతీయ ముస్లిం సమాజం చాలాకాలంగా రిజర్వేషన్ భావజాలాన్ని అంగీకరించలేదు. వారు తమలో కుల ఉనికిని తిరస్కరించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం సచార్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ నివేదికతో తమ విద్యాపరమైన వెనుకబాటుతనం ఒక తీవ్రమైన సమస్య అని ముస్లింలు గ్రహించారు. వాస్తవానికి, వారి వెనుకబాటుతనానికి వారి మతంతో సంబంధం ఉంది. ముస్లింలు కూడా కుల గణనను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నారు.

రిజర్వేషన్‌ను వాడుకోవడం తమ సామాజిక స్థాయికి తగనిదని భావించిన శూద్ర అగ్రవర్ణాలు కూడా ఇప్పుడు రిజర్వేషన్ వ్యవస్థలోకి రావాలనుకుంటున్నాయి. జాతీయ రాజకీయాల్లో రిజర్వేషన్ల సిద్ధాంతం ప్రధాన అంశంగా మారింది. అందుకే రెడ్లు, మరాఠాలు కుల గణనకు విముఖత చూపడం లేదు.

కుల గణనతో కూడిన సామాజిక ఆర్థిక గణన భారతీయ ముస్లింలలోని ప్రతి కులం వాస్తవ స్థితిని బయటకు తెస్తుంది. ముస్లింలలో ఉన్నత కులాలు ఉన్నాయి. వీరు మొఘల్, మొఘల్ అనంతర భూస్వామ్య వ్యవస్థ నుండి, సాంప్రదాయిక ఇస్లామిజం నుండి ప్రయోజనం పొందారు. ఉదాహరణకు, పేద దిగువ కులాల ముస్లింలు వెనుకబడిన మదర్సా ఉర్దూ మీడియం విద్యలోకి నెట్టబడ్డారు; ధనిక ఉన్నత కుల ముస్లింలు స్వాతంత్ర్యానికి ముందు రోజుల నుండీ ఆంగ్ల మాధ్యమ విద్యను పొందారు. ముస్లింల మధ్య ఉన్న ఈ వలయాన్ని కూడా ఛేదించి తీరాలి.

కుల గణన, సంక్షేమ పథకాల న్యాయబద్ధమైన పంపిణీ, విద్య- ఉద్యోగాలలో రిజర్వేషన్ ప్రయోజనాల కోసం జాతీయ డిమాండ్ నేపథ్యంలో 'ఏక్ రహేంగే తో సేఫ్ రహేంగే' నినాదాన్ని బీజేపీ తెలివిగా ఇచ్చింది. కుల గణన, సంక్షేమ వలయాన్ని అత్యంత అర్హులైన వారికి విస్తరించడం మాత్రమే... ఆధునిక అభివృద్ధి ప్రక్రియను కొనసాగించే భారతీయ మధ్యతరగతిని మరింతగా పెంచుతుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ముక్కల కొట్లాట



మీర్జాపూర్ (ఉత్తర ప్రదేశ్) బీజేపీ నాయకుడు వందల మందికి పెద్ద పార్టీ ఏర్పాటుచేశారు. కానీ మటన్ ముక్కలు అయిపోయి, జనానికి కోపమొచ్చింది. పులుసుతో సరిపెట్టుకోక, 'బోటి' కావాలన్నారు. అతిథులు ఒకర్ని ఒకరు తన్నుకున్నారు. ఎంత కామెడీ కంటెంట్?

– సందీప్ మనుధానె, విద్యావేత్త

కాదా లౌకికం?



పేరుకు మాత్రమే యూనస్ అధిపతిగా ఉన్న సైనిక పాలనలోని బంగ్లాదేశ్ హింసపూరిత ఇస్లామిస్టులకు దుర్గంగా మారింది. రాజ్యాంగంలోని 'లౌకికవాదం' ప్రస్తావనను తొలగించాలని ప్రభుత్వం భావిస్తోందని హైకోర్టుకు అటార్నీ జనరల్ తెలియజేశారు. '90 శాతం ముస్లిం జనాభా ఉన్న దేశపు వాస్తవికతను లౌకికవాదం ప్రతిబింబించదు' అన్నారు.

– బ్రహ్మ చెలానీ, స్ట్రాటెజిస్ట్

మారాల్సిన సంస్కృతి



మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, డెహ్రాడూన్ ప్రమాదం (తలలు తెగిపడేంత దుర్ఘటన) మద్యపానం వల్ల జరిగింది. మద్యాన్ని ఎవరు కొనొచ్చు, ఎవరు తాగొచ్చు అనే దానికి కఠిన నియమాలు ఉండాలి. మద్యపానాన్ని తప్పుగా చూసే ఒకప్పటి సంస్కృతి తిరిగి రావాలి.

– చిరాగ్ బడ్జాత్యా, ఆంట్రప్రెన్యూర్

రాకపోతే ఎలా?



విదేశాలకు వెళ్లేటప్పుడు ఇంగ్లీష్ నుండి ఫ్రెంచ్, ఇంగ్లీష్ నుండి స్పానిష్, ఇంగ్లీష్ నుండి ఇటాలియన్ డిక్షనరీలను కొనడానికి జనాలు ఒక్క నిమిషం కూడా ఆలోచించరు. అదే భారతదేశంలో స్థానిక భాషను నేర్చుకొమ్మని మర్యాదపూర్వకంగా చెప్పినా, కాదు పొమ్మంటారు. ఏళ్ల తరబడి కర్ణాటకలో ఉంటూ కూడా 'నాకు కన్నడ రాదు' అని గొప్పగా చెప్పేవాళ్ళు ఉన్నారు. నా మాతృభాష కన్నడ కాదు. నేను ఇంకా వాక్యాలతో కష్టపడుతున్నాను. కానీ ప్రయత్నిస్తే జనాలు అభినందిస్తారు.

– చంద్ర ఆర్. శ్రీకాంత్, జర్నలిస్ట్

కొత్త ప్రారంభం



శ్రీలంక ప్రజలు తమ పార్లమెంటరీ ఎన్నికలలో, పాత పద్ధతులకు వ్యతిరేకంగా కొత్త ప్రారంభం కోసం స్పష్టంగా ఓటు వేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి నా శుభాకాంక్షలు.

– మహమ్మద్ నషీద్, మాల్దీవుల మాజీ అధ్యక్షుడు

శ్రీబాగ్ ఒడంబడిక అమలే కీలకం!

అభిప్రాయం




మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

శ్రీబాగ్ ఒప్పందం రాయలసీమ ప్రజల భావోద్వేగాలతో పెన వేసుకున్న అనుబంధం. తొలి భాషా ప్రయుక్త రాష్ట్ర అవతరణకు మూలం. పాలకుల నిరాదరణకు గురైన ఈ ఒడంబడికకు నేటికి 87 సంవత్సరాలు. అప్పట్లో ప్రస్తుత తెలంగాణ నైజాం నవాబు పాలనలో ఉండేది. కోస్తా, రాయలసీమ ప్రాంతాలు మద్రాసు ప్రెసిడెన్సీలో ఉండేవి. భాషాభిమానం, రాజకీయ కారణాలతో తమిళుల ఆధిపత్యంలో ఉన్న మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి తెలుగు రాష్ట్రంగా విడిపోవాలనే ఆలోచన మధ్య కోస్తా ఆంధ్ర పెద్దలలో వచ్చింది. ఈ క్రమంలో 1913 (బాపట్ల)లో తొలి 'ఆంధ్ర మహాసభ' జరిగింది. అది భాష, సాంస్కృతిక వికాసం కోసం పరిత పించిన వేదిక అయినా... అంతర్లీనంగా మద్రాసు ప్రెసి డెన్సీ నుంచి తెలుగు ప్రాంతం విడిపోవాలని దీని నిర్వాహకులకు ఉండేది. కారణాలు ఏమైనా రాయలసీమ ప్రాంతం నుంచి ప్రతినిధులు ప్రారంభంలో సమావేశాలకు హాజరు కాలేదు. అయితే రాయలసీమ భాగస్వామ్యం లేకుండా మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి వేరుపడటం సాధ్యం కాదన్న నిర్ణయానికి వచ్చిన ఆంధ్రమహాసభ పెద్దలు సీమ ప్రజల మనోగతాన్ని తెలుసుకోవడం కోసం 1917లో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ సీమలో పర్యటించిన అనంతరం జరిగిన సభలలో సీమ ప్రాంత ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి విడిపోవాలన్న మధ్య కోస్తా ఆంధ్ర పెద్దలతో సీమ ప్రాంత పెద్దలు గొంతు కలపలేదు. కారణం అప్పటికే ఆంగ్లేయుల పాలనలో ఉన్న ఆ ప్రాంతం... విద్యాపరంగా అభివృద్ధి చెందింది. అలాగే కాటన్ బ్యారేజీ, ప్రకాశం బ్యారేజీల వల్ల సీమతో పోల్చుకుంటే అభివృద్ధిలో ముందు ఉన్నది. సమీపంలో ఉన్న మద్రాసు నగరాన్ని వదులుకుని అప్పటికే అభివృద్ధిలో మెరుగ్గా ఉన్న కోస్తా ఆంధ్రతో కలిసి రాష్ట్రంగా ఏర్పడటం సీమ పెద్దలకు ఇష్టం లేదు.

ఆంధ్రాయూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో జరిగిన అనుభవాలతో అనుమానాలు పెరిగాయి. 1926 ఆంధ్రమహాసభ ఆంధ్రాయూనివర్సిటీని వెనుకబడిన అనంతపురంలో ఏర్పాటు చేయాలని తీర్మానం చేసింది. మద్రాసు శాసనసభలో ఈ అంశంపై జరిగిన తీర్మానంలో తమిళ శాసన సభ్యులు పాల్గొనవద్దని ఆనాటి ముఖ్యమంత్రి సూచించారు. వాస్తవానికి ఆంధ్ర మహాసభ తీర్మానం ప్రకారం... కోస్తా, సీమ సభ్యులు అనంతపురంలో యూనివర్సిటీ ఏర్పాటుకు ఓటు వేయాలి. అందుకు భిన్నంగా మధ్య కోస్తా సభ్యులు విజయవాడలో ఏర్పాటు చేయాలని ఓటు వేశారు. అయితే ముఖ్యమంత్రి సూచనను పక్కన పెట్టి తమిళ శాసన సభ్యులు కొందరు సీమ సభ్యులకు అనుకూలంగా ఓటు వేయడంతో 25 – 35 ఓట్లతో అనంతపురంలో యూనివర్సిటీ ఏర్పాటుకు తీర్మానం చేశారు. ఆంధ్ర మహాసభ తీర్మానం, అసెంబ్లీ ఆమోదాన్ని కాదని విశాఖలో ఏర్పాటు చేసి తొలి ఉప కులపతిగా రాయలసీమ వారికి అవకాశం ఇచ్చారు. ఈ పరిణామంతో పప్పూరి రామాచార్యులు, టీఎన్ రామకృష్ణారెడ్డి లాంటి వారు... 'ఉంటే మద్రాసుతో కలిసుందాము లేకపోతే రాయలసీమ రాష్ట్రంగా (ప్రస్తుతమున్న సీమ నెల్లూరు ప్రకాశం జిల్లా, కర్ణాటక లోని బళ్లారితో సహా) విడిపోదాం' అని ప్రతిపాదన చేశారు.



ఇదంతా గమనిస్తున్న ఆంధ్రమహాసభలోని పెద్దలు చర్చల నిమిత్తం రెండు ప్రాంతాల సభ్యులతో ఒక కమిటీని నియమించారు. 1937 నవంబర్ 16న మద్రాసు నగరంలోని దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహం (శ్రీబాగ్)లో కమిటీ సమావేశమయ్యింది. మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి తెలుగు రాష్ట్రం అవతరించిన తర్వాత పాలనా ప్రాధాన్యతలపై ఒక ఒప్పందం చేసుకున్నారు. అదే 'శ్రీబాగ్ ఒడంబడిక'. కోస్తా, సీమ ప్రజల పోరాటం... మరో వైపు పొట్టి శ్రీరాములు దీక్ష-ఆత్మార్పణల ఫలితంగా భారత దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్ 1న అవతరించింది.

శ్రీబాగ్ ఒడంబడికలోని ముఖ్యాంశాలు:

1. ఒక ప్రాంతంలో రాజధాని, మరో ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలి. ఎంపిక చేసుకునే హక్కు రాయలసీమకు ఉండాలి. 2. కృష్ణా, తుంగభద్రలలో నీటి వినియోగంలో రాయలసీమకు వాటా కేటాయించాలి. అందుకనుగుణంగా నీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి. 3. రెండు ప్రాంతాల మధ్య సాంఘిక, సాంస్కృతిక సమానత్వాన్ని సాధించేందుకు విద్యా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఆంధ్రా యూనివర్సిటీ కింద ఒక కేంద్రాన్ని అనంతపురంలో ఏర్పాటు చేయాలి. 4. జనాభా లెక్కల ప్రకారం కాకుండా సీమ, కోస్తా ఆంధ్రకు సమానంగా నియోజక వర్గాల ఏర్పాటు చేయాలి.

ఈ ఒప్పందం ప్రకారం 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. కానీ, 1956లో తెలంగాణను కలుపుకుని ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కావడంతో రాజధాని రాయలసీమ నుంచి తెలంగాణకు మారింది. అలా శ్రీబాగ్ ఒప్పందానికి తూట్లు పడటం ప్రారంభమయ్యింది. రాయల సీమ అభివృద్ధిలో అతి ముఖ్య పాత్ర పోషించే నీటి ప్రాజెక్టులనన్నా పూర్తి చేస్తున్నారా అంటే అదీ జరగడం లేదు. అదేమంటే శ్రీబాగ్ ఒప్పందానికి చట్టబద్ధత లేదనీ, అది కాంగ్రెస్ పార్టీలోని రెండు గ్రూపుల మధ్య కుదిరిన ఒప్పందం అనీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నాటి కాంగ్రెస్ విభిన్న అభిప్రాయాలు ఉన్నవారి సంగమం. కమిటీ సభ్యులు కాంగ్రెస్‌లో ఉన్నంత మాత్రాన ఈ ఒప్పందం ఆ పార్టీ అంతర్గత వ్యవహారంగా తేల్చడం సమంజసమేనా?

మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి తెలుగు రాష్ట్రం విడిపోవడంలో సీమ ప్రజల త్యాగం ఉన్నది. తెలుగు రాష్ట్రం కావాలనే కోరిక పుట్టిన ప్రారంభంలోనే... తమిళులు మదురై కేంద్రంగా తమిళ రాష్ట్రం కోసం తీర్మానం చేశారు. దీనికి కారణం ఎప్పటికైనా చెన్నై తెలుగు వారిదే అవుతుందేమో అని వారి ఆలోచన. నిజానికి పప్పూరి రామాచార్యులు, టీఎన్ రామకృష్ణారెడ్డి ప్రతిపాదన ప్రకారం రాయలసీమ రాష్ట్రం ఏర్పడి ఉంటే (ప్రస్తుత రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, బళ్ళారి, చెన్నై సమీప జిల్లాలతో కలిపి) చెన్నై మహానగరం మనదే అయ్యేది. దీన్నిబట్టి సమీపంలోని చెన్నై నగరాన్ని వదులుకుని తెలుగు రాష్ట్రం కోసం సీమ ప్రజలు త్యాగం చేశారని అర్థం చేసుకోవాలి.

ప్రస్తుతం రాష్ట్రంలోని రాజకీయ వాతావరణం కారణంగా శ్రీబాగ్ ఒప్పందం అంటే రాయలసీమకు రాజధాని మాత్రమే అన్న ప్రచారం జరుగుతోంది. ఇది సరికాదు. మరి నీటి ప్రాజెక్టుల సంగతేమిటి? శ్రీశైలం ప్రాజెక్టు నీటిని సత్వరం అందిపుచ్చుకునే విధంగా సిద్ధేశ్వరం అలుగునూ, పోతిరెడ్డి పాడునూ వెడల్పు చేయడం; రాయలసీమ ఎత్తిపోతల పథకం, తుంగభద్ర నీటిని ఉపయోగించుకునే విధంగా గుండ్రేవుల, కుందూపై రిజర్వాయర్లు నిర్మించడం; గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం; చెరువుల పునరుద్ధరించడం వంటి చర్యలే రాయలసీమ కరువుకు శాశ్వత పరిష్కారం. అందుకే రాయలసీమ సమగ్రాభివృద్ధి జరగాలి అంటే కచ్చితంగా శ్రీబాగ్ ఒప్పందంలో పేర్కొన్న విధంగా కృష్ణా, తుంగభద్రలపై సీమ ప్రాంత సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి అనుగుణంగా పై ప్రాజెక్టులు పూర్తి చేయాలి.

శ్రీబాగ్ ఒడంబడికలో పేర్కొన్న విధంగా కృష్ణా, తుంగభద్ర నీటిని సీమకు అందించే విధంగా ప్రాజెక్టుల నిర్మాణం జరిగేలా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలి. శ్రీబాగ్ ఒప్పంద స్ఫూర్తితో సీమ సమాజం ఇందుకోసం ముందుకు సాగాలి.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త

సాక్షి

నేడు నవంబర్ 16
జాతీయ పత్రికా దినోత్సవం

ఈ సందర్భంగా స్వేచ్ఛ, పారదర్శకత, నైతిక విలువలతో కూడిన జర్నలిజానికి కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేస్తున్నాం.

దైవ సాక్షాత్కారం

దేవుడు ఎక్కడి నుంచో వచ్చి మనకు ప్రత్యక్షం అవుతాడనుకోవడం పొరపాటు. మన పురాణాల్లో దేవుడు ప్రత్యక్షమైనట్లు చెప్పిన ప్రతిసారీ ఆయన ఎక్కడి నుంచో వచ్చి ప్రత్యక్షమైన వర్ణనే కనిపిస్తుంది. ఈ విషయాన్ని మనం సరిగా అవగాహన చేసుకోవాలి. దైవశక్తి అంతటా నిండి ఉన్నదని తెలపడమే పురాణాలలోని వర్ణనల ప్రయోజనం అని గ్రహించాలి. భగవంతుడు ఎక్కడో చాలా దూరంగా ఉన్నాడనేది దీని భావం కాదు. దైవత్వం అనేది ఒక అనుభవం. దీనిని హృదయంలో ప్రతిబింబింప చేసుకోవాలి. ఉదాహరణకు అద్దాన్నే తీసుకుందాం. అద్దము కదలుతూ ఉన్నా లేక పొగతో కప్పివేయబడినా లేక వస్తువుల నుండి చాలా దూరంగా ఉన్నా అది సరిగా ప్రతిబింబింప చేయలేదు. ఇక్కడ అద్దము అంటే మనసు. అద్దము కదలకుండా ఉండటమంటే మనస్సు నిశ్చలంగా ఉండటమే. అంటే ఏకాగ్రతన్న మాట. అద్దముపై కప్పబడిన 'అహం' అనే పొగను తొలగించాలి. అనగా అహాన్ని పతనమొందించాలి. అదే 'దైవ సాక్షాత్కారం'.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

జ్ఞానానికి రెండు స్థాయిలు ఉన్నాయి. ఒకటి క్రిందిస్థాయి, మరొకటి పైస్థాయి. ఇంద్రియాలను ఉపయోగించుకొని, హేతుబద్ధంగా విచారించి తెలుసుకొనేది కిందిస్థాయి జ్ఞానం. చాలా మంది కిందిస్థాయి జ్ఞానంతోనే జీవితాన్ని గడుపుతున్నారు. దైవానికి సంబంధించిన జ్ఞానమే పైస్థాయికి చెందినది. ఇది సాధారణమైన జ్ఞానానికి మించినది. అనగా సర్వోత్కృష్టమైనది. కొద్దిమంది భాగ్యవంతులు మాత్రమే ఇటువంటి జ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నిస్తారు. పై స్థాయికి చెందిన జ్ఞానాన్ని కళాశాలలో కాని లేక విశ్వవిద్యాలయంలో కాని చదివి లేక పాండిత్యాన్ని సంపాదించి ఎవరు కూడా పొందలేరు. ఈ విషయంలో (పై స్థాయి జ్ఞానమును పొందటానికి) హేతువాదం, తర్కం ఉపయోగపడవు. వివేకపుటంచుల నుండి మాత్రమే ఇటువంటి జ్ఞానాన్ని పొందడానికి వీలుంది. ఈ విధమైన జ్ఞానాన్ని సద్గురువు మాత్రమే అనుగ్రహిస్తారు.

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.1.05 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** కృత్తిక రా.9.14 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** ఉ.9.55 నుండి 11.23 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.56 నుండి 7.42 వరకు, **అమృతఘడియలు:** రా.7.02 నుండి 8.31 వరకు. ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.09, **సూర్యాస్తమయం:** 5.21.

ఆర్టీసీకి బీఎస్‌-6 బస్సులు

- వాటిపై అవగాహనకు చెన్నై అశోక్‌లేలాండ్‌ ప్లాంట్‌కు వెళ్లిన అధికారులు
- కాలుష్య కారకాల ఉత్పత్తిని నియంత్రించే ప్రమాణాలతో తయారీ
- 31 సెన్సార్లు.. అతి తక్కువ కాలుష్యం


చెన్నైలోని బస్సుల తయారీ ప్లాంట్‌లో తెలంగాణ ఆర్టీసీ అధికారులకు అవగాహన కల్పిస్తున్న అశోక్‌లేలాండ్‌ ఇంజనీర్లు

సాక్షి, హైదరాబాద్‌: భారత్‌ స్టేజ్‌-6 బస్సుల వాడకంపై ఆర్టీసీ దృష్టి సారించింది. వాయు కాలుష్య కారకాల ఉత్పత్తిని నియంత్రించేందుకు ఉద్దేశించిన ఉద్గారాల ప్రమాణాల జాబితాలోని బీఎస్‌-6 బస్సుల వాడకానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. ఇంతకాలం బీఎస్‌-4 ప్రమాణాల బస్సుల వాడకానికి పరిమితమైన ఆర్టీసీకి ఇప్పుడు బీఎస్‌-6కు చెందిన 1,500 బస్సులు కొత్తగా సమకూరాయి. 2020 నుంచి మన దేశంలో ఈ ప్రమాణ బస్సులను అందుబాటులోకి తెచ్చినా..ఆర్టీసీ కొత్త బస్సులు కొనకపోవటంతో ఆ శ్రేణి బస్సులు ఇప్పటివరకు సమకూరలేదు. గతేడాది ఆర్టీసీ కొత్త బస్సులకు ఆర్డర్‌ ఇవ్వగా, దశలవారీగా అవి సమకూరుతున్నాయి. కొత్త బస్సులన్నీ బీఎస్‌-6 శ్రేణి బస్సులే. తాజా యూరో ప్రమాణాల మేరకు ఇవి రూపొందాయి. కర్బన ఉద్గారాలు తక్కువ పరిమితిలో విడుదల చేయటంతోపాటు ఎక్కువ ఎలక్ట్రానిక్‌ డిజైన్‌తో ఇవి రూపొందాయి. దీంతో వీటి వినియోగంపై అవగాహన కల్పించేందుకు బీఎస్‌-6 బస్సులున్న డిపోలను పర్యవేక్షిస్తున్న అధికారులకు చెన్నైలోని అశోక్‌ లేలాండ్‌ కంపెనీలో వాటి తయారీ ఇంజినీర్ల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఆ బస్సుల ప్రత్యేకత ఏంటంటే...

మన దేశంలో 2000 సంవత్సరం నుంచి భారత్‌ స్టేజ్‌ ఎమిషన్‌ స్టాండర్ట్స్‌ అమలులోకి వచ్చింది. తొలుత భారత్‌ స్టేజ్‌-1 ప్రారంభమైంది. అలా 2020 నుంచి బీఎస్‌-6 ప్రమాణాలు మొదలయ్యాయి. అంతకుముందు శ్రేణి వాహనాలతో పోలిస్తే వీటిల్లో కాలుష్య కారకాల ఉత్పత్తి చాలా తక్కువగా ఉండేలా ఇంజిన్లను ఆధునీకరించారు. అంతకు ముందున్న బీఎస్‌-4 (బీఎస్‌-5 స్కిప్‌) డీజిల్‌ బస్సుల్లో నైట్రోజన్‌ ఆక్సైడ్‌ పరిమితి 250 మి.గ్రా.గా ఉండేది. దానిని బీఎస్‌-6 బస్సుల్లో 80 మి.గ్రా.కు కట్టడి చేశారు. పర్టిక్యులేట్‌ మ్యాటర్‌ పరిమితిని 25 మి.గ్రా.ల నుంచి 4.5 మి.గ్రా/కి.మీ.కు తగ్గించారు. దీనివల్ల కొత్తతరం బస్సుల్లో కాలుష్య కారకాల విడుదల చాలా తక్కువగా ఉంటుంది.

డాష్‌ బోర్డులో పలు రకాల సూచనలు

ఈ బస్సుల్లో డాష్‌బోర్డుపై పలు రకాల సూచనలు బ్లింక్‌ అవుతుంటాయి. ఆ మేరకు డ్రైవర్లు బస్సులను నడపాలి. ఈ బస్సుల్లోని చాలా భాగాలు సెన్సార్ల ఆధారంగా పనిచేస్తాయి. వీటిల్లో దాదాపు 31 సెన్సార్లు ఏర్పాటు చేశారు. పాత బస్సుల్లో డాష్‌ బోర్డుకు ప్రాధాన్యమే ఉండేదికాదు. డిస్‌ప్లే బోర్డులో రీడింగ్‌ మీటర్లు పగిలిపోయి రంధ్రాలే కనిపిస్తుండేవి. కానీ, కొత్త తరం బస్సుల్లో 31 సెన్సార్లు అలర్ట్‌లను చూపుతుంటాయి. ఏదైనా బ్లింక్‌ కనిపిస్తే, సంబంధిత ఇంజిన్‌ భాగంపై దృష్టి సారించాలి. దీనికి సంబంధించి ఆయా బస్సులను నిర్వహిస్తున్న డిపోల అధికారులకు ముందు అవగాహన కలిగితే, వారు డ్రైవర్లను ప్రశ్నిస్తూ బస్సులు మెరుగ్గా నడిచేలా చూస్తారని సంస్థ భావిస్తోంది. ఈమేకు ఆయా డిపోల అధికారులను చెన్నైలోని అశోక్‌లేలాండ్‌ ప్లాంట్‌కు పంపింది. మొదటి బ్యాచ్‌ అధికారుల బృందం ప్రస్తుతం చెన్నై ప్లాంట్‌లో ఉంది. త్వరలో రెండో బృందం వెళ్లనుంది.

కాలుష్య కణాలు వెలువడవు

బస్సు వదిలే పొగలో లక్షల సంఖ్యలో కాలుష్య కణాలుంటాయి. అవి మన శరీరంలోకి చేరితే తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. పొగగొట్టం నుంచి వెలువడే పొగతో అవి వాతావరణంలోకి చేరతాయి. కానీ, బీఎస్‌-6 బస్సుల్లో ప్రత్యేక వ్యవస్థ ఉంది. డీజిల్‌ మండిన తర్వాత వెలువడే ఈ సూక్ష్మ కణాలు ఒకచోట జమవుతాయి. నిర్ధారిత సమయంలో అవి మరోసారి మండి బూడిదగా మారి నేల మీద పడిపోతాయి. పొగ రూపంలో అవి వాతావరణంలో కలిసే ప్రమాదం బాగా తగ్గిపోతుంది. అందుకే ఈ బస్సుల్లో, పాతతరం బస్సుల తరహాలో పొగగొట్టం ఉండదు. డ్రైవర్‌ పక్కనున్న ఇంజిన్‌ కిందే ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. ఇలాంటి ప్రత్యేకతలు ఈ బస్సుల్లో ఎన్నో ఉన్నాయి.

‘వక్ఫ్‌’ పేరిట గుట్టల బేగంపేటలో కబ్జా: కొండా



సాక్షి, హైదరాబాద్‌: గుట్టల బేగంపేటలో 90 ఎకరాలను వక్ఫ్‌ బోర్డు చట్టాన్ని అడ్డుపెట్టుకుని ఆక్రమించుకున్నారని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం సెక్యులర్‌ స్ఫూర్తికి విరుద్ధంగా 1995 వక్ఫ్‌ చట్టం ట్రిబ్యునల్‌ను తీసుకొచ్చిందని, సుప్రీంకోర్టు కంటే మించి వక్ఫ్‌ బోర్డుకు ఎక్కువ అధికారాలు కల్పించిందని ధ్వజమెత్తారు. ఈ వక్ఫ్‌ చట్టాన్ని అడ్డంపెట్టుకుని తన నియోజకవర్గంలో నేటికీ కొంతమంది ఔరంగజేబు మాదిరిగా దాడులతో భూములు ఆక్రమిస్తున్నారన్నారు. కలెక్టర్‌, రెవెన్యూ సర్వే డిపార్ట్‌మెంటుతో సంబంధం లేకుండా కొన్ని ముస్లిం యాజమాన్యాలు సర్వే చేసుకోవడం చట్ట వ్యతిరేకమన్నారు. మత, ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్‌ పార్టీ దేశాన్ని కూడా అమ్మేస్తుందని కొండా వ్యాఖ్యానించారు.

యాదగిరిగుట్టకు కార్తీక శోభ


సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. 40 వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 8 బ్యాచ్‌లుగా వ్రతాలు, పూజలు నిర్వహించారు. యాదగిరీశుడి సన్నిధిలో, పాతగుట్టలో కలిపి 2,090 వ్రతాలు జరిగాయి. వ్రతాల ద్వారా రూ.14,65,600, పూజల ద్వారా రూ.51,22,947 ఆదాయం ఆలయానికి సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

పవర్‌ ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా రత్నాకర్‌

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ పవర్‌ ఇంజనీర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా పి.రత్నాకర్‌, సెక్రటరీ జనరల్‌గా సదానందం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు తెలంగాణ విద్యుత్‌ సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ఇంజనీర్లకు మధ్య వారధిగా వ్యవహరించి విద్యుత్‌ ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ మండలంలో ఘటన


అశోక్‌

గజ్వేల్‌రూరల్‌: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాచకొండ అశోక్‌ (35) తనకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నాడు. అలాగే గ్రామంలో ఇస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వ్యవసాయం కోసం పెట్టుబడులతో పాటు కుటుంబ పోషణ నిమిత్తం సుమారు రూ.1.50 లక్షల అప్పు చేశాడు. వ్యవసాయం కలిసి రాక అప్పులు ఎలా తీర్చాలో తెలియక, ప్రతి రోజూ మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారు జామున పొలం వద్దకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో ఏడో తరగతి విద్యార్థిని మృతి


నివృతి

చెన్నూర్‌: ఆడుతూ పాడుతూ తిరుగుతున్న ఆ బాలికను అకస్మాత్తుగా మృత్యువు కబళించింది. గుండెపోటు రూపంలో ఆ కుటుంబంలో విషాదం మిగిల్చింది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్‌ పట్టణంలోని పద్మనగర్‌ కాలనీలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పద్మనగర్‌ కాలనీకి చెందిన కస్తూరి శ్రీనివాస్‌, రమాదేవి దంపతులకు ఓ కూతురు, కుమారుడు. కూతురు నివృతి (12) పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో కుటుంబ సభ్యులు ఆ సందడిలో ఉన్నారు. నివృతి ఆలయానికి వెళ్లేందుకు సిద్ధం అవుతోన్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండెపోటుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ‘కార్తీక దీపాలు వెలిగించే ఇంట్లో దీపం లేకుండా చేశావా తల్లీ’ అంటూ తల్లిదండ్రులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

బైక్‌ నడుపుతూ సెల్ఫీ... డివైడర్‌ను ఢీకొట్టి మృతి


జగ్గోజి హుర్దుకె

కల్హేర్‌ (నారాయణఖేడ్‌): సెల్ఫీ సరదా ఓ డెలివరీ బాయ్‌ ప్రాణం తీసింది. డివైడర్‌ను బైక్‌ ఢీకొట్టడంతో స్విగ్గీ డెలివరీ బాయ్‌ మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం బాచేపల్లి బల్కంచెల్క తండా సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా పట్నూర్‌ గ్రామానికి చెందిన కచ్చు జగ్గోజి హుర్దుకె (25) హైదరాబాద్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల సొంత గ్రామంలో వ్యవసాయ పనులు చేసేందుకు వచ్చాడు. పనులు పూర్తి కావడంతో శుక్రవారం బైక్‌పై తిరిగి హైదరాబాద్‌ బయల్దేరాడు. మార్గమధ్యలో బల్కంచెల్క తండా వద్ద నేషనల్‌ హైవేపై బైక్‌ రన్నింగ్‌లో ఉండగానే సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కల్హేర్‌ పోలీసులు తెలిపారు.

21న కృష్ణా బోర్డు సమావేశం వాయిదా

- ఈ నెల 25న నిర్వహించాలని బోర్డు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ప్రస్తుత నీటి సంవత్సరంలో కృష్ణా జలాల పంపిణీ ఎజెండాగా ఈ నెల 21న జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం వాయిదా పడింది. అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాలు ఈనెల 22 వరకు జరగనున్న నేపథ్యంలో కృష్ణా బోర్డు సమావేశాన్ని వాయిదా వేసి, ఈ నెల 25న నిర్వహించాలని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు చేసిన ప్రతిపాదనను కృష్ణా బోర్డు చైర్మన్‌ అతుల్‌ జైన్‌ ఆమోదించారు. ఈ మేరకు ఈ నెల 25న సమావేశాన్ని నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఉమ్మడి ప్రాజెక్టుల్లో పాత పద్ధతిలోనే అంటే 66 శాతం ఏపీకి, 34 శాతం తెలంగాణకు పంపిణీ చేయాలని ఏపీ ప్రభుత్వం కోరుతుండగా.. చెరి సగం పంపిణీ చేయాలని తెలంగాణ సర్కార్‌ డిమాండ్‌ చేస్తోంది. ఈ నేపథ్యంలో కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశంలో నీటి పంపిణీయే ప్రధాన ఎజెండాగా మారనుంది. 2023లో ఏపీ ప్రభుత్వం నాగార్జునసాగర్‌ స్పిల్‌వేలో సగభాగం, కుడి కాలువ హెడ్‌ రెగ్యులేటర్‌ను తన అధీనంలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్‌ నిర్వహణను పూర్తిగా తమకే అప్పగించాలని తెలంగాణ సర్కార్‌ కోరుతూ వస్తోంది. దీనిని కూడా ఎజెండాలో చేర్చాలని కృష్ణా బోర్డును తెలంగాణ జలవనరుల శాఖ ఉన్నతాధికారులు డిమాండ్‌ చేస్తున్నారు.

అమెరికా ఆరోగ్య మంత్రిగా...
వ్యాక్సిన్ల వ్యతిరేకి

కెనెడీ జూనియర్‌ను నియమించిన ట్రంప్ ● ప్రజారోగ్య నిపుణుల్లో తీవ్ర ఆందోళన

వాషింగ్టన్: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. ఆరోగ్య, ప్రజా సేవల మంత్రిగా వ్యాక్సిన్ వ్యతిరేక ఉద్యమకారుడు రాబర్ట్ ఎఫ్ కెనెడీ జూనియర్‌ను నియమించనున్నట్లు ప్రకటించారు. ''ప్రజారోగ్యం విషయంలో మందుల కంపెనీల మోసాలు, తప్పుడు సమాచారం తదితరాలతో అమెరికన్లు చాలాకాలంగా నలిగిపోయారు. కెనెడీ వీటికి అడ్డుకట్ట వేసి అమెరికాను మళ్లీ గొప్పగా, ఆరోగ్యంగా మారుస్తారు. ఔషధాలు, వ్యాక్సిన్లు, ఆహార భద్రత, వైద్య పరిశోధన, సామాజిక భద్రత, మెడికేర్ వంటి కీలక వ్యవహారాలను ఆయన పర్యవేక్షిస్తారు'' అని తన సోషల్ మీడియా హ్యాండిల్ ట్రూత్‌లో పోస్ట్ చేశారు. 'మేక్ అమెరికా హెల్దీ అగైన్' నినాదానికి కెనెడీ పూర్తిగా న్యాయం చేస్తారని విశ్వాసం వెలిబుచ్చారు. తన రెండో విడత పాలనలో ప్రజారోగ్యం విషయంలో కీలక నిర్ణయాలు తీసుకునేందుకు కెనెడీకి పూర్తి స్వేచ్ఛనిస్తానని ట్రంప్ పదేపదే చెప్పుకొచ్చారు. టీకాలు తదితరాలను తీవ్రంగా వ్యతిరేకించే వ్యక్తికి ఏకంగా ఆరోగ్య శాఖ అప్పగించడం పట్ల తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కీలక నియామకాన్ని సెనేట్ ఆమోదించాల్సి ఉంటుంది.


గురువారం ట్రంప్ బహిరంగ సభలో భార్య చెరిల్ హైన్స్‌తో రాబర్ట్ ఎఫ్.కెనెడీ జూనియర్

రాజకీయ కుటుంబం

కెనెడీ ఉన్నత రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి రాబర్ట్ ఎఫ్.కెనెడీ మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెనెడీకి తమ్ముడు. అమెరికాకు అటార్నీ జనరల్‌గా పని చేశారు. ఈసారి డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం అధ్యక్షుడు జో బైడెన్‌తో కెనెడీ పోటీ పడ్డారు. తర్వాత స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. తాను గెలిస్తే ఆరోగ్య విధాన పర్యవేక్షణను అప్పగిస్తానని ట్రంప్ హామీ ఇవ్వడంతో ఆయనకు మద్దతుగా పోటీ నుంచి తప్పుకున్నారు. అనంతరం ఇద్దరూ మంచి స్నేహితులయ్యారు. ఎన్నికల చివరి దశలో ట్రంప్ కోసం కెనెడీ ముమ్మరంగా ప్రచారం కూడా చేశారు.

వ్యాక్సిన్లకు ఫక్తు వ్యతిరేకి

ప్రపంచంలోనే ప్రముఖ వ్యాక్సిన్ వ్యతిరేక ఉద్యమకారుల్లో కెనెడీ ఒకరు. ఆటిజం తదితర ఆరోగ్య సమస్యలకు టీకాలు కారణమవుతాయన్నది ఆయన వాదన. వ్యాక్సిన్ అస్సలు సురక్షితం కావని, ప్రభావవంతమైనవీ కావని తానిప్పటికీ నమ్ముతున్నానని చెబుతారు. పిల్లలకు టీకాలను సూచించే సీడీసీ మార్గదర్శకాలను వ్యతిరేకించాలని 2021లో ప్రజలకు పిలుపునిచ్చారు. టీకాలకు వ్యతిరేకంగా ఏకంగా ఓ స్వచ్ఛంద సంస్థనే స్థాపించారు. అది టీకా సంస్థలతో పాటు వాటికి మద్దతిచ్చే పలు వార్తా సంస్థలపై కూడా కోర్టుల్లో పోరాడుతోంది. ప్రముఖ న్యాయవాది అయిన కెనెడీ పురుగుమందులు, ఫార్మా కంపెనీలపై కేసుల్లో స్వయంగా వాదిస్తుంటారు. ప్రాసెస్డ్ ఫుడ్, కలుపు మందుల వాడకానికి కూడా ఆయన ఫక్తు వ్యతిరేకి. అమెరికాలో ఆహార పరిశ్రమపై చిరకాలంగా పెత్తనం చలాయిస్తున్న భారీ వాణిజ్య కమతాలు, దాణా పరిశ్రమలను బాగా విమర్శిస్తుంటారు. దశాబ్దాలుగా దేశమంతటా నమ్మకమైన అనుచరగణాన్ని నిర్మించుకున్నారు. ఆహార పదార్థాల విషయంలో కఠిన నిబంధనలు విధించాలన్నది కెనెడీ వైఖరి. అమెరికాలో ఆహారాన్ని ఆరోగ్యకరంగా మారుస్తానని, ఈ విషయంలో యూరప్ తరహా నిబంధనలు తెస్తానని చెబుతున్నారు. ఆరోగ్య శాఖకు సంబంధించి పలు విభాగాల ఉద్యోగుల నేపథ్యాన్ని లోతుగా పరిశీలిస్తామని కూడా ప్రకటించారు. ఫార్మా తదితర కంపెనీల్లో చేసిన నేపథ్యమున్న వారిని ఏం చేయాలో నిర్ణయిస్తామని చెప్పారు. వ్యాక్సిన్ పరిశోధనలను పర్యవేక్షించే వందలాది ఉద్యోగులను తొలగించాలనుకుంటున్నట్లు ఆయన చెప్పడం కలకలం రేపింది.

వివాదాస్పదుడు కూడా

పలు వివాదాల్లో కూడా కెనెడీ పతాక శీర్షికలకెక్కారు. ఎలుగుబంటి కళేబరాన్ని న్యూయార్క్‌లోని సెంట్రల్ పార్క్‌లో పడేసి అది బైక్ ఢీకొని చనిపోయినట్టు చిత్రీకరించారు. దాన్ని ఆయనే కారుతో గుద్ది చంపారంటారు. బీచ్‌లో ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓ తిమింగలం తలను కత్తిరించి కారుకు కట్టి ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని ఆయన కుమార్తే వెల్లడించింది. దాంతో కెనెడీ కోర్టు కేసును ఎదుర్కోవాల్సి వచ్చింది.

తీవ్ర ఆందోళనలు

కెనెడీ నియామకం ప్రజారోగ్య నిపుణులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. చిన్నారులను మహమ్మారుల బారినుంచి కాపాడే టీకాలకు వ్యతిరేకంగా ఉద్యమించే వ్యక్తి చేతుల్లో ప్రజల ఆరోగ్యాన్ని బలి పెడుతున్నారంటూ వారంతా మండిపడుతున్నారు. ఆరోగ్య మంత్రి పదవికి అవసరమైన ఒక్క అర్హత కూడా ఆయనకు లేదని అమెరికాలోని ప్రఖ్యాత ప్రజారోగ్య స్వచ్ఛంద సంస్థ సెంటర్ ఫర్ సైన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ పీటర్ లురీ అన్నారు. ఆ పదవికి ఆయన పూర్తిగా అనర్హుడంటూ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ డైరెక్టర్ డాక్టర్ మండీ కోహెన్ ధ్వజమెత్తారు. ''ఆరోగ్యం విషయంలో అమెరికన్లు మళ్లీ తిరోగమన బాటను కోరుకోవడం లేదు. పిల్లలు, పెద్దలు ఆరోగ్య సమస్యల బారిన పడటం, ప్రాణాలు కోల్పోవడం వంటివి చూడాలనుకోవడం లేదు'' అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


అంతర్గత వ్యవహారాల మంత్రిగా డాగ్ బర్గమ్

అంతర్గత వ్యవహారాల మంత్రిగా నార్త్ డకోటా గవర్నర్ డాగ్ బర్గమ్‌ను ట్రంప్ ఎంచుకున్నారు. నిజానికి ఆయన ట్రంప్ రన్నింగ్‌మేట్ అవుతారని తొలుత అంతా భావించారు. 67 ఏళ్ల బర్గం రెండోసారి గవర్నర్‌గా కొనసాగుతున్నారు. తొలుత రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో కూడా కొనసాగారు. తర్వాత తప్పుకుని ట్రంప్‌కు మద్దతుగా ముమ్మరంగా ప్రచా రం చేశారు. పూర్వాశ్రమంలో సాఫ్ట్‌వేర్ దిగ్గజమైన ఆయన అనంతరం ట్రంప్ మాదిరిగానే రియల్టీ వ్యాపారంలో కూడా రాణించారు.

'హష్ మనీ' లాయర్‌కు అందలం

తన హష్ మనీ కేసును వాదిస్తున్న న్యాయ బృందం సారథి టాడ్ బ్లాంచ్‌ను దేశ డిప్యూటీ అటార్నీ జనరల్‌గా ట్రంప్ ఎంపిక చేశారు. న్యాయ శాఖలో ఇది రెండో అత్యున్నత పదవి. అటార్నీ జనరల్‌గా మాట్ గేట్జ్ ఆయన ఇప్పటికే ఎంచుకోవడం తెలిసిందే. కాంగ్రెస్ మాజీ సభ్యుడు డగ్ కొలిన్స్‌ను వెటరన్స్ వ్యవహారాల మంత్రిగా ట్రంప్ ఎంచుకున్నారు.


టాడ్ బ్లాంచ్ | డాగ్ కొలిన్స్ | డాగ్ బర్గమ్


శుక్రవారం ఢిల్లీలో ఇండియాగేట్ వద్ద కనువిందు చేస్తున్న సూపర్‌మూన్

ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించుతా

శాంతి స్థాపనకు కృషి: ట్రంప్



వాషింగ్టన్: రష్యా–ఉక్రెయిన్ యుద్ధంలో భారీగా జన నష్టం జరుగుతోందని అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ యుద్ధానికి తెర దించడంపై తీవ్రంగా దృష్టి సారిస్తానని ప్రకటించారు. దాంతోపాటు గాజా యుద్ధం, ఇజ్రాయెల్, ఇరాన్, హెజ్‌బొల్లా, హౌతీల మధ్య ఘర్షణ తదితరాలతో అట్టుడుకుతున్న పశ్చిమాసియాలోనూ శాంతి స్థాపనకు తన పాలన బృందంతో కలిసి శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు. ఫ్లోరిడాలోని తన సొంత మారాలాగో ఎస్టేట్లో గురువారం అమెరికా ఫస్ట్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడారు. నవంబర్ 5న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో విజయం అనంతరం ఆయన పాల్గొన్న తొలి బహిరంగ సభ ఇదే. ''రష్యా, ఉక్రెయిన్ సరిహద్దుల్లో గత మూడు రోజుల్లోనే వేలాది మంది సైనికులు మరణించినట్టు ఈ రోజే ఓ నివేదికలో చూశా. యుద్ధం ఆగి తీరాల్సిందే'' అని ట్రంప్ స్పష్టం చేశారు. జాతీయ నిఘా విభాగం డైరెక్టర్‌గా తాను ఎంచుకున్న హిందూ నేత తులసీ గబార్డ్‌పై ఆయన ఈ సందర్భంగా మరోసారి ప్రశంసల వర్షం కురిపించారు. ట్రంప్ సలహాదారుల బృందంలో ముఖ్య సభ్యులంతా సభలో పాల్గొన్నారు. మరే దేశమూ పొరుగు రాజ్యాలపై దండెత్తే ఆలోచన చేయని రీతిలో ఉక్రెయిన్ యుద్ధానికి తెర దించాలని ట్రంప్ భావిస్తున్నట్టు ఆయన ప్రచార బృందంలోని కీలక సభ్యురాలు లీసా కుర్టిస్ చెప్పారు.

శ్రీలంకలో ఎన్‌పీపీ ఘన విజయం

225 సీట్లకు గాను 159 సీట్లు కైవసం

కొలంబో: శ్రీలంక పార్లమెంట్ ఎన్నికల్లో నేషనల్ పీపుల్స్ పవర్(ఎన్‌పీపీ) కూటమి సంచలన విజయం సాధించింది. అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే నేతృత్వంలోని ఎన్‌పీపీ మూడింట రెండొంతుల సీట్లు సొంతం చేసుకుంది. పార్లమెంట్‌లోని 225 సీట్లకు గాను ఏకంగా 159 సీట్లను కూటమి గెలుచుకుంది. ఏకంగా 61 శాతం ఓట్లు(60.8 లక్షలు) కై వసం చేసుకుంది. శ్రీలంక పార్లమెంట్ ఎన్నికలు గురువారం జరగ్గా, శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. సజిత్ ప్రేమదాస నాయకత్వంలోని సమాగీ జన బలవెగాయా పార్టీ 40 సీట్లు సాధించింది. రెండో స్థానంలో నిలిచింది. ఇళంకై తమిళ అరసు కట్చీ 8 సీట్లు, న్యూ డెమొక్రటిక్ ఫ్రంట్ 5 సీట్లు, శ్రీలంక పొదుజన పెరమునా 3 సీట్లు, శ్రీలంక ముస్లిం కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకున్నాయి. అనూర కుమార దిసనాయకే ఈ ఏడాది సెప్టెంబర్‌లో శ్రీలంక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. కొద్ది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికలను ప్రకటించారు. శ్రీలంక నూతన పార్లమెంట్ వచ్చేవారం కొలువుదీరనుంది.

గుజరాత్ తీరంలో 700 కిలోల డ్రగ్స్ స్వాధీనం

- విలువ దాదాపు రూ.3,500 కోట్లు
- 8 మంది ఇరాన్ జాతీయుల అరెస్టు

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని పోర్బందర్ తీరంలో 700 కిలోల మాదక ద్రవ్యాలను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్సీబీ) అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మెథాంఫెటామైన్ డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపు రూ.3,500 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు. అలాగే 8 మంది ఇరాన్ జాతీయులను అరెస్టు చేశారు. విదేశాల నుంచి పెద్ద ఎత్తున డ్రగ్స్ వస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో 'సాగర్ మంథన్–4' అనే కోడ్‌నేమ్‌లో ఎన్సీబీ, భారత నావికాదళం, గుజరాత్ పోలీసు శాఖకు చెందిన యాంటీ–టెర్రరిస్టు స్క్వాడ్(ఏటీఎస్) సిబ్బంది జాయింట్ ఆపరేషన్ ప్రారంభించారు. గుజరాత్ తీరంలో భారత ప్రాదేశిక జలాల్లో ప్రవేశించిన రిజిస్టర్ కాని ఓ పడవను అడ్డుకున్నారు. అందులో తనిఖీ చేయగా 700 కిలోల డ్రగ్స్ లభించాయి. పడవలో ఉన్న 8 మంది ఇరాన్ పౌరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లేవు. భారీ ఎత్తున డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న అధికారులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభినందించారు. 'మాదక ద్రవ్యాల రహిత భారత్' తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. డ్రగ్స్ రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3,500 కిలోల డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మూడు కేసుల్లో 11 మంది ఇరాన్ పౌరులను, 14 మంది పాకిస్తాన్ పౌరులను అరెస్టు చేశారు. వారంతా ప్రస్తుతం ఇండియా జైళ్లలో ఉన్నారు.

ఢిల్లీలో 80 కిలోల కొకైన్ స్వాధీనం

దేశ రాజధాని ఢిల్లీలో రూ.900 కోట్ల విలువైన 80 కిలోల కొకైన్‌ను ఎన్సీబీ శుక్రవారం స్వాధీనం చేసుకుంది. ఓ కొరియర్ సెంటర్‌లో ఆ డ్రగ్స్ లభించినట్లు అధికారులు చెప్పారు.

దీపావళి సంబరాల్లో 'మాంసం, మద్యం'... స్టార్మర్ కార్యాలయం క్షమాపణలు



లండన్: దీపావళి సంబరాల్లో మాంసం, మద్యం చోటు చేసుకున్న ఉదంతంపై బ్రిటన్ ప్రధాని కార్యాలయం శుక్రవారం క్షమాపణలు తెలిపింది. దాన్ని అనుకోకుండా దొర్లిన తప్పిదంగా అభివర్ణించింది. ''దీనిపై బ్రిటిష్ హిందూ సమాజం ఆందోళనలను అర్థం చేసుకోగలం. ఇకపై జరిగే సంబరాల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాం'' అని హామీ ఇచ్చింది. ప్రధాని అధికారిక నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌లో అక్టోబర్ 29న దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాటిలో ప్రధాని ప్రధాని కియర్ స్టార్మర్ పాల్గొనడమే గాక దీపాలు వెలిగించారు. అయితే ఆ వేడుకల్లో మాంసం, మద్యం చోటుచేసుకోవడంపై హిందూ సమాజం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. డౌనింగ్ స్ట్రీట్ దీపావళి సంబరాలు హిందూ సమాజం విశ్వాసాలకు అనుగుణంగా జరగలేదంటూ కన్జర్వేటివ్ పార్టీకి చెందిన బ్రిటిష్ ఇండియన్ ఎంపీ శివానీ రాజా గురువారం స్టార్మర్‌కు లేఖ కూడా రాశారు. ఇకముందు వాటినెలా జరపాలో వివరించేందుకు సంసిద్ధత వెలిబుచ్చారు.

మోదీ విమానంలో సాంకేతిక లోపం



రాంచీ: ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణించాల్సిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఫలితంగా ఆయన ఏకంగా రెండు గంటలకుపైగా జార్ఖండ్‌లోని దేవగఢ్ ఎయిర్‌పోర్టులోనే ఉండిపోవాల్సి వచ్చింది. విమానానికి మరమ్మతులు పూర్తికాకపోవడంతో మరో విమానంలో ఆయన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ప్రధానమంత్రి శుక్రవారం బిహార్‌లో జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అక్కడి నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని దేవగఢ్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్) చెందిన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరాల్సి ఉంది. ఇంతలో విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో మోదీ ప్రయాణం ఆగిపోయింది. రెండు గంటలకుపైగా ఎయిర్‌పోర్టులోనే ఆయన నిరీక్షించారు. అయినప్పటికీ విమానం సిద్ధం కాలేదు. దాంతో అధికారులు మరో ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేశారు. అందులో మోదీ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. వాస్తవానికి మోదీ రాక సందర్భంగా ఈ ప్రాంతాన్ని నో–ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. ఇతర విమానాలు, హెలికాప్టర్ల రాకపోకలకు అనుమతి ఇవ్వలేదు.

చంద్రునిపై ఆవలి వైపూ...
అగ్నిపర్వతాలు!

న్యూయార్క్: చందమామ ఆవలి వైపు కూడా కొన్ని వందల ఏళ్ల కింద భారీ అగ్నిపర్వతాలకు నిలయమేనని సైంటిస్టులు తాజాగా తేల్చారు. చంద్రుని ఆవలివైపు నుంచి చైనాకు చెందిన చాంగ్ ఈ–6 వ్యోమనౌక తొలిసారిగా తీసుకొచ్చిన రాళ్లు, మట్టి, ధూళి నమూనాలను క్షుణ్నంగా పరీక్షించిన మీదట వారు ఈ మేరకు నిర్ధారణకు వచ్చారు. ''వాటిలో అగ్నిపర్వతపు రాళ్ల తాలూకు గుర్తులున్నాయి. అవి దాదాపు 280 కోట్ల కిందివని తేలింది. ఒకటైతే ఇంకా పురాతనమైనది. అది ఏకంగా 420 కోట్ల ఏళ్లనాటిది'' అని వారు వివరించారు. ఆవలి వైపున అగ్నిపర్వతాల పేలుళ్లు కనీసం వంద కోట్ల ఏళ్ల పాటు కొనసాగినట్టు నిర్ధారణ అవుతోందని అధ్యయన సహ సారథి, చైనీస్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ నిపుణుడు క్యూలీ లీ చెప్పారు.

ఇప్పటికీ మిస్టరీయే...

చంద్రునిపై మనకు కనిపించే వైపు అగ్నిపర్వతాల ఉనికి ఎప్పుడో నిర్ధారణ అయింది. అయితే ఆవలి వైపు మాత్రం సైంటిస్టులకు ఎప్పుడూ పెద్ద మిస్టరీగానే ఉంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో తాజా నమూనాలు అందించిన సమాచారం అమూల్యమైనదని విశ్లేషణలో పాలుపంచుకున్న అరిజోనా యూనివర్సిటీకి చెందిన ప్లానెటరీ వాల్కెనో నిపుణుడు క్రిస్టోఫర్ హామిల్టన్ అన్నారు.

ఆదివాసీ సమాజాన్ని ఆరాధిస్తున్నాం

- స్వాతంత్య్ర పోరాటంలో గిరిజనుల త్యాగాలు: మోదీ
- మొత్తం క్రెడిట్‌ను ఒక పార్టీ, ఒక కుటుంబం కొట్టేశాయి
- కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం

పాట్నా: దేశ స్వాతంత్య్రం కోసం ఎంతోమంది గిరిజన యోధులు పోరాటం సాగించారని, క్రెడిట్ మాత్రం కాంగ్రెస్ పార్టీ, ఒక కుటుంబం కొట్టేశాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆక్షేపించారు. గిరిజన నాయకుల పోరాటాలు, త్యాగాలను కాంగ్రెస్ చిన్నచూపు చూసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల కుట్రల వల్ల అడవి బిడ్డలకు పేరు ప్రతిష్టలు దక్కలేదని, వారు అనామకులుగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. గిరిజన పోరాట వీరుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా శుక్రవారం బిహార్‌లోని జముయిలో నిర్వహించిన వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. గిరిజన సంక్షేమానికి సంబంధించి రూ.6,640 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులు ప్రారంభించారు. 'పీఎం జన్ మన్ యోజన'కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రసంగించారు. ఆదివాసీ సమాజాన్ని తాము ఆరాధిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా గిరిజన జాతికి తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలని సంకల్పించామని తెలిపారు. ఇందులో భాగంగా బిర్సా ముండా జయంతిని 'జనజాతీయ గౌరవ్ దివస్'గా ప్రకటించి, వేడుకలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే...

నిజం సమాధికి కుట్రలు

''శతాబ్దాలుగా దేశ సాంస్కృతిక చరిత్ర, ఘనమైన వారసత్వాన్ని పరిరక్షించడంలో గిరిజనుల పాత్ర వెలకట్టలేనిది. శ్రీరాముడు ఒక రాజకుమారుడి నుంచి భగవంతుడిగా మారడానికి గిరిపుత్రులు సహకరించారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలోనూ కీలక పాత్ర పోషించారు. ఎన్నో త్యాగాలు చేశారు. ప్రాణాలు పోగొట్టుకున్నారు. కానీ, గత ప్రభుత్వాలు ఈ నిజాన్ని సమాధి చేసేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించాయి. కొందరి కుట్రల కారణంగా స్వాతంత్య్ర ఉద్యమ క్రెడిట్ మొత్తం ఒక పార్టీకి, ఒక కుటుంబానికి(నెహ్రూ) దక్కింది. దీనివల్ల బిర్సా ముండా, తిల్కా మాంఝీ(18వ శతాబ్దపు సంథాల్ నాయకుడు) పేర్లు మరుగునపడ్డాయి. కొందరు ప్రచారం చేస్తున్నట్లు కేవలం ఒక్క కుటుంబం పోరాటం వల్లే దేశానికి స్వాతంత్య్రం వస్తే మరి బిర్సా ముండా ఎందుకోసం పోరాటం చేసినట్లు?'' అని మోదీ ప్రశ్నించారు.


శుక్రవారం బిహార్‌లోని జముయిలో గిరిజనులతో మోదీ మాటామంతీ

రూ.24,000 కోట్లతో జన్ మన్ యోజన

ఈరోజు 'పీఎం జన్ మన్ యోజన' ప్రారంభించుకుంటున్నాం. గిరిజనుల్లో అత్యంత వెనుకబడ్డ వర్గాల సంక్షేమం కోసం రూ.24,000 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేయబోతున్నాం. పథకం అమల్లోకి రావడం వెనుక రాష్ట్రపతి ముర్ము చొరవ ఉంది. ఈ క్రెడిట్ ఆమెకే దక్కుతుంది. గిరిజనుల జీవన విధానం ప్రకృతికి దగ్గరగా, పర్యావరణ హితంగా ఉంటుంది. ఆధునిక యుగంలో వారి జీవన విధానం అందరికీ అనుసరణీయం.

రాహుల్ హెలికాప్టర్‌కు ఆలస్యంగా అనుమతి



రాంచీ: జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెలికాప్టర్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ) అధికారులు ఆలస్యంగా అనుమతి ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రాహుల్ శుక్రవారం జార్ఖండ్‌లో సుడిగాలి పర్యటనలు చేశారు. రెండు సభల్లో ప్రసంగించారు. గోడ్డా జిల్లాలో ఆయన ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌కు షెడ్యూల్ ప్రకారం అనుమతి ఇవ్వలేదు. 45 నిమిషాలు ఆలస్యంగా అనుమతి ఇవ్వడం పట్ల కాంగ్రెస్ వర్గాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఉద్దేశపూర్వకంగా ఏటీసీ అనుమతిలో జాప్యం జరిగిందని ఆరోపిస్తూ ఆ పార్టీ నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జార్ఖండ్‌లోని దేవగఢ్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రధాని మోదీ విమానంలో బయలుదేరాల్సి ఉండడం, విమానంలో సాంకేతిక లోపం వల్ల ప్రయాణం ఆలస్యంగా కావడం వల్ల అదే ప్రాంతంలో ఉన్న రాహుల్ గాంధీ హెలికాప్టర్‌కు అనుమతి ఇవ్వడంలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. రాహుల్ 45 నిమిషాలపాటు హెలిప్యాడ్‌లోనే ఉండిపోయారు.

ఢిల్లీ గాలి యమ డేంజర్

- రోజుకు 30 సిగరెట్లతో సమానం
- ఆయువులో ఏకంగా 7.8 ఏళ్లు కోత

ఢిల్లీలో వాయు కాలుష్యం నానాటికీ కట్టలు తెంచుకుంటోంది. నెల రోజులకు పైగా కాలుష్య మేఘాలు వాతావరణం నిండా దట్టంగా పరుచుకున్నాయి. దాంతో జనానికి ఊపిరి కూడా ఆడని పరిస్థితి! ప్రస్తుత పరిస్థితుల్లో దేశ రాజధానిలో గాలి పీల్చడమంటే రోజుకు ఏకంగా 25 నుంచి 30 సిగరెట్లు తాగడంతో సమానమని షికాగో యూనివర్సిటీ జరిపిన తాజా అధ్యయనం ఒకటి తేల్చింది! అంతేగాక కాలుష్యం దెబ్బకు ఢిల్లీ ప్రజల ఆయు ప్రమాణం కూడా ఏకంగా 7.8 ఏళ్ల దాకా తగ్గుతోందని వెల్లడించింది. దీర్ఘకాలం పాటు ఢిల్లీ గాలి పీల్చడం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారి తీసే ఆస్కారం కూడా చాలా ఎక్కువని తెలిపింది. ముఖ్యంగా విషతుల్యమైన పీఎం2.5 స్థాయిలు ఢిల్లీలో ఏకంగా 247 గ్రా/ఎం3గా నమోదవుతుండటం గుబులు పుట్టిస్తోంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిన 15గ్రా/ఎం3 ప్రమాణాల కంటే ఏకంగా 20 రెట్లు ఎక్కువ కావడం గమనార్హం. ఇక ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ కూడా ఎప్పుడో 400 దాటేసింది. శుక్రవారం కూడా ఇది 411గా నమోదైంది. కాలుష్యం ధాటికి ఢిల్లీవాసులు ఇప్పటికే దగ్గు తదితర శ్వాస సంబంధ సమస్యలతో పాటు కళ్ల మంటలు, జ్వరం తదిరాలతో అల్లాడుతున్నారు. వాయు కాలుష్య భూతం బారిన పడకుండా ఇళ్లలో ఎయిర్ ప్యూరిఫయర్లు బిగించుకోవాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. బయటికి వెళ్లినప్పుడు విధిగా ఎన్95, ఎన్99 మాస్కులు ధరించాలని చెబుతున్నారు.

భారత్‌లో 30 నుంచి 50 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులకు వాయు కాలుష్యమే కారణమని అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ అనే స్వచ్ఛంద సంస్థ ఇటీవల వెల్లడించిన నివేదిక పేర్కొంది. అయితే ఆ కాలుష్యం మెడ, తల భాగాల క్యాన్సర్‌కు కూడా దారి తీయవచ్చని షికాగో వర్సిటీ అధ్యయనం పేర్కొంది. పొగ తాగేవారిలో ఈ తరహా క్యాన్సర్లు పరిపాటి అని అధ్యయన బృందం సారథి జాన్ క్రామర్ గుర్తు చేశారు. భారత్‌లో ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితుల్లో అత్యధికులు జీవితంలో ఎన్నడూ పొగ తాగనివారేనని ముంబైలోని టాటా స్మారక ఆస్పత్రి గత జూలైలో ప్రచురించిన ఒక అధ్యయనం వెల్లడించడం గమనార్హం.

– సాక్షి, నేషనల్ డెస్క్

యూపీలో ఇంటింటికీ బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్!

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్ భారీ ఎదురుదెబ్బ నుంచి బీజేపీ పాఠం నేర్చుకుంది. 9 అసెంబ్లీ స్థానాలకు అక్కడ జరుగుతున్న ఉప ఎన్నికల్లో మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌తో సమన్వయంతో పనిచేస్తోంది. ఇండియా కూటమి కులాధారిత సామాజిక న్యాయ రాజకీయాన్ని హిందుత్వ కార్డుతో ఢీ కొట్టనుంది. 'ఏక్ హై తో సేఫ్ హై' (ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం) నినాదాన్ని వచ్చే ఐదు రోజులు విస్తృతంగా ఇంటింటికీ తీసుకెళ్లాలని ప్రయాగ్‌రాజ్‌లో బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ కీలక భేటీలో నిర్ణయించారు. సమాజ్‌వాదీ పార్టీ తెరపైకి తెచ్చిన పీడీఏ (పీడిత్, దళిత్, ఆదివాసీ) ఫార్ములాను ఎదుర్కొనే వ్యూహాలపై భేటీ చర్చించింది. హిందుత్వ అజెండాకు పదును పెట్టాలని సంఘ్ నొక్కి చెప్పింది. 'బటేంగేతో కటేంగే' (విడిపోతే చెల్లాచెదురవుతాం) అన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. పార్టీ, సంఘ్ మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాల్సిందిగా పార్టీ శ్రేణులకు ఆదేశాలు జారీ అయ్యాయి. దళిత, ఓబీసీ ఓటర్ల మధ్య విభజనకు యత్నాలకు చెక్ పెట్టాలని బీజేపీకి ఆర్‌ఎస్‌ఎస్ సూచించింది.

చంద్రుని దక్షిణ ధ్రువంపై
నాసా గ్యాస్ పైప్‌లైన్!

చంద్రునిపై శాశ్వత మానవ ఆవాసం దిశగా ప్రయత్నాలను నాసా ముమ్మరం చేస్తోంది. ఇందుకు ఉద్దేశించిన ఆర్టెమిస్ ప్రోగ్రాంపై ఇప్పటికే భారీగా ఖర్చు చేసింది కూడా. అందులో భాగంగా దక్షిణ ధ్రువంపై ఆక్సిజన్ గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని అమెరికా అంతరిక్ష సంస్థ తాజాగా తలపోస్తోంది. దీన్ని ల్యూనార్ సౌత్‌పోల్ ఆక్సిజన్ పైప్‌లైన్ (ఎల్–ఎస్పీఓపీ)గా పిలుస్తున్నారు. చంద్రుని ఉపరితలంపై ఆక్సిజన్ రవాణాకు సంబంధించిన రిస్కులను, ఖర్చులను భారీగా తగ్గించుకోవడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఎందుకంటే చంద్రుని ఉపరితలం మీది రాతి నిక్షేపాల నుంచి ఆక్సిజన్‌ను వెలికితీయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే నీటి అవసరాలను చంద్రునిపై అపారంగా పరుచుకున్న మంచుతో తీర్చుకోవాలని యోచిస్తోంది.

ఎలా చేస్తారు?

చంద్రునిపై ఆక్సిజన్‌ను కంప్రెస్డ్ గ్యాస్, లేదా ద్రవ రూపంలో ట్యాంకుల్లో బాట్లింగ్ చేయాలన్నది నాసా ప్రణాళిక. కాకపోతే వాటి రవాణా పెను సవాలుగా మారనుంది. ఆక్సిజన్‌ను దాని వెలికితీత ప్రాంతం నుంచి సుదూరంలో ఉండే మానవ ఆవాసాలకు తరలించేందుకు అత్యంత వ్యయ ప్రయాసలు తప్పకపోవచ్చని భావిస్తున్నారు. ఇందుకోసం తొలి దశలో కనీసం 5 కి.మీ. పొడవైన పైప్‌లైన్ నిర్మించాలన్నది ప్రాథమిక ప్రణాళిక. దీన్ని చంద్రునిపై అందుబాటులో ఉండే అల్యూమినియం తది తరాల సాయంతోనే పూర్తి చేయాలని నాసా భావిస్తోంది.

- ఈ పనుల్లో పూర్తిగా రోబోలనే వాడనున్నారు.
- మరమ్మతుల వంటివాటిని కూడా రోబోలే చూసుకుంటాయి
- పైప్‌లైన్ ద్వారా ఆక్సిజన్ గంటకు రెండు కి.మీ. వేగంతో ప్రవహిస్తుంది
- ప్రాజెక్టు జీవితకాలం పదేళ్లని అంచనా

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆత్మాహుతి డ్రోన్లను పరీక్షించిన ఉ.కొరియా

భారీ ఎత్తున తయారీకి కిమ్ ఆదేశం



సియోల్: లక్ష్యాలపైకి దూసుకెళ్లి పేలిపోయే ఆత్మాహుతి డ్రోన్లను ఉత్తరకొరియా పరీక్షించింది. వీటి దాడులను ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఆత్మాహుతి డ్రోన్లను భారీ ఎత్తున తయారు చేయాలని కిమ్ ఆదేశించారు. అంతర్జాతీయ జలాల్లో అమెరికా, దక్షిణకొరియా, జపాన్‌లు ఉమ్మడి సైనిక విన్యాసాలు చేపట్టిన తరుణంలో ఉత్తరకొరియా ఈ డ్రోన్ల సామర్థ్యాన్ని పరీక్షించడం గమనార్హం. ఈ మానవరహిత ఏరియల్ వెహికిల్స్‌కు 'ఎక్స్' ఆకృతిలో రెక్కలు, తోక భాగం ఉన్నాయి. ఆగస్టులో పరీక్షించిన డ్రోన్లను పోలి ఉన్నాయని ఉత్తరకొరియా సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. అధ్యక్షుడు కిమ్ సైనిక అధికారులతో మాట్లాడుతున్న ఫొటోలను విడుదల చేసింది. ఈ డ్రోన్లు ఒక బీఎండబ్ల్యూ కారును, పాత యుద్ధ ట్యాంకులను ఢీకొని పేల్చివేసిన దృశ్యాలను ప్రసారం చేసింది. వివిధ దిశల్లో ఈ డ్రోన్లు దూసుకెళ్లి లక్ష్యాలను ఛేదించాయి. వీటి పనితీరు పట్ల కిమ్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ డ్రోన్ల తయారీని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కిమ్ అధికారులను ఆదేశించారు. సైనిక అవసరాల నిమిత్తం పెద్ద ఎత్తున తయారు చేయాలని, చవకైన ఈ డ్రోన్లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

అమ్మో.. పులి!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో సంచారం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

ఏటా శీతాకాలంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న పులులు.. ఉమ్మడి ఆదిలాబాద్ వాసుల్లో అలజడి రేపుతున్నాయి. జనావాసాలకు సమీపంలో సంచరిస్తూ.. పశువులపై దాడి చేసి చంపి తింటున్నాయి. ప్రస్తుతం జానీ, ఎస్–12గా పిలుస్తున్న రెండు పులులు తిరుగుతున్నట్టు గుర్తించారు. ఇలా పులుల రాకను అటవీ అధికారులు, పర్యావరణవేత్తలు స్వాగతిస్తుండగా.. అడవి సమీప ప్రాంతాల ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. పత్తి పంట చేతికొచ్చే వేళ పొలాలకు వెళ్లలేక పోతున్నామని గిరిజన రైతులు వాపోతున్నారు.

ప్రస్తుతం తిరుగుతున్న పులులు జానీ, ఎస్–12గా గుర్తింపు

- పశువులపై దాడి చేసి చంపేస్తున్న వైనం..
- అవి టైగర్ జోన్ వెలుపల జనావాసాల్లోకి వస్తుండటంపై ఆందోళన
- పత్తి తీసే పనులు సాగడం లేదంటున్న గిరిజన రైతులు

అక్కడ సరిపోక..

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యాలలో పులుల సంఖ్య పెరిగింది. అక్కడి ఇరుకు ఆవాసం వల్ల ఆ పులులు తెలంగాణ వైపు వస్తున్నాయి. వాటిలో మగపులులే అధికమని అధికారులు చెప్తున్నారు. గత నెల రోజులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, కుంటాల, సారంగాపూర్, మామడ, పెంబి మండలాల్లో ఎనిమిదేళ్ల మగ పులి(జానీ) సంచరిస్తున్నట్టు గుర్తించారు. సుమారు రెండేళ్ల వయసున్న మరో మగ పులి (ఎస్ 12) మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట, బెల్లంపల్లి అటవీ ప్రాంతంలో తిరుగుతోంది. ఇంకో పులి కెరమెరి మండలంలోని లక్మాపూర్, కరంజివాడ ప్రాంతాల్లో కనిపించి వెళ్లిపోయింది.



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం మేదారం అడవుల్లో కెమెరాకు చిక్కిన మగ పులి



నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి)శివారు మహబూబా ఘాట్స్‌పై పులి

ఇక్కడ కోర్ ఏరియాలోకి వెళ్లలేక..

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్ జోన్ల నుంచి వస్తున్న పులులు.. కవ్వాల్‌లోని కోర్ ఏరియాకు చేరుకోవాలంటే, 200 కిలోమీటర్లకుపైగా నడవాలి. ఇది వాటికి పెద్ద సమస్య కాకపోయినా.. మధ్యలో జాతీయ రహదారులు, బొగ్గు గనులు, సాగునీటి ప్రాజెక్టులు, పోడు సాగు, పంట పొలాలు పులుల రాకకు ఆటంకంగా మారాయి. రహదారుల వెంట అండర్ పాస్‌లు, ఓవర్ పాస్‌లు ఏర్పాటు చేసినా ప్రయోజనం కనిపించడం లేదు. అయితే ఆ పులులు అడవి అంచుల్లోనే సంచరిస్తుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు కవ్వాల్ బయట కాగజ్‌నగర్ డివిజన్‌లో ఐదు పెద్దవి, నాలుగు చిన్నవి కలిపి 9 పులులు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

మనుషులపై దాడులతో కలకలం

రాష్ట్రంలోకి వస్తున్న పులులు.. పశువులు, మనుషులపై దాడి చేస్తున్నాయి. 2020 నవంబర్‌లో 18 రోజుల వ్యవధిలో ఏ2 అనే మగపులి ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం దిగిడకు చెందిన సిడాం విగ్నేశ్ (21)పై, పెంచికల్‌పేట మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల (18)పై పొలాల్లో దాడిచేసి చంపేసింది. గత ఏడాది నవంబర్‌లో మరో పులి ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము (69)పై దాడి చేసి ప్రాణాలు తీసింది. నాటి ఘటనల నేపథ్యంలో.. ఇప్పుడు అటవీ అధికారులు ఏజెన్సీ ప్రజలను అప్రమత్తం చేశారు.



పులి సంచారంపై స్థానికులను అప్రమత్తం చేస్తున్న అధికారులు

కోర్ ఏరియాలోకి వెళ్లేలా చూస్తున్నాం..



టైగర్ జోన్ వెలుపల సంచరించే కొత్త పులులు కోర్ ఏరియాలోకి వెళ్లేలా ప్రయత్నాలు చేస్తున్నాం. వేటగాళ్లు ఉచ్చులు వేయకుండా, స్థానికులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పులి దాడి చేసిన పశువుల యజమానులకు వెంటనే పరిహారం ఇస్తున్నాం. పులి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

\- శాంతారామ్, ఫీల్డ్ డైరెక్టర్, ప్రాజెక్టు టైగర్, కవ్వాల్ టైగర్ రిజర్వు

పులుల సంచారంతో భయంగా ఉంది



పులి భయంతో పత్తి తీసే పనులు సాగడం లేదు. మా చేన్ల వైపు పులి రాకుండా అటవీ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే రైతులు చాలా నష్టపోతారు.

\- ఆత్రం జైతు, భుర్కరెగడి గ్రామం, నిర్మల్ జిల్లా

ఎదురొస్తే.. ఎలా ఎదుర్కోవాలి?

పులి మనకు ఎదురొచ్చినా.. మనం పులికి ఎదురెళ్లినా.. 'పోయేది' మనమేనన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే, ఒకవేళ మన టైం బాగోక పులిని మనం చూసినా లేదా అది మనల్ని చూసినా ఏం చేయాలి ?

మీరు పులిని చూశారు.. అది మిమ్మల్ని చూడలేదు. అలాంటప్పుడు ఎక్కడున్నారో అక్కడే కదలకుండా నిశ్శబ్దంగా నిల్చోండి. శ్వాస వేగంగా తీసుకోకూడదు. చెప్పడం ఈజీగానీ.. పులిని చూశాక.. ఎవరైనా గాబరా పడటం సహజం, అయితే.. ఇక్కడ మీరు ఎంత కామ్‌గా ఉంటారన్న దాని మీదే మీ జీవితం ఆధారపడి ఉంటుంది. అది వెళ్లేంతవరకూ ఆగండి. వెళ్లాక.. అది వెళ్లిన దిశకు వ్యతిరేక దిశలో వెంటనే వెళ్లిపోండి. ఇక్కడ తప్పించుకుపోవడం ఒక్కటే మీ లక్ష్యంగా ఉండాలి. అంతే తప్ప.. ఏదైనా కొత్తగా చేసి హీరోయిజం చూపిద్దాం అనుకుంటే.. అడవిలో అదే హీరో అన్న విషయాన్ని మరోసారి గుర్తు చేసుకోండి.

ఈసారి పులే మిమ్మల్ని చూసింది. మొట్టమొదట చేయకూడని పని పరుగెత్తడం. మీరు ఉసేన్ బోల్ట్ కాదు.. అదైతే కన్సర్న్. పైగా వెంటాడుతూ.. వేటాడటంలో పులులు స్పెషలిస్టులు. అందుకే అలా చేయొద్దు.. ఒకవేళ మీరు కూర్చునే పొజిషన్‌లో ఉంటే.. ముందుగా లేచి నిల్చోండి. ఎందుకంటే.. పులులు సాధారణంగా జింకల్లాంటి వాటిపై వెనుక నుంచి దాడి చేస్తాయి.. ముఖ్యంగా అవి కూర్చునే పొజిషన్‌లో ఉన్నప్పుడు వేటాడతాయి. పైగా.. అవి తాము వేటాడే జంతువులకు, మనుషులకు మధ్య తేడాను గుర్తించలేవు. అందుకే లేచి నిల్చోవడం ద్వారా మీరు పులి వేటాడే జంతువు కాదన్న విషయాన్ని తెలియజేయాలి. గతంలో కూడా మన దేశంలో అడవుల్లో వంగి.. కట్టెలు ఏరుకుంటున్న వారు లేదా వంగి పనిచేసుకుంటున్న మనుషులపై వెనుక నుంచే అత్యధిక శాతం పులి దాడులు జరిగాయి.



లేచి నిల్చున్నారు సరే.. తర్వాతేం చేయాలి? పులికి మీ మీద దాడి చేసే ఉద్దేశం ఉందో లేదో తెలుసుకోవాలి.. దాన్ని అడిగి కాదు.. దాన్ని గమనించడం ద్వారా.. సాధారణంగా పులికి మీ మీద దాడి చేసే ఉద్దేశం ఉంటే.. అది ఒక్కసారిగా అక్కడే ఆగిపోతుంది.. మీ మీదే దృష్టి పెడుతుంది.. కాళ్లను వంచుతుంది.. దాని చెవులు ఇలా వెనక్కి వెళ్లినట్లుగా అవుతాయి. ఆగ్రహంగా గాండ్రించి.. ముందుకు దూకుతుంది.

ఆగండాగండి.. ఇక్కడో విషయం చెప్పాలి. కుక్కల చెవులు కూడా వెనక్కి వెళ్తాయి మనపట్ల స్నేహభావంతో.. ఇక్కడ కూడా చెవులు వెనక్కి వెళ్లాయి కదా.. ఫ్రెండే అని అనుకోకండి.. బాలయ్య బాబు ఏదో సినిమాలో చెప్పినట్లు బోత్ ఆర్ నాట్ సేమ్ అని తెలుసుకోండి. పులి చెవులు వెనక్కి వెళ్లాయంటే.. అది వార్నింగ్ కిందే లెక్క.. నువ్వక్కడ ఉండటం దానికి ఇష్టం లేదన్నమాట. ఉన్నచోట ఉన్నట్లే ఒక్కొక్క అడుగు వెనక్కి వేసుకుంటూ.. వెళ్లండి. వీపు చూపొద్దు. చూపితే వెంటనే దాడి తప్పదు. గతంలో మధ్యప్రదేశ్‌లోని భాంధవ్‌గఢ్ నేషనల్ పార్కులో మూడు పులులు రావడంతో ఓ ఏనుగు భయపడి.. మావటిని కిందన పడేసి వెళ్లిపోయింది. దాంతో ఆ మావటి వెనక్కి తిరిగి పరిగెట్టకుండా.. ఇలాగే ఒక్కో అడుగూ నెమ్మదిగా వెనక్కి వేసుకుంటూ.. రెండు గంటల తర్వాత ఆ ప్రాంతం నుంచి బయటపడ్డాడట.

ఒకవేళ దగ్గర్లో చెట్టు ఉంది.. పులి కొంచెం దూరంగా ఉంది. మీకు చెట్లెక్కడం బాగా వస్తే.. వెంటనే ఎక్కేయండి. కనీసం 15 అడుగుల ఎత్తు ఎక్కేదాకా ఆగొద్దు. చాన్స్ ఉంటే ఇంకా పైకి ఎక్కండి. మీకు వేగంగా చెట్లు ఎక్కగలిగే సామర్థ్యం ఉంటేనే ట్రై చేయండి. లేకపోతే వద్దు. పులులు 15 అడుగుల ఎత్తు దాకా ఎగరగలవు. పులులు చెట్లెక్కడంలో స్పెషలిస్టులు కావు.

ఒకవేళ దగ్గర్లో చెరువు ఉంది. పులి కొంచెం దూరంగా ఉంది.. అయినా సరే.. ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిలో దూకొద్దు.. మీకు ఒలింపిక్స్‌లో గోల్డ్ వచ్చి ఉంటే మాత్రం దూకండి. ఎందుకంటే.. పులులు మనకన్నా బాగా ఈదగలవు. ఇంకో ఆప్షన్ కూడా ఉంది. బాగా సౌండ్ చేయగల మెటల్ వస్తువులు ఉంటే.. హోరెత్తించేయండి. చేతిలో ఏం లేదు.. పులి దాడి చేయడానికి వస్తుంటే.. అప్పుడు చాలా గట్టిగా అరవండి. ఎంతలా అంటే.. దాని చెవులకు చిల్లులు పడేలా.. ఇలాంటి టైంలో అది కన్ఫ్యూజ్ అవుతుంది.

అన్ని ఆప్షన్లు అయిపోయాయి. ఇక చేసేదేమీ లేదంటే మాత్రం పోరాడాల్సిందే. దగ్గర్లో ఏది దొరికితే.. అది పట్టుకోండి. రాయి, కర్ర ఏదైనా సరే. పులి శరీరంలో కళ్లు, ముక్కు బలహీన ప్రదేశాలు. అక్కడే బలంగా దాడి చేయాలి. పులి బలం దాని పంజా, కోరలు.. వాటి నుంచే తప్పించుకోవాలి. అది దాడి చేయడానికి వచ్చినప్పుడు పులికి ఎంత దగ్గరగా అయితే.. అంత దగ్గరగా ఉండి పోరాడాలి. దాని పీకను పట్టుకొని.. గట్టిగా హత్తుకోవాలి. ధృతరాష్ట్ర కౌగిలిలాగ.. ఊపిరి పీల్చుకునే అవకాశం ఇవ్వకూడదు. గట్టిగా అదిమి పట్టుకుంటే.. అది ఆశ్చర్యపోతుంది. పులులు సాధారణంగా దాన్ని ఇష్టపడవు. అవి ప్రేమలో ఉన్నప్పుడు లేదా వేరే పులులతో పోరాడుతున్నప్పుడు కూడా బాగా దగ్గరగా అలముకున్నట్లు ఉండవు. మెడ జాగ్రత్త. పులికి దొరికితే అంతే. పోరాడుతున్నంత సేపు.. గట్టిగా అరుస్తూనే ఉండాలి. పులులు సాధారణంగా పోరాటాలను ఇష్టపడవు. కానీ అది పోరాటానికి దిగిందంటే మాత్రం చంపడానికే దిగుతుంది. అది తప్పించుకోవాలని అనుకుంటేనో.. లేదా మనం చేసిన ఏ పనితోనైనా అది ఆశ్చర్యపోతేనో తప్ప..

చివరగా అన్నింటికన్నా ముఖ్యమైన విషయం.. పైన చెప్పినవన్నీ చేస్తున్న సమయంలో దేవుడిని ప్రార్థించడం మాత్రం మరువద్దు. ఈ టిప్స్ ఫెయిలయినా.. ఆ దేవుడు మిమ్మల్ని కాపాడవచ్చు. ఆల్ ది బెస్ట్ మరి..

ఓ పులి రేపు రా..

\- సాక్షి సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

రాష్ట్రంలో పర్యాటకానికి నూతన ప్రణాళికలు

మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ యాత్రికులు ఇక్కడి పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాలను సందర్శించే విధంగా రాష్ట్ర ప్రభు త్వం నూతన ప్రణాళికలను రూపొందిస్తోందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే ఓ కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యాటకులతోపాటు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాల కోసం వచ్చే వారిని పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని చెప్పారు. శుక్రవారం హైటెక్స్‌లో జరిగిన ట్రావెర్నియా ఫెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక, వారసత్వ, చారిత్రక ప్రాంతాలు, ఆయా ప్రజల జీవన శైలి, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాల గురించి సమగ్ర సమాచారం అందించడమే లక్ష్యంగా ట్రావెర్నియా ఫెస్ట్ నిర్వహించడం బాగుందని కితాబిచ్చారు.

'టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగించాలి'

సాక్షి, హైదరాబాద్: పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 18 నుంచి 30 వరకు పొడిగించాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సంఘ నేతలు రాజా భానుచంద్ర ప్రకాశ్, రాజా గంగారెడ్డి లేఖ రాశారు. న్యాస్ పరీక్ష నిర్వహణ, పండుగలు, ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాల నమోదులో సాంకేతిక ఇబ్బందులు రావడాన్ని దృష్టిలో పెట్టుకుని ఫీజు గడువు పొడిగించాలని కోరారు. టెన్త్ మూల్యాంకనకు 33 జిల్లాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయాలని, స్కూల్ సమీపంలోనే పరీక్ష కేంద్రాలుండాలని విన్నవించారు. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అల్పాహారం ఇవ్వాలన్నారు.

నేడు బీజేపీ మూసీ నిద్ర

20 ప్రాంతాల్లో పార్టీ నేతల బస

- అంబర్‌పేట తులసీరాంనగర్‌లో కిషన్‌రెడ్డి
- ఎల్‌బీనగర్ ద్వారకాపురి కాలనీలో ఈటల
- ఆదివారం ఉదయం వరకు ప్రజలతో మమేకం
- సమస్యలపై అధ్యయనం, బాధితులతో రచ్చబండ



సాక్షి, హైదరాబాద్: 'మూసీ ప్రక్షాళన చేయండి.. కానీ పేదల ఇళ్లు కూల్చకండి' అనే నినాదంతో బీజేపీ 'మూసీ నిద్ర'కు సిద్ధమైంది. మూసీ పరీవాహక ప్రాంతంలో ఒకరోజు ఉండి చూపించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించిన బీజేపీ.. ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. శనివారం సాయంత్రం 4 నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు మూసీ పరీవాహక ప్రాంతంలోని 3 ఎంపీ, 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 20 ప్రదేశాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. బీజేపీ నేతలు ప్రజల ఇళ్లలోనే భోజనంచేసి, అక్కడే నిద్రిస్తారు. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి తన నియోజకవర్గం సికింద్రాబాద్ పరిధిలోని అంబర్‌పేట తులసీరాంనగర్‌లో 'మూసీనిద్ర'లో పాల్గొంటారు. ఈ కార్యక్రమ వివరాలను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు సమగ్ర నివేదికను ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

రచ్చబండ చర్చలు.. అధ్యయనం

మూసీ నిద్ర కార్యక్రమంలో భాగంగా బీజేపీ నేతలు తాము బసచేసే ప్రాంతాల్లోని ప్రజలతో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శనివారం సాయంత్రం నేతలంతా తమకు కేటాయించిన ప్రాంతాలకు చేరుకొని మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు బాధితులను పరామర్శిస్తారు. కూల్చటానికి ప్రభుత్వం మార్కింగ్ చేసిన ఇళ్లు, ఆస్తులను పరిశీలిస్తారు. రాత్రికి అక్కడి ప్రజల ఇళ్లలోనే భోజనం చేసి నిద్రిస్తారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు.. స్థానిక ప్రజల సాధారణ సమస్యలపై అధ్యయనం చేస్తారు. ఆదివారం ఉదయం అక్కడే అల్పాహారం చేసి మరోసారి స్థానిక ప్రజలతో సమావేశమవుతారు. రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించి మూసీ ప్రాజెక్టుపై స్థానికుల అభ్యంతరాలను సేకరిస్తారు. మీడియా సమావేశాలు నిర్వహిస్తారు. ముఖ్యనేతలు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ పరంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తారు.

నేతలకు కేటాయించిన ప్రాంతాలు

మూసీ నిద్ర కార్యక్రమంలో ఏ నాయకుడు ఎక్కడ పాల్గొనాలో బీజేపీ ఇప్పటికే నిర్ణయించి ఆయా నేతలకు ఆదేశాలు జారీచేసింది. కిషన్‌రెడ్డి అంబర్‌పేటలోని తులసీరాంనగర్‌లో మూసీ నిద్ర చేస్తారు. ఓల్డ్ మలక్ పేట్ శాలివాహన్ నగర్‌లో ఎంపీ కె.లక్ష్మణ్, ఎల్బీనగర్‌లోని ద్వారకాపురి కాలనీ, గణేష్ నగర్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొంటారు. రాజేంద్రనగర్ పరిధిలోని హైదర్ షాకోట్‌లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గోషామహల్ పరిధిలోని గౌలిగూడలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, మేడ్చల్ రూరల్ ఘట్ కేసర్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రాంచందర్ రావు, అఫ్జల్‌గంజ్‌లోని రెసిడెన్షియల్ హౌసింగ్ బస్తీలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, జుమ్మెరాత్ బజార్‌లో మాజీ ఎంపీ సీతారాం నాయక్, ఎల్బీనగర్ పరిధిలోని సత్యనగర్, న్యూ మారుతీనగర్‌లో మాజీ ఎంపీ చాడ సురేష్ రెడ్డి తదితరులు మూసీ నిద్ర చేయనున్నారు.

హాన్ నదిలా మూసీ

- మూసీ పునరుద్ధరణతో పర్యాటకాభివృద్ధి
- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- దక్షిణ కొరియాలోని హాన్, చియాంగీచాన్ నదుల సందర్శన



సాక్షి, హైదరాబాద్: దక్షిణ కొరియాలోని హాన్ నదిలా హైదరాబాద్‌లోని మూసీ నదిని సుందరంగా తీర్చిదిద్దితే ఆ ప్రాంతం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సియోల్ నగరంలోని హాన్ నదికి మూసీ నదికి దగ్గరి పోలికలు ఉన్నాయని తెలిపారు. గడ్డం ప్రసాద్‌తో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, శాసనసభ కార్యదర్శి వీ నరసింహా చార్యులు దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. శుక్రవారం వారు హాన్, చియాంగీచాన్ నదులను సందర్శించారు. అక్కడ చేపట్టిన నదుల సుందరీకరణ కార్యక్రమాల గురించి అధికారులు వీరికి వివరించారు. సియోల్ నగరం మధ్య నుంచి ప్రవహించే హాన్ నది గతంలో మురికి నీటితో కాలుష్యంతో నిండి ఉండేదని, 20 ఏళ్ల క్రితం ప్రభుత్వం నదిని శుద్ధి చేసి మౌలిక వసతులు కల్పించడంతో పర్యాటక ప్రాంతంగా మారిందని తెలిపారు. చియాంగీచాన్ నది వెంట మౌలిక వసతులు కల్పించడంతో పర్యాటకం బాగా అభివృద్ధి చెందినట్లు స్థానికులు వివరించారు. ఆస్ట్రేలియాలో జరిగిన 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం వీరు కామన్వెల్త్ దేశాల్లో స్టడీ టూర్ నిర్వహిస్తున్నారు.

రూ. 24 వేల వార్షికాదాయం మించొద్దు

- పదో తరగతి పరీక్ష ఫీజు మాఫీకి దశాబ్దాలనాటి రూల్
- వార్షికాదాయం రూ.24 వేలు దాటితే ఫీజు కట్టాల్సిందే
- అంత తక్కువ ఆదాయంతో సర్టిఫికెట్ ఇవ్వలేమంటున్న ఎమ్మార్వోలు
- నష్టపోతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత కాలంలో రోజు కూలీకి వెళ్లే వాళ్లు కూడా నెలకు రూ.15,000 సంపాదిస్తున్నారు. చిన్నపాటి ఉద్యోగం చేసేవాళ్లు కూడా ఏటా రూ.2 లక్షలకు పైగానే సంపాదిస్తున్నారు. అలాంటిది పదో తరగతి (ఎస్ఎస్‌సీ) వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు మాఫీకి అర్హత సాధించాలంటే వారి తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.24 వేలు మించరాదని పాఠశాల విద్యాశాఖ షరతు పెట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దశాబ్దాల క్రితం అమల్లోకి తెచ్చిన ఈ నిబంధననే ఇంకా కొనసాగిస్తుండటంతో విద్యార్థులు నష్టపోతున్నారు. టెన్త్ వార్షిక పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఈ నెల 18వ తేదీ వరకు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి రూ.125 చొప్పున ఫీజు చెల్లించాలని టెన్త్ పరీక్షల విభాగం సూచించింది. పరీక్ష రాసే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ మినహాయింపు పొందాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి రూ.24 వేలలోపే ఉన్నట్టు మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) నుంచి సర్టిఫికెట్ తేవాలని నిబంధన పెట్టారు. ఇక్కడే అసలు సమస్య వచ్చింది.

సర్టిఫికెట్ ఎలా ఇచ్చేది?

ఏడాదికి రూ.24 వేల ఆదాయం అంటే.. నెలకు రూ.2 వేలు. ప్రభుత్వ సామాజిక పెన్షన్ కూడా రూ.2 వేల కంటే అధికంగానే ఉన్నది. అలాంటప్పుడు నెలకు రూ. 2 వేలు ఆదాయం ఉన్నట్టు ఎలా ధ్రువపత్రం ఇస్తామని అధికారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో మండల ఆఫీసుకు తిరిగి, ఆటో ఖర్చులు వదిలించుకోవడం తప్ప ప్రయోజనం ఉండటం లేదని విద్యార్థులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో ఏడాది రూ.2 లక్షల వార్షిక వేతనం ఉన్నవారిని దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారిగా గుర్తించాలని ప్రభుత్వాలు పేర్కొన్నాయి. కానీ విద్యాశాఖ మాత్రం కొన్ని దశాబ్దాల నాటి నిబంధననే ఇంకా కొనసాగించటం హాస్యాస్పదంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. సాధ్యం కాని రూల్స్ పెట్టే బదులు, ఫీజు రాయితీ ఇవ్వకపోయినా బాగుండేదని విమర్శిస్తున్నారు.

రూ.100 కోట్లు.. 'గాడిద పాలు'

▶ మొదటి పేజీ తరువాయి

పలువురు రైతులు ఆ సంస్థ ప్రతినిధులను సంప్రదించారు. ఈ క్రమంలోనే ఫ్రాంచైజీ తీసుకోవాలనుకునేవారు రూ. 5.5 లక్షలు ముందుగా చెల్లించాల్సి ఉంటుందని, ఆపై గాడిదలను తామే కొనుగోలు చేసి ఇస్తామని, ఒక్కో లీటరు పాలకు రూ.1,600 చొప్పున చెల్లిస్తామని సంస్థ ప్రతినిధులు చెప్పారు. గాడిదలను గుజరాత్ నుంచి కొనుగోలు చేయడానికి ఒక్కోదానికి రూ.70 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. ఇదిలా ఉండగా ప్రారంభ సమయంలో కొందరికి 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు సక్రమంగానే పాలకు సంబంధించిన బిల్లులు చెల్లించారు. దీంతో ఈ వ్యాపారం బాగుందని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన 400 మందికి పైగా రైతులు ఫ్రాంచైజీలు తీసుకున్నారు. దీంతో డాంకీ ప్యాలస్ సంస్థ ప్రతినిధులు ఒక్కొకరి నుంచి రూ. 20 లక్షలు మొదలు రూ.70 లక్షల వరకు కట్టించుకున్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యం.. ఆపై బెదిరింపులు

మొదట్లో బాగానే ఉన్నా.. గత 18 నెలల నుంచి పాల బిల్లుల చెల్లింపులో జాప్యం మొదలైంది. బిల్లులు అడిగితే సంస్థ ప్రతినిధులు బెదిరింపులకు దిగడం మొదలుపెట్టారు. దీంతో తిరునల్వేలి జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలను కలిసి ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. తమ ఫిర్యాదు మేరకు పోలీసులు డాంకీ ప్యాలస్ ప్రతినిధులను గట్టిగా హెచ్చరించారని, రైతులకు న్యాయం చేయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని వెల్లడించారు. దీంతో డాంకీ ప్యాలస్ ప్రతినిధులు దాదాపు 200 మంది రైతులను వాట్సాప్ గ్రూపుల్లో బెదిరించారని చెప్పారు. తమకు రాజకీయంగా పలుకుబడి ఉందని, మీరేం చేయలేరని, చంపేస్తామని మెస్సేజ్‌లు పెట్టారని బాధితులు వాపోయారు. తామంతా సుమారు రూ.100 కోట్ల వరకు మోసపోయామని పేర్కొన్నారు. కాగా, ఏడాది క్రితం రూ.10 కోట్ల చెక్కు యూరప్ నుంచి వచ్చిందని, ఆ డబ్బులు రాగానే అందరికి చెల్లింపులు చేస్తామని చెప్పారని వెల్లడించారు. చాలా మందికి చెక్కులు ఇచ్చారని, అయితే తమ బ్యాంకు ఖాతాల్లో చెక్‌లను డిపాజిట్ చేస్తే బౌన్స్ అయ్యాయని తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఏపీ మంత్రి లోకేశ్‌కు వినతి పత్రం ఇచ్చామని, తమ బాధలను కేటీఆర్ ట్విట్టర్‌లో చూసి స్పందించారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్‌లు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

ఆదుకోకుంటే.. ఆత్మహత్యే శరణ్యం

మేం రైతులం. పాలు అమ్ముకుని బతుకుదాం అనుకున్నాం. రూ.30 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. డాంకీ ప్యాలస్ వాళ్లు మోసం చేశారు. రూ.లక్షలు పెట్టి గుజరాత్‌లో కొనుగోలు చేసిన వందలాది గాడిదలను మేపలేక వదిలేస్తున్నాం. అవి చచ్చిపోతున్నాయి. చేసిన అప్పులు తీర్చడానికి మాకు వేరే దిక్కులేదు. ప్రభుత్వాలు ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్నాం.

– తేజస్విని, బాధితురాలు, అనంతపురం (ఏపీ)

త్వరలో హరీశ్, కేసీఆర్‌ల విచారణ?



కాళేశ్వరం బరాజ్‌లపై క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలవనున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

- 21న రాష్ట్రానికి వస్తున్న పీసీ ఘోష్.. 22 లేదా 23 నుంచి ప్రక్రియ
- తొలుత ఐఏఎస్ అధికారులు, తర్వాత ప్రజాప్రతినిధుల విచారణ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈనెల 22 లేదా 23 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునఃప్రారంభించనుంది. ఈ నెల 21న జస్టిస్ పీసీ ఘోష్ హైదరాబాద్‌కు చేరుకుని.. నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను ప్రారంభించి.. తొలుత ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను విచారించనున్నారు. నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన రిటైర్డ్ ఐఏఎస్‌లు ఎస్‌కే జోషి, రజత్‌కుమార్, కొంతకాలం ఇన్‌చార్జి కార్య దర్శిగా వ్యవహరించిన వికాస్‌రాజ్, సోమేశ్ కుమార్, సీఎం కేసీఆర్‌కు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్‌లను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే వీరిని విచారించిన కమిషన్.. కీలక సమాచారాన్ని అఫిడవిట్ల రూపంలో తీసుకుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలక నిర్ణయాలు తీసుకున్నది ఎవరు? బరాజ్‌ల వైఫల్యానికి కారణాలు ఏమిటి? ప్రాజెక్టును ఎందుకు రీఇంజనీరింగ్ చేశారు? తదితర అంశాలపై సమాచారాన్ని సేకరించింది. ఈ క్రమంలో ఐఏఎస్ అధికారులను క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన తర్వాత.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులను క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలిపించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నెలాఖరులో, లేదా వచ్చే నెల తొలివారంలో హాజరుకావాలంటూ వారికి సమన్లు జారీ చేయనున్నట్టు పేర్కొంటున్నాయి. మొత్తానికి డిసెంబర్ చివరిలోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉందని సమాచారం.

కులగణన సామాజిక న్యాయానికి తొలిమెట్టు : జైరాం రమేశ్

సాక్షి, న్యూఢిల్లీ : కులగణన సామాజిక న్యాయానికి తొలిమెట్టు అని..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక ముందడుగు వేసిందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. ఈ సంప్రదాయాన్ని ఆచరించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని శుక్రవారం ఎక్స్ వేదికగా విమర్శించారు. 'కులాల సర్వే అనేది సామాజిక న్యాయం దిశగా విప్లవాత్మకమైన ముందడుగు. తెలంగాణలో 33 జిల్లాల్లో 1.17 కోట్ల కుటుంబాల సర్వేకు 80 వేల మంది ఎన్యుమరేటర్లు పనిచేస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 55 శాతం సర్వే పూర్తయిపోయింది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో అధికారులు 44 వార్డుల్లో పర్యటించి 288 ఎన్యుమరేషన్ బ్లాకుల జీఐఎస్(భౌగోళిక సమాచార వ్యవస్థ) మ్యాప్‌ను అభివృద్ధి చేశారు. సర్వే నివేదికలను సురక్షితంగా నిల్వ చేయడానికి తగిన భద్రత చర్యలు తీసుకుంటున్నారు. 2021లో జరగాల్సిన దశాబ్ద జనాభాగణనను నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది'అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

నేత్రపర్వం.. పంచ సహస్ర దీపోత్సవం



జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన పంచ సహస్ర దీపోత్సవం నేత్రపర్వంగా సాగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బ్రహ్మపుష్కరిణి కోనేరులో నలువైపులా 5 వేల దీపాలు వెలిగించారు. శ్రీలక్ష్మీనృసింహస్వాములను కోనేరు మధ్యలోని భోగ మండపంలో ఆసీనులు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ధర్మపురి

జ్వాలా తోరణం.. భక్తుల పరవశం



కార్తీక పౌర్ణమి సందర్భంగా నల్లగొండలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం వద్ద జ్వాలా తోరణం కింద నుంచి స్వామి వారిని తీసుకొస్తున్న భక్తులు.

- నల్లగొండ

కోటగుళ్లు.. దీపాల లోగిళ్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల ఆలయం కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి వెలుగులతో మెరిసింది. రాత్రి 6 గంటలకు ఆలయ ప్రాంగణంతోపాటు ఉప ఆలయాల వద్ద 11 వేల దివ్వెలు వెలిగించారు. దీంతో ఆలయం అటు నిండుపున్నమి, ఇటు దీపాల వెలుగుల్లో శోభాయమానంగా కనిపించింది.

- గణపురం

క్లుప్తంగా...

కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి అనర్హుడు

కలెక్టర్‌పై దాడులను సమర్థించడం శోచనీయం: పొన్నం



సిరిసిల్ల టౌన్: కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి అనర్హుడని రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో శుక్రవారం నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి.. జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడిని ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. మళ్లీ సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు జరగడం బాధ కలిగిస్తుందని పొన్నం ఆవేదన వ్యక్తం చేశారు. నేతన్నలను గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామన్నారు. త్వరలోనే సిరిసిల్లలో 'ఆత్మస్థైర్య ర్యాలీ'చేపడతామని తెలిపారు. సిరిసిల్ల నేత కార్మికులకు ప్రభుత్వపరంగా అన్ని ప్రయోజనాలు కల్పించి ఆదుకుంటామని స్పష్టం చేశారు. పదేళ్ల నిరంకుశపాలన చూశామని.. ఇప్పుడు ప్రతిపక్షాలు కూడా నిరసన తెలిపే అవకాశాన్నిస్తూ ప్రజాపాలన చూపిస్తున్నామన్నారు. ఇదే అదనుగా తీసుకుని ప్రతిపక్షాలు దాడులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర

కార్పొరేషన్ చైర్మన్ల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని అస్థిరపరిచేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ ఆరోపించారు. శుక్రవారం వీరు గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుంటే.. ఇటీవల పరిణామాలు చూసిన ప్రజలు ప్రతిపక్షం ఇంకా ఇంత దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉందా అని అనుకుంటున్నారన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని సీఎం ఆలోచన చేస్తుంటే.. మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రైతులను రెచ్చగొట్టి అధికారులపై దాడులు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇటువంటి దాడులు చేస్తే.. ప్రాజెక్టులు కట్టేవారా? అని వారు నిలదీశారు.

వదిలిపెట్టేదే లేదు!

రేవంత్‌రెడ్డి లాంటి వాళ్లను చాలా మందిని చూశాం: కేటీఆర్

- మేం అధికారంలోకి వచ్చాక ఏం చేయాలో తెలుసు
- లగచర్ల బాధితులను పోలీసులు క్రూరంగా హింసించారు
- సంగారెడ్డి సెంట్రల్ జైల్లో లగచర్ల బాధితులతో ములాఖత్



సంగారెడ్డి జైలులో బాధితులను పరామర్శించి బయటకు వస్తున్న కేటీఆర్ తదితరులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ''రేవంత్‌రెడ్డీ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉండేది ఐదేళ్లు మాత్రమే.. అధికారం శాశ్వతమని భావించొద్దు. నువ్వు చక్రవర్తివో, రాజువో కాదు. నీలాంటి వారిని చాలా మందిని చూశాం. ఢిల్లీ వాళ్లకు కోపం వస్తే నీ పదవి ఎప్పుడు ఊడుతుందో కూడా తెలియదు. మేం అధికారంలోకి వచ్చాక ఏం చేయాలో మాకు తెలుసు. వదిలిపెట్టేదే లేదు..''అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రాబందులా పేదల భూములు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. లగచర్ల ఘటనలో అరెస్టై సంగారెడ్డి జైల్లో రిమాండ్‌లో ఉన్న రైతులతో శుక్రవారం కేటీఆర్ ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కొడంగల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భూములు గుంజుకుని అల్లుడికి ఫార్మా కంపెనీ పెట్టిస్తానంటే.. ఈ రోజు కొడంగల్ తిరగబడిందని, రేపు తెలంగాణ తిరగబడుతుందని హెచ్చరించారు.

అమానుషంగా వ్యవహరించారు.

తమ భూములు తమకే ఉండాలని.. రూ.70 లక్షలు పలికే భూములను అడ్డికి పావుశేరు ధరకు లాగేసుకోవద్దని డిమాండ్ చేస్తూ లగచర్ల, హకీంపేట్ రైతులు తొమ్మిది నెలలుగా పోరాటం చేస్తున్నారని కేటీఆర్ చెప్పారు. ''లగచర్ల ఘటనలో పోలీసులు పూర్తిగా అమానుషంగా వ్యవహరించారు. బందిపోట్లను అరెస్టు చేసేందుకు వెళ్లినట్టుగా రైతుల ఇళ్లకు వెళ్లి.. తలుపులు బద్దలుకొట్టారు. రైతులను చిత్రహింసలు పెట్టారు. అరెస్టు చేసిన వారిలో పంచాయతీ కార్యదర్శి, ప్రభుత్వ ఉద్యోగి కూడా ఉన్నారు. కులగణనలో పాల్గొన్న తాను సాయంత్రం ఇంటికి వస్తే.. తనను కూడా జైలులో పెట్టారని ములాఖత్‌లో ఓ బాధితుడు చెప్పారు. వనపర్తిలో ఐటీఐ చదువుకుంటున్న ఓ యువకుడు ఇంటికి వస్తే.. అతడిని కూడా జైలులో పెట్టారు. ప్రభుత్వ వైఫల్యాన్ని, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి లగచర్ల ఘటనకు రాజకీయ రంగు పులిమారు...'' అని మండిపడ్డారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లోనూ ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా ఆందోళన జరిగిందని గుర్తు చేశారు. కొడంగల్, న్యాల్‌కల్ రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, న్యాయ పోరాటం చేస్తుందని తెలిపారు. ఫార్మాసిటీ కోసం హైదరాబాద్ శివార్లలో సేకరించిన 14 వేల ఎకరాల భూమితో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

పనిమంతుడు పందిరేస్తే.. కుక్కతోక తగిలి కూలిందట!

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై 'ఎక్స్'లో కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

'సంక్షేమ హాస్టళ్లలో నాణ్యత పాటించకుంటే జైలుకే..'అని కాంట్రాక్టర్లను సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించడంపై మాజీ మంత్రి కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'సాక్షి'లో ప్రచురితమైన వార్త క్లిప్పింగ్‌ను జత చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ''పనిమంతుడు పందిరేస్తే.. కుక్క తోక తగిలి కూలిపోయిందట. సంక్షేమ గురుకుల పాఠశాలల ఆహార బిల్లులు, అద్దెలు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు వాటికి తాళాలు వేస్తే.. 9 నెలలకుగాను 3 నెలల బిల్లులు చెల్లించారు. కానీ వేదికల మీద మాత్రం నాణ్యత లేకుంటే జైలుకేనని బెదిరిస్తున్నారు. 11 నెలల పాలనలో సంక్షేమ గురుకులాల నిర్వహణ గాలికి వదిలేశారు. 36 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారు. గురుకుల పాఠశాలలు, వసతిగృహాల విద్యార్థులు రోడ్డెక్కుతున్నారు. సర్కారు పత్తి, ధాన్యం కొనుగోళ్లు చేపట్టక రైతన్నలు తక్కువ ధరకు ఉత్పత్తులను అమ్ముకుంటున్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో పేదల బతుకుల్లో ప్రభుత్వం నిప్పులు పోసింది. సంక్షేమం మాయమైంది. అభివృద్ధి దూరమైంది. కాంగ్రెస్ తెచ్చిన మార్పు చూసి తెలంగాణ నివ్వెరబోతోంది. కాలం రాగానే కాటేయాలని ఎదురుచూస్తోంది..''అని కేటీఆర్ పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు

- స్థల సేకరణ, బ్యాంకు రుణాల్లో చేయూతనందించండి
- అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశం



శుక్రవారం ప్రజాభవన్‌లో అధికారులతో సమావేశమైన డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం సౌర విద్యుత్ (సోలార్ పవర్ ప్లాంట్లు) కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, ఇందులో ఇందిరా మహిళాశక్తి సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం తీర్మానించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఇందిరా మహిళాశక్తి సభ్యులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. అందుకు పూర్తిస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో ఆయన ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, రెడ్కో వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వావిలాల అనీల తదితరులతో ఈ అంశంపై సమీక్షించారు. రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి త్వరితగతిన చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు అవసరమైన స్థలాలను సేకరించి వారికి లీజుకు ఇవ్వాలని సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన యంత్రాల కొనుగోళ్లకు అవసరమైన ఆర్థిక వనరుల కోసం బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు ఇప్పించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రుణాల తిరిగి చెల్లింపుల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులు 99 శాతం ప్రగతిని కనబరుస్తున్నారని, వీరికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తిగా ఉన్న విషయాన్ని అనుకూలంగా మలుచుకోవాలని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇటీవల బ్యాంకర్ల సమావేశంలోనూ స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టీసీకి బస్సులు సమకూర్చే మరిన్ని పథకాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానున్నట్టు స్పష్టం చేశామన్నారు. వారు కూడా విరివిగా రుణాలిచ్చి ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తామని స్పష్టం చేసిన విషయాన్ని డిప్యూటీ సీఎం అధికారులకు వివరించారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత ఇవ్వడం ద్వారా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం ద్వారా సామాజిక మార్పు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపడితే గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని చెప్పారు.

ఇంధనశాఖకు పీఆర్‌శాఖ ప్రతిపాదనలు

మహిళా స్వయం సహాయక సంఘాలకు వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయించాలని ప్రభుత్వానికి పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలు పంపింది. ఒక్క మెగావాట్‌కు రూ. 3 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ వ్యయంలో 10 శాతం మహిళా సంఘాలు భరిస్తే 90 శాతం బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వనున్నాయి. ఇంధనశాఖ దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది.

తప్పుచేసిన వారిని ప్రభుత్వం ఉపేక్షించదు

రైతుల ముసుగులో అరాచకం సృష్టిస్తున్నారు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భైంసా: తప్పు చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నిర్మల్ జిల్లా భైంసాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల పేరుతో, రైతుల ముసుగులో స్వార్థపూరిత రాజకీయాలతో రెచ్చగొడుతున్న వారిని ఈ ప్రభుత్వం క్షమించదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని చెప్పారు. త్వరలోనే ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు నిర్మిస్తామని, రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే డిసెంబర్‌లోగా మాఫీకాని రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి జనవరి నుంచి సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని భూమిని విదేశాల్లో ఉన్న సంస్థలకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ప్రాజెక్టులు, ధరణి పేరిట ప్రజాధనం వృథా అయ్యిందన్నారు.



డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కలెక్టర్‌తో సమీక్ష

భైంసాలోని విశ్రాంతి భవనంలో జిల్లా కలెక్టర్ అభిలాషఅభినవ్, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో పా టు పలు శాఖల అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్షించారు. ధాన్యం, పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రైతుల ఇక్కట్లు తెలుసుకొని వారికి అండగా ఉండాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి డిగ్రీ కళాశాల వద్ద ఉన్న డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించారు. పనులు పూర్తి చేసి అర్హులకు పంపిణీ చేస్తామన్నారు. ఆ తర్వాత జిన్నింగ్ మిల్లులకు వెళ్లి కొనుగోళ్లను పరిశీలించారు. పత్తిలో తేమ శాతం నిర్ధారణ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాటలు ప్రజలకు.. మూటలు కాంగ్రెస్‌కు..

ఇక్కడ గ్యారంటీలు అమలు చేయకుండా.. మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- రైతు భరోసా లేదు.. పింఛన్ల పెంపు లేదు.. బోనస్ ఇవ్వడం లేదు
- రైతులపై కేసులు పెట్టి జైలుకు పంపేంతగా ప్రభుత్వం దిగజారిందని మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గ్యారంటీలు, హామీలను అమలు చేయకుండా.. మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్ ఏ మొహం పెట్టుకుని మహారాష్ట్రలో ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్ పాలన మాటలు ప్రజలకు.. మూటలు కాంగ్రెస్ పార్టీకి అన్నట్టుగా తయారైంది. తెలంగాణలో సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీ యాత్రలు చేసి.. ఎన్నో హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక ఒక్కటీ సరిగ్గా అమలు చేయలేదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ బాటలోనే రేవంత్ పాలన నడుస్తోంది. రేవంత్ వ్యవహారం, దోపిడీ, అబద్ధాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు, తెలంగాణ సమాజాన్ని అవమానించే మాటలు.. అచ్చం కేసీఆర్ మాదిరిగానే సాగుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల డీఎన్ఏ ఒకటే. ఒకరిపై మరొకరు డూప్ ఫైటింగ్ చేయడం వారికి అలవాటే.

రాష్ట్ర ప్రభుత్వం విఫలం

తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. వ్యాపార రంగం విశ్వాసం కోల్పోయింది. పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమానికీ పైసల్లేవు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పెన్షన్లు పెంచలేదు. కొత్త నోటిఫికేషన్లు ఇవ్వలేదు.. కానీ కొత్త ఉద్యోగాలు ఇచ్చామంటూ జబ్బలు చరుచుకుంటున్నారు. ధాన్యం కొనుగోలు భారాన్ని కేంద్రమే భరిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లలో విఫలమైంది. రైతులకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ 15 పైసలు కూడా ఇవ్వలేదు. రైతులకు ధాన్యంపై బోనస్ లేదు. సీఎం సొంత నియోజకవర్గంలో ఫార్మా విలేజీకి భూసేకరణ విషయంలో కలెక్టర్‌పై దాడి, రైతుల మీద కేసులు పెట్టి జైలుకు పంపించేంతగా రాష్ట్ర ప్రభుత్వం దిగజారింది.

రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నాం..

మూసీని కొబ్బరినీళ్లలా మారుస్తామన్న కేసీఆర్.. ఏమీ చేయకుండానే వెళ్లిపోయారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి.. మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూల్చడం, నల్లగొండలో రైతులను రెచ్చగొట్టడం తప్పితే చేసిందేమీ లేదు. పేదల ఇండ్లు కూల్చొద్దంటే.. బుల్డోజర్లతో తొక్కిస్తామంటూ అహంకారంతో మాట్లాడుతున్నారు. మూసీ ప్రక్షాళన చేయండి.. పేదల ఇళ్లు కూల్చకండి.. ఇదే మా డిమాండ్. మూసీ పరిసర ప్రాంతంలో ఒక్క రోజు నిద్రపోండి అని సీఎం విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నాం. శనివారం మూసీ పరీవాహక ప్రాంతాల్లో నిద్ర చేయబోతున్నాం. ప్రజలతో కలసి వారి ఇంట్లోనే భోజనం చేసి, అక్కడే నిద్ర చేస్తాం.

పోలీసు వ్యవస్థ నిర్వీర్యం

రాష్ట్రంలో శాంతి భద్రతల పర్యవేక్షణలో కాంగ్రెస్ సర్కారు విఫలమైంది. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేసింది. మజ్లిస్ పార్టీ, అసదుద్దీన్, రాహుల్ గాంధీ ఆదేశాలతో రాష్ట్రంలో పోలీసు అధికారుల బదిలీలు జరుగుతున్నాయి.''అని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

ఫార్మాకు 'భూ' గ్రహణం!

▶ మొదటి పేజీ తరువాయి

అడ్డుకుంటుండటంతో ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. అయితే దీనికంతటికీ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీయే కారణమని, రైతులను రెచ్చగొడుతూ అభివృద్ధిని, ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ప్రభుత్వం ఆరోపిస్తోంది.

ఫార్మాసిటీకి బదులుగా ఫార్మా విలేజ్‌లు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతంలో 19 వేల ఎకరాల్లో 'హైదరాబాద్ ఫార్మా సిటీ'ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎనిమిదేళ్ల క్రితం భూ సేకరణ ప్రారంభించి సుమారు 14 వేల ఎకరాలు సేకరించింది. మౌలిక వసతులు కల్పించాల్సి ఉండగా.. గత ఏడాది డిసెంబర్‌లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీని స్థానంలో సకల వసతులతో కూడిన ఫోర్త్ సిటీని నిర్మిస్తామని, ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పది ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అభివృద్ధి వికేంద్రీకరణ

ఫార్మా రంగాన్ని రాష్ట్రమంతటా విస్తరించడం ద్వారా ఎక్కడికక్కడే విద్యావంతులకు, పరోక్షంగా అంతగా చదువుకోని వారికి కూడా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని, అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని చెబుతోంది. చిన్నచిన్న క్లస్టర్ల ద్వారా కాలుష్య రహితంగా వీటిని ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

తొలిదశలో నాలుగు ఫార్మా విలేజ్‌లు

తొలిదశలో నాలుగు ప్రాంతాల్లో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. 'ఫార్మా సిటీ'ఏర్పాటుకు ఇప్పటికే సేకరించిన భూముల్లో రెండు ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. వీటితో పాటు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో ఒకటి, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్‌కల్ మండలంలో మరో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొడంగల్ ఫార్మా విలేజ్ ఏర్పాటుకు 1,358.38 ఎకరాలు, జహీరాబాద్‌లో ఫార్మా విలేజ్‌కు 2,003 ఎకరాలు అవసరమని లెక్కలు వేశారు.



న్యాల్‌కల్ మండలంలో పంట పొలాల సాగు

భూసేకరణ ఇలా.. (ఎకరాల్లో..)

దుద్యాల మండలం (వికారాబాద్ జిల్లా)		న్యాల్‌కల్ మండలం (సంగారెడ్డి జిల్లా)	
హకీంపేట	506.02	డప్పూర్	1,383.29
పోలేపల్లి	130.21	మల్గి	256.01
లగచర్ల	722.15	వడ్డి	281.39
మొత్తం	1,358.38	మొత్తం	1,920.69

(నోట్: న్యాల్‌కల్ మండలంలో మొత్తం 2003 ఎకరాలు సేకరించాలని భావించినా 1920.69 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు)

ఎన్ని పైసలు ఇచ్చినా భూమి ఇవ్వం



మా కుటుంబానికి ఉన్న రెండున్నర ఎకరాలే జీవనాధారం. ఈ భూమిలో 15 ఏళ్లుగా పుదీనా పండిస్తూ నారాయణఖేడ్ మార్కెట్లో అమ్ముకుంటున్నాం. ఇప్పుడు ఫ్యాక్టరీల ఏర్పాటు కోసం మా భూములను లాక్కుంటే మేం ఎక్కడికి పోవాలి? ఎన్ని డబ్బులు ఇచ్చినా మా భూములు అప్పగించం. పచ్చటి భూముల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటు ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలి.

- అజీమొద్దీన్
రైతు, మల్గి, సంగారెడ్డి జిల్లా

భూ సేకరణ కోసం నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. పట్టా, అసైన్డ్ భూములు అనే తేడా లేకుండా ఒక్కో ఎకరానికి రూ.15 లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. కలెక్టర్లు భూముల పరిశీలనకు, ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టారు. అయితే బహిరంగ మార్కెట్లో తమ భూముల ఎకరం ధర రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. దీనితో పాటు కాలుష్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఫార్మా విలేజ్‌ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. తమకు జీవనాధారమైన భూముల్ని ఇచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్‌ను వ్యతిరేకిస్తూ కలెక్టర్ తదితర ఉన్నతాధికారులపై లగచర్లలో దాడికి దిగారు. దాడి చేసిన వారిగా అనుమానిస్తున్న కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు సంగారెడ్డి జిల్లాలోనూ రైతులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో ఫార్మా విలేజ్‌లకు భూ సేకరణ కష్టంగా మారుతుందనే అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది.

లగచర్ల ఘటనలో మరో 10 మంది అరెస్ట్

దుద్యాల్: లగచర్ల ఘటనకు సంబంధించి మరో పది మంది రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది. వీరిని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం. దాడికి ఎవరు ప్రేరేపించారు? ముందస్తు పథకం ప్రకారమే అధికారులపై భౌతిక దాడులకు పాల్పడ్డారా? పరారీలో ఉన్న వారి ఆచూకీ తెలుసా? అనే కోణాల్లో ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే 21 మందిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు మిగిలిన వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నవారిని శనివారం న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టే అవకాశం ఉంది.



డార్క్ ఫాంటసీ..

నగరం నిద్రపోవడం మర్చిపోయి చాన్నాళ్లయింది.. ఇదేదో స్లీప్ డిజార్డర్ కాదు. ఇదో ఆధునాతన జీవనశైలి. నగర యువత డార్క్ ఫాంటసీకి అలవాటుపడుతోంది. - సిటీప్లస్‌లో



కలర్‌ఫుల్ 'కామిక్ కాన్'

కామిక్ లవర్స్, కామిక్ సూపర్ హీరోస్ అభిమానులతో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ నిండిపోయింది. 'హైదరాబాద్ కామిక్ కాన్' ఈవెంట్ అందరినీ ఆకట్టుకుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/18.0

నగరంలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఉద్యోగ నియామకాల్లో తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల కొంత మంది అభ్యర్థులకు వైద్యారోగ్య శాఖలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి తప్పుడు ప్రచారంతో ఫోన్ కాల్స్ వస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి తెలిపారు. 09836330846 నంబర్ నుంచి కాల్ చేసిన వ్యక్తి తాను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిగా పేర్కొంటూ.. అభ్యర్థులను ఎంపిక చేశామని, 7003386564 నంబర్‌కు గూగుల్/ ఫోన్ పేతో డబ్బులు చెల్లించాలని తప్పుడు ప్రచారం చేసినట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. తప్పుడు ప్రచారానికి సంబంధించి శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో ఉన్న అభ్యర్థులకు అనుమానాస్పద ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని ఆయన సూచించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్ లేదా స్థానిక మీడియా ద్వారా మాత్రమే పొందాలన్నారు. అభ్యర్థులకు వైద్యారోగ్య శాఖ అధికారుల పేరుతో ఫోన్ కాల్స్ వస్తే ఏసీబీ వాట్సాప్ హెల్ప్‌లైన్ నంబర్ 9440446106 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1064, ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.



లంగర్‌హౌస్‌లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళ



కీసరగుట్టలో శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు



చీర్యాల దేవాలయంలో సత్యనారాయణ వ్రతాలు చేస్తున్న భక్తులు

కన్నుల పండువగా కార్తీక దీపం

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి ముంగిళ్లన్నీ దీపాల కాంతులతో మురిసిపోయాయి. ప్రత్యేక పూజలతో శివాలయాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. ప్రఖ్యాత శైవ క్షేత్రం కీసరగుట్టలో భక్తులు పూజలు చేసి శివలింగాల వద్ద దీపాలను వెలిగించారు. నగరంలోని ఆలయాలు కార్తీక పౌర్ణమి శోభతో తళుక్కుమన్నాయి.



పూజలందుకున్న కీసరగుట్ట స్వామివారు



ఆరెకే పురం అష్టలక్ష్మి ఆలయంలో..

టార్గెట్.. నవ ఓటర్!

ఈ నెల 28 వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో నమోదు

వచ్చే నెల 24 వరకు అభ్యంతరాల స్వీకరణ

- జనవరి 6న తుది ఓటరు జాబితా వెల్లడి
- గ్రేటర్ సహా శివారు జిల్లాల్లో ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 1.12 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: నూతన ఓటరు నమోదుకు, తప్పులు దొర్లినా, పేరు లేకున్నా, ఇంకా ఇతరత్రా వాటికి ఫారం–8, పేరు తొలగించేందుకు ఫారం–7 దరఖాస్తులు అందించేందుకు స్థానిక తహసీల్ కార్యాలయాల్లో ఈ నెల 28 వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. అభ్యంతరాలను డిసెంబరు 24 వరకు పరిశీలించి.. జనవరి 6 వరకు తుది ఓటరు జాబితాను వెల్లడించటానికి ఆయా జిల్లాల ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటోంది.

18 ఏళ్లు నిండితే..

పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ముమ్మరంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు పూర్తయిన యువతీ యువకులు తమ ఓటును నమోదు చేసుకునేలా.. ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఆయా జిల్లాల ఎన్నికల కమిషన్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న జాబితాలో మరణించిన వారి పేర్ల తొలగింపు, తప్పుల సవరణకు ఎన్నికల సంఘం వెసులుబాటు కల్పిస్తోంది. గ్రేటర్ సహా శివారు జిల్లాలలో కార్యక్రమాలు కొనసాగుతుండటంతో వీటిని నిత్యం సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

యువ ఓటరు నమోదు లక్ష్యంగా శని, ఆదివారాల్లో దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాలను జోరుగా నిర్వహించారు.



ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు..

- గ్రేటర్ సహా శివారుల్లోని 28 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు, రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అయిదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు శివారు జిల్లాల్లోని 29 పురపాలిక సంఘాలు ,గ్రామ పంచాయతీల్లో స్వీప్ కార్యక్రమాలను సంబంధిత అధికారులు చేపడుతున్నారు. ఇటీవల ప్రకటించిన ఓటరు తుది జాబితా ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాల్లో మొత్తం 1,12,14,168 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 57,45,342 పురుష ఓటర్లు ఉండగా, 54,68,052 మహిళా ఓటర్లు, ఇతరులు 774 మంది ఉన్నారు. నూతన ఓటర్ల నమోదుకు అధికార యంత్రాంగం ప్రత్యేకంగా సన్నాహాలు చేపడుతోంది. ఇప్పటికే ఆయా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతుండటంతో పాటు ప్రత్యేకంగా ఫారాలు అందజేస్తుండటంతో అభ్యర్థులు ఓటు నమోదు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా నమోదు నిర్వహించారు.

ప్రస్తుతం ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి

జిల్లా	ఓటర్లు
హైదరాబాద్	46,22,133
రంగారెడ్డి	36,51,513
మేడ్చల్–మల్కాజిగిరి	29,40,522
మొత్తం ఓటర్లు	1,12,14,168

అవగాహన కార్యక్రమాలు ఇలా..

ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి, జిల్లా ఉపాధి అధికారులు క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు శిబిరాల నిర్వహణతోపాటు గ్రామాల్లో ఓటరు నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు కొత్తగా వివాహం చేసుకున్న వివాహితులకు ఓటు నమోదు విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇంటర్ కళాశాలల్లో, పాఠశాలతో పాటు స్వీప్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పట్టణాలు, గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. పురపాలికల్లో, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, 2కే రన్, మానవహారం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

'ఇంటర్' ఎన్యుమరేటర్లు



ఉద్యోగులకు బదులుగా వీరితోనే గ్రేటర్‌లో సర్వే

- కుటుంబ సభ్యుల పేర్లతో మమ
- ఇలాంటి సర్వేతో ఏంటో ప్రయోజనం?

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఓ వార్డులో ఇద్దరమ్మాయిలు చేతుల్లో సమగ్ర కుటుంబ సర్వే ఫారాలతో ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేస్తున్నారు. మీరెవరని అడిగిన వారికి 'జీహెచ్‌ఎంసీ' అని చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీలో ఏం చేస్తారంటే.. సర్వే చేస్తాం అని సమాధానం. సర్వే అనేది ఇప్పుడు జరుగుతోంది. రెగ్యులర్‌గా ఏం చేస్తారంటే.. జీహెచ్‌ఎంసీలో ఎప్పుడైనా వీటిని తామే చేస్తామని, వాటి కోసమే తామున్నట్లు మరో సమాధానం. అసలు విషయం ఏమిటంటే.. వారు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు కాదు. పోనీ.. వేరే ప్రభుత్వ విభా గాల్లో పని చేస్తున్న ఆశా వర్కర్లో, ఇతరత్రా సిబ్బందో కూడా కాదు. వీరు ప్రైవేటు వ్యక్తులు. టెన్త్, ఇంటరో చదివారు. రెట్టించి అడిగిన వారికి ఇంటర్ చదివినట్లు మాత్రం చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ సార్లు సర్వే అవసరమైనప్పుడు తమకు పనులు చెబుతారని.. అందుకు వేతనం చెల్లిస్తారని తెలిపారు.

జీహెచ్‌ఎంసీలోని టాక్స్ ఇన్‌స్పెక్టర్లో, బిల్ కలెక్టర్లో, మరో విభాగం వారో తాము చేయాల్సిన పనుల్ని ఇలా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించినట్లు తెలుస్తోంది. పోనీ.. అలాగని తాము చేయాల్సిన ఆస్తిపన్ను వసూళ్లు చేస్తున్నారా? అంటే అదీ లేదు. ప్రస్తుతం సర్వే వల్ల ఆస్తిపన్ను వసూళ్లు తగ్గుతున్నాయని ఉన్నతాధికారులకు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీలోని కొందరు టాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తమ బదులుగా ప్రైవేటు సైన్యంతోనే ఆస్తిపన్ను వసూళ్లు కూడా చేస్తూ వారికి జీతాలిస్తుండటం ఎంతోకాలంగా జరుగుతున్న తంతు అని తెలిసినా దీనిని అరికట్టే నాథుడే లేకుండా పోయారు. దీంతో ఇలాంటి సర్వే పనులు సైతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగిసున్నట్లు తెలుస్తోంది.

సర్వే జరుగుతోందిలా..

ఇక సర్వేకు వెళ్తున్న వారు సైతం ఫారంలోని అన్ని ప్రశ్నలకు కాకుండా రెండు పేజీల్లోని వివరాలు నమోదు చేస్తూ కార్యక్రమం ముగిస్తున్నారు. కుటుంబ యజమాని పేరు, ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల వివరాలు మాత్రం నమోదు చేస్తూ మిగతా వాటి గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. అటు ప్రజలకు, ఇటు సర్వే చేస్తున్నవారికి ఇది ఉభయతారకంగా ఉండటంతో సర్వే వేగంగా జరుగుతోంది. సర్వే ముగిశాక సాయంత్రం ఫారాలను తమకు అప్పగించిన ఉద్యోగికి అందజేస్తున్నట్లు తెలిసింది. ఈ మధ్యలో గోప్యంగా ఉండాల్సిన సమాచారం లీక్ అవుతుందనే అనుమానాలున్నాయి. ప్రైవేటు వ్యక్తులు సర్వే ఫారాలు సవ్యంగా నింపుతున్నారో లేదో తెలియని తెలియని పరిస్థితి.

నేరుగా సర్వేకే..

తొలుత ఇళ్లకు స్టిక్కర్లు వేసి, తర్వాత సర్వే ప్రారంభించినట్లు చెబుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నేరుగా సర్వేకే వెళ్తున్నారు. దాంతో తమ ఇంటికి ఇంకా స్టిక్కర్ వేయలేదని, వేశాక వివరాలు సిద్ధం చేసుకోవచ్చుననుకుంటున్న వారు.. వచ్చిన సిబ్బందికి నోటికి గుర్తుకున్న వివరాలు మాత్రం చెబుతున్నారు.

ఏమిటి ప్రయోజనం?

సర్వే ద్వారా ప్రజల స్థితిగతులు తెలుసుకొని, అవసరమైన వారికి తగిన ప్రయోజనాలు అందేందుకు కృషి చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు.. ఇలాంటి సర్వే వల్ల ఏ మేరకు అమలవుతాయో, ఎలా అమలవుతాయో తెలియని పరిస్థితి.

ఇన్‌చార్జి ఆఫీసర్లు ఏం చేస్తున్నారు?

సర్వే సజావుగా నడిపేందుకని జీహెచ్‌ఎంసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులను ఆయా సర్కిళ్లకు ఇన్‌చార్జి ఆఫీసర్లుగా నియమించింది. ప్రభుత్వం నలుగురు ఐఏఎస్ అధికారులను మానిటరింగ్ ఆఫీసర్లుగా, వారిపై మరొకరిని కోఆర్డినేటింగ్ ఆఫీసర్‌గా నియమించింది. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఆఫీసర్లకు ఇలాంటి 'చిత్రాలు' కనిపించడం లేదా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక్క జోన్ అని కాకుండా అన్ని జోన్లలోనూ ప్రైవేట్ సిబ్బంది సర్వే చేస్తున్నారనే టాక్ అంతటా వినిపిస్తుండగా.. జీహెచ్‌ఎంసీ అధికారులకు మాత్రం ఎందుకు వినబడటం లేదో ?!

నిమ్స్‌లో నేటి నుంచి నైపుణ్య అవగాహన సదస్సు



లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో న్యూరోసర్జరీ విభాగం ఆధ్వర్యంలో మైక్రో సర్జరీ, మైక్రోవాస్క్యులర్‌లపై జోన్ స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శుక్రవారం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్ ఎర్రగుంట తెలిపారు. న్యూరాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించే ఈ కార్యక్రమం నిమ్స్‌లో శనివారం నుంచి రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. దేశంలోని ప్రముఖ న్యూరోసర్జన్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. బ్రెయిన్ బైపాస్ సర్జరీలు నిర్వహించడానికి అత్యవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. సదస్సులో న్యూరోసర్జన్‌లు వంశీ కృష్ణ, సుచంద భట్టాచర్య, మానస్ పాణిగ్రాహి, కృష్ణ శ్రీధర్ పాల్గొంటారని తిరుమల్ వివరించారు.

రూ. 300 కోట్లు లూటీ



బై బ్యాక్ స్కీమ్‌ల పేరుతో సామాన్యులకు వల

- ఓపెన్ ప్లాట్లు, గోల్డ్ బిస్కెట్లలో పెట్టుబడులు
- అధిక లాభాలు, వడ్డీ చెల్లిస్తామని డిపాజిట్ల సేకరణ
- 3,600 మందిని ముంచిన 12 వెల్త్ క్యాపిటల్ సంస్థ
- ఎండీ పవన్ సహా 8 మంది అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: అధిక లాభాల ఆశ చూపించి అమాయకులను నిలువునా ముంచేసింది 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ కంపెనీ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 3,600 మంది నుంచి రూ.300 కోట్లు కొట్టేసింది. అధిక లాభాలు, వడ్డీ చెల్లిస్తామంటూ సామాన్యులను మోసం చేసిన కంపెనీ ఎండీ కలిదిండి పవన్ కుమార్ సహా 8 మందిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. అమాయకులకు అధిక లాభాలు, వడ్డీ ఆశ చూపించి డిపాజిట్లు సమీకరించాలని పవన్ కుమార్ నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం.. రావుల సత్యనారాయణ, బొద్దుల హరికృష్ణ, వల్లూరు భాస్కర్ రెడ్డి, పగడాల రవి కుమార్ రెడ్డి, కొల్లాటి జ్యోతి, కూర్లళ్ల మౌనిక, కుర్కుల లావణ్యలను సంస్థ ప్రతినిధులుగా నియమించుకున్నారు.

స్కీమ్‌ల పేరుతో..

బై బ్యాక్, డబుల్ గోల్డ్ స్కీమ్‌లకు తెర లేపారు. బై బ్యాక్ ఓపెన్ ప్లాట్లలో ఒక్క కస్టమర్ కనిష్టంగా 2 గుంటల స్థలాన్ని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చార్జీలతో కలిపి రూ.8.08 లక్షలు చెల్లించాలి. బదులుగా కంపెనీ 25 నెలల పాటు 4 శాతం లాభాలు అంటే రూ.32 వేలు కస్టమర్‌కు చెల్లిస్తుంది. ఈ స్కీమ్‌లో కస్టమర్లను చేర్చే బిజినెస్ అసోసియేట్స్ 1 శాతం కమీషన్ పేరిట ప్రతి నెలా రూ.7,200 చొప్పున బోనస్ అందిస్తుంది.

– డబుల్ గోల్డ్ స్కీమ్ కింద కస్టమర్ కనిష్ఠంగా రూ.4 లక్షలు పెట్టుబడులు పెట్టాలి. దీంతో సంస్థ కస్టమర్‌తో ఒప్పందం చేసుకుంటుంది. 12 నెలల తర్వాత రూ.8 లక్షల విలువైన గోల్డ్ బిస్కెట్‌ను అందజేస్తుంది. గోల్డ్ చిట్స్ స్కీమ్ పేరిట రూ.5 లక్షలు చెల్లిస్తే.. ప్రతి నెలా 3 శాతం వడ్డీ చొప్పున 19 నెలల పాటు రూ.15 వేలు చెల్లిస్తుంది. 20వ నెలలో అదనంగా రూ.15 వేలతో పాటు పెట్టుబడి సొమ్ము రూ.5 లక్షలు తిరిగి కస్టమర్‌కు ఇచ్చేస్తుంది. ఈ క్రమంలో వేలాది మంది కస్టమర్లకు ఆశ చూపించి రూ.వందల కోట్లు మోసం చేశారు. ఈ మేరకు బాధితుడు కేపీహెచ్‌బీకి చెందిన నాయని హరికాంత్ సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ అండర్ సెక్షన్ 316 (2), 318 (4), 61 (2)తో పాటు తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1999లోని సెక్షన్–5 కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో 8 మందిని అరెస్టు చేశారు.





భక్తిశ్రద్ధలతో గురునానక్ జయంతి

నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గురునానక్ దేవ్‌జీ 555వ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిక్కులు వేలాదిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. - గన్‌ఫౌండ్రీ

అతివేగం రెండు జీవితాలను బలిగొంది

డివైడర్‌ను బైక్ ఢీకొని ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల దుర్మరణం

గచ్చిబౌలి: అతివేగం ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల ప్రాణాలను బలిగొంది. మితిమీరిన వేగం ఎంతటి ప్రమాదమో ఈ విషాదకర ఘటన తెలియజెప్పింది. గచ్చిబౌలి పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకన్న స్వామి (30), దేవ్ కుమార్ స్వామి (25) అనే యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు దుర్మరణం చెందారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపిన వివరాలప్రకారం.. ఏపీలోని కాకినాడకు చెందిన కేవీ కృష్ణా రావు కుమారుడు కేసాని వెంకన్న స్వామి అమెజాన్ కంపెనీలో, వైజాగ్‌లోని హరిజన బస్తీకి చెందిన చెందిన పిల్లి కుమార స్వామి కుమారుడు దేవ్‌కుమార్ స్వామి మైక్రోసాఫ్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. నానక్‌రాంగూడలో ఓ పీజీ హాస్టల్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి వీరిద్దరూ కలిసి సెకండ్ షో సినిమాకు వెళ్లారు. సినిమా చూసి శుక్రవారం తెల్లవారు జామున 2.15 గంటల సమయంలో బైక్‌పై వస్తుండగా ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద ఎడమ వైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. బైక్ ఎగిరి పల్టీ కొట్టింది. ఇద్దరూ కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. మృతదేహాలకు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగానే బైక్ అదుపుతప్పి ప్రమాదం జరిగిందని పోలీసులు చెబుతున్నారు. గచ్చిబౌలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వెంకన్న స్వామి (ఫైల్)



దేవ్‌కుమార్ స్వామి (ఫైల్)

'మెడికవర్'లో ఏరోటెక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

అమీర్‌పేట: గుండె మార్పిడి చేయాల్సిన రోగికి సవాళ్లతో కూడిన ఎరోటెక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ గుండె శస్త్రచికిత్సను మెడికవర్ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా నిర్వహించి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం అమీర్‌పేలోని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిటీవీఎస్ సర్జన్ సుదీర్ వివరాలను వెల్లడించారు. బీహార్‌కు చెందిన శ్రీ ఓంప్రకాష్ ప్రసాద్(59) తీవ్రమైన గుండె వైఫల్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నాడు. అతనికి గ్రాడియెంట్ ఎరోటిక్ స్టెనోసిస్(ఎల్ఎఫ్ఎల్‌జీఏఎస్) అనే అరుదైన గుండె సమస్య ఉన్నట్లు నిర్ధారించామన్నారు. హార్ట్ పంపింగ్ కెపాసిటీ 65 శాతం ఉండాల్సి ఉండగా కేవలం 19 శాతంగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. 20 లోపు ఉంటే కచ్చితంగా గుండె మార్పిడి చేయాలి కాని అతనికి ఎరోటిక్ వాల్వ్ మార్పిడి శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు కాపాడామని, ఇది అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స అని తెలిపారు. తెలిపారు. సమావేశంలో వైద్యులు కార్డియాలజిస్ట్ సాకేత్, మానస, రాజ్‌కుమార్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షల మధ్య సింగర్ 'దల్జీత్ లైవ్ షో'

నోటీసులు జారీ చేసిన మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు

శంషాబాద్ రూరల్: ప్రముఖ పాప్ సింగర్ దల్జీత్ దోసంజ్ లైవ్‌షోపై మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆంక్షలు విధిస్తూ నోటీసులు జారీ చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్ సమీపంలో శుక్రవారం రాత్రి లైవ్‌షో ఉండగా.. అధికారులు కొన్ని షరతులు విధించారు. చిన్న పిల్లలను షోకి వాడకూడదు. దీంతో పాటు డ్రగ్స్, ఆల్కాహాల్, వైలెన్స్‌ను ప్రేరేపించేలా షో ఉండకూడదు. ముఖ్యంగా వీటిని ప్రేరేపించే పాటలు పాడకూడదని హెచ్చరించారు. పెద్దలకు 140డీబీ, చిన్నపిల్లలకు 120డీబీ మించి సౌండ్ వాడొద్దని హెచ్చరించారు. సింగర్‌తో పాటు నటి, ఈవెంట్ మేనేజర్‌కు నోటీసులు పంపించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. చండీఘడ్‌కు చెందిన పండిత్ రావ్ ధర్నేవర్ ఫిర్యాదు మేరకు అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో దల్జీత్ నిర్వహించిన షోలలో ఈ అతిక్రమణలు జరిగాయనే సూచనలతో ఈ ఆంక్షలు విధించారు.

అప్పు చెల్లించే నెపంతో మోసం

- మీ డాడీకి డబ్బులు బాకీ ఉన్నానంటూ సైబర్ నేరస్తుల టోకరా
- వెంటనే స్పందించి నిందితుడి అకౌంట్ ఫ్రీజ్ చేసిన పోలీసులు



బంజారాహిల్స్: మీ డాడీ దగ్గర రూ.2,000 అప్పుగా తీసుకున్నాను..వాటిని ఇద్దామంటే ఆయన మొబైల్ నెంబర్ పోగొట్టుకున్నాను..నీ నెంబర్‌ను అప్పుడెప్పుడో ఫీడ్ చేసుకున్నాను..మీ పేరు, మీ నాన్న పేరు ఇదే కదా? అంటూ ఓ వ్యక్తి తియ్యటి మాటలతో సైబర్ వల విసిరి గృహిణికి అప్పు చెల్లించే ముసుగులో మోసం చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కొత్త రకంగా చక్కటి ప్లాన్‌తో సైబర్ మోసగాడు ఆమెను నమ్మించి మాటల్లో దింపి తికమకపెట్టి రూ.35 వేలు తన ఖాతాలోకి మళ్లించుకున్నాడు. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లో నివసించే స్వాగతారాయ్ అనే గృహిణికి సైబర్ మోసగాడు ఫోన్ చేసి మీ డాడి అశోక్‌కుమార్ శర్మకు తాను రూ.2000 బాకీ ఉన్నానని, వాటిని జీపే చేస్తానని ఆమెకు చెప్పాడు. తన పేరు, తండ్రి పేరు కరెక్ట్‌గానే చెబుతున్నాడు కదా అని ఆమె నమ్మి జీపే చేయమంది. వెంటనే ఆయన రూ.10,000 ఒకసారి, రూ.20,000 ఒకసారి మీ అకౌంట్‌కు పంపించాను, నీకు మెసేజ్ వచ్చింది చూసుకో అని చెప్పాడు. ఆ మేరకు ఫోన్‌కు మెసేజ్ కూడా వచ్చింది. కొద్దిసేపట్లోనే రూ.12,000 మరోసారి పంపించాడు. ఆమెకు ఆ మెసేజ్ కూడా వచ్చింది. రెండు నిమిషాల తర్వాత ఫోన్ చేసి పొరపాటున రూ.40,000 పంపాను..రెండు వేలు కట్ చేసుకుని రూ.38 వేలు తనకు తిరిగి జీపే చేయాలని ఆమెను తికమక పెట్టాడు. బాలింతరాలు అయిన ఆమె ఓ వైపు చిన్నారి ఏడుస్తుండడం, ఇంకోవైపు తన చికాకు..ఈ గొడవలోనే రూ.38 వేలు బదిలీ చేసింది. మరుక్షణంలోనే ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.38 వేలు వెళ్లడం, తన ఖాతా జీరో అని చూపించడంతో వెంటనే ఈ విషయాన్ని భర్తకు తెలిపింది. భర్త వెంటనే గంట వ్యవధిలోనే (గోల్డెన్ అవర్) బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. వెంటనే పోలీసులు ఇది సైబర్ మోసమని గుర్తించి ఆమెకు వచ్చినవి నకిలీ మెసేజ్‌లు అని తెలుసుకుని సైబర్ మోసగాడి ఖాతాను ఫ్రీజ్ చేశారు. గంట వ్యవధిలోనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో సైబర్ మోసగాడి నుంచి డబ్బులు రికవరీ అయ్యే ఛాన్స్‌ను ఆమె పొందింది. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే గంట సేపట్లోనే గోల్డెన్ అవర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే ఛాన్స్ ఉంటుందని బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

ఇంటింటికీ ఓటీఎస్ పై అవగాహన

జలమండలి ఎండీ అశోక్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నల్లా బిల్లుల బకాయిల చెల్లింపులపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం(ఓటీఎస్) కింద వర్తింపజేస్తున్న వడ్డీ, ఆలస్య రుసుం మాఫీపై ఇంటింటికీ అవగాహన కల్పించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఓటీఎస్‌పై ఆయన ఈడీ మయాంక్ మిట్టల్‌తో కలిసి డైరెక్టర్లు, సీజీఎం, జీఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఓటీఎస్ పథకాన్ని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాలన్నారు. ప్రతి డివిజన్ లోని టాప్–10 వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయాలు అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని జనరల్ మేనేజర్లకు సూచించారు. అలాంటి వినియోగదారుల వివరాలను ఇప్పటికే డివిజన్ల వారిగా అందించామని చెప్పారు. ఈడీ మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ సీజీఎంలు న్యాయపరమైన సమస్యలతో దీర్ఘకాలికంగా బిల్లు చెల్లించని వినియోగదారులను గుర్తించి.. వారి సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపాలని అన్నారు. సమావేశంలో ఈఎన్సీ, రెవిన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్–2 డైరెక్ట్ స్వామి, సీజీఎమ్‌లు, జీఎమ్‌లు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డ్ ప్రొఫెసర్ మృతి


ప్రొ.బలరాంరెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.బలరాంరెడ్డి (68) గురువారం రాత్రి గుండెపాటుతో మరణించారు. తార్నాకలో నివాసం ఉంటున్న ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ప్రొ. బలరాంరెడ్డి ఓయూలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూ వివిధ పదవులు చేపట్టి 9 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. అమెరికాలో నివాసం ఉంటున్న చిన్నకూతురు వచ్చాక ఈనెల 17న తార్నాకలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా హరికిరణ్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా చెవ్వూరు హరికిరణ్ శుక్రవారం అబ్కారీ భవన్‌లో బాధ్యతలను చేపట్టారు.2009 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఏపీలో నెంబర్ వన్ రాంకర్ గాను, జాతీయస్థాయిలో 18వ రాంకర్‌గా నిలిచారు.శిక్షణ అనంతరం వైఎస్సార్ కడప, ఈస్ట్‌గోదావరి జిల్లాల కలెక్టర్‌గా బాధ్యతలను నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు బదిలీ అయ్యారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో డైరెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అబ్కారీ భవన్‌లో ఏఈఎస్ శ్రీనివాస రావు,తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

నగరంలో మరో టోర్నమెంట్

18న భారత్, మలేషియా జట్ల మధ్య ఫుట్‌బాల్ మ్యాచ్


గచ్చిబౌలి స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

గస్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నగరం మరో మెగా టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతుంది. ఈ నెల 18వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో ఇండియా, మలేషియా జట్ల మధ్య పీఫా ఫ్రెండ్లీ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ నిర్వహణకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. గత నెలలో ఇండియా, సిరాయ మారిషస్ జట్ల మధ్య పీఫా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన స్టేడియం ఈ నెల 18న ఇండియా, మలేషియా జట్ల మధ్య జరిగే ఫ్రెండ్లీ మ్యాచ్‌కు వేదిక కానుంది. ఈ తరహా ఫ్రెండ్లీ కప్ నగరంలో జరగడం ఇదే మొదటి సారి కావడం విశేషం. ఈ మ్యాచ్‌ను నిర్వహించడంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ తీసుకున్న చొరవ పీఫా, ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ ప్రతినిధుల ప్రశంసలను అందుకుంది. స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ.. ఫుట్‌బాల్‌కు పునర్వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం


నరేందర్(ఫైల్)

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఉప్పల్ లక్ష్మీనగర్‌కు చెందిన బ్యాగరీ నరేందర్ (20) హబ్సిగూడలోని ఓమెగా డిగ్రీ కళాశాలలో డిగ్రీ 3వ సంవత్సరం చదువుతూ హబ్సిగూడలోని సబ్ వే రెస్టారెంట్‌లో పని చేస్తున్నాడు. ఈనెల 8న ఉప్పల్‌లోని తన ఇంటి నుంచి తన తండ్రి సెల్‌ఫోన్‌ను తీసుకుని చెప్పకుండా బయటకు వెళ్లాడు. అనంతరం సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్‌చేశాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోటీలు పిల్లల మనోవికాసానికి దోహదం

ఘనంగా రెయిన్ బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ చిల్డ్రన్స్ డే వేడుకలు


చిన్నారులతో రెయిన్ బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ సభ్యులు

లక్డీకాపూల్ : చిల్డ్రన్స్ వేడుకలు పిల్లల మనో వికాసానికి ఎంతో దోహదపడతాయని, ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రెయిన్ బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 10, 13, 14 తేదీల్లో చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ ఆడిటోరియంలో డ్యాన్స్, సింగింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్స్ నిర్వహించి విజేతలకు, పాల్గొన్నవారికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. 13న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చిల్డ్రన్ షార్ట్ ఫిలింస్ ప్రదర్శన ఏర్పాటు చేసి, అందులో ఉత్తమ షార్ట్ ఫిలింస్, ఉత్తమ బాల నటీనటులు, ఉత్తమ దర్శకుడిని ఎంపిక చేశారు. 14న రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ థియేటర్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. రెయిన్ బో చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ జనరల్ సెక్రటరీ, బాలల చిత్రం ''అప్పూ'' దర్శకుడు కె. మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నాగులపల్లి పద్మిని, నటుడు మేకా రామకృష్ణ, 'ఘర్షణ' శ్రీనివాస్ రావు, రిటైర్డ్ ఎంఆర్‌ఓ బిక్కవల్లి సత్యానందం, ఆనంద్ సింగ్, నిర్మాత భద్రినాథ్, దాశరథి ఫిలిం సొసైటీ కార్యదర్శి బి.డి.యల్. సత్యనారాయణ, మేడిది సుబ్బయ్య ట్రస్ట్ ఫౌండర్ మేడిది వెంకటేశ్వర రావు పాల్గొని విజేతలకు జ్ఞాపికలను అందజేశారు.

యువకుడి ఆత్మహత్య

మేడ్చల్ రూరల్: ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీపక్ లాల్‌సింగ్(20) మేడ్చల్‌కు వచ్చి మండలంలోని రావల్‌కోల్ గ్రామ పరిధిలో సమ్మక్క సారక్క క్రషర్స్ కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. గురువారం అర్ధరాత్రి నిర్మానుష్య ప్రదేశంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

అలకాపూర్‌లో యువకుడి హత్య

బాలానగర్ వాసిగా గుర్తింపు


మృతుడు రోహిత్ కుమార్ సింగ్ (ఫైల్)

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడిని హత్య చేశారు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బాలానగర్‌కు చెందిన రోహిత్‌కుమార్ సింగ్ (25) అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 30 వద్ద నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ వద్ద తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్నాడు. ఆ విషయాన్ని స్థానికులు 100కు ఫోన్ చేయటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు.

పుట్టినరోజు వేడుకలకు పిలిచి...

తన మిత్రుడు అక్బర్ జన్మదినోత్సవం ఉండటంతో అతని పిలుపు మేరకే రోహిత్ కుమార్ సింగ్ శుక్రవారం సాయంత్రం అలకాపూర్ టౌన్‌షిప్‌కు వచ్చాడు. రాత్రంతా మిత్రులతో కలిసి మద్యం తాగిన అతను మాటామాటా పెరిగి పార్టీకి వచ్చిన వారిలో ఒకరితో గొడవ పడినట్లు సమాచారం. దాంతో అక్బర్ మిత్రుడొకరు రోహిత్ తలపై బీరు బాటిల్‌తో బలంగా కొట్టడంతో అతని తలకు గాయామై తీవ్ర రక్తస్రావం అయ్యింది. పోలీసులు అక్బర్‌తో పాటు మరో యువకుడిని అదుపులోకి తీసుకుని పరారీలో ఉన్న హత్యకు పాల్పడిన నిందితున్ని అరెస్టు చే సేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిసింది.

గచ్చిబౌలి టు బీదర్..

- గచ్చిబౌలి నుంచి బీదర్ వరకు పది చోట్ల మొబైల్ ఫోన్ల దోపిడీ
- గచ్చిబౌలిలో ప్రేమ జంటను కత్తితో బెదిరించి చోరీ
- ఒకరు అరెస్ట్, మరొకరు పరారీ

గచ్చిబౌలి: బైక్ వచ్చిన ఇద్దరు దుండగులు కత్తితో బెదిరించి ప్రేమ జంట వద్ద మొబైల్ ఫోన్లు, చెవి రింగ్‌లు దోచుకున్నారు. అంతటితో ఆగకుండా గచ్చిబౌలి నుంచి బీదర్ వరకు మరో పది చోట్ల మొబైల్ ఫోన్లు దోపిడీ చేశారని మాదాపూర్ ఏసీపీ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. షాహిన్‌నగర్, పహడీషరీఫ్‌కు చెందిన సయ్యద్ జుబీర్ అలీ అలియాస్ ముజ్జు(20) మరో వ్యక్తితో కలిసి స్కూటీపై గచ్చిబౌలి వైపు వచ్చారు. ఈ నెల 5న మధ్యాహ్నం 2 గంటలకు గచ్చిబౌలి స్టేడియం ముందు ఎస్.ప్రశాంత్ అనే యువకుడు ప్రేమికురాలితో మాట్లాడుతుండటం గమనించారు. అక్కడి వెళ్లి కత్తి చూపించి చంపేస్తామని బెదిరించి సెల్ ఫోన్లు, చెవి రింగ్‌లు, వెండి బ్రాస్‌లెట్, చైన్‌లను లాక్కొని ఉడాయించారు. అంతటాతో ఆగకుండా బీదర్ వరకు స్కూటీపై వెళ్లి రాత్రి వరకు పది చోట్ల సెల్ ఫోన్లు దొపిడీ చేశారు. ఈ కేసులో సయ్యద్ జుబీర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడు పరారీలో ఉన్నారు. జుబీర్‌పై చత్రినాక, కాచిగూడ, అఫ్జల్‌గంజ్,అబిడ్స్, అత్తాపూర్ పీఎస్‌లలో ఆరు కేసులు నమోదయ్యాయి. జుబీర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు ఏసీపీ శ్రీకాంత్ తెలిపారు. నిందితుడి నుంచి స్కూటీ, రెండు సెల్ ఫోన్లు, రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్, డీఐ రాజేష్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

21 కిలోల గంజాయి పట్టివేత

13 మందిపై కేసు నమోదు,ఐదుగురు అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు రైలులో గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో మాటు వేసి గంజాయి సంచులతో ట్రైన్ దిగిన రాజమండ్రికి చెందిన ఎస్‌కే అహ్మమద్ అలీని అదుపులోకి తీసుకున్నారు. ఆతడి వద్ద నుంచి 17.22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒరిస్సాకు చెందిన పాండు అలియాస్ పవిత్ర నాయక్ ధూల్‌పేట్‌కు చెందిన రాహుల్ సింగ్‌కు గంజాయి పంపిస్తున్నట్లు నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ముగ్గురిపైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌టీఎఫ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. అలాగే మరో కేసులో అప్పర్ ధూల్‌పేట్ హజారీ హోటల్ సమీపంలో ఎస్‌టీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు కలిసి శుక్రవారం ఉదయం నిర్వహించిన రూట్ వాచ్‌లో నలుగురు నిందితుల వద్ద 4.238 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయితో పట్టుబడిన నలుగురిని విచారించగా మరో ఎనిమిది మందికి గంజాయి అమ్మకాలతో సంబంధాలు ఉన్నట్లు తేలింది.గంజాయితో పట్టుబడిన వారిలో ఎడిగా గణేష్, రాహుల్ సింగ్, అంకిత్, లడ్డు సింగ్‌లు ఉన్నారు. యూసఫ్, చరణ్, శంకర్, అమన్ సింగ్, అదర్శసింగ్, ముఖేష్ సింగ్, ఎన్కె ఆహ్మమద్, సుమరాజ్ గులారీలు పరారీలో ఉన్నారు. గంజాయిని రెండు చోట్లు పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

పేదల ఇళ్లను కూల్చితే ఊరుకోం

మూసీ పరీవాహకంలోని 27 ప్రాంతాల్లో నేడు బస :బీజేపీ

మన్సూరాబాద్: మూసి పునరుజ్జీవనానికి బీజేపీ వ్యతిరేకం కాదని, రేవంత్ సర్కార్ చేసే దోపిడీకి వ్యతిరేకమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సునితారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేద ప్రజల ఇళ్లను కూల్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని అడ్డుకుంటామని తెలిపారు. ఎన్నికల హామీలైన 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేక.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు హైడ్రా, మూసీ పునరుజ్జీవనమంటుందని మండిపడ్డారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఒక పూట బస చేసి చూడూ అంటే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు సీఎం విసిరిన సవాలును బీజేపీ స్వీకరిస్తుందని తెలిపారు. మూసీ పరివాహకంలో 27 ప్రాంతాలను పార్టీ గుర్తించిందని, కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే, పార్టీ ముఖ్యనాయకులు నేటి సాయంత్రం4 గంటల నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు బస చేయనున్నట్లు వెల్లడించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని ప్రభుత్వంపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం చైతన్యపురి డివిజన్ పణిగిరికాలనీలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ బస చేస్తున్నట్లు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, జగన్ ముదిరాజ్, ఏలే పురేందర్ పాల్గొన్నారు.

సీఎం మీటింగ్‌కు వచ్చిన చిన్నారులకు అస్వస్థత

- నిలోఫర్‌కు తరలింపు.. ఆసుపత్రిలో చేర్చుకోని సిబ్బంది
- విచారణకు ఆదేశించిన వైద్య శాఖ ఉన్నతాధికారులు

నాంపల్లి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లాల్ బహుదూర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన సీఎం బహిరంగ సభకు వచ్చిన బాలికలు అస్వస్థతకు గురై నిలోఫర్ ఆసుపత్రికి వస్తే చేర్చుకోకుండా ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లాలంటూ ఇచ్చిన ఉచిత సలహా ప్రస్తుతం వివాదాస్పదం అవుతోంది. ఈ విషయం రాష్ట్ర స్థాయి వైద్యాధికారుల దృష్టికి వెళ్లింది. స్పందించిన హెల్త్ సెక్రెటరీ డీఎంఈని విచారణకు ఆదేశించారు. ఈ కేసు విచారణ కోసం శుక్రవారం ఉదయం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి డీఎంఈ వచ్చారు. జరిగిన విషయాన్ని సూపరింటెండెంట్ డీఎంఈకి వివరించినట్లు తెలిసింది. వివరాలలోకి వెళ్లితే...గురువారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో నవంబరు 14న ప్రభుత్వం బాలల దినోత్సవాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన నేపథ్యంలో నగరంలోని పాఠశాలల నుంచి బాలబాలికలను ఆహ్వానించారు. ఈ ఆహ్వానం మేరకు సనా (13) అనే బాలిక తోటి బాలికలతో కలిసి ఎల్బీ స్టేడియానికి వచ్చింది. సనాకు వాంతులు, విరేచనాలు రావడంతో సిబ్బంది వెంటనే రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అయితే నిలోఫర్‌కు వచ్చిన చిన్నారి రోగిని అడ్మిట్ చేసుకోలేదు. కాసేపటికి మరో చిన్నారిని నిలోఫర్‌కు వచ్చినా వైద్యం కోసం ఆసుపత్రిలో చేర్చుకోకపోవడంతో వెనుదిరక తప్పలేదు. ఆ తరువాత ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ చిన్నారులు ఇద్దరు కోలుకున్నట్లు తెలుస్తోంది.

15 వేల గృహాల్లో సర్వే పూర్తి

బంజారాహిల్స్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమాచార సేకరణ సమగ్ర సర్వే జీహెచ్ఎంసీ సర్కిల్–17 పరిధిలో 15 వేలు దాటిందని డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సమగ్ర కుటుంబ సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఒక్క శుక్రవారం రోజే 2,300 గృహాలను సందర్శించి సర్వే చేసినట్లు వెల్లడించారు. సర్వేలో మొత్తం 75 అంశాలను సంబంధించిన ప్రశ్నలను అడుగుతున్నారని, ఇందులో కుటుంబ సభ్యుల పేర్లు, కులం, ఆధార్ నెంబర్లు, రేషన్‌కార్డు, మొబైల్ నెంబర్లను సాఫీగా చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేకు సహకరిస్తున్నారని వెల్లడించారు. ఒకవైపు సర్వే జరుగుతుండగానే మరోవైపు కంప్యూటీకరణ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సర్కిల్–17 పరిధిలో సర్వే సంతృప్తిగానే కొనసాగుతుందని, ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు.

నేటి నుంచి నిత్యాన్నదానం



రహమత్‌నగర్ (బోరబండ): ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం సైతం దీక్ష బూనిన అయ్యప్ప స్వాముల కోసం బోరబండ హరిహర పుత్ర అయ్యప్ప దేవాలయంలో శనివారం నుంచి నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి డిసెంబర్ 31 వరకు నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. అయ్యప్పస్వామి కృప, దాతల సహకారంతో 16 సంవత్సరాలుగా కార్యక్రమం కొనసాగుతుండటం అభినందనీయమన్నారు. అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

అపోలో రోడ్డులో ఆపరేషన్ రోప్

38 మంది వీధి వ్యాపారులకు జరిమానాలు



ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని సురుచి చౌరస్తా నుంచి అపోలో ఆస్పత్రి మీదుగా కేరళ రెస్టారెంట్ వరకు రోడ్డుకు రెండువైపులా వెలసిన ఆక్రమణలను శుక్రవారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు అశోక్, గోపీ, నర్సింహారావుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు రెండు గంటలపాటు ఈ రోడ్డులో 'ఆపరేషన్ రోప్' నిర్వహించారు. కొంతకాలంగా రోడ్ల పక్కన ఇళ్ల యజమానులు చిరువ్యాపారులకు ఫుట్‌పాత్‌లు, రోడ్లను అద్దెలకు ఇచ్చారు. ఇలా 38 ఆక్రమణలను తొలగించి ఒక్కొక్కరికీ రూ.250 చొప్పున జరిమానా విధించి సామగ్రిని సీజ్ చేశారు. మరోసారి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అపోలో ప్రధాన గేటు ముందు భవన యజమానులు తమ ఇంటి ముందు ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి కిరాయిలకు ఇస్తూ రోడ్డును పూర్తిగా ఇరుకుగా మార్చేశారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

చిన్నారులకు వినికిడి యంత్రాల వితరణ



వినికిడి యంత్రాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: వినికిడి సమస్యతో బాధపడుతున్న పేద చిన్నారులకు అండగా నిలిచేందుకు తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఆరా హియరింగ్ కేర్ సంస్థ డబ్ల్యూఎస్ఏ ఆడియాలజీ సీఈవో అవినాష్ పవార్ అన్నారు. నగరంలో సికింద్రాబాద్, చందానగర్, మెహిదీపట్నం ప్రాంతాల్లో మూడు కొత్త శాఖలు ప్రారంభించిన నేపథ్యంలో పంజగుట్ట ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు వినికిడి సమస్యతో బాధపడుతున్న 25 మంది చిన్నారులకు హియరింగ్ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ పవార్ మాట్లాడుతూ వినికిడి సమస్యలకు పరిష్కారం చెప్పే దిశలో భాగంగా తాము నగర వ్యాప్తంగా మరిన్ని బ్రాంచీలు ఏర్పాటు చేయబోతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పియూష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తేవాలి



బంజారాహిల్స్: రాబోయే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెచినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ కార్యకర్తల సమావేశం సాగర్ సొసైటీలోని కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి హాజరైన మెచినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోనే జూబ్లీహిల్స్ డివిజన్‌లో అత్యధిక సభ్యత్వ నమోదు జరిగిందన్నారు. అదేవిధంగా కొత్తగా బూత్ కమిటీలు కూడా వేసుకోవాలని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే ఏ ఎన్నికల్లో అయినా బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు గడ్డం వెంకటస్వామి, బలిజ రమేష్, కస్తూరి మహిపాల్‌రెడ్డి, దండుగుల శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రహమత్‌నగర్: ప్రతి సంవత్సరం శ్రీరాంనగర్ చిల్లా వద్ద గ్యార్వీ షరీఫ్ వేడుకలు నిర్వహిస్తూ, అన్నదానం చేయడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ మేరాజ్‌అలీ కొనియాడారు. గార్వీ షరీఫ్ నిర్వాహకులు ముఖీమ్, సయ్యద్ ఉమర్ తదితరులను చిల్లా వద్ద శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మేరాజ్‌అలీ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేపడుతున్న ముస్లిం నాయకులకు అల్లా కృప తప్పక ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.









కనుల పండువగా కార్తీక పౌర్ణమి



బంజారాహిల్స్ రోడ్ నెం.1 శివాలయంలో...


• శివాలయాల్లో పోటెత్తిన భక్తులు • తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు




ఫిలింనగర్ దైవసన్నిధానంలో...

బంజారాహిల్స్: కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో భక్తజన సందోహం పోటెత్తింది. కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది కాగా అందులోనూ కార్తీక పౌర్ణమి కావడంతో ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారికి వేకువ జాము నుంచే అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించగా, ఆలయంలో నిర్వహించిన దీపారాధనలో కూడా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఫిలింనగర్ దైవసన్నిధానంలో సైతం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని శివాలయంలో స్వామివారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12 ఎన్బీటీనగర్ కమాన్‌లోని శ్రీ హనుమాన్ ఆలయం, అయ్యప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో సాయంత్రం నిర్వహించిన ఆకాశ దీపారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి మహన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకాలను వైభవంగా నిర్వహించారు.





విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకూడదు

ప్రిన్సిపాల్ అస్మతున్నీసా



బహుమతులు ప్రదానం చేస్తున్న అస్మతున్నీసా

ఫిలింనగర్: విద్యార్థులు కేవలం చదువులు, తరగతి గదులకే పరిమితం కాకుండా భవిష్యత్తుకు దోహదపడే, సృజనను వెలికితీసే, ప్రతిభను చాటుకునే మిగతా అంశాలపై కూడా దృష్టిపెట్టాలని జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10సీలోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా అన్నారు. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో విజేతలకు శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బహుమతుల ప్రదానోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమకు ఇష్టమైన కళల్లో రాణించాలని, ఆ మేరకు తమ పాఠశాల కూడా ఆయా విద్యార్థులను ప్రోత్సహిస్తుందని వెల్లడించారు. చిన్నారులు ఈ పోటీల్లో పండ్లు, పువ్వులు, పక్షులు, జంతువులు తదితర అంశాలు నేపథ్యంగా చిత్రాలు వేశారని, ఇవి ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. పాటలు, ఆటలు, నృత్యాలు, పెయింటింగ్, వ్యాస, క్విజ్, వక్తృత్వ తదితర అంశాల్లో కూడా విద్యార్థులు ఇంకా రాణించాల్సిన అవసరం ఉందని, అందుకు తమ పూర్తి ప్రోత్సాహం ఉంటుందన్నారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేసి అభినందించారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

• షాపుల యజమానులకు సూచించిన ఎమ్మెల్యే దానం నాగేందర్



సూచనలు, సలహాలు చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

కాచిగూడ: ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దని, షాప్స్ పరిధిలోనే బైక్స్ పెట్టుకుని వ్యాపారాలు చేసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సెకండ్ హ్యాండ్ బైక్ వ్యాపారులకు సూచించారు. శుక్రవారం హిమాయత్‌నగర్ డివిజన్‌కింగ్‌కోఠి ప్రాంతంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని బైక్స్ వ్యాపారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. షాపుల ముందు బైక్స్ నిలపడం వల్ల ట్రాఫిక్ పోలీసులు వేలల్లో చలాన్లు వేస్తున్నారని షాపుల యజమానులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. షాపుల యజమానులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని రోడ్లపై బైక్‌లు పెట్టడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కింగ్‌కోఠి స్కూల్స్ జోన్ ప్రాంతం కావడంతో విద్యార్థుల రాకపోకలతో రోడ్డు ట్రాఫిక్‌జామ్ అవుతోందని అన్నారు. స్కూల్ జోన్ ప్రాంతం కావడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సి వస్తుండటంతో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ నియంత్రణకు బైక్స్ వ్యాపారులు కూడా సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

టెక్నాలజీని మంచి కోసమే ఉపయోగించాలి

వైజ్ఞానిక ప్రదర్శనలో బీవీబీపీ విద్యార్థుల ఆలోచనాత్మక నమూనాలు



వైజ్ఞానిక ప్రదర్శనను చూస్తున్న ప్రిన్సిపాల్ అరుణశ్రీ తదితరులు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో 6–9 తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆలోచనాత్మకమైన, భవిష్యత్తుకు ఉపయోగపడే నమూనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. పర్యావరణాన్ని ఎలా పరిరక్షరించుకోవాలి.. టెక్నాలజీని ఎలా ఉపయోగించాలి.. ఎలా ఉపయోగించకూడదు.. ప్రజల ప్రయోజనాలకు ఉపయోపగడే పలు ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. సైన్స్, మ్యాథ్స్, టెక్నాలజీ ఈ మూడు అంశాలను క్రోడీకరిస్తూ నమూనాలు రూపొందించారు. సైకాలజీ ప్రొఫెసర్ నరేష్ వడ్లమాని, ఇదే స్కూల్ పూర్వ విద్యార్థి ఐఎఫ్ఎస్ అధికారి ఆదిత్య ప్రవీణ్‌లు ముఖ్యఅతిథులుగా విచ్చేసి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. భవిష్యత్తుపై వారి ఆలోచనలను ప్రశంసించారు. ఒకరోజు పాటు జరిగిన ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో జేహెచ్‌పీఎస్, ఆత్మకూరి రామారావు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ కూడా పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ టీటీడీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మహాలక్ష్మీ అమ్మవారికి కంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దాదాపు 500 మంది ముత్తైదువులు పాల్గొని మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు రాఘవయ్య స్వామి ఆధ్వర్యంలో సంకల్పము, పుణ్యాహవాచనం, కలశ స్థాపన చేసి మహాలక్ష్మీ అమ్మవారి సహస్ర నామాలతో కుంకుమార్చన నిర్వహించారు. టీటీడీ నుంచి మహిళలకు పసుపు, కుంకుమ, పూలు, కార్తీక మాసానికి సంబంధించి పుస్తకాలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కుంకుమార్చనలో మహిళలు

నేత్రపర్వంగా సత్యనారాయణ వ్రతాలు



వేంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో...



ఫిలింనగర్: కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమి రోజు సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆదరిస్తే మంచి ఫలితం ఉంటుందనే విశ్వాసంతో ఆలయాల్లో నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని శివాలయం, ఫిలింనగర్ దైవసన్నిధానం, శ్రీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతాల్లో వందలాది మంది దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. దీంతో ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వ్రతాల అనంతరం అన్ని ఆలయాల్లో అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళ అదృశ్యం

శ్రీనగర్‌కాలనీ: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ సమీపంలోని స్నేహపురి కాలనీకి చెందిన ఆదిలక్ష్మి ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది. ఈ క్రమంలో స్కూల్ పిల్లలను గురువారం కృష్ణకాంత్ పార్క్‌కు ఆటలాడించడానికి వచ్చారు. పార్క్‌లో చిన్నారులను ఆటలాడించిన తర్వాత సాయంత్రం పిల్లలు, ఉపాధ్యాయులు సంబంధిత బస్సు దగ్గరకు వచ్చారు. అయితే ఆదిలక్ష్మి మాత్రం కనబడలేదు. విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు శేఖర్‌రావు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆదిలక్ష్మి కనబడలేదు. దీంతో శేఖర్‌రావు మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం గ్రేటర్ మహాసభలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనివాస్‌నగర్ వెస్ట్ కమ్యూనిటీ హాల్లో నవంబర్ 30, డిసెంబర్ 1న జరుగనున్న సీపీఎం గ్రేటర్ హైద్రాబాద్ సెంట్రల్ కమిటీ 23 వ మహాసభలను జయప్రదం చేయాలని హైద్రాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ కోరారు. ఎస్పీఆర్‌హిల్స్‌లో ఎన్ఎస్‌బీనగర్‌లో సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొలిసారి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న సీపీఎం నగర మహాసభలను పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఈ మహాసభలను సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు రాఘవులు ప్రారంభిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం రహమత్‌నగర్ డివిజన్ తమ పార్టీ నాయకులు బస్తీల్లో ప్రచారాన్ని చేపడ్తారని తెలిపారు. ప్రజల పక్షాన పోరాడే సీపీఎం మహాసభలకు ప్రజలు తమ సహాయ, సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. సిటీ సెక్రటేరియట్ కమిటీ సభ్యుడు వెంకటేశ్, జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, సీసీఎం బాధ్యుడు శేషగిరిరావు, స్వామిలు పాల్గొన్నారు.

పరీక్షలతో ముందుగానే వ్యాధులను గుర్తించొచ్చు

ఖైరతాబాద్: అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉండేందుకు వైద్యపరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యమని, ముందుగానే వ్యాధులను గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అనారోగ్యాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని టీఎస్‌పీఎస్ కామాండెంట్ ఎన్.త్రినాథ్ తెలిపారు. శుక్రవారం బుద్ధభవన్‌లో యోదా ల్యాబ్స్ ఆధ్వర్యంలో రేడియాలజీ, రక్త పరీక్షలపై ప్రత్యేక రాయితీ అందజేస్తూ కుదుర్చుకున్న ఒప్పందాన్ని యోదా ల్యాబ్స్ ఎండీ గిరిధర్ రాహుల్ కమాండెంట్ త్రినాథ్‌కు అందజేశారు. ఈ ఒప్పందం ప్రకారం టీఎస్‌పీఎస్ పరిధిలోని తెలంగాణ సచివాలయం, అసెంబ్లీ, తెలంగాణ హైకోర్టు, అర్‌బీఐలలో పనిచేసే సిబ్బందికి వర్తిస్తుందని తెలిపారు.



రాయితీ పత్రాన్ని స్వీకరిస్తున్న కమాండెంట్ త్రినాథ్ తదితరులు

నగరంలో నేడు

- భక్తి టీవీ కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం ఎన్టీఆర్ స్టేడియం వేదికగా సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది.
- సూత్ర ప్రత్యేక వివాహ కలెక్షన్స్ ఎగ్జిబిషన్ బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్‌కృష్ణలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది.
- మాదాపూర్‌లో హైటెక్స్‌లో ఫిల్మ్‌ఫెస్ట్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కంటోన్మెంట్ అభివృద్ధికి
కట్టుబడి ఉన్నాం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- సిఖ్ విలేజ్‌లో క్రీడా మైదానం పరిశీలన
- ఎలివేటెడ్ కారిడార్ పరిహారంతో డ్రైనేజీ, నాలాల అభివృద్ధి
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా రోడ్ల విస్తరణ తప్పదని వెల్లడి


హాకీ మైదానాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ తదితరులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కంటోన్మెంట్ సిఖ్ విలేజ్‌లోని హాకీ మైదానాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, గతంలో మల్కాజిగిరి ఎంపీగా కొనసాగడంతో ఇక్కడి సమస్యలపై ఆయనకు సంపూర్ణ అవగాహన ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చిన వెంటనే కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి స్థలం కేటాయింపునకు కేంద్రాన్ని ఒప్పించినట్లు వెల్లడించారు.

- ఆరు నెలల క్రితమే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన కూడా జరగడాన్ని గుర్తు చేశారు. ఈ మేరకు సేకరించనున్న స్థలాల్లో కంటోన్మెంట్ బోర్డుకు సంబంధించిన 24.6 ఎకరాల భూమికి బదులుగా, రూ.303.6 కోట్లను చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఈ మొత్తాన్ని కేంద్రానికి చెల్లించకుండా, అవే నిధులతో కంటోన్మెంట్‌లో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చాలని కంటోన్మెంట్ అధికారులు కోరినట్లు చెప్పారు.
- స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రత్యేక చొరవతో సీఎం రేవంత్‌రెడ్డి, రూ.303 కోట్లతో కంటోన్మెంట్‌లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పర్చడం, పికెట్, ప్యాట్నీ నాలాల అభివృద్ధికి అంగీకారం తెలిపారని చెప్పారు. ఇందుకు సంబంధించి పట్టణాభివృద్ధి శాఖ గురువారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు.

కొందరికి ఇబ్బందులు తప్పవు..

ఏదైనా ప్రాజెక్టు కోసం స్థల సేకరణ జరిగే సమయంలో కొందరికి నష్టం జరగడం సహజమని, అయితే మెజార్టీ ప్రజల ప్రయోజనం కోసం తప్పదన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎలివేటెడ్ కారిడార్ల కోసం రాష్ట్ర రహదారి–01, జాతీయ రహదారి–44 మార్గాల్లో రోడ్డును 60 మీటర్లకు విస్తరించాల్సిందేనన్నారు. స్థలాలను కోల్పోయే వారికి ప్రభుత్వం పరిహారం ఇస్తుందన్నారు. ఈ విషయంలో ఈటల రాజేందర్ రాజకీయాలు చేయడం తగదన్నారు. ప్రస్తుతం తాము నగరం నలుమూలలా సమాన అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ల మార్గంలో మెట్రోను సైతం అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు అధ్యయనం చేయాల్సిందిగా, మెట్రో అధికారులకు సీఎం ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు.

మాది చేతల ప్రభుత్వం

కంటోన్మెంట్‌లో క్రీడా స్థలాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాలు మాటలు చెప్పడం తప్ప, కార్యాచరణ లేదన్నారు. క్రీడాకారులకు పుట్టినిల్లు వంటి కంటోన్మెంట్‌లో స్టేడియాల నిర్మాణం చేపట్టాల్సిందిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరడంతో, స్థలం అప్పగింతకు కంటోన్మెంట్ బోర్డు ముందుకొచ్చిందన్నారు. సుమారు 8 ఎకరాల స్థలంలో స్థానికులకు ఉపయోగపడేలా క్రీడా సదుపాయాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సర్వేలో బ్యాంకు అకౌంట్ వివరాలు ఏమీ అడగడం లేదన్నారు. కులం వివరాలు చెప్పడానికి ఇష్టం లేని వారు '999' ఆప్షన్ ఎంచుకోవచ్చన్నారు.

ప్రజాస్వామ్యానికి పాతరేశారు: శ్రీగణేశ్

కంటోన్మెంట్‌లో ఎన్నికలు నిర్వహించి పదేళ్లు అవుతోందన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాతినిధ్యం లేకుండా చేసి, కేంద్రం ఇక్కడ ప్రజాస్వామ్యానికి పాతరేసిందన్నారు. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం లేదా ఎన్నికల నిర్వహణపై తక్షణమే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం కంటోన్మెంట్‌కు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల సర్వీసు చార్జీలను తక్షణమే విడుదల చేసి ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. కంటోన్మెంట్ రూ.303 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టించనుందన్నారు.

పెండింగ్ సమస్యల పరిష్కారం

- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప
- నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు


నిమ్స్ డైరెక్టర్ బీరప్పతో నిమ్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

లక్డీకాపూల్: నిమ్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం.హరినాథ్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను నిమ్స్ మాజీ సెక్యూరిటీ అధికారి బంగారు ఉమేష్ నిర్వహించారు. ఇటీవల నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హరినాథ్‌బాబు అధ్యక్షతన ఏర్పడిన నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఆర్.శరత్‌బాబు, కోశాధికారిగా రామరాజు, ఉపాధ్యక్షులుగా వేణుగోపాలస్వామి, పూలమ్మ, జాయింట్ సెక్రటరీగా నాగరాజు ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్పతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపిస్తానని ఆయన వారి భరోసా ఇచ్చారు. తొలుత సంఘం కార్యవర్గానికి బీరప్ప శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో సంఘం నూతన కార్యవర్గంతో పాటు మాజీ అధ్యక్షుడు ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజూ కొనసాగిన ప్రజావాణి


ప్రజావాణిలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జి.చిన్నారెడ్డి

లక్డీకాపూల్: గురునానక్ జయంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజు అయినా మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జీ.చిన్నారెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు తీసుకుని వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేస్తూ ఆయా అర్జీలపై ఎండార్స్‌మెంట్ చేశారు. ప్రజావాణిలో మొత్తం 171 దరఖాస్తులు అందాయి. వాటిలో 41 అర్జీలు మైనార్టీ సంక్షేమ శాఖకు చెందినవే ఉన్నాయి. అవి కూడా ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు, వృద్ధాప్య పింఛన్ వంటి సంక్షేమ పథకాల కోసమే దరఖాస్తులు వచ్చాయి. కాగా రెవెన్యూ శాఖకు 33, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 30, విద్యుత్ శాఖకు చెందిన 21, ప్రవాసి ప్రజావాణికి ఒక అర్జీతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై 45 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు.

స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రత్నాకర్



లక్డీకాపూల్: తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పి.రత్నాకర్‌రావు ఎన్నికయ్యారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో రత్నాకర్ అధ్యక్షతన ఏర్పడిన నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా పి.సదానందం, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జేఎల్ జనప్రియ, అడిషనల్ సెక్రటరీగా ఎం.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. విద్యుత్ ఇంజినీర్ల సమస్యలకు పరిష్కారం చూపుతామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్, సదానందం తెలిపారు.

ఒక్క రోజులో 50 సేల్స్

- 43.29 ఎకరాల్లో లగ్జరీ విల్లాలు
- శంషాబాద్‌లో వైష్ణోయ్ సౌత్ వుడ్స్ ప్రాజెక్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన నిర్మాణ సంస్థ వైష్ణోయ్ గ్రూప్ శంషాబాద్‌లోని మామిడిపల్లిలో సౌత్ వుడ్స్ పేరుతో లగ్జరీ విల్లా ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఒక్క రోజులోనే 50 బుకింగ్స్‌ను పూర్తి చేసినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 43.29 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో 260 అల్ట్రా లగ్జరీ విల్లాలు ఉంటాయని కంపెనీ ఫౌండర్ అండ్ సీఎండీ వై.రవి ప్రసాద్ తెలిపారు. 300 నుంచి 550 చదరపు గజాల్లో ఎక్స్‌క్లూజివ్ 4, 5 బీహెచ్‌కే విల్లాలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి విల్లాలో మినీ థియేటర్‌తో పాటు 50 రకాల ఆధునిక వసతులను కల్పిస్తున్నామని వివరించారు. డిసెంబర్ 2027 నాటికి నిర్మాణ పనులు పూర్తవుతాయని ఆయన చెప్పారు.

కళ్లకు కట్టినట్లు న్యాయవ్యవస్థ పనితీరు



- రాజ్యాంగ ప్రాధాన్యత వివరించే లీగల్ ఎగ్జిబిషన్
- అన్ని లా కాలేజీలు ఏర్పాటు చేయాలి
- హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవి దేవి

కాచిగూడ: రాజ్యాంగం ప్రాధాన్యతను, న్యాయ వ్యవస్థ పనితీరును కళ్లకు కట్టినట్లు వివరించేలా ఏర్పాటు చేసిన లీగల్ ఎగ్జిబిషన్ ఎంతో బాగుందని తెలంగాణ హైకోర్టు జడ్జి, జస్టిస్ మాధవి దేవి అన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లా కాలేజీ యాజమాన్యం లీగల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం.. కేశవ్ మెమోరియల్ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్దితో కలిసి ప్రతి స్టాల్‌ను ఆమె సందర్శించి, విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'రాజ్యాంగం మనకు భగవద్గీత లాంటిదని, లీగల్ ఎగ్జిబిషన్ అద్భుతంగా ఉందన్నారు. రాజ్యాంగం ప్రాధాన్యతను చక్కగా వివరించారు. స్టూడెంట్స్, ఫ్యాకల్టీ ఏర్పాటు చేసిన స్టాల్స్ చాలా బాగున్నాయి. న్యాయ వ్యవస్థ గురించి తెలుసుకోవాలనుకునే వారు ఈ లీగల్ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలన్నారు. లా విద్యార్థులతో పాటు ఇతరులు కూడా సందర్శిస్తే బాగుంటుందని తెలిపారు. ప్రాక్టికల్‌గా చూడటం వల్ల చాలా నేర్చుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కేశవ్ మెమోరియల్ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది మాట్లాడుతూ.. న్యాయ కళాశాలల చరిత్రలోనే మొదటిసారిగా లీగల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి సైతం ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు.

మూసీ బాధితులకు అండగా బీజేపీ

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి
- నేడు తులసిరాంనగర్ బస్తీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బస


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

కాచిగూడ: మూసీనది ప్రక్షాళన పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం తగదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అన్నారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావుతో కలిసి ఆమె శుక్రవారం మాట్లాడారు. మూసీ ప్రక్షాళన అంటే కేవలం ఇళ్లను కూలగొట్టడమే కాదని, ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. మూసీనది ప్రక్షాళనకు అడ్డు వస్తే బుల్డోజర్లతో తొక్కుకుంటూ వెళ్లి నదిని పునరుజ్జీవింపజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూసీ పరివాహకంలో 22 ప్రాంతాల్లోని ఇళ్లలో ఈ నెల 16వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి 17వ తేదీ ఉదయం 9 గంటల వరకు బీజేపీ నేతలు బస చేస్తారని తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక డివిజన్‌లోని నాలుగు బస్తీలైన తులసీరాంనగర్‌లో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, కమలానగర్‌లో చింతల రాంచంద్రారెడ్డి, శాస్త్రీనగర్‌లో ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, అంబేడ్కర్ నగర్‌లో సి.కృష్ణయాదవ్ బస చేస్తారని తెలిపారు. రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే బీజేపీ నేతలను తొక్కిపడేయడానికి బుల్డోజర్లను తీసుకురావాలని సవాల్ విసిరారు. ప్రణాళికలు, అంచనాలు వేయకుండా కేవలం డబ్బు దోపిడీ కోసమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టును చేపట్టిందని విమర్శించారు. మూసీ బాధితులకు అండగా బీజేపీ ఉంటుందని ఆమె తెలిపారు. కార్పొరేటర్లు వై.అమృత, కన్నె ఉమారమేష్‌యాదవ్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, కేశబోయిన శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సదనం బాలుడు.. విమానం ఎక్కాడు

గుజరాత్‌లో జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు హాజరు

సైదాబాద్: మునుపెన్నడూ లేనివిధంగా ప్రభుత్వ జువైనల్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న బాలుడు ఆటల పోటీల్లో పాల్గొనేందుకు విమానం ఎక్కాడు. గుజరాత్‌లో జరుగుతున్న ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు సదనం బాలుడు రూబెన్ విమాన ప్రయాణం చేశాడని జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జా అలీబేగ్ తెలిపారు. సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనంకు చెందిన బాలుడు రూబెన్ ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో సత్తాచాటి నాలుగో స్థానంలో నిలిచాడు. అంతేగాకుండా అండర్–19 బాలుర జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కూడా సాధించాడు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు గుజరాత్ నడియాడ్‌లో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు సదనం సంరక్షకుడు రహ్మాన్‌తో కలిసి రూబెన్ బయలుదేరాడు. శుక్రవారం డీడీ మీర్జాఅలీబేగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర జువైనల్ వెల్ఫేర్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ కాంతివెస్లీ ప్రత్యేక అనుమతితో బాలుడు పోటీలకు వెళ్లాడని తెలిపారు. సదనం బాలుడు జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లోనూ చక్కగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

హెచ్ఎండీఏ కమిషనర్ ఇంట్లో కులగణన సర్వే


సమగ్ర సర్వేలో వివరాలు నమోదు చేస్తున్న హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్

బంజారాహిల్స్: సమగ్ర కుటుంబ ఇంటింటి కులగణన సర్వేలో భాగంగా శుక్రవారం జూబ్లీహిల్స్‌లో నివసించే హెచ్ఎండీఏ కమిషనర్, సర్వే స్పెషల్ ఆఫీసర్ సర్ఫరాజ్ అహ్మద్ ఇంట్లో సిబ్బంది సర్వే చేశారు. ఇందులో భాగంగా సూపర్‌వైజర్ శివకుమార్, ఎన్యుమరేటర్ పృథ్వీ ఆయన నుంచి 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని పూరించి తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి సర్వే చేస్తున్న విధానాన్ని, ప్రజల నుంచి వస్తున్న స్పందనను, ఇప్పటి వరకు ఎన్ని గృహాలు సందర్శించింది.. తదితర వివరాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

ఘనంగా బాలల సాంస్కృతికోత్సవం

సుల్తాన్‌బజార్: బాలల వ్యక్తిత్వ వికాసానికి కొన్ని సంవత్సరాలుగా పరిషత్ నిర్వహిస్తున్న సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలకు విశేష స్పందన లభిస్తుందని వక్తలు కొనియాడారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బొగ్గులకుంటలో నిర్వహించిన కొడూరు శాంతమ్మ స్మారక బాలల సాంస్కృతికోత్సవం ఎంతో ఘనంగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 100కు పైగా ఉన్నత పాఠశాలలకు చెందిన 1200 మంది విద్యార్థులు వచన కవిత, పద్య కవిత, కథ, చిత్రలేఖనం పోటీలకు పాల్గొన్నారు. ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా శాంతా వసంత ట్రస్ట్ అధ్యక్షులు పద్మభూషణ్ డాక్టర్ కెఐ.వరప్రసాదరెడ్డి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారిలు హాజరై గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కృష్ణమోహన్, డాక్టర్ సుమిత్ర పార్థసారథి, డాక్టర్ జె.విజయ్‌కుమార్‌జీ ప్రసంగించారు.






డుప్కి పున్నమి.. నదీ స్నానాల జాతర

లంగర్‌హౌస్: కార్తీక పౌర్ణమి నదీ స్నానాల డుప్కి పున్నమి జాతర త్రివేణి సంగంలో వైభవోపేతంగా ప్రారంభమైంది. ఆనాడు కార్తీక పౌర్ణమికి రామ లక్ష్మణులు స్వయంగా స్నానాలు ఆచరించిన లంగర్‌హౌస్‌లోని త్రివేణి సంగంలో పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణులకు తెల్లవారుజామున నదీ స్నానం చేయించి జాతర ప్రారంభించారు. అనంతరం స్వామివారు అమ్మవార్లను పురవీధుల్లో రథంపై ఊరేగించారు. నదిలో స్నానాలు ఆచరించి త్రివేణి సంగం మధ్యలో స్వయంభూగా వెలసిన శివలింగాల వద్ద దీపాలు వెలిగించి, కార్తీక దీపాలను భక్తులు నదిలో వదిలారు. అనంతరం వనభోజనాలు నిర్వహించారు.

విద్యార్థులకు కష్టపడే తత్వం ఉండాలి

- విద్యార్థుల గుండెల్లో కష్టపడే ధైర్యం ఉండాలి
- వెయిట్‌లిఫ్టర్ కరణం మల్లేశ్వరి
- గచ్చిబౌలి స్టేడియంలో ముగిసిన 'రెసోఫెస్ట్'


ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్‌లో సీట్లు సాధించిన విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న కరణం మల్లేశ్వరి

చందానగర్: దేశంలోని క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని, కష్టపడే ధైర్యం విద్యార్థుల గుండెల్లో ఉండాలని వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో రెసోనెన్స్ కళాశాల 'రెసోఫెస్ట్' శుక్రవారం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథులుగా వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి, సినీనటుడు మురళీశర్మ, రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఎండీ ఎస్.పూర్ణచంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ సంస్థ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తోందన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థులు ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ, మెడికల కాలేజీల్లో సీట్లు సాధిస్తుండటం చాలా సంతోషకరమన్నారు. ఉత్తమ విద్యార్థులకు సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు కష్టపడి ధైర్యంగా ముందుకెళ్తే అనుకున్న సాధించవచ్చని, క్రీడాకారులకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. తాను హర్యానా రాష్ట్రంలో వెయిట్ లిఫ్టింగ్ కోచింగ్ అకాడమీ ఇస్తున్నానన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు శిక్షణ తీసుకుంటున్నారన్నారు. అనంతరం రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఎండీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రెసోనెన్స్ 23 సంవత్సరాల నుంచి విద్యారంగంలో విజయవంతమైన, జనాధారణ పొందిన బ్రాండ్ అన్నారు. దేశంలో 76 నగరాల్లో ఉందని, 35 క్యాంపస్‌లలో 10వేలకు పైగా విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కులగణనపై బీజేపీ వైఖరి చెప్పాలి

మాజీ ఎంపీ రవీంద్రనాయక్

సాక్షి, సిటీబ్యూరో: కులాలు, తెగల మధ్య అసమానతలు, వైషమ్యాలను తొలిగించాలన్న రాహుల్ గాంధీ ఆలోచనను అభినందించాల్సింది పోయి ప్రధాని మోదీ విమర్శించడం సబబు కాదని మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఓబీసీని అంటారు, మరి ఓబీసీల కులగణనను వద్దనడమేంటని ప్రశ్నించారు. ఈ కులగణనతో 78 సంవత్సరాలుగా ఓబీసీలకు లభించని సామాజిక న్యాయం, స్వాభిమానం, అధికారం, అభివృద్ధిలో భాగస్వామ్యం కులగణన ద్వారా లభిస్తుందని తెలిపారు. ఇలా చేయడం బీజేపీకి ఇష్టం లేదా, దీనిపై మీ అభిప్రాయం ఏంటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రకారం ఎవరి వాటా వారికి ఇవ్వడానికి భయమెందుకో చెప్పాలన్నారు. రోజురోజుకూ పేదవాడు కడుపేదగా, ధనవంతుడు అపర కుబేరుడుగా మారుతూ సమాజంలో తారతమ్యాలు పెరుగుతున్నాయన్నారు. దేశంలో 15 కోట్ల మంది నిరుపేదలు అన్నమో రామచంద్ర అంటూ తిండికి లేక అలమటిస్తున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 10 ఏళ్ల క్రితం ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలన్నారు, ఇంటింటికీ రూ.15 లక్షలన్నారు. వాటిని ముందు ప్రజలకు అందించాలని కోరారు.

గ్రంథాలయాన్ని ఆశ్రయించారు..
సర్కార్ కొలువులు సాధించారు


కొలువులు సాధించిన వారిని సన్మానిస్తున్న గ్రంథ పాలకుడు హరిబాబు, పాఠకులు

సనత్‌నగర్: పోటీ పరీక్షల నేపథ్యంలో వారంతా గ్రంథాలయ వేదికగా నిత్య పఠనం చేశారు.. అంతిమంగా సర్కార్ కొలువులను సాధించి గ్రంథాలయ ప్రాశస్త్యాన్ని చాటిచెప్పారు. గురువారం విడుదలైన టీజీపీఎస్సీ గ్రూప్–4 ఫలితాల్లో ఎస్సార్‌నగర్ గ్రంథాలయ వేదికగా ప్రిపేర్ అయిన ఐదుగురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. శేఖర్ చెంగల్ అనే యువకుడు ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్, గడ్డం శివ కుమార్ జూనియర్ ఆడిటర్, శివరామ్ వార్డు ఆఫీసర్(సంగారెడ్డి), వంశీకృష్ణారెడ్డి వార్డు ఆఫీసర్ (సూర్యాపేట), పృథ్వీరాజ్ వార్డు ఆఫీసర్ (మహబూబాబాద్) సర్కార్ కొలువులు సాధించారు. వీరంతా ఉదయం నుంచి రాత్రి వరకు గ్రంథాలయాన్నే తమ లక్ష్య సాధనకు కేంద్రంగా చేసుకున్నారు. ఇక్కడ లభించే విజ్ఞాన పుస్తకాలతో పాటు కాంపిటీటివ్ మెటీరియల్‌ను అభ్యసిస్తూ వచ్చారు. ఆ మేరకు విజ్ఞానాన్ని ఆర్జించి టీజీపీఎస్సీ గ్రూప్–4 పరీక్షలు రాసి ప్రభుత్వ ఉద్యోగాలను పొందారు. వీరిని శుక్రవారం గ్రంథ పాలకుడు హరిబాబు గ్రంథాలయానికి ఆహ్వానించి పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. తాము ఉద్యోగాలు సాధించడంలో గ్రంథాలయం ఎంతో ఉపయోగపడిందన్నారు. ప్రశాంత వాతావరణంతో పాటు తమకు అవసరమైన స్టడీ మెటీరియల్ కూడా అందుబాటులో ఉండేదన్నారు. అభ్యర్థుల కోసం గ్రంథాలయ సమయ పాలనను కూడా పొడిగించి రోజంతా తెరిచి ఉంచేవారని, దీని ద్వారా ఎలాంటి అంతరాయం కలగకుండా తాము చదువుకునేందుకు వీలు కలిగిందన్నారు. మధు, అజయ్, రాజా, సంజయ్ గ్రంథాలయ సిబ్బంది సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
13
హైదరాబాద్, శనివారం, 16, నవంబర్, 2024
సిటీ ప్లస్



నగరం నిద్రపోవడం మర్చిపోయి చాన్నాళ్లైంది.. అయ్యో.. ఇదేదో స్లీప్ డిజార్డరో, మానసిక రుగ్మతో కాదు. ఇదో అధునాతన జీవనశైలి. నగర యువత డార్క్ ఫాంటసీకి అలవాటుపడుతోంది.. అర్ధరాత్రుళ్లయినా హైదరాబాద్ రోడ్లు అలసిపోవు, ఆఫీసులు ముగిసినా ఆహ్లాదానికి విసుగు రాదు. నగరానికున్న ఎన్నో విశిష్టతల్లో సిటీ నైట్ లైఫ్ ఒకటి. అది కూడా ఎదో ఒక ప్రాంతానికే పరిమితం కాదు. నగరానికి నలుమూలలా ఫేవరెట్ స్పాట్లున్నాయి. సెంట్రల్ హైదరాబాద్ నెక్లెస్ రోడ్ మొదలు లండన్‌ను తలపించే మాదాపూర్ స్ట్రీట్స్ వరకూ నైట్ లైఫ్ ఒక అనుభూతి, ఒక ఎమోషన్. ఆ అర్ధరాత్రి రంగుల హరివిల్లుపై ఓ లుక్కేద్దామా..?!!

– సాక్షి, సిటీబ్యూరో





డార్క్ ఫాంటసీ..

హైటెక్ నగరంలో నైట్ లైఫ్ ట్రెండ్

అర్ధరాత్రి దాటినా అంతులేని వినోదం..
- నిలోఫర్ చాయ్ మొదలు ఓల్డ్ సిటీ బిర్యానీ వరకు
- ఐతే ట్యాంక్ బండ్.. లేదంటే ఎయిర్‌పోర్ట్ రోడ్
- లండన్‌ను తలపించే మాదాపూర్, గచ్చిబౌలి
- ఐటీ రోడ్లపై చిల్లింగ్ రైడ్స్.. కేబుల్ బ్రిడ్జి పై సెల్ఫీ స్పాట్స్..
- కాక్‌టేల్ మిక్స్ నైట్ హైదారాబాద్ పై ప్రత్యేక కథనం...

ఒకప్పుడు రాత్రి తొమ్మిది దాటిందంటే ఎదో టీవీ షో చూస్తూనో, డిన్నర్ చేస్తూనో లేదా ఆ పాటికే నిద్రపోవడమో జరిగేది. కానీ.. ప్రస్తుతం పగలు ఓ రోజు, రాత్రి మరో రోజు అనేలా మారింది. అలా అందరికీ కాకపోయినప్పటికీ సగానికి పైగా యువతకు ఇప్పుడిదే ట్రెండ్ అయ్యింది. అర్ధరాత్రి వరకూ ఆహ్లాదం కోసం సిటీ రైడ్ వేయడం సర్వసాధారణమైపోయింది. దీనికి తోడు నగరంలోని పలు చోట్ల అర్ధరాత్రి వరకూ ఇరానీ ఛాయ్ నుంచి హైదరాబాద్ బిర్యానీ వరకూ అందుబాటులో ఉండటం ఓ కారణం. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఐటీ ఉద్యోగుల షిఫ్టింగ్ విధానంతో ఈ నైట్ కల్చర్ మరింత పెరిగింది. అలా అని హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో మాత్రమే ఈ సందడి ఉందనుకుంటే పొరపాటే. ఓల్డ్‌సిటీ మొదలు ట్యాంక్ బండ్, సికింద్రాబాద్ నుంచి ఎయిర్ పోర్ట్ రోడ్ వరకూ ఈ నిశాచర జీవితం అంతులేని ఆహ్లాదానికి, యువత సంతోషాలకు వేదికలుగా నిలుస్తున్నాయి.

వినోదం కోసం విహారం..

మాదాపూర్ టూ హైటెక్‌సిటీ రోడ్. రాత్రి 10, 11 గంటలు దాటినా ఇక్కడి టిఫిన్ల కోసం 10 నిమిషాలైనా ఆగాల్సిందే. అంత మంది అక్కడికి చేరుకుంటారు. రాత్రి 12 గంటలైనా ట్యాంక్ బండ్ రోడ్ జాతరలా ఉంటుంది. ఇప్పుడిది కేక్ కటింగ్ స్పాట్‌గా మారింది. ఈ మధ్య కాలంలో సంబంధిత అధికారులు ఇక్కడ కేక్ కటింగ్ నిషేధించినా బర్త్‌డే పార్టీల సందడి అంతగా తగ్గనే లేదు. ఇక నెక్లెస్ రోడ్, ప్రసాద్ ఐమ్యాక్స్, ఈట్ స్ట్రీట్ రోడ్‌లో పాత ఆనవాయితే. అయితే కొత్తగా సెక్రటేరియేట్, భారీ అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపం నైట్‌సెల్ఫీ స్పాట్‌గా మారింది.

నైట్ ఈటింగ్..

నగరంలోని ఛాయ్ ప్రేమికుల కోసం వీధి వీధినా చాయ్ స్టాల్స్ ఉన్న సంగతి తెలిసిందే. కానీ రాత్రి సమయంలో చాయ్ తాగాలంటే ఐతే నీలోఫర్‌లో తాగాలి.. లేదా చార్మినార్ నిమ్రా కేఫ్‌లో తాగాల్సిందే, సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టాల్సిందే. ముజాంజాహి మార్కెట్ వేదికగా రాత్రి వెన్నెలలో చల్లని ఐస్‌క్రీం తినడం మరో స్పెషల్. ఇక ఫ్లేవర్ ఆఫ్ హైదరాబాద్ 'బిర్యానీ' అంటే షాదాబ్ నుంచి ప్యారడైస్ వరకూ..., మేఫిల్ నుంచి కేఫ్ బాహర్ వరకూ ఎక్కడంటే అక్కడ దొరుకుతుంది.





కాక్‌టేల్‌కు మించిన కిక్..

క్లబ్‌లు, పబ్బులు, బార్‌లు, రెస్టారెంట్లు.. ఒకటా రెండా.. నగరంలో విహరించాలంటే ఎన్నో కారణాలు, ఎన్నెన్నో అనుభవాలు. ఈ మధ్య కాలంలో ఐతే దుర్గం చెరువు పై రంగురంగుల లైట్లతో నైట్ రెయిన్ బోను తలపించే కేబుల్ బ్రిడ్జ్ పై సెల్ఫీ దిగడమో, రీల్స్ చేయడమో ఒక ట్రెండ్‌గా మారింది. ఎంతలా అంటే.. కేబుల్ బ్రిడ్జ్ పై ట్రాఫిక్ పెరగిపోయి అవస్థలు పడేంతలా. అందుకే సీసీ టీవీ కెమెరాలతో కట్టడి చేస్తున్నారు. రాత్రిళ్లు మాదాపూర్, గచ్చిబౌలి మధ్య బైక్ రైడ్ చేయడం ఈ తరం యూత్‌కు ఒక సరదా. అంతేకాదు.. ఏకంగా శంషాబాద్‌లోని ఎయిర్ పోర్ట్‌కు ఓ రైడ్ వేసి అక్కడే పిజ్జానో, బర్గరో తిని.. మర్చిపోకుండా మళ్లీ ఓ సెల్ఫీ దిగడం కూడా స్పెషల్ అచీవ్‌మెంట్. కొండాపూర్ నుంచి ఎల్‌బీ నగర్ వరకూ.. బొల్లారం నుంచి ఆరాంఘర్ వరకూ అర్ధరాత్రిళ్లు అనుమతులకు అనుగుణంగా నిర్వహిస్తున్న ఫుడ్‌స్టాల్, ఐస్‌క్రీం పార్లర్లలో సందడి చేయడం నగరవాసులకొక హాబీలా మారింది. అయితే ఈ సంస్కృతి ఆరోగ్యానికి హానికరం ఐనప్పటికీ.. మిక్స్‌డ్ కాక్‌టేల్‌కు మించిన కిక్ ఇస్తుందనేది నైట్ లైఫ్ లవర్స్ అభిప్రాయం.



హైటెక్స్‌లో ట్రావెర్నియా ఫెస్ట్

- ఒక చోట చేరిన ట్రావెలింగ్ ప్రేమికులు
- దేశ, విదేశాల నుంచి భారీగా వచ్చిన ఔత్సాహికులు
- 'అరౌండ్ ది వరల్డ్ ఇన్ మాగ్నెట్స్' పుస్తకావిష్కరణ

ఇది మంచి స్పందన..



ఫెస్ట్‌కు మంచి స్పందన వచ్చింది. నాకు ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. అందుకే తరచూ దేశ, విదేశాల్లోని అనేక ప్రదేశాలకు వెళ్తుంటాను. అక్కడి అనుభవాలు, ఇబ్బందులు, ఇష్టాలు, సంస్కృతి, సంప్రదాయాలను అందరికీ.. ముఖ్యంగా వచ్చే తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ట్రావెర్నియాను ప్రారంభించాం. పలువురు ట్రావెలర్స్ తమ అనుభవాలను ఇక్కడ పంచుకోవడం చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ ఆంథోనీ విపిన్ దాస్, ట్రావెర్నియా వ్యవస్థాపకుడు

సాక్షి, సిటీబ్యూరో: ఒక్క ఊరు కాదు.. ఒక్క ప్రాంతం కాదు.. ఒక్క భాష కూడా కాదు.. ఒకే వయసు అంతకన్నా కాదు.. కానీ వారందరూ ఒకే చోటుకు చేరారు. దీనికి కారణం వారందరి అభిరుచీ ఒక్కటే.. అదే ట్రావెలింగ్. ప్రయాణం అంటే వారందరికీ ప్రాణం. ముఖ్యంగా సోలోగా ప్రయాణాలు చేస్తూ తమను తాము తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. దేశ, విదేశాల్లో తమ అనుభవాల గురించి ప్రపంచానికి తెలియజేసేందుకు గురువారం హైటెక్స్ వేదికగా 'ట్రావెర్నియా ఫెస్ట్' నిర్వహించారు. ఇందులో దేశ, విదేశాల నుంచి వచ్చిన ట్రావెలర్స్ తమ అనుభవాలను పంచుకున్నారు.

టూరిజం అభిమతం..

ఈ ఫెస్ట్‌లో ప్రపంచంలో పర్యటించదగిన ఎన్నో ప్రాంతాల గురించి ట్రావెలర్స్ వివరించారు. వ్యయ ప్రయాసలకోర్చి ప్రయాణాలు చేసి పడ్డ కష్టం మొత్తం మరిచిపోతుంటామని పలువురు పేర్కొన్నారు. పైగా పదేళ్ల కింద వెళ్లిన ప్రదేశాలను మరోసారి సందర్శిస్తే అక్కడ జరిగిన మార్పులను నేరుగా చూడొచ్చని చెప్పారు. అభివృద్ధికి సాక్షిభూతంగా నిలవొచ్చని, అదో అద్భుతమైన అనుభూతని, అందుకే ప్రతి ఒక్కరూ జీవితంలో ఒంటరిగా ప్రయాణం చేస్తే మనల్ని మనం తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రయాణాల ద్వారా కొత్త వారితో పరిచయాలు ఏర్పడి మనలో మార్పును తీసుకొస్తాయని వివరించారు.

ఆసక్తిగా ట్రావెల్ క్విజ్..

ట్రావెర్నియా ఫెస్ట్‌లో భాగంగా స్కూల్ విద్యార్థులకు పర్యాటక ప్రదేశాల గురించి క్విజ్ నిర్వహించారు. పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.లక్ష ప్రైజ్ మనీ అందజేశారు. పర్యాటక ప్రదేశాల గురించి తెలియని అనేక విషయాలు తెలుసుకున్నామని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వినూత్నమైన ఎన్నో ఉత్పత్తులను స్టాళ్లలో ప్రదర్శించారు. ట్రావెర్నియా వ్యవస్థాపకుడు విపిన్ దాస్ తన ట్రావెలింగ్ అనుభవంపై రచించిన 'అరౌండ్ ది వరల్డ్ ఇన్ మాగ్నెట్స్' పుస్తకాన్ని మంత్రి జూపల్లి ఆవిష్కరించారు.

ఎంతో స్ఫూర్తినిచ్చింది..



ఈ క్విజ్ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు వరంగల్ నుంచి మా పాపతో వచ్చాను. ట్రావెలర్స్ అనుభవాలు స్ఫూర్తి కలిగించాయి. సోలో ట్రావెలింగ్ చేస్తే ఎలాంటి అనుభూతి కలుగుతుందో వాళ్లు చెబుతుంటే అబ్బురం అనిపించింది. తెలియని ఎన్నో విషయాలను ఫెస్ట్‌లో తెలుసుకున్నాను. ముఖ్యంగా ఏదైనా మన వల్ల సాధ్యం అవుతుందనే నమ్మకం వచ్చింది.

– మామిళ్లపల్లి శ్రీకాంత్, వరంగల్



కలర్‌ఫుల్ కామిక్ కాన్

- హైటెక్స్‌లో కాస్‌ప్లేయర్ల సందడి
- 2 వేలమంది ఔత్సాహికులు హాజరు
- విజేతలకు రూ.2 లక్షల బహుమతి

సాక్షి, సిటీబ్యూరో: దేశంలోని ఫేమస్ కాస్‌ప్లేయర్లు, కామిక్ లవర్స్, కామిక్ సూపర్ హీరోస్ అభిమానులతో హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ నిండిపోయింది. నగరంలో మరో అధునాతన ఫెస్టివల్ సంస్కృతికి కామిక్ కాన్ నిదర్శనంగా నిలిచింది. నగరంలోని శుక్రవారం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అతిపెద్ద పాప్ కల్చర్ 'హైదరాబాద్ కామిక్ కాన్' ఈవెంట్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ఇందులో భాగంగా పలువురు కాస్‌ప్లేయర్లు విభిన్న కామిక్ రూపాల్లో దర్శనమిచ్చి వావ్ హైదరాబాద్ అనిపించారు. ఈ ఫెస్ట్‌లో మొదటి రోజు కామిక్ బుక్స్, టీవీ, ఫిల్మ్స్ మాంగా, యానిమే, గేమింగ్, యానిమేషన్ కార్యక్రమాలు, వాటిని ప్రదర్శించే స్టాల్స్‌తో సందడి నెలకొంది. ఇందులో భాగంగా మారుతి సుజీకి ఎరీనా, క్రం చీ రోల్ వేదికలుగా హైదరాబాద్ కామిక్ కాన్ కాస్‌ప్లే కాంటెస్టులు, కామిక్ బుక్ ఆవిష్కరణలు, ఇతర గేమింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఫెస్ట్‌లో భాగంగా కామెడీ షోకేస్ స్టేజ్ ప్రదర్శనలు యువతను నవ్వులతో ముంచెత్తాయి. కామిక్ స్టార్లను ప్రతిబింబించే దుస్తుల్లో డిజైన్ వేర్‌తో కాస్‌ప్లేయర్లు హైలెట్‌గా నిలిచాయి. ట్రెండ్‌గా మారుతున్న ఈ ఈవెంట్‌లో దాదాపు రెండు వేలకు పైగా నగరవాసులు, కామిక్ లవర్స్ పాల్గొనడం విశేషం. ఈ సందడి మరో 2 రోజులు కొనసాగనుంది. విజేతలకు 2 లక్షల ప్రైజ్ మనీ ఉండటం మరో విశేషం.



ఇండియన్ కామిక్స్ స్పెషల్..



దేశవ్యాప్తంగా 2011 నుంచి ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నాం. కామిక్ ఫెస్ట్‌కు నగరవాసుల నుంచి భారీ స్పందన లభిస్తుంది. ఇందులో ప్రముఖ కాస్‌ప్లేయర్లు, ఆర్టిస్టులు, కామెడీ స్టార్స్, పాన్ ఇండియా ఐకాన్స్ పాల్గొన్నారు. ప్రముఖ కామిక్ ఐకాన్ రవిగుప్తా, ప్రముఖ ప్లేలిస్ట్ డైసుకీ వంటి వారు ఈ షోలో భాగమవ్వడం మరింత క్రేజ్ పెంచింది. ఎప్పటిలా బ్యాట్ మెన్, మార్వెల్స్ కాకుండా ఈ సారి ఇండియన్ కామిక్ స్టార్లను ప్రదర్శించారు. 16 నుంచి 36 ఏళ్ల వారు ఈ ప్రదర్శనల్లో పాల్గొంటున్నారు. భారత్‌లో ఈ సీజన్‌లో హైదరాబాద్ కామిక్ కాన్ మొదటి ప్రదర్శన. వివిధ నగరాల్లో స్థానిక ఫైనల్స్‌తో పాటు ఏప్రిల్‌లో నిర్వహించే ఆల్ ఇండియా ఈవెంట్‌లో నేషనల్ ఫైనల్స్ జరగనున్నాయి. రీజినల్ ఫైనల్స్‌లో 2 లక్షల బహుమతులను అందిస్తున్నాం.

– కరణ్, నిర్వాహకులు





ఫ్యాషన్ సూత్రం..

- ప్రారంభించిన సినీతార హిమజ
- 17 వరకూ తాజ్ కృష్ణాలో ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: హోటల్ తాజ్ కృష్ణా వేదికగా ఆధునిక సంప్రదాయ మేళవింపుతో సూత్ర ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ప్రదర్శనను టాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ హిమజ, వారాహి సిల్క్స్ ఎండీ డాక్టర్ స్పందన మద్దుల ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 17 వరకూ కొనసాగనుంది. దేశంలోని అనేక నగరాలకు చెందిన మహిళా వ్యాపారవేత్తలు, డిజైనర్లు ఒకే వేదికలో విభిన్నమైన వస్త్ర, లైఫ్ స్టైల్ ఉత్పత్తులు ఏర్పాటు చేయడం అభినందనీయమని నటి హిమజ అన్నారు. వెడ్డింగ్ సీజన్ స్పెషల్స్, డిజైనర్, వెస్ట్రన్ వేర్, ఇండియన్ అప్పారెల్, హ్యాండ్లూమ్స్, కాస్ట్యూమ్ డిజైనర్ జ్యూవెలరీతో పాటు గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు ఉమేష్ తెలిపారు.


క్యాండిల్ కాన్సర్ట్..



ఉర్రూతలూగించిన ట్రిబ్యూట్ టు కోల్డ్ ప్లే

సాక్షి, సిటీబ్యూరో: లివ్ యువర్ సిటీ పేరుతో బంజారా హిల్స్ రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్ వేదికగా శుక్రవారం నిర్వహించిన 'ట్రిబ్యూట్ టు కోల్డ్‌ప్లే' క్యాండిల్‌లైట్ కాన్సర్ట్‌కి అపూర్వ స్పందన లభించింది. లిఖిత్ సంగీత ప్రదర్శనకు అహూతుల నుంచి స్టాండింగ్ ఒవేషన్ లభించింది. పారిస్‌లోని చారిత్రాత్మక వేదికలు మొదలు, న్యూయార్క్‌లోని మోడ్రన్ వేదికల వరకూ ప్రపంచ ప్రయాణం చేసి మిలియన్ల మ్యూజిక్ లవర్స్‌ను అలరించింది. ఈ గ్లోబల్ షో నగరంలోనూ నిర్వహించడంతో మ్యూజిక్ లవర్స్ సంతోషానికి హద్దులు లేకుండా పోయింది. దీనికి కొనసాగింపుగా, డిసెంబర్‌లో ఇదే హోటల్‌లో 'బెస్ట్ మూవీ సౌండ్ ట్రాక్స్' షో నిర్వహించనుంది. అనంతరం గచ్చిబౌలిలోని హయాత్‌లో 'క్వీన్ వర్సెస్ అబ్బా' ట్రిబ్యూట్ ఉంటుంది. తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలను అందిస్తూనే స్థానిక సంస్కృతులను గౌరవించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని లివ్ యువర్ సిటీ ఇండియా కంట్రీ మేనేజర్ దీపా బజాజ్ తెలిపారు.

ఇదో కొత్త అనుభూతి..



సంగీతం అంటే ఇష్టం. రెగ్యులర్‌గా మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్స్‌కి వెళుతుంటాను. ఈ ఈవెంట్ బాగా నచ్చింది. ఒక కొత్త అనుభూతిని ఇచ్చింది.

– రిథి, హైదరాబాద్

మానసిక ప్రశాంతతకు డెస్టినేషన్..



కోల్డ్ కన్సర్ట్‌లో ఈవెంట్ చేస్తున్నాం. దేశంలో ఇటువంటి కార్యక్రమం ఇదే తొలిసారి. క్యాండిల్ లైట్స్‌లో మంచి అనుభూతి ఉంటుంది. సంగీత ప్రియులు ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న ఈవెంట్ ఇది. ఇటువంటి ఈవెంట్స్ మానసిక ప్రశాంతతకు డెస్టినేషన్‌గా నిలుస్తాయి.

– డి.లిఖిత్, ప్రముఖ పియానో ప్లేయర్

దేశంలో అత్యధిక సర్క్యులేషన్ పత్రికల్లో 8వ స్థానంలో 'సాక్షి'

'సాక్షి' రోజువారీ సర్క్యులేషన్ 12,47,492...

ఏపీ 8,66,582.. తెలంగాణ 3,71,947.. మెట్రో ఎడిషన్స్ 8,963

- తొలి స్థానంలో దైనిక్ భాస్కర్ (హిందీ), రెండో స్థానంలో దైనిక్ జాగరణ్ (హిందీ)
- మూడో స్థానంలో అమర్ ఉజాలా (హిందీ).. నాలుగో స్థానంలో టైమ్స్ ఆఫ్ ఇండియా (ఇంగ్లీష్)

సాక్షి, అమరావతి: 'సత్యమేవ జయతే' నినాదంతో తెలుగు నేలపై 2008 మార్చి 23వతేదీన ప్రారంభమైన 'సాక్షి' పత్రిక ప్రస్థానం దినదిన ప్రవర్థమానంగా వర్థిల్లుతోంది. ఉన్నది ఉన్నట్టుగా.. నాణానికి రెండో వైపు వాస్తవాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్న 'సాక్షి' అశేష పాఠకాదరణతో తన ప్రస్థానాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తోంది. ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకూ నిర్వహించిన ఆడిటింగ్‌లో నిత్యం 12,47,492 కాపీలతో దేశంలో అత్యధిక సర్క్యులేషన్ కలిగిన దిన పత్రికల్లో 'సాక్షి' ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో 8,66,582, తెలంగాణలో 3,71,947, బెంగళూరు, చెన్నై, ముంబై, న్యూఢిల్లీ మెట్రో ఎడిషన్లలో 8,963 సర్క్యులేషన్‌తో 'సాక్షి' పాఠకాదరణలో దూసుకెళ్తున్నట్లు ఏబీసీ వెల్లడించింది.

తొలి మూడు స్థానాల్లో హిందీ పత్రికలు

తాజాగా ఏబీసీ నిర్వహించిన ఆడిటింగ్‌లో హిందీ పత్రికలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దైనిక్ భాస్కర్ (హిందీ) పత్రిక 30,73,304 సర్క్యులేషన్‌తో అగ్రస్థానంలో నిలిచింది. 24,42,728 సర్క్యులేషన్‌తో దైనిక్ జాగరణ్ (హిందీ) రెండో స్థానంలో నిలవగా.. అమర్ ఉజాలా (హిందీ) 17,05,529 సర్క్యులేషన్‌తో మూడో స్థానంలో ఉంది. టైమ్స్ ఆఫ్ ఇండియా (ఇంగ్లీష్) నాలుగో స్థానంలో నిలిచింది.


19న వరంగల్‌కు సీఎం రేవంత్

- ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బహిరంగసభ
- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం
- ఏడాది పాలనపై 'ప్రజా పాలన విజయోత్సవాలు'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 19న వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఆర్ట్స్ కాలేజీ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. స్వయం సహాయ బృందాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో సమావేశమై ఆ గ్రూపులకు సంబంధించిన ఆస్తుల పంపిణీ చేస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను సమీక్షించేందుకు సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి వరంగల్ పర్యటన రూట్ మ్యాప్, వేదిక ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. సభకు వచ్చే మహిళలు ఎక్కువ దూరం నడవకుండా పక్కాగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులను కోరారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు, పిల్లల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల చిత్రాలను సభ వద్ద ప్రదర్శించాలని సూచించారు. సీఎం సభ, ఇతర కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలని కోరారు.

కాంగ్రెస్ కూటమికి బంపర్ మెజార్టీ ఖాయం

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ పార్టీ కూటమి బంపర్ మెజార్టీతో గెలిచి అధికారం చేపట్టబోతోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, షోలాపూర్ పార్లమెంట్ సభ్యురాలు ప్రణతి షిండేతో కలిసి రెండు రోజులుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న మంత్రి.. కాంగ్రెస్ పార్టీ పట్ల మహారాష్ట్ర ప్రజల్లో ఆదరణ బాగుందని వెల్లడించారు. శుక్రవారం మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి సుశీల్‌కుమార్ షిండేతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలని ఇక్కడి ప్రజలు బలంగా కోరుకుంటున్నట్లు మంత్రి ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శ్రమిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఈ సందర్భంగా షిండే అభినందించారు. మంత్రి వెంట ప్రచారంలో జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు.


పటిష్టమైన రెవెన్యూ వ్యవస్థకు వీఆర్‌ఏలు ఉండాలి: ఆర్.కృష్ణయ్య

సుందరయ్య విజ్ఞానకేంద్రం: పటిష్టమైన రెవెన్యూ వ్యవస్థ ఉండాలంటే వీఆర్‌ఏలు ఉండాలని.. అందుకు ప్రభుత్వం ఆ వ్యవస్థను పటిష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వీఆర్‌ఏ జేఏసీ ఆధ్వర్యంలో జీవో నంబర్ 81లో మిగిలిపోయిన 3,797మంది వీఆర్‌ఏలకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట వినేరకం, పనిచేసే రకం అని మీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ వారసులందరికి ఉద్యోగాలు ఇచ్చి కొత్త వ్యవస్థను రూపొందించాలని, అందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేదే వీఆర్‌ఏలని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన వీఆర్‌ఏలకు తగిన న్యాయం జరగాలని, ఈ పోరాటానికి మా నైతిక మద్దతు ఉంటుందన్నారు. వీఆర్‌ఏ జేఏసీ కన్వీనర్లు వంగూరి రాములు, రమేష్ బహదూర్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరెడ్డి, నీలా వెంకటేష్, మధు, పాలడుగు భాస్కర్, గౌతంకుమార్ తదితరులు మాట్లాడారు.

● హామీలపై మళ్లీ మోసం

ఆలోచనలతో సంపద సృష్టిస్తా.. పేదరికాన్ని నిర్మూలిస్తా

- అలా వచ్చిన ఆదాయంతో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తాం
- ఇప్పటికే ఆరు ఉత్తమ పాలసీలు ప్రకటించా
- వాటితో ఈజ్ ఆఫ్ డూయింగ్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ చేస్తా
- శాసనసభలో బడ్జెట్‌పై సీఎం చంద్రబాబు ప్రసంగం



సాక్షి, అమరావతి : 'అన్ని వర్గాల వారిలో మా ప్రభుత్వంపై ఆకాంక్షలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, హామీల అమలుకు అప్పులు తేవాలంటే ఎఫ్‌ఆర్‌బీఎం షరతులున్నాయి. అమ్మడానికి ఆస్తులు కూడా లేవు'.. అని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. హామీలు అమలుచేయడానికి డబ్బుల్లేవుగానీ, తన దగ్గర కొత్త ఆలోచనలున్నాయని చెప్పారు. వాటితో సంపద సృష్టించి, పేదరికాన్ని నిర్మూలిస్తానన్నారు. బడ్జెట్‌పై శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కూటమి నుంచి 21 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారని.. ఫలితంగా ఢిల్లీలో పలుకుబడి పెరిగిందన్నారు. హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చుపెడతామని.. ఇందులో భాగంగా ఆరు కొత్త పాలసీలను ప్రకటించామని సీఎం చెప్పారు. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ పాలనతో ప్రభుత్వంలోని అన్ని శాఖలు అస్తవ్యస్తంగా మారాయని, వివిధ పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని ఆయన ఆరోపించారు.

ఇది ఉత్తమ బడ్జెట్..

రూ.2.94 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టామని.. ఇది ఎంతో ఉత్తమ బడ్జెట్ అని చంద్రబాబు అభివర్ణించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా నెరవేరుస్తూ అదనపు హామీలను అమలుపరుస్తున్నామని చెప్పారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. ఇప్పటికే కేంద్రం నుంచి వచ్చిన నిధులతో అమరావతిని పట్టాలెక్కించామని.. గోదావరి, పెన్నా, వంశధార నదుల అనుసంధానానికీ చర్యలు తీసుకుంటామన్నారు. ఇక సంక్రాంతిలోపు రహదారులపై గుంతలన్నింటినీ పూడుస్తామని.. నూతన మద్యం పాలసీ అమలుతో రాష్ట్రంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మద్యం బ్రాండ్‌లన్నింటినీ అందుబాటులోకి తెచ్చామని.. ప్రజలు కూడా తమ జీవితాలు ఎలా మారాయో చర్చించుకోవాలన్నారు.

భూములు అమ్ముకుంటే రాజధాని నిర్మాణం పూర్తి..

ఇక అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని చంద్రబాబు చెప్పారు. రాజధాని కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టే అవసరంలేదని తాను గతంలో చాలా సందర్భాల్లో చెప్పానన్నారు. ఇక్కడ 10 వేల ఎకరాల భూమి ఉందని.. దీనిని అమ్ముకుంటే దశల వారీగా రాజధాని నిర్మాణం పూర్తవుతుందని ఆయన తెలిపారు. ఆడబిడ్డల రక్షణ కోసం తమ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని.. సోషల్ మీడియాలో వారిని కించపరిచేలా పోస్టులు పెడితే వారు ఏ పార్టీ వారైనా విడిచిపెట్టబోమని హెచ్చరించారు. డిసెంబరులోగా పేదలకు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తామన్నారు.

ఇసుక విధానంపై మా ఎమ్మెల్యేలే అసహనం..

సభలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. అమరావతి కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.15 వేల కోట్లు గ్రాంటా అప్పా అనే సందేహాలపై త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు. అప్పులపై ఆధారపడితే రాష్ట్రం ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని.. గత ప్రభుత్వంలో చేసిన అప్పుల్లో 80 శాతం మేర సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చుపెట్టారని.. అదే బాబు పాలనలో చేసిన అప్పుల్లో 40 శాతం మాత్రమే సంక్షేమానికి ఖర్చుచేశారని పయ్యావుల చెప్పారు. నూతన ఇసుక విధానాన్ని తీసుకొచ్చామని.. అయితే, దీనిపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అంతేకాక, చాలా జిల్లాల్లో సమస్యలు ఉన్నట్లు తమ ఎమ్మెల్యేలే అసహనం వ్యక్తంచేస్తున్నారని పయ్యావుల సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇక ఇసుక పాలసీలో ప్రభుత్వానికి మంచిపేరు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు.

నేడు, రేపు మహారాష్ట్రలో సీఎం ఎన్నికల ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శని, ఆదివారాల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి ఉదయం 10 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటారు. అక్కడ నుంచి చంద్రాపూర్‌లో స్థానిక నేతలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం వరుసగా రాజురా, డిగ్రాస్, వార్ధానియోజకవర్గాల్లో ప్రచార సభలు, రోడ్ షోలలో పాల్గొని రాత్రికి తిరిగి నాగ్‌పూర్‌చేరుకుంటారు. రెండోరోజు ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నయగావ్, భోకర్, షోలాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదే రోజు తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్

10 మంది సీనియర్ విద్యార్థుల సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల కొత్తగా కళాశాలలో చేరిన వైద్య విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ పేరిట ఇబ్బందులకు గురిచేశారని, గోడ కుర్చీలు వేయించడం వంటి చర్యలతో వేధించారని కళాశాల డైరెక్టర్‌కు రాత పూర్వక ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు పదిమంది సీనియర్ వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ విధించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఏర్పడిన ఈ వైద్య కళాశాలకు 2016 జనవరిలో భారత వైద్య మండలి (ఎంసీఐ) నుంచి అనుమతులు లభించాయి. అదే సంవత్సరం జూన్‌లో తరగతులు ప్రారంభం కాగా.. ఇప్పటివరకు ర్యాగింగ్ ఘటనలు చోటుచేసుకోలేదు. తాజాగా ర్యాగింగ్ కారణంగా 10 మంది విద్యార్థుల సస్పెన్షన్ చర్చనీయాంశంగా మారింది. సదరు విద్యార్థులపై డిసెంబర్ ఒకటి వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని.. ర్యాగింగ్‌ను ఉపేక్షించేది లేదని కళాశాల డైరెక్టర్ రమేశ్ తెలిపారు.

గడువులోగా పూర్తి చేయాలి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు.

ఆటంకం కలిగిస్తే ఉపేక్షించొద్దు..

సమగ్ర సర్వేలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని సీఎం పేర్కొన్నారు. సర్వేకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. సర్వే జరుగుతున్న తీరును రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎటువంటి ఆటంకం లేకుండా జరిగేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

44.1 శాతం పూర్తయింది..

శుక్రవారం సాయంత్రానికి రాష్ట్రవ్యాప్తంగా 44.1 శాతం సర్వే పూర్తయిందని.. సర్వేలో 87,807 మంది సిబ్బంది, 8,788 మంది పర్యవేక్షక అధికారులు పాల్గొంటున్నారని అధికారులు సీఎంకు తెలిపారు. ప్రజల నుంచి స్పందన బాగుందని వివరించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ ట్రిబ్యునల్‌కు సిబ్బందిని నియమించండి

ముఖ్యమంత్రికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం 2016లో ఏర్పాటు చేసిన బిల్డింగ్ ట్రిబ్యునల్‌కు చైర్‌పర్సన్, సాంకేతిక సభ్యులు, ఇతర సిబ్బందిని నియమించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) లేఖ రాసింది. 'అక్రమ కట్టడాల నిర్మాణాన్ని ఆదిలోనే ఆపివేయడానికి, అలాగే కేసుల విచారణ త్వరిత గతిన పూర్తయ్యేలా చూసేందుకు ప్రభుత్వం 2016లో మున్సిపల్ బిల్డింగ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. అయితే సిబ్బంది నియామకం చేయకపోవడంతో 2019లో హైకోర్టులో పిల్ దాఖలు చేశాం. 2022, ఏప్రిల్‌లో నాలుగు వారాల్లో సిబ్బందిని నియమిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకు నియామకం జరగలేదు. అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం హైడ్రాను నెలకొల్పింది. హైడ్రా కూల్చివేతలు రాజకీయ దుమారాన్ని లేపాయి. చివరకు బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. 2016లోనే ట్రిబ్యునల్‌కు సిబ్బందిని నియమించి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఇప్పటికైనా నియామకం చేపట్టాలని కోరుతున్నాం' అని లేఖలో పేర్కొన్నారు.



అల్లెగ్రో కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ పరిశోధన కేంద్రం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ఆటోమోటివ్, విద్యుత్ వాహనాల తయారీలో ఉపయోగించే మ్యాగ్నెటిక్, సెన్సర్లు, చిప్‌ల తయారీలో దిగ్గజ సంస్థ అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం అల్లెగ్రో కంపెనీ ప్రతినిధులతో ఎంఓయూ పూర్తయిన అనంతరం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. అల్లెగ్రో సంస్థ పరిశోధన కేంద్రం ఏర్పాటు వల్ల కొత్తగా 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి సంతృప్తి చెందిన తర్వాత హైదరాబాద్‌ను అల్లెగ్రో యాజమాన్యం ఎంచుకోవడం హర్షించదగిన విషయమన్నారు. అల్లెగ్రో రాకతో రాష్ట్రంలో సెమీకండక్టర్ చిప్‌ల తయారీ పరిశ్రమకు ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఎండబ్ల్యు విద్యుత్ కార్ల తయారీ సంస్థతోపాటు ఈవీ రంగంలో బ్యాటరీల నిర్వహణ, పవర్ చిప్‌ల తయారీలో ఈ సంస్థ అగ్రగామిగా ఉందని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ సీఇఓ వినీత్ నర్గోల్వాలా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుమన్ నారాయణ్, మరో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మ్యాక్స్ గ్లోవర్ పాల్గొన్నారు.

విచారణ జరిపి నివేదిక ఇవ్వండి

- రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1పై వచ్చిన ఆరోపణలపై రిజిస్ట్రేషన్ ఐజీ, కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం
- జూలైలో ఇచ్చిన ఆదేశాలు పాటించపోవడంపై ఆగ్రహం
- మార్గదర్శకాలు తప్పకుండా అమలు చేయాలని స్పష్టం

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా జాయింట్ సబ్‌రిజిస్ట్రార్–1పై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపి సీల్డ్‌కవర్‌లో నివేదిక అందజేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐటీ, కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. గత జూలైలో తాము జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వాటిని తప్పకుండా పాటించేలా వెంటనే చర్యలు చేపట్టాలని తేల్చిచెప్పింది. సేల్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పిటిషనర్లు మరోసారి పత్రాలు సమర్పించాలని సూచించింది. వారు దరఖాస్తు చేసిన వారంలోగా నిర్ణయం తీసుకోవాలని రిజిస్ట్రేషన్ అధికారులకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 10వ తేదీకి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ రాజరాజేశ్వర్‌నగర్ సర్వేనంబర్ 78, 93లోని 300 గజాల ప్లాట్ విక్రయంలో భాగంగా గత నెల 11న సమర్పించిన సేల్ డీడ్‌ను సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్‌కు నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేపీహెచ్‌బీ తొమ్మిదో ఫేజ్‌కు చెందిన రమ్యశ్రీ, వెంకటరమణలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సబ్ రిజిస్ట్రార్ చర్య చట్టానికి, రాజ్యాంగ విరుద్ధమన్నారు. రిజిస్ట్రేషన్ చేసేలా సబ్ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 11న న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. లంచం ఇస్తే గానీ రిజిస్ట్రేషన్ చేయమని సబ్ రిజిస్ట్రార్, సిబ్బంది పిటిషనర్లను డిమాండ్ చేశారన్నారు. సేల్‌డీడ్ పేపర్లను రిజిస్ట్రేషన్ చేయలేదని, పోనీ పెండింగ్ నంబర్‌కు కూడా కేటాయించలేదని చెప్పారు. రూ.2 లక్షల డిమాండ్ చేసిన వాట్సాప్ మెసేజ్‌లను న్యాయమూర్తికి అందజేశారు. దీంతో న్యాయమూర్తి.. సబ్ రిజిస్ట్రార్ తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. 12న సబ్ రిజిస్ట్రార్ కోర్టుకు హాజరయ్యారు. పిటిషనర్లు రిజిస్ట్రేషన్ కోసం ఎలాంటి సేల్ డీడ్ పత్రాలు సమర్పించలేదని చెప్పారు. అలాంటప్పుడు తిరస్కరణ, లంచం డిమాండ్ ఆరోపణ ఎలా సాధ్యమన్నారు. పిటిషనర్లు చెబుతున్న తేదీన తాను సెలవులో ఉన్నానని చెబుతూ సెలవు పత్రాన్ని కోర్టుకు అందజేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గత జూలైలో తాము ఇచ్చిన ఆదేశాలు సబ్ రిజిస్ట్రార్లు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌పై విచారణ చేపట్టి సీల్డ్ కవర్‌లో నివేదిక అందజేయాలని ఐజీని ఆదేశించారు. తదుపరి విచారణ వాయిదా వేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు, వినతులు స్వీకరించడానికి ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు.



- దేశంలో ఇళ్ల అమ్మకాల్లో నగరం వాటా 12 శాతం
- 3 నెలల్లో 12,700 యూనిట్ల అమ్మకం
- పశ్చిమంలోనే అత్యధికం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో గృహ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. దేశంలోని ఏడు మెట్రో నగరాల్లోని ఇళ్ల అమ్మకాల్లో హైదరాబాద్ వాటా 12 శాతంగా ఉంది. ఈ ఏడాది జూలై–సెప్టెంబర్ (క్యూ3)లో నగరంలో 12,700 గృహాలు అమ్ముడుపోగా.. 13,900 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. క్యూ2తో పోలిస్తే విక్రయాలు 16 శాతం క్షీణించగా.. లాంచింగ్ ఒక శాతం పెరిగాయని అనరాక్ తాజా అధ్యయనం వెల్లడించింది.

- గృహ విక్రయాల్లో పశ్చిమ హైదరాబాద్ హవా కొనసాగుతోంది. క్యూ3లో అమ్ముడైన ఇళ్లలో 53 శాతం వెస్ట్ జోన్‌లోనే జరిగాయి. ఆ తర్వాత నార్త్‌లో 28 శాతం, సౌత్‌లో 13 శాతం, ఈస్ట్‌లో 4 శాతం, సెంట్రల్ హైదరాబాద్‌లో ఒక శాతం విక్రయాలు జరిగాయి. నగరంలో అపార్ట్‌మెంట్ల చ.అ. ధర సగటు రూ.7,150లుగా ఉన్నాయి.

లగ్జరీ గృహాలే ఎక్కువ..

నగరంలో క్యూ3లో 13,900 యూనిట్లు లాంచింగ్ కాగా.. లగ్జరీ గృహాలు అత్యధికంగా ఉన్నాయి. రూ.1.5 కోట్లకు పైగా ధర ఉన్న ప్రీమియం ఇళ్ల వాటా 60 శాతంగా ఉంది. విభాగాల వారీగా చూస్తే.. రూ.40–80 లక్షల ధర ఉన్న గృహాల వాటా 3 శాతం, రూ.80 లక్షల నుంచి రూ.1.5 కోట్ల ఉన్న యూనిట్ల వాటా 37%, రూ.1.5–2.5 కోట్ల ధర ఉన్న ఇళ్ల వాటా 40%, రెండున్నర కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న యూనిట్ల వాటా 20 శాతంగా ఉంది.

లక్ష దాటిన ఇన్వెంటరీ..

హైదరాబాద్‌లో తొలిసారిగా ఇన్వెంటరీ లక్ష యూనిట్లను దాటింది. ఈ ఏడాది మూడో త్రైమాసికం నాటికి నగరంలో 1.01 లక్షల గృహాల ఇన్వెంటరీ ఉంది. దేశంలోని ఇన్వెంటరీలో 18 శాతం నగరానిదే. అత్యధికంగా పశ్చిమ హైదరాబాద్‌లో 60 శాతం, నార్త్‌లో 25 శాతం ఇన్వెంటరీ ఉంది.

3-5 శాతం ధరల వృద్ధి..

నగరంలో 3 నెలల్లో గృహాల అద్దెలు 1–4 శాతం, అపార్ట్‌మెంట్ల చ.అ. ధరలు 3–5 శాతం మేర పెరిగాయి. ఆదిభట్లలో చ.అ. ధర సగటు రూ.4,650, ఎల్బీనగర్‌లో రూ.6,800, మియాపూర్‌లో 6,700, కొండాపూర్‌లో రూ.8,600, గచ్చిబౌలిలో రూ.8,900లుగా ఉన్నాయి. ఇక, అద్దెలు నెలకు ఆయా ప్రాంతాలలో రూ.14 వేల నుంచి రూ.42 వేలుగా ఉన్నాయి.

కాళేశ్వరం లేకున్నా రికార్డు వరి పంట

- ఈ ఏడాది 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా
- కాళేశ్వరంతోనే ఉత్పత్తి పెరిగిందన్న బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడేమంటారు?
- అధికార దాహంతో బీఆర్‌ఎస్.. రెండో స్థానం కోసం బీజేపీ పోటీ
- సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం
- మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీరు అందించకపోయినా రాష్ట్రంలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి అవుతున్నదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా ఈ ఏడాది 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం వల్లనే రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరిగిందని ప్రచారం చేసిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రులు మీడియాతో మాట్లాడారు. అధికార దాహంతో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ.. రైతులకు మేలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రెండోస్థానం కోసం బీజేపీ కుయుక్తులు పన్నుతోందని మండిపడ్డారు.


40 లక్షల ఎకరాల్లో సన్నాల సాగు

రాష్ట్రంలో గతంలో 25 లక్షల ఎకరాల్లో సన్నవడ్లు సాగు చేస్తే, ఈ ఏడాది సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో 40 లక్షలకు పైగా ఎకరాల్లో రైతులు సాగు చేశారని మంత్రులు తెలిపారు. వచ్చే సంక్రాంతి నుంచి రేషన్ షాపులు, గురుకులాలు, హాస్టళ్లలో సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించారు. 'గత ఏడాది ఇదే సమయానికి 17 జిల్లాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తే.. ఈ ఏడాది 25 జిల్లాల్లో కొనుగోళ్లు చేస్తున్నాం. గత ఏడాది ఈ కాలానికి 9.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగులో చేస్తే.. ఈ ఏడాది 9.58 లక్షలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. వాస్తవాలు ఇలా ఉంటే ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి' అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

హింస ప్రేరిపిస్తోంది విపక్షాలే..

ప్రతిపక్షాలు రైతులను, ప్రజలను రెచ్చగొట్టి హింసను ప్రేరిపిస్తున్నాయని మంత్రులు విమర్శించారు. పరిశ్రమలకు భూములు సేకరించే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణను నేరుగా ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు చేపట్టడం దేశ చరిత్రలో ఎక్కడా లేదని, దీనిపై బీఆర్‌ఎస్ నేత కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొడంగల్‌లో ఫార్మా కంపెనీల ఏర్పాటు విషయంలో రైతులతో మాట్లాడేందుకు సీఎం, మంత్రులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ధాన్యంలో తేమ 17 శాతానికి మించరాదన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రులు తెలిపారు. ఈ నిబంధన సడలించేలా రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. తేమశాతాన్ని పక్కనపెట్టి ప్రైవేటు వ్యాపారులు అధిక ధరకు రైతుల నుంచి ధాన్యం కొంటున్నారని చెప్పారు.

టీచర్ల పెండింగ్ బిల్లులు ఇవ్వాలి: పీఆర్టీయూటీఎస్



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యాలయంలో 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్ మాట్లాడుతూ మెడికల్, సరెండర్ లీవ్, టీఎస్‌జీఎల్‌ఐ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ బిల్లులు ఏడాదిగా పెండింగ్‌లో ఉండటంతో టీచర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ రద్దు చేయాలని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ కల్చర్









• కాగితం కళ

పేపర్ సూపర్

'హౌ టూ....' అని గాలించేందుకు అప్పట్లో గూగులమ్మ లేదు.
రిఫర్ చేసేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు.
'కాగితం కళ'పై చిన్నప్పటి నుంచి ఇష్టం పెంచుకున్న మేడా రజని ఎలాంటి సౌకర్యాలు లేని కాలంలో తనకు తోచిన రీతిలో రకరకాల డిజైన్‌లు చేసేది.
'కాగితం కళ' అనేది ఆమె బాల్య జ్ఞాపకం కాదు.
బతుకు బాట వేసిన సాధనం.
ఎంతోమందికి స్ఫూర్తినిస్తున్న ఉత్తేజం....

ప్రకృతి పాఠశాలలో ఎన్నో నేర్చుకోవచ్చు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం గిలకలదిండికి చెందిన రజనికి ప్రకృతి ప్రసాదమైన పూలను చూస్తూ గడపడం అంటే ఎంతో ఇష్టం. విరబూసిన పూల నుంచి స్ఫూర్తి పొంది, తనలోని సృజనాత్మకతకు పదును పెట్టేది. 'పేపర్ క్విల్లింగ్' ఆర్ట్‌ని సాధన చేసేది. ఇది తన అభిరుచి మాత్రమే కాదు ఆర్థికంగా బలాన్ని ఇచ్చింది. తన పరిధిలో మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు వెళుతూ పేద విద్యార్థులకు 'పేపర్ క్విల్లింగ్'లో ఉచిత శిక్షణ ఇచ్చేలా చేస్తోంది.

'శ్రీ క్రియేషన్స్' అనే సంస్థకు శ్రీకారం చుట్టి క్రియేటివ్ క్రాఫ్ట్ అండ్ ఆర్ట్ శిక్షణా తరగతులను ఆఫ్ లైన్, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తోంది. 'సింధు డిజైన్స్' పేరుతో శుభకార్యాల కోసం అందమైన ఆకృతిలో పేపర్ బ్యాగులు, కాగితపు పూలతో చేసిన ఫ్లవర్ వాజ్‌లు, బొకేలు, పూల జడలు, పేపర్ క్విల్లింగ్ ఆర్ట్స్‌తో చేసిన ఫొటో ఫ్రేమ్‌లు... మొదలైనవి తయారు చేస్తోంది.

'కళకున్న గుణం ఏమిటంటే మనల్ని ఖాళీగా కూర్చోనివ్వదు!

ఎప్పుడూ ఏదో తెలుసుకునేలా చేస్తుంది. నేర్చుకునేలా చేస్తుంది.'పేపర్ ఆర్ట్ గురించి నాకు బాగా తెలుసు' అని ఎప్పుడూ అనుకోలేదు రజని. ఎప్పటికప్పుడు కొత్త కొత్త విషయాలు తెలుసుకుంటూనే ఉంటుంది. విదేశీ కళలకు లోకల్ ఫ్లేవర్ జోడించడం గురించి రకరకాలుగా ఆలోచిస్తుంటుంది.

చండీగఢ్ కేంద్ర విశ్వవిద్యాలయం నుంచి దూరవిద్యలో ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ చేసిన రజని 'నా కళ నా దగ్గరే ఉండాలి' అని అనుకోలేదు. తనకు తెలిసిన కళకు సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి మరీ కొత్త తరానికి పరిచయం చేస్తోంది.

'క్రియేటివ్ హార్ట్స్- ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ అకాడమీ' జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో రజని తయారు చేసిన రాధాకృష్ణ పేపర్ క్విల్లింగ్ ఆర్ట్ 'గోల్డెన్ బ్రష్ అవార్డు' గెలుచుకుంది. ఇలాంటి పురస్కారాలు ఆమె ప్రయాణంలో ఎన్నో ఉన్నాయి.

'అవార్డ్ అందుకున్నాను అనే ఆనందం కన్నా నా వల్ల పదిమంది ఈ కళలో ప్రావీణ్యం సాధించారనే విషయం గొప్పగా ఉంటుంది' అంటుంది రజని.

తన ఆర్ట్‌వర్క్‌కు సంబంధించిన ప్రదర్శనలను దేశంలో ఎన్నోచోట్ల ఏర్పాటు చేసి ప్రశంసలు అందుకున్న రజని పేపర్ ఆర్ట్‌లో మరెన్నో ప్రయోగాలు చేయాలనుకుంటోంది.

'నేర్చుకున్నది ఎప్పుడూ వృథా పోదు' అనేది ఆమె నోటినుంచి వినిపించే మాట.

నిజమే కదా! ఉత్సాహం ఇస్తుంది. ఉపాధి ఇస్తుంది. ఇతరులకు ఉపాధి కలిగించేలా చేస్తుంది.

– ఎస్.పి. యూసుఫ్, సాక్షి, మచిలీపట్నం

ఎంతో ఇచ్చింది...

చిన్నప్పుడు ఆడుతూ పాడుతూ నేర్చుకున్న పేపర్ క్రాఫ్ట్ నాకు ఉత్సాహాన్నిచ్చింది. ఉపాధి కల్పించింది. పేరు తెచ్చింది. నేను కన్న కలలు నిజం చేసుకునేందుకు ఉపయోగపడింది. ఈ కళలో రాణించేందుకు ఓర్పు, శ్రద్ధ, ఏకాగ్రత, సృజనాత్మకత ఉండాలి. నేర్చుకున్నచోటే ఉండిపోకుండా కాలంతో పాటు కొత్త కళలు, సాంకేతికతపై దృష్టి పెట్టాలి.

– మేడా రజని



హనాతో గొంతు కలుపుతూ 'రుద్ర తాండవం' చేసేందుకు సీట్ల లోంచి లేస్తున్న ఇతర పార్లమెంటు సభ్యులు

అట్లుంటది ఆమెతోని..!

'కాంతారా' లోని గుండె గుభిల్లుమనే 'అరుపు' ఆ సినిమాను చూసిన వారి చెవుల్లో ఎప్పటికీ మార్మోగుతూనే ఉంటుంది. సరిగ్గా అలాంటి అరుపే గురువారం నాడు న్యూజిల్యాండ్ పార్లమెంట్ హాల్లో ప్రతిధ్వనించింది! ఆ దేశ చరిత్రలోనే అతి చిన్న వయసు ఎంపీ అయిన 22 ఏళ్ల హానా రాహిటీ మైపీ-క్లార్క్ కంఠనాళాలను చీల్చుకుంటూ ఒక్కసారిగా బయటికి వచ్చిన అరుపు అది. 123 మంది సభ్యులు గల ఆ నిండు సభను ఒక ఊపు ఊపిన ఆ అరుపు.. మావోరీ ఆదివాసీ తెగల సంప్రదాయ రణన్నినాదమైన 'హాకా' అనే నృత్య రూపకం లోనిది!

న్యూజిలాండ్ ప్రభుత్వం తీసుకు రాబోతున్న కొత్త బిల్లుకు నిరసనగా, ఆ బిల్లు కాగితాలను రెండుగా చింపి పడేసి, తన సీటును వదిలి రుద్ర తాండవం చేసుకుంటూ పార్లమెంట్ హాల్ మధ్యలోకి వచ్చారు హానా! ఆమెతో జత కలిసేందుకు తమ సీట్లలోంచి పైకి లేచిన మరికొందరు ఎంపీలు 'హాకా' డ్యాన్స్‌కు స్టెప్పులు వేయటంతో నివ్వెరపోయిన స్పీకర్ సమావేశాన్ని కొద్దిసేపు వాయిదా వేయవలసి వచ్చింది.

హానా 'మావోరీ' పార్టీకి చెందిన ప్రతిపక్ష ఎంపీ. మావోరీ తెగల హక్కుల పరిరక్షకురాలు. బ్రిటిష్ ప్రభుత్వానికీ, మావోరీలకు మధ్య కుదిరిన 1840 నాటి 'వైతాంగి ఒప్పందం' ద్వారా మావోరీలకు సంక్రమిస్తూ వస్తున్న ప్రత్యేక హక్కులను మొత్తం న్యూజీలాండ్ ప్రజలందరికీ వర్తింపజేసేలా మార్పులు చేసిన తాజాబిల్లును మావోరీల తరఫున హానా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ వ్యతిరేకతకు సంకేతంగానే పార్లమెంటులో అరుపు అరిచారు. అధికార పక్షాన్ని ఓ చరుపు చరిచి బిల్లు కాగితాలను చింపేశారు.

ఈ ఏడాది జనవరిలో కూడా హానా ఇదే అరుపుతో పార్లమెంటు దద్దరిల్లిపోయేలా చేశారు. అంతకు ముందే డిసెంబరులో కొత్తగా ఏర్పాటైన న్యూజిలాండ్ ప్రభుత్వం తొలి పార్లమెంటు సమావేశం లో... మాతృభాషను నేర్చుకోవాలని తహతహలాడుతున్న మావోరీ పిల్లలకు మద్దతుగా ఆమె దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ 'హాకా' వార్ క్రై నినాదాన్ని ఇచ్చారు. ''నేను మీ కోసం చనిపోతాను. అయితే నేను మీకోసం జీవిస్తాను కూడా..'' అని పార్లమెంటు సాక్షిగా ఆమె మావోరీ తెగలకు మాట ఇచ్చారు.

పసిఫిక్ మహాసముద్రంలోని చిన్న ద్వీపదేశం అయిన న్యూజీలాండ్‌లో 67.8 శాతం జనాభా ఉన్న యూరోపియన్‌ల తర్వాత 17.8 శాతం జనాభాతో మావోరీలే ద్వితీయ స్థానంలో ఉన్నారు. తక్కిన వారు ఆసియా దేశస్థులు, పసిఫిక్ ప్రజలు, ఆఫ్రికన్‌లు, ఇతరులు. తాజామార్పుల బిల్లులో అందరినీ ఒకేగాట కట్టేయటాన్ని మావోరీలకు మాత్రమే ప్రత్యేకమైన పెద్ద గొంతుకతో హానా ప్రశ్నిస్తున్నారు.



పార్లమెంటులో పెద్దగా అరుస్తూ బిల్లు కాగితాలను రెండుగా చింపుతున్న హానా

కిచెన్ టిప్స్



- కొత్త బియ్యాన్ని వండినప్పుడు అన్నం ముద్దగా అవుతుంది. అన్నం ఉడికేటప్పుడు అందులో కొద్దిగా నిమ్మ రసం పిండితే ముద్ద కాకుండా అన్నం మెతుకులు విడివిడిగా ఉంటాయి.
- పొటాటోతో ఇంట్లో ఫ్రెంచ్ ఫ్రై చేసినప్పుడు రెస్టారెంట్‌లో ఉన్నట్లు కరకరలాడవు. రెస్టారెంట్ రుచి రావాలంటే పొటాటో స్టిక్స్‌ని నూనెలో ఒక మోస్తరుగా వేయించి తీయాలి. వేడి తగ్గిన తరవాత వాటిని పాలిథిన్ కవర్‌లో పెట్టి రబ్బర్ బ్యాండ్‌తో బిగుతుగా కట్టి ఫ్రీజర్‌లో పెట్టాలి. నాలుగైదు గంటల తర్వాత తీసి మరోసారి వేయించి వేడిగా ఉండగానే వడ్డించాలి.
- పరాఠాలకు పిండి కలిపేటప్పుడు అందులో స్వీట్ కార్న్ (చిదిమి కలపాలి), ఉడికించిన పాల కూర, తురిమిన క్యాబేజ్, తురిమిన ముల్లంగి, మెంతి ఆకు కలిపితే పిల్లలు ఇష్టపడతారు. ఇది హెల్దీ బ్రేక్‌ఫాస్ట్.
- చపాతీలు మృదువుగా రావాలంటే పిండి కలిపిన తర్వాత తడి వస్త్రాన్ని కప్పి అర గంట సేపు నాననివ్వాలి.
- కూరల్లో ఉప్పు ఎక్కువైతే వెంటనే బంగాళాదుంపను తొక్క తీసి, చిన్న ముక్కలు చేసి కూరలో కలపాలి. అదనంగా ఉన్న ఉప్పు బంగాళదుంప పీల్చుకుంటుంది.



నగధగలు



అన్‌కట్ డైమండ్ ఆభరణాలు ధరిస్తున్నారా?

వజ్రం చాలా గట్టిగా ఉంటుంది. కఠినమైన మనసు అని చెప్పడానికి 'అతడి గుండె వజ్ర సదృశం' అంటారు కవులు. అయితే ఆ గట్టిదనం కట్ డైమండ్స్‌కే పరిమితం. అన్‌కట్ డైమండ్స్ అంత గట్టిగా ఉండవు. ఎందుకంటే ఇవి వజ్రాన్ని కట్ చేసేటప్పుడు వచ్చే పలుకులు. కట్ డైమండ్‌కు ఉన్నట్లు అన్‌కట్ డైమండ్‌లో ఫేసెట్స్ కూడా ఉండవు. అందుకే గట్టిదనం తక్కువగా ఉండే అన్‌కట్ డైమండ్ ఆభరణాల నిర్వహణ విషయంలో మరింత ఎక్కువ జాగ్రత్త తీసుకోవాలి.

- అన్‌కట్ డైమండ్ ఆభరణాల్లో డిజైన్‌లో అవసరాన్ని బట్టి పోల్కీ, గ్లాస్ ఫిల్లింగ్, కెమికల్ ఫిల్లింగ్ చేస్తారు. కుందన్ ఆభరణాలను క్లోజ్ సెట్టింగ్ చేసేటప్పుడు లక్క కూడా నింపుతారు. అలాగే సిల్వర్ లేదా గోల్డ్ ఫాయిల్ ఉపయోగిస్తారు. పచ్చీ ఆభరణాలకు కూడా ఇంతే. వాతావరణానికి ప్రతిస్పందించే గుణం వీటికి ఎక్కువ. కాబట్టి రసాయనాలు తగలకూడదు. క్రీములు, లోషన్‌లు, పెర్‌ఫ్యూమ్‌లను ఆభరణాలకు తగలకుండా రాసుకోవాలి.
- కట్ డైమండ్ ఆర్నమెంట్స్‌ని రోజువారీగా ధరించవచ్చు. అన్‌కట్ డైమండ్ ఆర్నమెంట్స్‌ని మాత్రం వేడుకల సందర్భంగా ధరించి తర్వాత తీసి భద్రపరచాలి. ఆభరణాలను ధరించి అలాగే నిద్రపోవడం, స్నానం చేయడం వంటివి చేయరాదు.
- భద్రపరిచేముందు శుభ్రమైన తడి వస్త్రంతో తుడవాలి. వాయు కాలుష్యం కారణంగా ఆభరణం మీద చేరిన దుమ్ము వస్త్రానికి అంటుకుంటుంది. ఆభరణం శుభ్రపడుతుంది. తుడిచిన తరవాత పది నిమిషాల సేపు గాలికి ఆరనిచ్చి బాక్సులో పెట్టాలి.
- ఈ ఆభరణాలను కుషన్ బాక్సుల్లో మాత్రమే భద్రపరచాలి. ఆ బాక్సు మూత గాలి దూరని విధంగా (ఎయిర్‌టైట్) గట్టిగా ఉండాలి. గ్లూ బాక్సులను వాడరాదు. ప్లాస్టిక్ బాక్సులో లోపలి వైపు కనిపించే వెల్వెట్ క్లాత్‌ని అతికించడానికి గ్లూ ఉపయోగిస్తారు. ఈ బాక్సుల్లో భద్రపరచకూడదు.



– విశేషిణి రెడ్డి, జీఐఏ జెమాలజిస్ట్

శీతాకాలఫలం

వర్షాలు పోయాయి... శీతాకాలం వచ్చేసింది.
సీతాఫలాలు అడవిని వదిలి జనంబాట పట్టాయి.
ఫ్రూట్ మార్కెట్ పచ్చగా కళకళలాడుతోంది.
సీతాఫలాలు కళ్లు విచ్చి చూస్తున్నాయి.
ఈ పండు రుచి అద్భుతం... తినడం ఓ ఆర్ట్.
ఈ పండును వండడమూ పెద్ద ఆర్టే.
ఓ పుడ్డింగ్... ఓ కుల్ఫీ ట్రై చేద్దాం.

కస్టర్డ్ యాపిల్ పుడ్డింగ్

కావలసినవి: వెన్న తీయని పాలు - లీటరు; చక్కెర- 50 గ్రాములు; సీతాఫలం గుజ్జు - వంద గ్రాములు (గింజలు తొలగించినది); యాలకుల పొడి- పావు టీ స్పూన్; బాదం పలుకులు- టేబుల్ స్పూన్; జీడిపప్పు పలుకులు- టేబుల్ స్పూన్; ఎండిన గులాబీరేకులు - గుప్పెడు.

తయారీ: ● మందపాటి పాత్రలో పాలను పోసి మరిగించాలి. పొంగు వచ్చిన తర్వాత మంట తగ్గించి పాలు సగానికి తగ్గే వరకు మరిగించాలి. అడుగుకు అంటుకోకుండా మధ్యలో గరిటెతో కలుపుతూ ఉండాలి. పాలు బాగా చిక్కబడి సగానికి ఇంకిపోయిన తర్వాత అందులో చక్కెర వేసి మరికొంత సేపు మరిగించాలి. చివరగా యాలకుల పొడి వేసి కలిపి మూత పెట్టి స్టవ్ ఆపేయాలి. అవి వేడి తగ్గేలోపు సీతాఫలం గుజ్జు సిద్ధం చేసుకోవాలి ● సీతాఫలాన్ని సగానికి ఒలిచి స్పూన్‌తో గుజ్జునంతటినీ తీసి పాలు వడపోసే స్ట్రెయినర్‌లో వేయాలి. ఇప్పుడు స్పూన్ లేదా బీటర్‌తో గుజ్జు మీద ఒత్తిడి కలిగించే కొద్దీ గింజలు విడిపోతాయి ● పాలు వేడి తగ్గిన తర్వాత సీతాఫలం గుజ్జు కలిపితే కస్టర్డ్ యాపిల్ పుడ్డింగ్ రెడీ. దీనిని ఫ్రిజ్‌లో పెట్టాలి. చల్లారిన తర్వాత బయటకు తీసి కప్పుల్లో వేసి పైన బాదం, జీడిపప్పు పలుకులు, గులాబీ రేకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.





వంటిల్లు

కస్టర్డ్ యాపిల్ కుల్ఫీ

కావలసినవి: వెన్న తీయని పాలు - పావు లీటరు; క్రీమ్- పావు లీటరు; సీతాఫలం గుజ్జు - 300 గ్రాములు (గింజలు తొలగించినది); కండెన్స్‌డ్ మిల్క్- వంద మిల్లీలీటర్లు; నువ్వులు- టేబుల్ స్పూన్ (ఇష్టమైతేనే).

తయారీ: ● మందంగా వెడల్పుగా ఉన్న పాత్రలో పాలను పోసి మరిగించాలి. పాలు చిక్కబడి పాత్ర అడుగుకు అంటుకుంటున్న సమయంలో పాలలో కండెన్స్‌డ్ మిల్క్‌ను కలిపి పాత్రను స్టవ్ మీద నుంచి దించేయాలి. వేడి తగ్గిన తర్వాత సీతాఫలం గుజ్జు, క్రీమ్, నువ్వులు కలపాలి. ఈ మిశ్రమాన్ని కుల్ఫీ మౌల్డ్‌లో పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. కూలింగ్ మ్యాగ్జిమమ్‌లోకి మార్చాలి. ఐదు గంటలకు కుల్ఫీ గట్టిగా అమరి ఉంటుంది. **గమనిక:** కుల్ఫీ మౌల్డ్ నుంచి కుల్ఫీని విరగకుండా బయటకు తీయాలంటే మౌల్డ్‌ను అర నిమిషం పాటు గోరువెచ్చటి నీరున్న పాత్రలో ఉంచాలి.



ఫస్ట్ టైమ్

మరో అడుగు...

వెయ్యిమందికిపైగా మహిళలతో తొలిసారిగా మహిళా సీఐఎస్‌ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) బెటాలియన్ ఏర్పాటుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. విమానాశ్రయాలు, మెట్రో రైలు వ్యవస్థ వంటి దేశంలోని కీలకమైన మౌలిక సదుపాయాలను సంరక్షించడం, వీఐపీలకు కమాండోలుగా భద్రత కల్పించే బాధ్యతలను ఈ బెటాలియన్ భుజాలకెత్తుకోనుంది.

ప్రస్తుతం 1.80 లక్షల మంది ఉన్న సీఐఎస్‌ఎఫ్‌లో ఏడు శాతానికి పైగా మహిళలు ఉన్నారు. సీనియర్ కమాండెంట్ స్థాయి అధికారి నేతృత్వంలో 1,025 మంది సిబ్బందితో రిజర్వ్ బెటాలియన్ అని పిలిచే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కొత్త రిజర్వ్ బెటాలియన్‌ను ఏర్పాటు చేయడానికి ముందస్తు నియామకం, శిక్షణ, స్థలాన్ని ఎంపిక చేయడానికి సన్నాహాలు మొదలయ్యాయి.

సీఐఎస్‌ఎఫ్ 1969లో ఏర్పాటు అయింది. ఎన్నికల భద్రత లాంటి తాత్కాలిక బాధ్యతల నుంచి పార్లమెంట్ హౌజ్ భద్రత వరకు సీఐఎస్‌ఎఫ్ ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తోంది. తాజాగా...ఆల్-ఉమెన్ బెటాలియన్ ఏర్పాటు చేయడమన్నది మహిళా సాధికారత విషయంలో సీఐఎస్‌ఎఫ్ వేసిన మరో అడుగు అనవచ్చు.

'వీఐపీ భద్రతతో పాటు విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రో... మొదలైన వాటి భద్రతలో కమాండోలుగా బహుముఖ పాత్ర పోషించే సామర్థ్యం ఉన్న ఎలైట్ బెటాలియన్‌ను రూపొందిస్తున్నాం. దేశానికి సేవ చేయాలనుకునే మహిళలకు సీఐఎస్‌ఎఫ్ మంచి ఎంపిక. కొత్త ఆల్-ఉమెన్ బెటాలియన్ వల్ల దేశవ్యాప్తంగా మరింతమంది యువతులు సీఐఎస్‌ఎఫ్‌లో చేరేందుకు ప్రోత్సాహం లభిస్తుంది' అని అధికార ప్రకటన తెలియజేసింది.

'ఇదొక చారిత్రక నిర్ణయం. జెండర్ ఈక్వాలిటీని ప్రమోట్ చేయడానికి ఆల్-ఉమెన్ బెటాలియన్ ఉపకరిస్తుంది' అంటూ 'ఎక్స్' వేదికగా సీఐఎస్‌ఎఫ్ హర్షం ప్రకటించింది.



ఇన్నోవేషన్

నన్ను దోసెకుందువటే!

'దోసెలందు డెస్క్‌టాప్ దోసెలు వేరయా' అని ఎవరూ అనలేదు కానీ ఈ మనసు దోచే దోసెను చూస్తే మాత్రం అనక తప్పదు. పాట్నాలోని ఫూల్‌బాగ్ 'పాట్న కాలేజి'కి ముందు ఉన్న చిన్న హోటల్ యజమాని తయారుచేసే 'దోశ' 'హార్ట్' టాపిక్‌గా మారింది. దీనికి కారణం ఆ దోసెను ప్రింటింగ్ మెషీన్‌తో తయారుచేయడం!

ఈ 'యంత్ర దోశ'ను చూసి ఆశ్చర్యపడి, అబ్బురపడి 'ఎక్స్'లో '22వ శతాబ్దం ఆవిష్కరణ' కాప్షన్‌తో మోహిని అనే యూజర్ పోస్ట్ చేశారు.ఇది చూసి ముగ్ధుడై ముచ్చటపడిన పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా 'ది డెస్క్ టాప్ దోశ' అనే కాప్షన్స్‌తో ఈ వీడియోను రీ పోస్ట్ చేశారు.

'ఇంతకూ ఆ వీడియోలో ఏముంది?' అనే విషయానికి వస్తే... సదరు హోటల్ యజమాని మెషిన్‌లోని ఐరన్ ప్లేట్‌పై రుబ్బిన పిండి పోసిన వెంటనే ఇటు నుంచి ఒక రోలర్ వచ్చి 'దోశ' ఆకారాన్ని సెట్ చేస్తుంది. దీనిపై తగిన దినుసులు వేయగానే అటు నుంచి రోలర్ వచ్చి రోల్ చేస్తుంది. నిమిషాల వ్యవధిలో 'ఆహా' అనిపించేలా దోశను అందిస్తుంది.



ఇక సోషల్ మీడియావాసుల రెస్పాన్స్ చూస్తే.... 'భవిష్యత్తులో ఈ దోసె మెషిన్ ఆహార పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదు' అన్నారు చాలామంది.

కొద్దిమంది మాత్రం... 'చాల్లేండి సంబడం. ఎంతైనా దోసెకు మనిషి స్పర్శ ఉండాల్సిందే. మనిషి చేసిన దానితో ఇలాంటి యంత్ర దోసెలు సరితూగవు' అని తూలనాడారు. లోకో భిన్న'రుచిః'!

'ఇంతకీ ఈ మెషిన్ ఎలా పనిచేస్తుంది..' అనేది చాలామందికి ఆసక్తి కలిగించే విషయం. ఆ రహస్యం గురించి అడిగితే...

'అమ్మో.... ఆశ దోశ అప్పడం వడ... నేను చెప్పనుగాక చెప్పను' అంటాడో లేక 'ఇది నా ట్రేడ్ సీక్రెట్టేమీ కాదు. అందరూ బేషుగ్గా చేసుకోవచ్చు' అని చెబుతాడో... వేచి చూడాల్సిందే.

పిల్లల ఎదుగుదలను చూసి మురిసిపోని తల్లిదండ్రులు ఉండరు. అయితే వారికి లైఫ్ స్కిల్స్ అలవడేలా చేయడమూ మన కర్తవ్యమే అని మరచిపోకూడదు. గార్డెనింగ్ నేర్పించడం వల్ల పిల్లలకు లైఫ్‌స్కిల్స్‌అలవడతాయంటున్నారు మనస్తత్త్వ శాస్త్రవేత్తలు. అంటే మొక్కల పెంపకం నేర్పించడం వల్ల వారికి అనేక విధాలయిన నైపుణ్యాలు అబ్బుతాయట. అవేమిటో చూద్దాం...

● కేరెంటింగ్



మొక్కల బడి

తోటపని లేదా గార్డెనింగ్ కళ అనేది పిల్లల్లో జీవన నైపుణ్యాలను పెంచుతుందని చెబుతున్న నిపుణుల అభిప్రాయంతో మనం కూడా ఏకీభవించక తప్పదనిపిస్తుంది వారు చెప్పిన కారణాలు తెలుసుకున్న తర్వాత.

బాధ్యతను తెలియజెబుతుంది

మొక్కలు ఎంతో సున్నితమైనవి. వాటికి రోజూ తగినన్ని నీళ్లు పోస్తూ, ఎరువులు వేస్తూ, చీడ పీడలు రాకుండా చూస్తూ జాగ్రత్తగా సంరక్షిస్తూ ఉండటం వల్ల బాలలకు బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవడుతుంది.

ఓపిక, సహనం అలవడతాయి

మొక్కల పెంపకం అనేది అప్పటికప్పుడు జరిగే పని కాదు. విత్తనాలు నాటడం కోసం గొప్పులు తవ్వడం, విత్తనాలు నాటడం, నీళ్లు పోసి మొలకలు వచ్చే వరకు పక్షుల బారిన పడకుండా జాగ్రత్తగా చూడటం, లేలేత మొలకలను ఏ జంతువులో తినేయకుండా కాపాడటం... అవి పెద్దవి అయ్యే వరకు వాటిని రోజూ జాగ్రత్తగా గమనించడం అనే ప్రక్రియను పూర్తి చేయడానికి ఎంతో ఓపిక, సహనం అవసరం. అందువల్ల గార్డెనింగ్ చేసే పిల్లల్లో ఓపిక, సహనం అలవడతాయనడంలో సందేహం లేదు.



శ్రద్ధ, ఏకాగ్రత

విత్తనం నాటినప్పటి నుంచి అది ఎప్పుడెప్పుడు మొలకెత్తుతుందో గమనిస్తూ, దానికి నీళ్లు పెట్టడం, మొలకెత్తి, మారాకు వేసే వరకు జాగ్రత్తగా గమనిస్తుండడం వల్ల పిల్లల్లో వారికి తెలియకుండానే ఏకాగ్రత, దీక్ష అలవడతాయి.

ఆత్మగౌరవం పెంపొందుతుంది

చిన్న విత్తనం నుంచి చెట్టుగా మారి కాయ కాసి, అది పండుగా మారే వరకు ఆగి, ఆ పండును కోసుకుని తినే పిల్లల్లో తమకు కావలసిన దానిని తామే పండించుకున్నామన్న భావన కలిగి ఆత్మగౌరవం పెంపొందుతుంది. తమమీద తమకు నమ్మకం పెరుగుతుంది.

సృజనకు పాదులు

మొక్కల పెంపకంలో కొత్త కొత్త మెలకువలు తెలుస్తాయి. పెరటితోటను ఎంత అందంగా తీర్చి దిద్దాలో మనసులో ఊహించుకుంటూ ఉంటారు. ఫలితంగా వారిలో కొత్త ఆలోచనలు వచ్చి క్రియేటివిటీ పెరుగుతుంది.

ఒత్తిడి, ఆందోళనలు దూరం

గార్డెనింగ్ కోసం ప్రకృతిలో గడపడం వల్ల పిల్లలలోని ఆందోళన, ఒత్తిడి క్రమక్రమంగా దూరం అవుతాయి. పక్షుల కిలకిలారావాలు, గాలి, వెలుతురు వల్ల ఆహ్లాదంగా ఉంటుంది. ఒంటికి సూర్యకిరణాలు తగలడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరానికి వ్యాయామం కలగడం వల్ల మంచి ఆరోగ్యం చేకూరుతుంది.

మూడ్స్ బాగుంటాయి

మొక్కలు మారాకు వేయడం, మొగ్గలు రావడం, పూత, పిందెలు వచ్చి పువ్వులు, కాయలు, పండ్లు కాయడం వల్ల పిల్లలలో మూడ్స్ బాగుంటాయి. ఫలితంగా వారిలో మైండ్‌ఫుల్ నెస్ కలుగుతుంది.

గార్డెనింగ్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో చూశారు కదా... సో మీ ఇంటిలో ఇంతవరకు గార్డెన్ లేకపోతే వెంటనే మీ చిన్నారులకోసం పుస్తకాలే కాదు.... కొన్ని విత్తనాలు కూడా తీసుకు రండి. వారిని మొక్క బడిలో వేయండి. ●



పెళ్లి... పెనాల్టీనా?

పెళ్లి అనేది మహిళ జీవితానికి జరిమానాగా మారుతోందా? ప్రపంచ బ్యాంకు నివేదిక చూస్తే అవునని అంగీకరించక తప్పదు. ఇది ఒక్క మనదేశంలో మాత్రమే కాదు, దక్షిణాసియా దేశాలన్నింటిలోనూ కొంచెం అటూఇటూగా ఇదే పరిస్థితి ఉందంటోంది వరల్డ్ బ్యాంక్. చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో నూటికి పన్నెండు మంది పెళ్లి తర్వాత ఉద్యోగం మానేస్తున్నారు. మరి కొందరు పిల్లల సంరక్షణ కోసం ఉద్యోగం మానేస్తున్నారు. మరికొందరు ఉద్యోగం- కుటుంబ బాధ్యతల మధ్య సమన్వయం సాధించలేక ఉద్యోగాన్ని వదులుకుంటున్నారు. ఈ పరిణామం జీడీపీ మీద చూపిస్తోంది. దేశం ఆర్థికంగా ఎదగాలంటే ముందు సామాజికంగా ఎదగాలి.



ఇంటిబాధ్యతతో జాబ్‌కు దూరం

మహిళలు మూడింట ఒక వంతు పనిలో ఉంటే రెండు వంతుల పనికి దూరంగా ఉన్నారు. వీరు డబ్బు సంపాదించే పనిలో కాకుండా ఇంటిపనిలో ఉన్నారని అర్థం. మన సమాజంలో ఇంటిబాధ్యతలన్నీ మహిళల భుజాల మీదనే ఉంటాయి. భర్తకి అన్నీ అమర్చిపెట్టడం, పిల్లల పెంపకం వంటి పరిణామాలన్నీ ఆమెను ఇంటికి పరిమితం చేస్తున్నాయి.

దీని ఫలితం దేశం జీడీపీ వెనుకబడడానికి కూడా కారణమవుతోందంటోంది వరల్డ్ బ్యాంక్. భార్యాభర్తలిద్దరూ పని చేస్తూ, ఇంటిబాధ్యతలను ఇద్దరూ పంచుకుంటున్న దేశాలతో పోలిస్తే పనిలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉన్న దేశాల తలసరి ఆదాయం తక్కువగా ఉంటోంది. మహిళలు మగవాళ్లతో పాటు పనిచేస్తే జీడీపీ 51 శాతానికి పెరుగుతుందని వరల్డ్ బ్యాంక్‌లో సౌత్ ఏషియా విభాగానికి చీఫ్ ఎకనమిస్ట్ ఫ్రాంజిస్కా ఓన్‌సోర్జ్ అన్నారు. మనదేశానికి వస్తే పని ప్రదేశంలో స్త్రీ-పురుష నిష్పత్తిలో తీవ్రమైన అంతరం ఉంది. ఈ అంతరాన్ని తగ్గించాలన్నారు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్స్ రీసెర్చ్ జనరల్ డైరెక్టర్ పూనమ్ గుప్తా.

● సెలబ్ రెసిపి

హెల్దీ హమ్మస్ క్రీమ్

సాధారణంగా శాండ్‌విచ్, రోల్స్ వంటి క్రిస్పీ రుచులకు హమ్మస్ క్రీమ్ జోడిస్తే అదిరిపోతుందంటారు రుచులప్రియులు. మరి ఆ క్రీమ్‌ని ఇంట్లోనే హెల్దీగా, సులభంగా ఎలా చేసుకోవాలో తెలియజేసింది సీనియర్ నటి భాగ్యశ్రీ. ఎప్పటికప్పుడు ఆరోగ్యకరమైన పాక శాస్త్ర చిట్కాలను తన సోషల్ మీడియాలో పెట్టి.. ఆరోగ్యాభిలాషుల మనసుల్ని దోచుకోవడం ఆమెకు అలవాటే. ఈ క్రమంలోనే ప్రొటీన్స్‌తో కూడిన హమ్మస్ క్రీమ్ రెసిపీని ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఆమెను మనమూ ఫాలో అవుదామా మరి!



కావాల్సినవి: కాబూలీ శనగలు – 1 కప్పు (నానబెట్టుకోవాలి), ఆలివ్ ఆయిల్ – 1 టేబుల్ స్పూన్, పెరుగు – 2 టేబుల్ స్పూన్లు నువ్వులు – 3 టీ స్పూన్లు (దోరగా వేయించాలి), వెల్లుల్లి – 3 (పొట్టు తీసి పెట్టుకోవాలి), ఉప్పు – తగినంత, ఐస్ క్యూబ్స్ – 5.

తయారీ..

ముందుగా కాబూలీ శనగలను మెత్తగా ఉడికించి, చల్లారాక తొక్క తీసి పెట్టుకోవాలి. అనంతరం వాటిలో ఆలివ్ ఆయిల్ కలిపి, మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. తర్వాత అందులోనే పెరుగు వేసుకుని మరోసారి మిక్సీ పట్టాలి. ఇప్పుడు మరో మిక్సీ బౌల్ తీసుకుని దానిలో నువ్వులు, వెల్లుల్లి, ఉప్పు వేసుకుని మెత్తటి పౌడర్‌లా చేసుకోవాలి. ఆపై రెండు మిశ్రమాలను ఒక మిక్సీ జార్‌లో మార్చి, దానిలో ఐస్ క్యూబ్స్ వేసుకుని బాగా కలిసేలా మిక్సీ పట్టుకోవాలి. ఆ క్రీమ్ మీద నచ్చిన విధంగా గార్నిష్ చేసుకుని.. క్రిస్పీ ఐటమ్స్‌ని ముంచుకుని తింటే భలే రుచిగా ఉంటుంది. ఈ క్రీమ్‌ని రెండుమూడు రోజులు ఫ్రిడ్జ్‌లో నిలువ ఉంచుకోవచ్చని, ఇది చాలా హెల్దీ అని, అలాగే గుండె ఆరోగ్యానికి చాలా మంచిదని అంటోంది భాగ్యశ్రీ.

లైఫ్@360

వింటర్‌లో ఫుడ్ కేర్



చలికాలం మొదలైంది. చలికాలం వచ్చిందంటే వైరల్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. దీంతో చిన్న, పెద్దా తేడా లేకుండా చాలా మంది జలుబు, దగ్గుతో బాధ పడతారు. ఇవి వచ్చాయంటే ఓ పట్టాన తగ్గవు. అవి వచ్చాక బాధ పడేకన్నా, కొన్ని జాగ్రత్తలతో అవి రాకుండా చూసుకోవడం మంచిది.

● నిమ్మ, బత్తాయి, ద్రాక్ష, నారింజ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లలో సిట్రిక్ యాసిడ్ ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఎలాంటి సమస్యలు లేని వారు వీటిని తింటే వ్యాధి నిరోధకత శక్తి పెరుగుతుంది. అయితే, ఇప్పటికే జలుబు, దగ్గు వంటి సమస్యలతో బాధపడే వారు వీటిని తినకపోవడం మంచిది.



● పోషకాల నిలయమైన పైనాపిల్‌లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, మాంగనీస్, ఫైబర్, ఐరన్ వంటి మినరల్స్ ఉన్నాయి. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మరింత మెరుగుపరుస్తుంది. ఇన్ని ప్రయోజనాలున్నప్పటికీ.. జలుబు, దగ్గు ఉన్నవారు తింటే ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

● ఎన్నో పోషకాలు ఉండే సీతాఫలాన్ని సాధారణ వ్యక్తులు తింటే మంచిది. కానీ, జలుబు, దగ్గు ఉన్నవారు సీతాఫలం తింటే జలుబు తీవ్రత ఎక్కువయ్యే ప్రమాదముంది.

● కాఫీలో కెఫిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది గొంతులోని కండరాల్ని పొడి బారేలా చేస్తుంది. చలికాలంలో ఇప్పటికే పొడి దగ్గు, జలుబుతో బాధ పడేవారు కాఫీ, టీని తాగకూడదు. కాఫీ తాగడం వల్ల గొంతు ఇంకా పొడిబారి దగ్గు తీవ్రత పెరగడంతోపాటు గొంతు నొప్పి కూడా రావచ్చు. అందువల్ల కాఫీతో పాటు టీకి కూడా దూరంగా ఉంటే మంచిది.

ఎక్కువ పిండిపదార్థాలు ఉన్న ఆహారాల్ని రాత్రి వేళల్లో తీసుకోకూడదు. బంగాళ దుంపలు, పరోటాలు వంటి పదార్థాల జోలికి పోకూడదు. వీటి వల్ల కూడా చక్కెర, ఇన్సులిన్ స్పైక్‌లు ఏర్పడతాయి. ఎందుకంటే పిండి పదార్థాలు చక్కెరగా జీవక్రియ చేయబడి శక్తి కోసం బర్న్ అవుతాయి. దీంతో చివరికి బరువు పెరిగే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాత్రి సమయాల్లో కెఫిన్ కలిగిన ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. సోడా, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్‌లో కెఫిన్ ఉంటుంది. కొన్ని ఐస్‌క్రీమ్స్, డిజర్ట్స్‌లో కూడా కెఫిన్ ఉంటుంది. కెఫిన్ ఎక్కువ తీసుకుంటే మీ సిర్కాడియన్ సైకిల్‌కు పూర్తిగా అంతరాయం కలుగుతుంది. అంటే మీ నిద్రకు భంగం కలుగుతుంది. కెఫిన్ మెదడుని యాక్టివ్ చేస్తుంది. దీంతో సరిగ్గా నిద్ర పట్టకపోవడమే గాక రాత్రిపూట జీర్ణక్రియ కూడా నెమ్మదిస్తుంది. అంతేకాదు, కెఫిన్ వల్ల కడుపు నొప్పి, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.

చాలా మంది రాత్రిపూట డిన్నర్ తర్వాత స్వీట్స్ లేదా చాక్లెట్ తింటుంటారు. అయితే ఇది ఎంత మాత్రం మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇలా చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయని హెచ్చరిస్తున్నారు. స్వీట్స్ తినడం వల్ల రాత్రి నిద్రిస్తున్నప్పుడు ఎటువంటి ఉపయోగం లేని అదనపు శక్తి ఉత్పత్తి అవుతుంది. దీంతో.. కొవ్వు బర్న్ కాక బరువు పెరిగే ప్రమాదముంది. అందుకే రాత్రివేళల్లో స్వీట్స్,చాక్లెట్స్ వంటి పదార్థాల జోలికి పోకూడదంటున్నారు నిపుణులు.

సినిమా

సంక్రాంతి బరిలో...

హీరో బాలకృష్ణ సంక్రాంతి బరిలో దిగేందుకు ఫిక్స్ అయ్యారు. ఆయన హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'డాకు మహారాజ్' అనే టైటిల్‌ని ఫిక్స్ చేసి, టైటిల్ టీజర్ విడుదల చేశారు. అలాగే సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమాని రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'డాకు మహారాజ్' టైటిల్ టీజర్ విడుదల కార్యక్రమంలో బాబీ కొల్లి మాట్లాడుతూ– ''టీజర్ కన్నా సినిమా వేరే స్థాయిలో ఉంటుంది. ఈసారి యుద్ధం గట్టిగా ఉండబోతోంది'' అని చెప్పారు. ''టీజర్‌లో మీరు చూసింది చాలా తక్కువ. సినిమాలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి'' అన్నారు సూర్యదేవర నాగవంశీ. ''డాకు మహారాజ్' ఏదైతే కోరుకుంటుందో దానికి తగ్గట్టుగా సంగీతం అందిస్తున్నాను'' అని తమన్ తెలిపారు. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.



● బాలకృష్ణ

కుబేరలో ఎవరేంటి?

అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మల్టీస్టారర్ చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా, జిమ్ సర్భ్ కీలక పాత్ర చేస్తున్నారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది. కాగా 'కుబేర' ఫస్ట్ గ్లింప్స్‌ని హీరో మహేశ్‌బాబు శుక్రవారం లాంచ్ చేశారు. 'కుబేర'లో ఎవరేంటి? అనేది ఈ గ్లింప్స్ తెలియజేసేలా ఉంది. నాగార్జున సక్సెస్‌ఫుల్ మ్యాన్‌గా, ధనుష్ మురికివాడల్లోని వ్యక్తిగా, జిమ్ సర్భ్ బిలియనీర్ బిజినెస్ మ్యాన్‌గా కనిపించారు. మధ్యతరగతి జీవితంలో అసంతృప్తితో పోరాడుతున్నట్లు రష్మిక పాత్ర కనిపిస్తుంది. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.



● ధనుష్, నాగార్జున

నా కల నెరవేరింది - తమన్



''బాయ్స్' (2003) సినిమా సమయంలో శంకర్‌గారు నాలో యాక్టర్‌ని చూశారు. నేను మంచి మ్యూజిక్ డైరెక్టర్‌ని అని ఆయన గుర్తించేందుకు ఇన్నేళ్లు పట్టింది. శంకర్‌గారి సినిమాకు మ్యూజిక్ ఇవ్వాలనేది నా కల. అది 'గేమ్ చేంజర్' సినిమాతో నెరవేరింది'' అని సంగీత దర్శకుడు తమన్ తెలిపారు. నేడు (నవంబరు 16) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా శుక్రవారం తమన్ విలేకరులతో మాట్లాడుతూ– ''ఒకప్పుడు రొటీన్ చిత్రాలు వచ్చేవి. కానీ ఇప్పుడు డిఫరెంట్ కథలు వస్తున్నాయి కాబట్టి డిఫరెంట్ మ్యూజిక్ ఇస్తున్నాను. సినిమాలో భావోద్వేగం లేకపోతే నేను ఎంత మ్యూజిక్ కొట్టినా వేస్ట్. కథకు తగ్గట్టుగా, దర్శకుడు తీసిన దానికి అనుగుణంగా సంగీతం ఇస్తాను. కొన్ని చిత్రాలకు వాయిస్ ఎక్కువగా వినిపించాలి. ఇంకొన్నింటికి పరికరాల సౌండ్ ఎక్కువగా వినిపించాలి. తెలుగులో ప్రస్తుతం నేను చేస్తున్న 'తెలుసు కదా, ఓజీ, గేమ్ చేంజర్, డాకు మహారాజ్' వంటి సినిమాలు దేనికవే చాలా ప్రత్యేకంగా ఉంటాయి. నేపథ్య సంగీతంలో మణిశర్మగారి తర్వాత నేనో ట్రెండ్ క్రియేట్ చేయాలని చూస్తున్నాను. 'పుష్ప: ది రూల్'కి 15 రోజుల్లో నేపథ్య సంగీతం పూర్తి చేయమన్నారు. అది సాధ్యం కాదు. అందుకే నాకున్న టైమ్‌లో ఫస్ట్ హాఫ్‌ను దాదాపుగా పూర్తి చేసి ఇచ్చాను. ప్రభాస్‌గారి 'రాజా సాబ్'లో ఆరు పాటలుంటాయి. ఇతరుల సినిమాల నుంచి ట్యూన్స్‌ని కాపీ కొట్టేంత తెలివి నాకు లేదు. అందుకే వెంటనే దొరికిపోతాను (నవ్వుతూ). 'అఖండ 2'కి ఇప్పటికే ఒక పాట అయిపోయింది. హీరో అల్లు అర్జున్–డైరెక్టర్ త్రివిక్రమ్‌ల ప్రాజెక్ట్ కూడా చేస్తున్నాను. ఓ ప్రపంచ స్థాయి మ్యూజికల్ స్కూల్ నెలకొల్పి, ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచితంగా సంగీతం నేర్పించాలనుకుంటున్నాను'' అని చెప్పారు.

ఫీల్‌గుడ్ లవ్ సాంగ్‌లో...



● విజయ్ దేవరకొండ, జస్లీన్ రాయల్, రాధికా మదన్

హీరో విజయ్ దేవరకొండ తాజాగా 'సాహిబా...' అనే వీడియో సాంగ్‌లో నటించారు. 'హీరియే...' పాటతో సంగీత దర్శకురాలిగా, గాయనిగా మంచి పేరు సంపాదించుకున్న జస్లీన్ రాయల్ ఇప్పుడు 'సాహిబా...' పాటను వినిపించనున్నారు. ఈ వీడియో సాంగ్‌లో విజయ్ దేవరకొండ ఫొటోగ్రాఫర్‌గా కనిపిస్తారు. విజయ్‌కు జోడీగా రాధికా మదన్ నటించారు. ఈ ఫీల్ గుడ్ లవ్ సాంగ్‌ను వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో దర్శకుడు సుధాంశు సరియా రూపొందించారు.

ఎలా బతుకుతారు?

శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'కలియుగమ్ 2064'. తెలుగు, తమిళ భాషల్లో ప్రమోద్ సుందర్ దర్శకత్వంలో కె.ఎస్. రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం త్వరలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని ప్రముఖ దర్శకుడు మణిరత్నం విడుదల చేసి, ''వినూత్న కథాంశంతో రూపొందిన ఈ చిత్రం ఘన విజయం సాధించాలి'' అన్నారు. ''2064లో మనుషులు ఎలా ఉండబోతున్నారు? ఎలా బతకనున్నారు? ఎలా మరణించనున్నారు? అనే అంశాలతో ఈ సినిమా ఉంటుంది. మణిరత్నం గారు ఈ సినిమా కాన్సెప్ట్, పోస్టర్ బాగున్నాయని చెప్పి, యూనిట్‌తో చాలాసేపు సినిమా గురించి మాట్లాడారు. నేటి తరానికి ఈ సినిమా చాలా అవసరం. యూత్, ఫ్యామిలీ అందరూ చూడదగ్గ సినిమా'' అని కె.ఎస్. రామకృష్ణ తెలిపారు.



● కిశోర్, శ్రద్ధా శ్రీనాథ్

అందుకే ఆ పేరు పెట్టాం - రానా

''ఇది వరకు నేను కొన్ని టాక్ షోలు చేశాను. కానీ ప్రైమ్ వీడియోలో చేస్తున్న ఈ షో వైవిధ్యమైనది. అందుకే దీనికి 'రానా దగ్గుబాటి షో' అని పేరు పెట్టాం. ఇది ఆర్డినరీ టాక్ షో కాదు. వెరీ ఆథెంటిక్, అన్ ఫిల్టర్డ్, అన్‌స్క్రిప్టెడ్ షో'' అన్నారు రానా. ఆయన ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, క్రియేటర్‌గా వ్యవహరిస్తూ హోస్ట్ చేస్తున్న షో 'ది రానా దగ్గుబాటి షో'. స్పిరిట్ మీడియా బ్యానర్‌పై అమేజాన్ ప్రైమ్ వీడియో నిర్మించిన ఈ టాక్ షో ఈ నెల 23 నుంచి అమేజాన్‌లో ప్రసారం కానుంది. శుక్రవారం ఈ షో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ– ''ఈ షోలో ఎస్ఎస్ రాజమౌళి, రామ్‌గోపాల్ వర్మ, నాగచైతన్య, నాని, దుల్కర్ సల్మాన్, సిద్ధు జొన్నలగడ్డ, రిషబ్ శెట్టి, శ్రీలీల వంటి ప్రముఖులు పాల్గొంటారు. ఈ షోలో మా మాటలు చాలా సరదాగా సాగుతాయి. సెలబ్రిటీలు ఇంట్లో ఉన్నట్టుగానే నిజాయతీగా, సహజంగా ఉండేలా చేసే ఒక రకమైన హ్యాంగ్ అవుట్ స్పాట్ ఇది. సెలబ్రిటీల గురించి ఎన్నో కొత్త విషయాలను డిస్కవరీ చేసే షో. 240 దేశాల్లో ఈ షో ప్రసారం కానుండటం సంతోషంగా ఉంది'' అని చెప్పారు.



మూడేళ్ల కష్టానికి ఫలితం దక్కింది - కేఈ జ్ఞానవేల్ రాజా



''కంగువ' సినిమాకు మూడేళ్లు కష్టపడ్డాం. మా కష్టానికి ఫలితంగా ప్రేక్షకులు ఘనవిజయాన్ని అందించారు. తమిళ్ కంటే తెలుగులో ఎక్కువ వసూళ్లు వస్తున్నాయి. సూర్య సినిమాల్లో హయ్యెస్ట్ కలెక్టెడ్ మూవీగా 'కంగువ' నిలుస్తుంది'' అని నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తెలిపారు. సూర్య, దిశా పటానీ జంటగా శివ దర్శకత్వం వహించిన చిత్రం 'కంగువ'. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమాను నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేసింది. ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా 'కంగువ' విడుదలైంది. ఈ నేపథ్యంలో కేఈ జ్ఞానవేల్ రాజా విలేకరులతో మాట్లాడుతూ– ''కంగువ'లో మేం ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించాం. దర్శకుడు శివగారు చాలా సపోర్ట్ చేశారు. సూర్యగారు చేసిన రెండు పాత్రలకి, ఆయన నటనకి మంచి అభినందనలు వస్తున్నాయి. బాబీ డియోల్ నటన మరో హైలైట్. క్లైమాక్స్‌లో అతిథిగా వచ్చే కార్తీ పాత్రని చూసి, ఆడియన్స్ థ్రిల్ అవుతున్నారు. ఉత్తరాదిలో రిలీజైన అన్ని దక్షిణాది సినిమాల్లో 'కంగువ' బిగ్ ఓపెనింగ్స్ దక్కించుకుంటోంది. 'కంగువ 2'లో దీపికా పదుకోన్‌ని హీరోయిన్‌గా తీసుకుంటున్నామనే వార్తల్లో నిజం లేదు. అజిత్‌తో డైరెక్టర్ శివ చేయాల్సిన ప్రాజెక్ట్ అయ్యాక 'కంగువ' 2 పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుతం మా స్టూడియో గ్రీన్‌లో కార్తీ హీరోగా చేస్తున్న 'వా వాత్తియార్' చిత్రాన్ని జనవరి చివర్లో లేదా ఫిబ్రవరిలో విడుదల చేస్తాం'' అని చెప్పారు.

దేశభక్తి నేపథ్యంలో...

'ఆదిత్య, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్' వంటి సందేశాత్మక బాలల చిత్రాలు తీసిన దర్శక-నిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందించిన మరో బాలల చిత్రం 'అభినవ్'. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్, చరణ్, బేబీ అక్షర కీలక పాత్రల్లో నటించారు. శ్రీలక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సమర్పణలో సంతోష్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపొందింది. శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ– ''పిల్లల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సినిమాను రూపొందించాను. దురదృష్టవశాత్తూ పిల్లలు గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. ఎన్‌సీసీ, స్కౌట్స్, యోగా, ధ్యానం నేర్చుకోవడం ద్వారా పిల్లలు ఇలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారు'' అన్నారు.



● సుధాకర్ గౌడ్

మోసెస్ మాణిక్‌చంద్

హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్న చైతు జొన్నలగడ్డ ప్రధాన పాత్రలో ఓ చిత్రం రూపొందుతోంది. 'మోసెస్ మాణిక్‌చంద్ పార్ట్–2' టైటిల్‌తో టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఎ రియల్ విలన్ ఈజ్ ఆల్వేస్ బెటర్ దేన్ ఎ ఫేక్ హీరో' (ఒక నకిలీ హీరోకన్నా నిజమైన విలన్ బెటర్) అనేది ఈ చిత్రం ట్యాగ్‌లైన్. 'బొమ్మ బ్లాక్ బస్టర్' ఫేమ్ రాజ్ విరాట్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో చైతు లీడ్ రోల్‌లో నటించడంతో పాటు కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ కూడా అందించారు. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్‌ను హీరో నాని ఆవిష్కరించి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు.



● చైతు జొన్నలగడ్డ

సాక్షి బిజినెస్

శనివారం
16-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 111	నిఫ్టీ ▽ 26
77,580	23,533

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,685	▽	422
డోజోన్స్	43,429	▽	322
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,064	▽	8
డాక్స్	19,211	▽	53
షాంఘై	3,331	▽	49
నికాయ్	38,643	△	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.00	85.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.33	109.16
€	యూరో	ఎస్‌బీఐ	88.48	91.08
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.93	55.30
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.15	56.34
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.74	66.12
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.61	23.15
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.09	23.85
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.80	12.63

- పే లేటర్, క్రెడిట్–డెబిట్ కార్డులతో వాయిదా చెల్లింపు ఆప్షన్
- ఈ–కామర్స్ కంపెనీల బాటలోనే వినూత్న ఆఫర్లు...
- సింపుల్, లేజీ పే తదితర సంస్థలతో జట్టు...

చెంగు చెంగున మార్కెట్లో దూసుకెళ్తున్న క్విక్ కామర్స్ కంపెనీలు... కస్టమర్లను తమ వైపు తిప్పుకునేందుకు వినూత్న మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ తదితర ఈ–కామర్స్ సంస్థల రూట్లోనే కొంగొత్త పేమెంట్ పద్ధతులను ప్రవేశపెడుతున్నాయి. తద్వారా మార్కెట్‌ను మరింత 'క్విక్'గా కొల్లగొట్టాలనేది స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, జొమాటో బ్లింకిట్ తదితర దిగ్గజాల ప్లాన్!! - సాక్షి, బిజినెస్ డెస్క్

క్విక్ కామర్స్ ఈఎంఐ రూట్!



పదే పది నిమిషాల్లో పక్కా డెలివరీ అంటూ దుమ్మురేపుతున్న క్విక్ కామ్ సంస్థలు.. ఈ–కామర్స్ దిగ్గజాలకు పక్కలో బల్లెంలా మారుతున్నాయి. ఇప్పుడు పేమెంట్ల విషయంలోనూ 'నీవు నేర్పిన విద్యే..' అన్న చందంగా తయారైంది వాటి వ్యూహం. రూ. 2,999 పైబడిన కొనుగోళ్లకు బ్లింకిట్ గత నెలలో నెలవారీ వాయిదా (ఈఎంఐ) ఆప్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. వాస్తవానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో తొలిసారి 2016లోనే ఫ్లిప్‌కార్ట్ ఈ ఆప్షన్‌ను ప్రవేశపెట్టగా... అమెజాన్ కూడా 2018లో దీన్ని అనుసరించింది. పలు డెబిట్ కార్డులతో పాటు, ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై కూడా ప్రస్తుతం ఈ ఫీచర్‌ను అమలు చేస్తున్నాయి. 'ఈఎంఐ అవకాశం కల్పించడం వల్ల కస్టమర్ల కొనుగోలు శక్తి మరింత పెరుగుతుంది. ఆర్థికంగా కూడా వారికి వెసులుబాటు లభిస్తుంది' అని బ్లింకిట్ సీఈఓ అల్బిందర్ ధింద్సా పేర్కొన్నారు.

ఇప్పుడు కొనండి.. తర్వాత చెల్లించండి!

మరో పక్క, దాదాపు దిగ్గజ క్విక్ కామర్స్ కంపెనీలన్నీ ఈఎంఐ ఆప్షన్‌తో పాటు తర్వాత చెల్లించే (బైనౌ, పే లేటర్) పేమెంట్ విధానాన్ని కూడా ఆఫర్ చేస్తున్నాయి. ఇందుకోసం సింపుల్, పేయూకి చెందిన లేజీ పే వంటి కంపెనీలతో జట్టుకట్టాయి. ఫ్లిప్‌కార్ట్ 2017లో ఈ పే లేటర్ ఫీచర్ ద్వారా యూజర్లకు రూ. లక్ష వరకు ఇన్‌స్టంట్ రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. నయా పైసా చెల్లించకుండా ఉత్పత్తులను కొనుగోలు చేసి, తర్వాత నెలలో పూర్తిగా చెల్లించడం, లేదంటే ఈఎంఐగా మార్చుకునే అవకాశాన్ని ఇది కల్పిస్తోంది. ఇక 2020లో ప్రవేశపెట్టిన 'అమెజాన్ పే లేటర్' కూడా బాగానే ''క్లిక్' అయింది. కాగా, ఈ పేమెంట్ ఆప్షన్లతో క్యూ–కామ్ సంస్థల సగటు ఆర్డర్ విలువ పెరగడంతో పాటు ఎక్కువ రేటు గల ఉత్పత్తి విభాగాల్లోకి కూడా విస్తరించేందుకు దోహదం చేస్తుందని పరిశ్రమ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కంపెనీలు గనుక కస్టమర్ల విశ్వాసాన్ని పొందగలిగితే, ఈకామర్స్ దిగ్గజాలకు సవాలుగా నిలవడం ఖాయమని కూడా వారు విశ్లేషిస్తున్నారు.

> ఈఎంఐ అవకాశం కల్పించడం వల్ల కస్టమర్ల కొనుగోలు శక్తి మరింత పెరుగుతుంది. ఆర్థికంగా కూడా వారికి వెసులుబాటు లభిస్తుంది.
> – అల్బిందర్ ధింద్సా, బ్లింకిట్ సీఈఓ



75% స్మార్ట్ ఫోన్ కొనుగోళ్లు వాయిదాల్లోనే...

'పే లేటర్, ఈఎంఐ ఫార్మాట్ల వల్ల క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు.. సంప్రదాయ ఈకామర్స్ దిగ్గజాలతో మరింతగా పోటీపడేందుకు వీలవుతుంది. ముఖ్యంగా పే లేటర్ సదుపాయం వల్ల యూజర్ల మెరుగైన షాపింగ్ అనుభూతికి తోడ్పడుతుంది. ఇక స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాల వంటి అధిక ధర కేటగిరీ కొనుగోళ్లలో ఈఎంఐ కీలక పాత్ర పోషిస్తుంది. ఈకామర్స్ మాదిరిగానే పోటాపోటీ ధరలతో పాటు అనువైన పేమెంట్ ఆప్షన్లను కూడా ఆఫర్ చేయడం ద్వారా క్యూకామ్ సంస్థలు కస్టమర్లను ఆకట్టుకోగలుగుతాయి' అని డేటమ్ ఇంటెలిజెన్స్ విశ్లేషకుడు సతీష్ మీనా అభిప్రాయపడ్డారు. ఇప్పుడు దేశంలో 75 శాతం పైగా స్మార్ట్ ఫోన్లు ఈఎంఐ రూట్లోనే అమ్ముడవుతుండటం విశేషం! అయితే, ప్రస్తుతం క్విక్ కామ్ ప్లాట్‌ఫామ్స్‌లో జరుగుతున్న కొనుగోళ్లలో 85 శాతం మేర కిరాణా, నిత్యావసర ఉత్పత్తులేనని, ఈ పేమెంట్ ఆప్షన్లు తక్షణం వాటికి పెద్దగా ఉపయోగకరం కాదనేది మరో టాప్ కన్సల్టెన్సీ సంస్థ నిపుణుడి అభిప్రాయం. 'రానురాను ప్రీమియం విభాగాల్లోకి విస్తరించే కొద్దీ పే లేటర్, ఈఎంఐ వంటి ఆప్షన్లు క్విక్ కామ్ డిమాండ్‌ను పెంచడానికి తోడ్పడతాయి. ఇది ఈకామర్స్ సంస్థలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సవాలును ఎదుర్కోవాలంటే అవి మరిన్ని వినూత్న విధానాలను అనుసరించక తప్పదు' అని వ్యాఖ్యానించారు.

జనవరి 1 నుంచి బెంజ్ కార్ల ధరలు పెంపు



న్యూఢిల్లీ: జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ కార్ల ధరలను పెంచేందుకు సిద్ధమైంది. కొత్త ఏడాది జనవరి 1 నుంచి తన అన్ని రకాల కార్ల ధరల్ని 3 శాతం వరకు పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. జీఎల్‌సీ మోడల్ నుంచి టాప్‌ఎండ్(ఖరీదు శ్రేణి) మేబాక్ ఈక్యూఎస్ 680 మోడల్ వరకు కారు ధరను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.9 లక్షల మేర ఈ పెంపు ఉంటుందని పేర్కొంది. ''అధిక ఇన్‌పుట్ ఖర్చులు, ద్రవ్యోల్బణ పెరుగుదల వ్యాపార కార్యకలాపాలపై ఒత్తిళ్లు పెంచుతున్నాయి. కమోడిటీ ధరల్లో హెచ్చుతగ్గులు, రవాణా ఖర్చులతో గత మూడు త్రైమాసికాల నుంచి నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగిపోయాయి. దీంతో ధరల పెంపు నిర్ణయం తప్పలేదు'' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు. అయితే ఈ ఏడాది డిసెంబర్ 31 లోపు బుక్ చేసుకునే వాహనాలకు మాత్రం పెంపు వర్తించదని స్పష్టం చేశారు.

ఈ ఏడాది భారత్ వృద్ధి 7.2 శాతం: మూడీస్



న్యూఢిల్లీ: భారత్ జీడీపీ 2024లో 7.2 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని మూడీస్ రేటింగ్స్ అంచనా వేసింది. ఈ ఏడాదిలో వడ్డీ రేట్ల కోత ఉండకపోవచ్చని పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ మెరుగ్గానే ఉన్నప్పటికీ.. ద్రవ్యోల్బణ రిస్కులు ఆర్‌బీఐ కఠిన ద్రవ్య విధానాన్నే కొనసాగించేందుకు (2024 చివరి వరకు) దారితీయవచ్చని తెలిపింది. తగినన్ని ఆహార నిల్వలు, పెరిగిన సాగుతో ఆహార ధరలు దిగొస్తాయని, రానున్న నెలల్లో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ నియంత్రిత లక్ష్యం (4 శాతం) దిశగా తగ్గుముఖం పట్టొచ్చని అంచనా వేసింది. అక్టోబర్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ట స్థాయి అయిన 6.21 శాతానికి చేరడం తెలిసిందే. ''పెరిగిపోయిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ఎదురయ్యే ద్రవ్యోల్బణం రిస్క్, తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు ద్రవ్య విధానాన్ని సడలించే విషయంలో ఆర్‌బీఐ అప్రమత్తతను తెలియజేస్తోంది''అని మూడీస్ పేర్కొంది. ఈ ఏడాదికి చివరి ఎంపీసీ సమావేశం డిసెంబర్ 7–9 తేదీల మధ్య జరగనుంది. గృహ వినియోగం పెరగనుందని చెబుతూ.. పండుగల సీజన్‌లో కొనుగోళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పుంజుకోవడాన్ని మూడీస్ తన నివేదికలో ప్రస్తావించింది. సామర్థ్య వినియోగం పెరుగుతుండడం, వ్యాపార సెంటిమెంట్‌ను బలోపేతం చేస్తోందని, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తుండడం ప్రైవేటు పెట్టుబడులకు మద్దతుగా నిలుస్తుందని పేర్కొంది.

విద్యుత్ రంగానికీ పీఎల్ఐ!

జాబితాలోకి విద్యుత్ ప్రసార పరికరాలు • ఈ ఏడాది చివరికల్లా పథకానికి శ్రీకారం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రసార(పవర్ ట్రాన్స్‌మిషన్) రంగానికి సైతం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) చివరికల్లా పీఎల్ఐను వర్తింపచేయాలని చూస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రపంచస్థాయిలో ట్రాన్స్‌మిషన్ పరికరాల కొరత కారణంగా ధరలు పెరిగిపోతుండటంతో తాజా యోచనకు తెరతీస్తున్నట్లు తెలియజేశారు. మరోవైపు ప్రభుత్వం పునరుత్పాదక(రెనెవబుల్) ఇంధనాన్ని ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో వేగవంతంగా విద్యుత్ ప్రసార లైన్లను ఏర్పాటు చేయడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. దేశీయంగా విద్యుత్ ప్రసార పరికరాల కోసం అత్యధిక శాతం దిగుమతులపైనే ఆధారపడుతుండటంతో పీఎల్ఐకు ప్రభుత్వం తెరతీస్తున్నట్లు అధికారిక వర్గాలు తెలియజేశాయి. తద్వారా దేశీయంగా ట్రాన్స్‌మిషన్ పరికరాల తయారీకి ప్రభుత్వం దన్నునివ్వనున్నట్లు వెల్లడించాయి. దీంతో విదేశీ మారక నిల్వలను సైతం ప్రభుత్వం ఆదా చేసుకోనుంది.

దిగుమతులే అధికం

ప్రధానంగా ట్రాన్స్‌ఫార్మర్లు, సర్క్యూట్ బ్రేకర్లు, స్విచ్‌గేర్లు తదితర విద్యుత్ ప్రసార పరికరాల కోసం భారత్ విదేశాలపై అధికంగా ఆధారపడుతోంది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం 2023లో భారత్ 33.8 కోట్ల డాలర్ల (సుమారు రూ.2,840 కోట్లు) విలువైన పరికరాలను దిగుమతి చేసుకుంది.

పెళ్లి రుణాలకు వెడ్డింగ్‌లోన్స్.కామ్

చెన్నై: వివాహ బంధాలకు వేదికగా ఉన్న మ్యాట్రిమోనీ.కామ్ మరో అడుగు ముందుకేసింది. పెళ్లి వేడుకకు రుణం సమకూర్చేందుకు వెడ్డింగ్‌లోన్స్.కామ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఐడీఎఫ్‌సీ, టాటా క్యాపిటల్, లార్సెన్ అండ్ టూబ్రో ఫైనాన్స్‌తో చేతులు కలిపింది. వివాహ ప్రణాళిక, బడ్జెట్, అమలు ప్రక్రియను సులభతరం చేయడానికి సేవలను విస్తరిస్తున్నట్టు మ్యాట్రిమోనీ.కామ్ సీఈవో మురుగవేల్ జానకిరామన్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
డివిడెండ్ల కంటే రాయల్టీలకే మొగ్గు
అయిదో క్వార్టర్‌లోనూ స్మార్ట్‌ఫోన్స్ జోరు..

సాక్షి స్పోర్ట్స్

283 టి20ల్లో భారత్‌కు ఇది రెండో అత్యధిక స్కోరు. గత నెలలో హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 297 పరుగులు చేసింది.

210 సామ్సన్, తిలక్ జోడించిన పరుగులు. ఏ వికెట్‌కైనా భారత్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. రోహిత్, రింకూ (190; అఫ్గానిస్తాన్‌పై 2024లో) రికార్డు కనుమరుగైంది.

5 అంతర్జాతీయ టి20ల్లో వరుసగా రెండు శతకాలు చేసిన ఐదో బ్యాటర్ తిలక్ వర్మ. భారత్ తరఫున సామ్సన్ ఇదే సిరీస్‌లో ఆ రికార్డు నమోదు చేయగా... గతంలో మరో ముగ్గురు గుస్తావ్ మెక్‌కియాన్, ఫిల్ సాల్ట్, రిలీ రోసో ఈ ఘనత సాధించారు.

3 ఒకే మ్యాచ్‌లో ఇద్దరు బ్యాటర్లు సెంచరీలు చేయడం ఇది మూడోసారి. గతంలో చెక్ రిపబ్లిక్, జపాన్ బ్యాటర్లు ఈ ఫీట్ నమోదు చేశారు.

తిలక్, సామ్సన్ వీర విధ్వంసం

భారత బ్యాటర్ల సెంచరీల మోత
- చివరి టి20లో భారత్ ఘన విజయం
- 135 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు
- 3–1తో సిరీస్ టీమిండియా సొంతం



వాండరర్స్‌లో బౌండరీల వర్షం... సిరీస్‌లో తొలి మ్యాచ్ సెంచరీ హీరో, మూడో మ్యాచ్ శతక వీరుడు ఈసారి జత కలిసి సాగించిన పరుగుల ప్రవాహానికి పలు రికార్డులు కొట్టుకుపోయాయి. తిలక్ వర్మ, సంజు సామ్సన్ ఒకరితో మరొకరు పోటీ పడుతూ బాదిన సెంచరీలతో జొహన్నెస్‌బర్గ్ మైదానం అదిరింది. వీరిద్దరి జోరును నిలువరించలేక, ఏం చేయాలో అర్థం కాక దక్షిణాఫ్రికా బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. టీమిండియా ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, 23 సిక్సర్లు ఉండగా... బౌండరీల ద్వారానే 206 పరుగులు వచ్చాయి. అనంతరం మైదానంలోకి దిగక ముందే ఓటమిని అంగీకరించినట్లు కనిపించిన సఫారీ టీమ్ 20 ఓవర్లు కూడా పూర్తిగా ఆడలేకపోయింది. 3 ఓవర్లు ముగిసేసరికి 10/4 వద్ద నిలిచిన ఆ జట్టు మళ్లీ కోలుకోలేదు.

జొహన్నెస్‌బర్గ్: సఫారీ పర్యటనను భారత టి20 జట్టు అద్భుతంగా ముగించింది. అన్ని రంగాల్లో తమ ఆధిపత్యం కొనసాగిస్తూ నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–1తో సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన చివరి పోరులో భారత్ 135 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 283 పరుగులు చేసింది. హైదరాబాద్ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ (47 బంతుల్లో 120 నాటౌట్; 9 ఫోర్లు, 10 సిక్స్‌లు), సంజు సామ్సన్ (56 బంతుల్లో 109 నాటౌట్; 6 ఫోర్లు, 9 సిక్స్‌లు) మెరుపు సెంచరీలతో విధ్వంసం సృష్టించారు. తిలక్‌కు ఇది వరుసగా రెండో సెంచరీ కాగా... వరుసగా రెండు డకౌట్‌ల తర్వాత సామ్సన్‌కు ఈ సిరీస్‌లో ఇది రెండో శతకం కావడం విశేషం. వీరిద్దరు రెండో వికెట్‌కు 86 బంతుల్లోనే ఏకంగా 210 పరుగులు జోడించారు. అనంతరం దక్షిణాఫ్రికా 18.2 ఓవర్లలో 148 పరుగులకే ఆలౌటైంది.

ధనాధన్ జోడీ...

పవర్‌ప్లేలో 73 పరుగులు... 10 ఓవర్లు ముగిసేసరికి 129... 15 ఓవర్లలో 219... చివరి 5 ఓవర్లలో 64... ఇదీ భారత్ స్కోరింగ్ జోరు! గత కొన్ని మ్యాచ్‌లలో వరుసగా విఫలమైన అభిషేక్ శర్మ (18 బంతుల్లో 36; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఈసారి కాస్త మెరుగైన ఆటతో దూకుడు ప్రదర్శించాడు. అభిషేక్ అవుటయ్యాక సామ్సన్, తిలక్ జత కలిసిన తర్వాత అసలు వినోదం మొదలైంది. ప్రతీ బౌలర్‌పై వీరిద్దరు విరుచుకుపడి పరుగులు సాధించారు. మహరాజ్ ఓవర్లో తిలక్ రెండు వరుస సిక్స్‌లు కొట్టగా... స్టబ్స్ ఓవర్లో సామ్సన్ అదే పని చేశాడు. సిపామ్లా ఓవర్లో ఇద్దరూ కలిసి 3 సిక్సర్లతో 20 పరుగులు రాబట్టారు. కెప్టెన్ మార్క్‌రమ్ ఓవర్లో తిలక్ మరింత రెచ్చిపోతూ వరుసగా 4, 6, 6, 4 బాదాడు. సామ్సన్ స్కోరు 27 వద్ద ఉన్నప్పుడు క్రీజ్‌లోకి వచ్చిన తిలక్ ఒకదశలో అతడిని దాటేసి సెంచరీకి చేరువయ్యాడు. అయితే ముందుగా 51 బంతుల్లోనే సామ్సన్ శతకం పూర్తి చేసుకోగా... తర్వాతి ఓవర్లోనే తిలక్ 41 బంతుల్లో ఆ మార్క్‌ను అందుకున్నాడు.


సామ్సన్

టపటపా...

భారీ ఛేదనను చెత్త ఆటతో మొదలుపెట్టిన దక్షిణాఫ్రికా గెలుపు గురించి ఆలోచించే అవకాశమే లేకపోయింది. తొలి రెండు ఓవర్లలో హెన్‌డ్రిక్స్ (0), రికెల్‌టన్ (1) వెనుదిరగ్గా... మూడో ఓవర్లో అర్ష్‌దీప్ వరుస బంతుల్లో మార్క్‌రమ్ (8), క్లాసెన్ (0)లను పెవిలియన్ పంపించాడు. ఆ తర్వాత స్టబ్స్, మిల్లర్... చివర్లో జాన్సెన్ (29; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) కొద్దిసేపు నిలబడినా లాభం లేకపోయింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (నాటౌట్) 109; అభిషేక్ (సి) క్లాసెన్ (బి) సిపామ్లా 36; తిలక్ వర్మ (నాటౌట్) 120; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో వికెట్ నష్టానికి) 283. వికెట్ల పతనం:** 1–73. **బౌలింగ్:** జాన్సెన్ 4–0–42–0, కొయెట్జీ 3–0–43–0, సిపామ్లా 4–0–58–1, సిమ్‌లేన్ 3–0–47–0, మహరాజ్ 3–0–42–0, మార్క్‌రమ్ 2–0–30–0, స్టబ్స్ 1–0–21–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్‌టన్ (సి) సామ్సన్ (బి) పాండ్యా 1; హెన్‌డ్రిక్స్ (బి) అర్ష్‌దీప్ 0; మార్క్‌రమ్ (సి) బిష్ణోయ్ (బి) అర్ష్‌దీప్ 8; స్టబ్స్ (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 43; క్లాసెన్ (ఎల్బీ) (బి) అర్ష్‌దీప్ 0; మిల్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 36; జాన్సెన్ (నాటౌట్) 29; సిమ్‌లేన్ (సి) బిష్ణోయ్ (బి) వరుణ్ 2; కొయెట్జీ (సి) సామ్సన్ (బి) అక్షర్ 12; మహరాజ్ (సి) తిలక్ (బి) అక్షర్ 6; సిపామ్లా (సి) అక్షర్ (బి) రమణ్‌దీప్ 3; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.2 ఓవర్లలో ఆలౌట్) 148. వికెట్ల పతనం**: 1–1, 2–1, 3–10, 4–10, 5–96, 6–96, 7–105, 8–131, 9–141, 10–148. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3–0–20–3, పాండ్యా 3–1–8–1, రమణ్‌దీప్ 3.2–0–42–1, వరుణ్ 4–0–42–2, బిష్ణోయ్ 3–0–28–1, అక్షర్ 2–0–6–2.

తిలక్ వర్మ

అన్షుల్...10కి 10 వికెట్లు

రంజీల్లో ఈ ఘనత సాధించిన మూడో బౌలర్‌గా రికార్డు



రోహతక్: హరియాణా పేస్ బౌలర్ అన్షుల్ కంబోజ్ అరుదైన ఘనత సాధించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో (మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజులు జరిగే దేశవాళీ/అంతర్జాతీయ మ్యాచ్‌లు) ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు తీసిన ఆరో భారతీయ బౌలర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. కేరళ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'సి' మ్యాచ్‌లో 23 ఏళ్ల అన్షుల్ ఈ అద్భుతాన్ని ఆవిష్కరించాడు. బెంగాల్ స్పిన్నర్ ప్రేమాన్షు ఛటర్జీ (10/20; అస్సాంపై 1957లో), రాజస్తాన్ మీడియం పేసర్ ప్రదీప్ సుందరం (10/78; విదర్భపై 1985లో) తర్వాత రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు పడగొట్టిన మూడో బౌలర్‌గా అన్షుల్ గుర్తింపు పొందాడు. అన్షుల్ (30.1–9–49–10) విజృంభించడంతో ఈ మ్యాచ్‌లో కేరళ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 116.1 ఓవర్లలో 291 పరుగులకు ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన హరియాణా శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 61 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. చేతిలో మూడు వికెట్లు ఉన్న హరియాణా జట్టు ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 152 పరుగులు వెనుకబడి ఉంది.

భారత్ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో 10కి 10 వికెట్లు పడగొట్టిన బౌలర్ల జాబితా

గణాంకాలు	ప్లేయర్	జట్టు	ప్రత్యర్థి	టోర్నీ
10/20	ప్రేమాన్షు ఛటర్జీ	బెంగాల్	అస్సాం	1957 రంజీ ట్రోఫీ
10/46	దేబాశిష్ మొహంతి	ఈస్ట్‌జోన్	సౌత్‌జోన్	2001 దులీప్ ట్రోఫీ
10/49	అన్షుల్ కంబోజ్	హరియాణా	కేరళ	2024 రంజీట్రోఫీ
10/74	అనిల్ కుంబ్లే	భారత్	పాకిస్తాన్	1999 టెస్టు మ్యాచ్
10/78	ప్రదీప్ సుందరమ్	రాజస్తాన్	విదర్భ	1985 రంజీట్రోఫీ
10/78	సుభాశ్ గుప్తే	బాంబే	పాకిస్తాన్ కంబైన్డ్ సర్వీసెస్	1954

షేక్ రషీద్ డబుల్ సెంచరీ

- 'శత'క్కొట్టిన కరణ్ షిండే
- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 448/9
- హైదరాబాద్‌తో రంజీ మ్యాచ్



రషీద్

సాక్షి, హైదరాబాద్: కెప్టెన్ షేక్ రషీద్ (372 బంతుల్లో 203; 28 ఫోర్లు) డబుల్ సెంచరీతో చెలరేగడంతో హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 147 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న పోరులో ఓవర్‌నైట్ స్కోరు 168/2తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు ఆట ముగిసే సమయానికి 143 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసింది. కరణ్ షిండే (221 బంతుల్లో 109; 12 ఫోర్లు) సెంచరీతో ఆకట్టుకోగా... షేక్ రషీద్ ద్విశతకంతో విజృంభించాడు. తాజా రంజీ సీజన్‌లో వరుస వైఫల్యాలతో ఇబ్బంది పడుతున్న రషీద్ ఈసారి పూర్తి సాధికారికతతో బ్యాటింగ్ చేయగా... హైదరాబాద్ బౌలర్లు అతడిని కట్టడి చేయలేకపోయారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన రషీద్.. పరిస్థితులను ఆకళింపు చేసుకున్న అనంతరం ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు కరణ్ షిండేతో కలిసి రషీద్ 236 పరుగులు జోడించి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిపెట్టాడు. హనుమ విహారి (0) డకౌట్ కాగా... వికెట్ కీపర్ కోన శ్రీకర్ భరత్ (33; 3 ఫోర్లు) పర్వాలేదనిపించాడు. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి 4 వికెట్లు... చామా మిలింద్, రక్షణ్ రెడ్డి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం యరా సందీప్ (73 బంతుల్లో 33 బ్యాటింగ్; 4 ఫోర్లు, 1 సిక్స్), లలిత్ మోహన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్‌: శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్‌ తెలిపారు. ఈ మేరకు మౌలాలి–కొల్లాం (07143/07144) స్పెషల్‌ ట్రైన్‌ ఈనెల 24, 29 తేదీల్లో ఉదయం 11.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు కొల్లాంకు చేరుకోనుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 24, డిసెంబర్‌ 1వ తేదీన తెల్లవారుజామున 2.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు మౌలాలి చేరుకోనుంది. మచిలీపట్నం–కొల్లాం (07145/07146) ట్రైన్‌ ఈనెల 18, 25 తేదీల్లో మధ్యాహ్నం 3.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 9.20 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో నవంబర్‌ 20, 27 తేదీల్లో తెల్లవారుజామున 2.30 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.



శంషాబాద్‌లో వైష్ణోయ్‌ సౌత్‌వుడ్స్‌ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్‌: శంషాబాద్‌లోని మామిడిపల్లిలో ప్రత్యేక విల్లా కమ్యూనిటీ వైష్ణోయ్‌ సౌత్‌వుడ్స్‌ను ప్రారంభించినట్లు వైష్ణోయ్‌ గ్రూప్‌ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి రోజే 50 కంటే ఎక్కువ బుకింగ్‌లు వచ్చాయని తెలిపింది. ఈ సందర్భంగా వైష్ణోయ్‌ గ్రూప్‌ వ్యవస్థాపకుడు, సీఎండీ యెలిశాల రవిప్రసాద్‌ మాట్లాడుతూ 'మా విజన్‌ ఆఫ్‌ స్పెక్టాక్యులర్‌ లివింగ్‌ అనేది దక్షిణ హైదరాబాద్‌ రియల్‌ ఎస్టేట్‌ ల్యాండ్‌స్కేప్‌ను మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మార్గదర్శక స్ఫూర్తితో ఇళ్లను సృష్టించడం, కమ్యూనిటీలను పెంపొందించడంలో తిరుగులేని నిబద్ధతతో తాము నాణ్యత, విశ్వాసం కోసం కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తూనే ఉన్నామని వివరించారు. వైష్ణోయ్‌ సౌత్‌వుడ్స్‌ అనేది 260 అల్ట్రా విలాసవంతమైన విల్లాలను అందించే ప్రీమియం గేటెడ్‌ కమ్యూనిటీ. ఇది రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్‌ ఎయిర్‌పోర్ట్‌, హైటెక్‌సిటీ, ప్రముఖ విద్యాసంస్థలకు దగ్గర్లో ఉంటుంది.

ఆమె కాదు.. అతడు!

పుట్టిన 27 ఏళ్లకు అబ్బాయిగా తేలిన అమ్మాయి

- వైద్య పరీక్షల్లో పురుషుడేనని తేల్చిన వైద్యులు
- జన్యుపరమైన సమస్యవల్లేనని వెల్లడి

దుబ్బాక: ఆ దంపతులకు తొలి సంతానంగా పండంటి ఆడబిడ్డ పుట్టింది. సాక్షాత్తూ లక్ష్మీదేవే ఇంటికి వచ్చిందని ఆ జంట మురిసిపోయింది. కావ్యశ్రీ అని చక్కని పేరుపెట్టి అల్లారు ముద్దుగా పెంచుకొన్నారు. కూతురిని పాఠశాలకు, కళాశాలకు పంపి చక్కగా చదివించారు. కానీ, కావ్యశ్రీ వయసు పెరుగుతున్నాకొద్దీ ఆమె శరీరంలో మార్పులు రావటం మొదలైంది. యుక్త వయసు వచ్చేసరికి అబ్బాయిలా గడ్డం, మీసాలు వచ్చాయి. మొదట పెద్దగా పట్టించుకోలేదు. కానీ, 26 ఏళ్ల వయసు వచ్చేనాటికి ఆమె.. అతడిలా మారటం స్పష్టంగా తెలిసిపోయింది. ఆరోగ్య పరంగా కూడా కావ్యశ్రీ ఇబ్బందులు ఎదుర్కొన్నది. కంగారుపడిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా, కావ్యశ్రీ ఆడపిల్ల కాదని.. మగపిల్లాడని డాక్టర్లు తేల్చారు. దీంతో 27 ఏళ్ల వయసులో కావ్యశ్రీ కాస్తా.. కార్తికేయగా మారాడు. సిద్దిపేట జిల్లాలో ఈ అరుదైన ఘటన జరిగింది.

అనారోగ్యంతో బయటపడిన నిజం..

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేటకు చెందిన దొంతగాని రమేశ్‌, మంజుల మొదటి సంతానం కావ్యశ్రీ 1996 అక్టోబర్‌ 30న జన్మించింది. కావ్యశ్రీకి 2018 నుంచి శరీరంలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. మగవారి లాగా గడ్డం, మీసాలు పెరగడం ప్రారంభమైంది. విపరీతమైన కడుపు నొప్పి, ఆరోగ్యపరమైన సమస్యలు రావడంతో తల్లిదండ్రులు రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో వైద్యులను సంప్రదించారు. వారు ప్రత్యేక వైద్య నిపుణులను కలవాలని సూచించటంతో రెండు నెలల క్రితం బెంగళూరుకు చెందిన డాక్టర్లను కలిశారు. అక్కడి వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో నమ్మలేని నిజాలు బయట పడ్డాయి. కావ్యశ్రీకి కడుపు కింది భాగంలో పురుషుల మాదిరిగా వృషణాలు ముడుచుకుని ఉండడంతోపాటు, 2.5 ఇంచుల అంగం బయటకు రావడం గమనించారు. ముడుచుకున్న వృషణాలను శస్త్ర చికిత్స చేసి సరి చేయాల్సి ఉంటుందని వైద్యులు తెలిపారు. ఛాతీ భాగం సైతం అబ్బాయిదేనని, అధిక కొవ్వు కారణంగా ఎత్తుగా కనపడిందని తేల్చారు. ఇలా ఛాతీ ఎత్తుగా పెరగడాన్ని గైనాకో మాస్టియో అంటారని వైద్యులు తెలిపారు. దీంతో ఇప్పటి వరకు కావ్యశ్రీ అని పిలుచుకున్న తమ సంతానానికి కార్తికేయ అని పేరు మార్చామని తల్లిదండ్రులు తెలిపారు. మూడు వారాల క్రితం ఆధార్‌ కార్డులో సైతం కార్తికేయగా పేరు మార్పించారు. కావ్యశ్రీ విద్యార్హతల సర్టిఫికేట్లలో సైతం పేరు మార్చాల్సి ఉంది. 2014 నుంచే కార్తికేయ బైక్‌, కారు సైతం నడుపుతున్నాడు. ప్రస్తుతం కార్తికేయ ప్రొఫెషనల్‌ ఫొటోగ్రాఫర్‌గా, సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు.



అబ్బాయిగా జీవించటం ఆనందంగా ఉంది

నాకు టీనేజ్‌ వచ్చేసరికి అబ్బాయిలాగా గడ్డం, మీసాలు రావడం మొదలైంది. డాక్టర్లను సంప్రదించగా అసంకల్పిత రోమాలు అని చెప్పారు. కడుపు నొప్పి తరచుగా వస్తుండడంతో హైదరాబాద్‌లో నిపుణులను కలిశాం. దీంతో నాకు అసలు విషయం తెలిసింది. ఇప్పుడు అబ్బాయిగా జీవించడం నాకెంతో ఆనందంగా ఉంది.

–దొంతగౌని కార్తికేయ

జన్యు లోపాల వల్లే..

కార్తికేయ విషయంలో క్రోమోజోమ్‌ల లోపంతో ఇలా జరిగింది. కొన్ని క్రోమోజోమ్‌లు ఎక్కువగా డామినేట్‌ చేయడం వల్ల వృషణాలు చిన్నగా పెరిగాయి. వృషణాలు కొంత భాగం కడుపులో ముడుచుకొని ఉండటాన్ని గుర్తించాం. తదుపరి వైద్య పరీక్షలకు నిపుణులను సంప్రదించాలని సూచించాం. అతడు అమ్మాయి కాదు అబ్బాయే. టెస్టిక్యులర్‌ ఫెమినైజేషన్‌ సిండ్రోమ్‌ కారణంగా బయటకు అమ్మాయిలా కనిపించినా అంతర్గతంగా మొత్తం పురుష లక్షణాలే ఉన్నాయి. ఇది చాలా అరుదైన లక్షణం.

–డాక్టర్‌ హేమారాజ్‌ సింగ్‌, సర్జన్‌, దుబ్బాక ఆస్పత్రి సూపరింటెండెంట్‌

కార్తికేయను అబ్బాయిలాగే గుర్తించండి



నా కొడుకులో జన్యు మార్పుల వల్ల మేము ఇన్నాళ్లు అమ్మాయిగా భ్రమపడ్డాం. యుక్త వయస్సు వచ్చేసరికి వాడికి గడ్డం, మీసాలు రావడం గమనించాం. ఈ క్రమంలో కడుపు నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించాం. అమ్మాయి కాదని అబ్బాయి అని నిర్ధారించారు. సమాజం తప్పుగా అర్థం చేసుకోవద్దు. మా అబ్బాయిని అబ్బాయిలాగే గుర్తించండి.

–మంజుల–రమేష్‌ గౌడ్‌, కార్తికేయ తల్లిదండ్రులు

రేపటి నుంచే గ్రూప్‌-3 పరీక్షలు!

- రెండు రోజుల పాటు 3 పరీక్షల నిర్వహణ
- రాష్ట్రవ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన టీజీపీఎస్సీ
- పరీక్ష కేంద్రాల వద్ద భద్రత, నిఘా ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- మొత్తం పోస్టులు 1,388.. హాజరుకానున్న అభ్యర్థులు 5.36 లక్షలు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్‌–3 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈ నెల 17, 18వ తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీజీపీఎస్సీ) ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి రోజు రెండు, రెండో రోజు ఒక పరీక్ష నిర్వహించనున్నారు. 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్‌–1.. అదే రోజున మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్‌–2 పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్‌–3 పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,401 కేంద్రాల్లో జరిగే గ్రూప్‌–3 పరీక్షలకు మొత్తంగా 5.36 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇప్పటికే 80 శాతం మంది విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకున్నట్లు టీజీపీఎస్సీ తెలిపింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 1,388 గ్రూప్‌–3 ఉద్యోగాల భర్తీకి సంబంధించి 2022 డిసెంబర్‌లో నోటిఫికేషన్‌ జారీ అయింది.




కలెక్టర్లు, ఎస్పీలకు పర్యవేక్షణ బాధ్యతలు..

రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్‌–3 పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు అప్పగించింది. స్వయంగా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే కలెక్టర్లు, ఎస్పీలు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. టీజీపీఎస్సీ కార్యాలయానికి వాటిని అనుసంధానించి.. ప్రత్యక్షంగా పర్యవేక్షించేలా చర్యలు చేపట్టారు.

గంట ముందే పరీక్షా కేంద్రానికి రావాలి

గ్రూప్‌–3 అభ్యర్థులను పరీక్ష సమయం కంటే గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. కనీసం గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది. పరీక్ష ప్రారంభమయ్యే సమయానికి అరగంట ముందే సెంటర్ల గేట్లు మూసివేస్తామని.. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని స్పష్టం చేసింది. ఉద్యోగాల తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను, ప్రశ్నపత్రాలను జాగ్రత్త చేసుకోవాలని టీజీపీఎస్సీ సూచించింది. డూప్లికేట్‌ హాల్‌టికెట్లను జారీ చేయబోమని పేర్కొంది.

● టుడేస్‌ గ్రాఫిక్‌



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శనివారం । 16-11-2024

పాలమూరు మట్టిబిడ్డల ఇలవేల్పు శ్రీ కురుమూర్తి స్వామి. స్వామివారి గుట్టపై వెలుగుతున్న జ్యోతికి ఓ మహత్తరమైన చరిత్ర ఉంది. 400 ఏళ్లుగా ఒకే వంశీయులు కురుమూర్తి కొండపై దీపం వెలిగిస్తూ వస్తున్నారు. ఆ దీపం 15 కిలోమీటర్ల దూరం కనిపిస్తుంది. అంత దూరంలో ఉన్న గ్రామాల ప్రజలు కూడా ఉన్నచోటి నుంచే ఆ దివ్య జ్యోతిని దర్శించుకొని తరిస్తుంటారు. 'కురుమయ్య గుడి మీద దీపాన్ని వెలిగిస్తే ఢిల్లీకి వెలుగందినాదయ్య'అంటూ ఈ ప్రాంతంలో గొప్పగా చెప్పుకొంటారు. ఇప్పటికీ పంట పొలాల్లో కూలీలు ఈ దీపం చరిత్రపై పాటలు పాడుకుంటారు. ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన దీపం వెలిగించే బాధ్యత కురుమూర్తి గ్రామానికి చెందిన నీలి వంశీయులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కురుమయ్య దీపం ప్రత్యేకతపై 'సాక్షి'కథనం..



ఢిల్లీకి వెలుగందినాదయ్య

కురుమూర్తి స్వామి దీపానికి అపూర్వ చరిత్ర ● 400 ఏళ్లుగా దీపం వెలిగిస్తున్న నీలి వంశీయులు ● నేటికీ ఆనవాయితీ కొనసాగిస్తున్న వైనం

3 వేల అడుగుల ఎత్తుపై దేదీప్యమానంగా వెలుగులు కురుమూర్తి దీపంతో ఢిల్లీకి వెలుగందె అని నానుడి

మదనాపురం: కురుమూర్తి స్వామి కొలువైన కొండలు దాదాపు మూడు వేల అడుగుల ఎత్తులో దట్టమైన అడవులతో నిండి ఉంటాయి. ఇప్పుడంటే రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి కానీ.. 400 ఏళ్ల క్రితం ఆ దట్టమైన అడవుల్లో నుంచి వేల అడుగుల ఎత్తులో ఉన్న కొండపైకి ఎక్కి దీపం వెలిగించటానికి పెద్ద సాహసమే చేయాల్సి వచ్చేది. నీలి వంశీయులు స్వామివారిపై అచంచలమైన భక్తితో అంతటి కష్టమైన పనిని కూడా వందల ఏండ్లుగా నిర్విఘ్నంగా కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రతిరోజూ దట్టమైన అడవిలో చీకట్లో క్రూరమృగాలను తప్పించుకొంటూ.. రాళ్లు, రప్పలు ఎక్కి దిగుతూ దీపం వెలిగిస్తున్నారు.

నీలి వంశీయులకు 'మూగ'శాపం

ముక్కెర వంశపు రాజ వంశీయురాలు రాణి మహాభాగ్యలక్ష్మమ్మ నేతృత్వంలో కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అప్పట్లో అమ్మాపురం సంస్థానం పరిధిలోని కురుమూర్తి గ్రామానికి చెందిన భక్తురాలు నీలి చంద్రమ్మ స్వామివారి గుట్టపై ప్రతిరోజూ సాయంత్రం దీపం వెలిగించేవారట. ఆమె తర్వాత ఇంటి అల్లుడు వెంకటయ్య ఆ బాధ్యతలు తీసుకొని దీపాన్ని వెలిగిస్తూ వచ్చాడు. ఒకరోజు దీపం వెలిగించి కొండ దిగి వస్తుండగా సాయంత్రం వేళల్లో మునులు స్వామివారిని దర్శించుకుని గుహల్లోకి వెళ్లారు. వారిని గమనించిన వెంకటయ్య సైతం వారితోపాటు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఆయన జాడ కోసం రెండు నెలలపాటు వెతికినా ఆచూకీ లేకపోవడంతో.. దట్టమైన కురుమతి కొండల్లో చనిపోయి ఉంటాడని భావించారు. అయితే మునీశ్వరుల వెంట తిరుగుతున్న క్రమంలో గ్రామానికి చెందిన పశువుల కాపరికి ఆయన కనిపించాడు. ఈ విషయాన్ని పశువుల కాపరులు ఆయన సతీమణికి చెప్పగా, ఆమె భర్తను ఎలాగైనా పట్టుకోవాలని స్వామి సన్నిధికి వచ్చింది. స్వామిని దర్శించుకునేందుకు మునులతోపాటు వచ్చిన భర్తను గుర్తించి పట్టుకుంది. దీంతో కోపోద్రిక్తులైన మునులు 'భార్య, పిల్లలు ఉన్నారనే విషయం చెప్పకుండా మోసం చేశావు.. మమ్మల్ని ఇబ్బందులకు గురిచేశావు. నేటి నుంచి ఏడు తరాల వరకు మా విషయాన్ని ఎక్కడా చెప్పకుండా నీతోపాటు నీ వంశంలో అందరూ మూగవారిగా పుడతారు'అని శపించారట. ఆ రోజు నుంచే ఆయనకు మాటలు రాకుండా పోయాయట. ఆ తర్వాత ఆయన వంశంలో ఏడు తరాలు కుటుంబ సభ్యుల్లో అందరూ మూగవారిగానే జన్మించారు. 1967లో మరణించిన తిక్కన్న తర్వాత వారసులకు మాటలు వచ్చాయి.

వంశపారంపర్యంగా దీపం వెలిగించిన వారు..

నీలి పుల్లయ్య, నీలి చెన్నయ్య, నీలి కురుమన్న, నీలి రాములు, నీలి నారాయణ తదితరులు వంశపారంపర్యంగా కురుమూర్తి కొండపై దీపం వెలిగించారు. ప్రస్తుతం ఎనిమిదో తరం వారు ఆ ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. మంచి (వంటనూనె) నూనె, నూలుతో తయారు చేసిన ఒత్తి పెట్టి దీపం వెలిగిస్తారు. కురుమూర్తి కొండపై ప్రతిరోజూ వెలిగించే ఈ దీపం రాత్రివేళల్లో చాలాదూరం వరకు కనిపిస్తుంది. చుట్టుపక్కల 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల ప్రజలు దీపాన్ని మొక్కి తరిస్తారు.

కరెంటు లేని రోజుల్లో..



కరెంట్ లేని రోజుల్లో 400 ఏళ్ల క్రితం కురుమూర్తి కొండల్లో దీపం వెలిగించడమంటే ప్రాణాలతో చెలగాటమే. కొండలన్నీ భయంకరమైన అడవితో క్రూరమృగాలు తిరుగుతూ ఉండేవి. ఆ సమయంలో నీలి వంశీయులు దీపాన్ని వెలిగించడం ఎంతో గొప్ప విషయం. సాక్షాత్తూ తిరుమల వేంకటేశ్వరస్వామి, పద్మావతి దేవి సమేతంగా కురుమూర్తిలో వెలిశారు.

- బెల్లం సాయిలు, కురుమూర్తి స్వామి చరిత్ర పరిశోధకులు

అదృష్టంగా భావిస్తాం..



కురుమూర్తిస్వామి గుట్టపై తరతరాలుగా మా కుటుంబ సభ్యులు దీపం వెలిగిస్తున్నారు. ఈ బాధ్యత మా కుటుంబానికి రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాం. ప్రతిరోజూ స్వామివారికి సేవ చేసే భాగ్యం మా వంశానికి దక్కింది. మా కుటుంబంలో వంతుల ప్రకారం దీపాన్ని వెలిగిస్తాం.

- సతీష్, నీలి వంశీయుడు

శాపం తొలగింది



మా ముత్తాత వెంకటయ్య మునీశ్వరులు పెట్టిన శాపానికి గురయ్యారు. 1967లో మరణించిన తిక్కన్న వరకు ఏడు తరాలు మా కుటుంబంలో అందరూ మాటలు రాకుండా మూగవారిగా జన్మించారు. ఇప్పుడు ఆ శాపం పోయిందని అనుకుంటున్నాం. కురుమూర్తిస్వామికి మా కుటుంబ సభ్యులం దీపం వెలిగించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నాం.

- నారాయణ, నీలి వంశీయుడు

సీజేఐకు సన్మానం..



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నాను శుక్రవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సన్మానించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బార్ కౌన్సిల్ తరఫున సభ్యులు పీ విష్ణువర్ధన్‌రెడ్డి, జయాకర్, హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి శాంతిభూషణ్ హాజరయ్యారు



సీజేఐకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ కె.సునీల్ గౌడ్

11 నెలలుగా రాష్ట్రంలో ఆటవిక పాలన

వివేకానంద, ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 11 నెలలుగా ఆటవిక పాలన నడుస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు తన మార్క్‌ను చూపలేకపోయారన్నారు. ప్రజలను డైవర్ట్ చేయడానికి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. కేటీఆర్, హరీశ్‌రావుపై బురదజల్లడమే రేవంత్ పనిగా పెట్టుకున్నాడని, కేసీఆర్ నాయకత్వాన్ని బలహీనపర్చాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ రాష్ట్రంలో ఒక్కటయ్యాయని, కేంద్ర మంత్రి బండి సంజయ్ సీఎం రేవంత్‌రెడ్డికి సహాయమంత్రిగా పని చేస్తున్నారని విమర్శించారు. సొంత పార్టీ ఎంపీ డీకే అరుణను లగచర్ల గ్రామానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే బండి సంజయ్ ఎందుకు మాట్లాడలేదని వారు ప్రశ్నించారు.

ప్రతినెలా ఒక్కో స్కాం బయటపెడతాం

టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నికృష్టమైన రాజకీయ క్రీడకు కేటీఆర్ తెరతీశారని, ఆయన తీరు దొంగే దొంగ అన్నట్లు ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం అన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వచ్చే నాలుగేళ్లలో ప్రతినెలా ఒక్కో కుంభకోణం బయటికి వస్తుందని చెప్పారు. కాలుష్య రహిత ఫార్మా తీసుకురావడం కోసం ప్రభుత్వం ఆలోచన చేస్తుంటే.. తెలంగాణ రైతాంగం వారికి ఓట్లు వేయలేదని కక్షగట్టి కేటీఆర్ రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. లగచర్ల ఘటనకు కేటీఆర్ బాధ్యత తీసుకోవాలని సత్యం డిమాండ్ చేశారు. కేటీఆర్ మాటలు విని అధికారుల మీద కార్యకర్తలు దాడి చేస్తే జైలుకు పంపిస్తామన్నారు. సమయం వచ్చినప్పుడు మీ అంతు చూసేందుకు వేచిచూస్తున్నామని సత్యం హెచ్చరించారు.

డిసెంబర్ 21న ఓయూలో నిరుద్యోగుల కృతజ్ఞత సభ

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పదేళ్ల పాలనలో నిరుద్యోగులను వంచించి నిర్లక్ష్యంగా, అవమానకరంగా చూశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగుల భవిష్యత్ కోసమే సీఎం రేవంత్‌రెడ్డి తపన పడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కాక ముందే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. ప్రజాపాలనలో నిరుద్యోగుల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు డిసెంబర్ 21న ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగుల కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల జీవితాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం సరైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని పేర్కొన్నారు. గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో డిసెంబర్ 21న ఈ సభను ఏర్పాటు చేశామన్నారు.

లగచర్లలో కేటీఆర్, పట్నం నరేందర్‌రెడ్డికి ఏం పని?

టీపీసీసీ అధికార ప్రతినిధి చరణ్‌కౌశిక్

సాక్షి, హైదరాబాద్: లగచర్ల దాడి వెనక పాత్రధారి, సూత్రధారి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి చరణ్ కౌశిక్ యాదవ్ ఆరోపించారు. లగచర్లలో సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు తిరుపతిరెడ్డికి ఏం పని అన్న కేటీఆర్.. మరి లగచర్లలో ఆయనకు, పట్నం నరేందర్‌రెడ్డికి ఏం పనో చెప్పాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా తిరుపతిరెడ్డి ఉన్న విషయం కూడా తెలియదా? అని ప్రశ్నించారు. తిరుపతిరెడ్డి కూడా కొడంగల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారని, 2009 నుంచి ఆయన ఆ ప్రాంతంలో పని చేస్తున్నారని తెలిపారు. ప్రతీసారి రేవంత్‌రెడ్డి కుటుంబాన్ని బయటకు తీసుకొచ్చి బద్నాం చేయాలని చూస్తున్నారని చరణ్ కౌశిక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధర్మపురిని దర్శిస్తే... యమపురి ఉండదట!

పురాణాలు చెబుతున్నది అదే... దేశంలోనే అరుదైన యమధర్మరాజు విగ్రహం

ధర్మపురి: ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదని పురాణాలు చెబుతున్నాయి. జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం ప్రాంగణంలోనే యమధర్మరాజు ఆలయం ఉంది. ఇక్కడి యమధర్మరాజు విగ్రహం దేశంలోనే అరుదైనదిగా చెబుతుంటారు. భక్తులు ముందుగా యమధర్మరాజును దర్శించుకున్న తర్వాతే శ్రీలక్ష్మీనృసింహ, వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. యమధర్మరాజు భరణి జన్మనక్షత్రం సందర్భంగా ప్రతి నెలా ఆలయ ప్రాంగణంలో ఆయుష్షు హోమం, హారతి, మంత్రపుష్పం తదితర పూజలు చేస్తారు. ఏటా దీపావళి పర్వదినం సందర్భంగా యమ ద్వితీయ వేడుకలు నిర్వహిస్తారు. యమ ద్వితీయ రోజు యమధర్మరాజు నరక ద్వారాలను మూసివేసి తన సోదరి అయిన యమి ఇంటికి వెళ్లి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరిస్తారని పురాణాలు చెబుతున్నాయి. నరక ద్వారాలు మూసిన సందర్భంగా ఆరోజు మృతిచెందిన వారికి స్వర్గలోక ప్రాప్తి లభిస్తుందని నమ్మకం. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం తరలి వస్తుంటారు.



ధర్మపురిలో యమధర్మరాజుకు ప్రత్యేక పూజలు

ఇదీ ఆలయ ప్రాశస్త్యం

పూర్వం యముడు తాను చేసిన పాపాన్ని తొలగించుకోవాలనుకున్నాడు. మనస్సుకు శాంతి కావాలని అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నాడు. చివరగా నృసింహస్వామిని దర్శించుకునేందుకు ధర్మపురికి చేరుకున్నాడు. పవిత్ర గోదావరి నదిలో స్నానం ఆచరించి.. నృసింహుడిని శరణు వేడుకుంటాడు. స్వామి అనుగ్రహం లభించి పాప విముక్తుడయ్యాడు. నృసింహుని కృపతో ఆలయంలో దక్షిణ దిశలో వెలిశాడు. ముందు భక్తులు తనను దర్శించుకున్న తర్వాతే నృసింహుడిని దర్శించుకునేలా వరం పొందినట్టు పురాణాలు చెబుతున్నాయి. కాగా యముడు గోదావరి నదిలో స్నానం ఆచరించిన చోట యమగుండాలు అనే పేరు వచ్చింది.



యమధర్మరాజు ఆలయంలో ఆయుష్షు హోమం

క్రీ.శ 850- 928 నాటి ఆలయం

ధర్మవర్మ అనే రాజు పాలించినందుకు ధర్మపురికి ఆ పేరు వచ్చింది. ఈ క్షేత్రం క్రీ.శ. 850- 928 నాటి కంటే ముందునుంచే ఉన్నా.. క్రీ.శ. 1422–1436 కాలంలో బహమనీ సుల్తానుల దండయాత్రలో ధ్వంసమైంది. అనంతరం 17వ శతాబ్దంలో నృసింహ ఆలయాన్ని పునరుద్ధరించినట్టు చరిత్ర చెబుతోంది.

మా ఇలవేల్పు లక్ష్మీనృసింహుడు



ధర్మపురి లక్ష్మీనృసింహుడు మా ఇంటి ఇలవేల్పు. స్వామివారి దర్శనం కోసం వస్తూనే ఉంటాం. ఇక్కడున్న యమ ధర్మరాజును దర్శించుకుంటే సకల పాపాలు తొలగుతాయని మా నమ్మకం.

– భారతి, భక్తురాలు, కరీంనగర్

యముని దర్శనం కోసం వస్తాం



ధర్మపురిలోని యమ ధర్మరాజు దర్శనం కోసం వస్తుంటాం. దేశంలో ఇలాంటి ఆలయం ఎక్కడా లేదని అంటుంటారు. అందుకే ఏటా యమున్ని దర్శించుకునేందుకు కుటుంబ సమేతంగా పిల్లాపాపలతో వస్తాం.

– సాహితి, భక్తురాలు, మంచిర్యాల

ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారు



ధర్మపురిలోని యమధర్మరాజు ఆలయాన్ని దేశంలోనే అరుదైనదిగా భావిస్తారు. అందుకే యముడు, లక్ష్మీనృసింహుని దర్శనం కోసం మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదని పురాణాలు చెబుతున్నాయి.

– శ్రీనివాస్, ధర్మపురి ఆలయ ఈవో

ఏం సాధించారని విజయోత్సవాలు: కేతిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: 11 నెలల్లో ఏం సాధించారని ప్రజాపాలన విజయోత్సవాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేత కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టళ్లలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని స్వయంగా సీఎం అంటున్నారని, ఇప్పటివరకు హాస్టళ్లలో 36 మంది విద్యార్థుల చావుకు ప్రభుత్వం కారణం కాదా? అని ప్రశ్నించారు. పిల్లల మాక్ అసెంబ్లీలో కాంగ్రెస్ పాలనపై ఓ విద్యార్థిని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిందని తెలిపారు. ప్రజా పాలనను ఎప్పుడో గాలికి వదిలేశారని కేతిరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్కో విద్యార్థిపై రూ.1,20,000 కేసీఆర్ ఖర్చు పెట్టారన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎక్కడ తిరుగుబాటు చేసినా బీఆర్ఎస్ కుట్ర అంటున్నారని, రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ఫార్మా క్లస్టర్ వద్దని నిరసన చేస్తే కూడా బీఆర్ఎస్ కుట్ర అంటున్నారని మండిపడ్డారు.

అధికారం కోసం ఇంతలా దిగజారాలా?: అద్దంకి

సాక్షి, హైదరాబాద్: అధికారం కోసం ఇంతలా దిగజారడం మంచి పద్ధతి కాదని మాజీ మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ హితవు పలికారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ పొలిటికల్ డ్రామాలు ఆపాలని ధ్వజమెత్తారు. దాడులు చేయించింది వారే అని అందరికీ తెలిసిన తర్వాత.. తమ పరువు పోకుండా ఉండటానికి రైతులను పరామర్శించడం విడ్డూరమన్నారు. రైతుల మీద ప్రభుత్వం ఏ కేసులు పెట్టలేదని, రౌడీ మూకలు, దాడులకు ఉసిగొల్పిన వారి మీదే కేసులు పెట్టారని దయాకర్ తెలిపారు. అధికారుల మీద దాడులు చేయించిన మీ వల్ల తెలంగాణ సమాజం తల దించుకునే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు.



సిక్కు మత స్థాపకుడు గురునానక్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు

హరోం.. హర



కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా శివాలయాలన్నీ భక్తజన సందోహంతో కళకళలాడాయి. కార్తీక దీపాల వెలుగుల మధ్య ఆలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. నదీతీరాలు, సముద్రతీరాల చెంత తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలాచరించి దీపాలు వెలిగించారు.



కోటిదీపోత్సవ కాంతుల్లో విజయవాడ ఇంద్రకీలాద్రి



విజయవాడ దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో దీపం విడిచిపెడుతున్న చిన్నారి

క్లుప్తంగా...

గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలివ్వండి: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ జమ చేయడం మరిచిందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్నలు శుక్రవారం మండిపడ్డారు. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు జమ చేస్తామని ఎన్నికల్లో ప్రకటించిన చంద్రబాబు..తీరా అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గ్రంథాలయాల్లో పని చేసే ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

సీఎం చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: అత్యున్నత ప్రాధాన్యతారంగమైన విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదని, రాష్ట్రంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్, 17 వర్సిటీలకు ఉపకులపతి (వీసీ)లను తక్షణమే నియమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సీఎం చంద్రబాబును కోరారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను ఆయన శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. గత ప్రభుత్వం 4,439 యూనివర్సిటీ అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 5నెలలు గడుస్తున్నా ఉన్నత విద్యా మండలి చైర్మన్, వర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేకపోవడంతో ఆ పోస్టుల నియామక ప్రక్రియ ఆగిపోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 3 సెంట్లు చొప్పున కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలని రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను శుక్రవారం కలిసి రామకృష్ణ వినతిపత్రం అందించారు.

మునిసిపల్ టీచర్లకు 70 శాతం పదోన్నతులు ఇవ్వాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులకు 70 శాతం పదోన్నతి అవకాశాన్ని అమలు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాఠశాల విద్య కమిషనర్ సూచనలతో 100 శాతం పోస్టులను డీఎస్సీకి కేటాయించడంతో మున్సిపల్ టీచర్లు నష్టపోతున్నారని అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించి పదోన్నతులకు రీ షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు, డీఎస్సీ నిష్పత్తి 70: 30గా ఉండాలని సూచించారు. ప్రస్తుతం నిర్వహిస్తోన్న పదోన్నతుల ప్రక్రియలో కొన్ని మునిసిపాలిటీల్లో పదోన్నతులకు అసలు ఒక పోస్ట్ కూడా చూపించకుండా మొత్తం పోస్టులను డీఎస్సీకి కేటాయించటం సరికాదన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల్లో చేపట్టినట్టే ఉపాధ్యాయ పదోన్నతులు కూడా 70: 30 నిష్పత్తిని అమలు చేయాలని కోరారు. జీవో 117 రద్దు ద్వారా చాలా పోస్టులు కొత్తగా ఏర్పడతాయని, ప్రస్తుతం ఉన్న పోస్టుల్లో అర్హత గల మునిసిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని అభ్యర్థించారు.

ప్రకృతి చోద్యం!

ఎలాంటి రసాయనాలు వాడకుండా పంటలు పండించడమే ప్రకృతి వ్యవసాయం. దీనివల్ల భూసారం పెరగడంతో పాటు రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. అంతేకాకుండా ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులోకి వస్తాయి. అందువల్లే గత ప్రభుత్వాలు కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాయి. ఇందుకోసం వ్యవసాయశాఖలోనే ఒక విభాగాన్ని ఏర్పాటు చేశాయి. కానీ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం లెక్కలు ఘనంగా కనిపిస్తున్నా... క్షేత్రాలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు.



ప్రకృతి వ్యవసాయం పేరుతో సాగు చేసిన పంటలు

34,024 ఎకరాలు
అధికారుల లెక్కల ప్రకారం ప్రకృతి సాగు విస్తీర్ణం

367
ప్రకృతి సాగు విభాగంలోని సిబ్బంది

75,534 ఎకరాలు
ఈ ఏడాది ప్రకృత వ్యవసాయం లక్ష్యం

?
ప్రస్తుతం జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు

లక్ష్యం ఘనం.. క్షేత్రంలో అంతా శూన్యం

- ప్రకృతి వ్యవసాయంపై అంతులేని నిర్లక్ష్యం
- కాకిలెక్కలతో ప్రభుత్వాన్నే బురిడీ కొట్టిస్తున్న అధికారులు
- సేంద్రియసాగు పేరుతో జిల్లాలో జోరుగా కెమికల్స్ వినియోగం

ప్రకృతి వ్యవసాయం అంటే...

ప్రకృతి వ్యవసాయం అంటే ఎలాంటి పురుగు మందులు, రసాయన ఎరువులు వాడకుండా పంటలు పండించడం. పంటల సాగులో ద్రవ, ఘన జీవామృతాన్ని మాత్రమే వినియోగించడం. చీడపీడల నివారణకు కషాయాలు, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం, దశపర్ణి కషాయం తదితర వాటిని వినియోగించడం. ఏ రకంగానూ ఇటు పురుగుమందులు, అటు రసాయన ఎరువులు వినియోగించకపోవడం. అలా..వరుసగా మూడేళ్లు సాగు చేస్తే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లుగా పరిగణిస్తారు. కానీ అధిక దిగుబడుల కోసం చాలా మంది విచ్చల విడిగా రసాయన మందులు వాడుతున్నారు.

➤ కల్లూరు మండలం లక్ష్మీపురం పంచాయతీలో 631 మంది మహిళలు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఆ పంచాయతీలో ముగ్గురు మాత్రమే 100 శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అందుకే సర్టిఫికేషన్ కూడా ఎవరూ వెళ్లడం లేదు. అధికారులు చెబుతున్న లెక్కలన్నీ ఇలాగే ఉంటున్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయం జిల్లాలో రికార్డుల్లోనే సాగుతోంది. అధికారులు వేలాది ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుతోందని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం నామమాత్రానికే పరిమితమైంది. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక విభాగం ఉన్నా... ఉత్తుత్తి హడవుడే తప్ప ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. ప్రకృతి వ్యవసాయం కింద జిల్లాలో సాగుచేసిన ఆహార పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఉన్నట్లుగా శాస్త్రీయంగా నిర్ధారణ కావడంతో ప్రకృతి సేద్యం... అంతా చోద్యంగా మారింది.

లెక్కల్లో మాత్రం 34,024 ఎకరాల్లో...

2024–25 సంవత్సరంలో జిల్లాలోని 141 గ్రామ పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 53,834 మంది రైతులతో 75,534 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలన్నది వ్యవసాయ శాఖ లక్ష్యం. ప్రకృతి వ్యవసాయ విభాగం లెక్కల ప్రకారం ఇప్పటికే 32,607 మంది రైతులు 34,024 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లుగా చెబుతున్నారు. కానీ 32,707 మంది రైతుల్లో 5 శాతం మంది కూడా ప్రకృతి వ్యవసాయం చేయడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అందువల్లే జిల్లాలో వేలాది మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెబుతున్నప్పటికి.. సర్టిఫికేషన్ మాత్రం అతి కొద్ది మందికే వస్తోంది. అది కూడా స్వచ్ఛందంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకే దక్కుతోంది.

సాగుకు సిబ్బంది వెనుకంజ

ప్రకృతి వ్యవసాయ విభాగంలో 367 మంది పనిచేస్తున్నారు. వాస్తవానికి వీరంతా వారికున్న భూమిలో ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాలి. ప్రధానంగా ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరీ వరకు ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలవాలి. కానీ వీరిలోనే 60 శాతం మంది ప్రకృతి వ్యవసాయాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. రైతులకు ఆదర్శంగా ఉండాల్సిన సిబ్బందే కాడికిందపడేస్తే ఇక రైతులు ఎందుకు పట్టించుకుంటారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు కొందరు మాస్టర్ ట్రైనర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. విచ్చలవిడిగా కెమికల్స్ వాడుతున్నా.. ప్రకృతి వ్యవసాయం అంటూ నమ్మిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాలేకర్ స్ఫూర్తితో 150 మంది రైతులు..

ఎవరి ప్రమేయం లేకుండా స్వచ్ఛందగా జిల్లాలోని 150 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వీరు దాదాపు పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు. వీరు సుబాష్‌పాలేకర్ స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయం చేస్తుండటం విశేషం. ప్రకృతి వ్యవసాయ విభాగం చెబుతున్న వారిలో 5 శాతం కూడ ప్రకృతి వ్యవసాయం చేసే వారు లేరు. ఈ 150 మంది రైతుల ఉత్పత్తులతోనే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హడావుడి చేస్తున్నారు.

విచ్చల విడిగా కెమికల్స్ వాడకం

జిల్లాలో చాలా మంది పేరుకే ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆచరణలో మాత్రం అంతా కెమికల్స్ వ్యవసాయమే. ప్రకృతి వ్యవసాయం పెద్ద ఎత్తున జరుగుతుంటే రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గాలి. కానీ వివిధ మండలాల్లో లెక్కకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తుండటం గమనార్హం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.50 లక్షల టన్నుల వరకు రసాయన ఎరువుల వినియోగం ఉంది. జిల్లాల పునర్విభజన తర్వాత కర్నూలు జిల్లాలో 1.50 లక్షల టన్నుల వరకు వినియోగమవుతోంది. 2024–25 ఖరీఫ్‌లో 1,27,567.657 టన్నుల రసాయన ఎరువులను వినియోగించినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు.

సాగు విస్తీర్ణం పెంచుతాం

జిల్లా రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. ఆసక్తి ఉన్న వారిని గుర్తించి శిక్షణ ఇస్తున్నాం. జీవామృతం, కషాయాల తయారీపై కూడా అవగాహన కల్పిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయ విభాగంలో పనిచేసే సిబ్బంది కూడ ఎకరా, అర ఎకరా విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది 54,834 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.
– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి

ఏపీ మోడల్ విద్యపై కసరత్తు

ముసాయిదాపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం

సాక్షి, అమరావతి: ఏపీ మోడల్ విద్యా విధానంపై ముసాయిదా రూపకల్పనకు పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్ రామరాజు శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపారు. జీవో 117 ద్వారా 4,731 ప్రాథమిక పాఠశాలల్లో 3 – 5 తరగతులను యూపీ, హైస్కూళ్లలో విలీనం చేయగా వీటిని తిరిగి పాత విధానంలోకి తెచ్చేందుకు మార్గదర్శకాలను రూపొందించనున్నారు. ఇకపై అన్ని జిల్లాల్లో సీనియారిటీ జాబితాలతో మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో షెడ్యూల్ ప్రకారం మే నెలలో పదోన్నతులు, బదిలీలు చేపట్టనున్నారు. బేసిక్ ప్రైమరీ స్కూళ్లలో 20 మంది లోపు పిల్లలు ఉంటే ఒక ఎస్జీటీని, 60 మంది పిల్లలుంటే ఇద్దరు ఎస్జీటీలను, ఆపై ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని నియమిస్తారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తూ 120 మంది పిల్లలు కంటే ఎక్కువ ఉన్న పాఠశాలకు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పోస్టు కేటాయించే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రాథమిక పాఠశాలలకు 1 : 30, ఉన్నత పాఠశాలలకు 1 : 35 చొప్పున విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని నిర్ణయించనున్నారు. యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల విద్యార్థులు 30 మంది కంటే తక్కువ ఉంటే దాన్ని ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేస్తారు. 60 మంది కంటే ఎక్కువ మంది ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు. ఉన్నత పాఠశాలలో 6 – 10 తరగతుల వరకు 75 మంది విద్యార్థులకు మించి ఉంటే హెచ్ఎం, పీడీ పోస్టులను కేటాయిస్తారు. ఏటా మే 31 నాటికి ఖాళీలను పరిగణనలోకి తీసుకొని బదిలీలు నిర్వహించి జూన్ ఒకటో తేదీన పాఠశాలలో చేరేలా ఉత్తర్వులిస్తారు. ప్రధానోపాధ్యాయులకు కనీసం రెండు సంవత్సరాల సర్వీసు, గరిష్టంగా ఐదు సంవత్సరాల సర్వీసును... ఉపాధ్యాయులకు కనీసం రెండు సంవత్సరాల సర్వీసు, గరిష్టంగా 8 ఏళ్ల సర్వీసును పరిగణలోకి తీసుకుంటారు.

ఎన్‌టీఏ నిబంధనలతో విద్యార్థులకు ఇబ్బందులు

న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రికి పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధిక మంది విద్యార్థులు హాజరయ్యే జేఈఈ పరీక్షలకు ఎన్‌టీఏ విధించిన కొత్త నిబంధనలతో విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని, గతేడాది ఇదే సమయానికి 12.2 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే ఈ ఏడాది 5.01 లక్షలు మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగలిగారని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు నరహరి, కార్యదర్శి ఈశ్వరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి దరఖాస్తులో భాగంగా కేటగిరీ వారీగా అదనపు పత్రాలు అడగడంతో పాటు, ఆయా సర్టిఫికెట్ల ఐడీ, జారీ చేసిన తేదీ, అధికారి పేరును కూడా తప్పనిసరిగా అందించాలనే నిబంధన విధించారని తెలిపారు. ఇంత సంక్లిష్టమైన నిబంధనలతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని వివరించారు. సమయానికి ధ్రువపత్రాలు అందక, ఓబీసీ, ఈబీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ఈనెల 22 వరకు జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు గడువు ముగుస్తున్నందున విద్యాశాఖ మంత్రి కల్పించుకుని డాక్యుమెంటేషన్ సరళీకరించేలా ఎన్‌టీఏకు సూచించాలని వారు కోరారు.

మోటార్లు, ఇంజన్ల మరమ్మతులకు పరిహారం ఇవ్వాలి

ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కృష్ణా, బుడమేరు వరదల ప్రభావానికి దెబ్బతిన్న మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ఇతర వ్యవసాయ పరికరాలకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరావుతో కలిసి సంఘ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రమిచ్చారు. సంఘ కార్యదర్శి హరిబాబు మీడియాతో మాట్లాడుతూ..వరదల వల్ల దెబ్బతిన్న ఇంజన్లు, మోటార్ల రిపేర్ కోసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చవుతుందన్నారు. లంక భూముల్లో మేట వేసిన ఇసుకను తొలగించి, సాగుకు అనుకూలంగా మార్చుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చవుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ భారాన్ని కౌలురైతులు, రైతులు భరించే పరిస్థితుల్లో లేరని ప్రభుత్వమే ఈ ఇసుక మేటలను ఉచితంగా తొలగించాలని కోరారు. పంటలు కోల్పోయిన రైతులకు ఇచ్చిన నష్టపరిహారాన్ని పెంచాలని కోరారు. కౌలు రైతులు, సాగుదారుల రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వచ్చి మాట్లాడేదాకా నో బిల్

- తుంగభద్ర ఎగువ, దిగువ కాలువ పనులను నిలిపేసిన టీడీపీ నేతలు
- బిల్లులు ఆపాలని ఆర్థికశాఖకు రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు లేఖ
- టీబీ బోర్డుకు ఆర్థికశాఖ లేఖ, అకౌంట్లు బ్లాక్ చేసిన కర్ణాటక ట్రెజరీ
- కాంట్రాక్టర్లు వచ్చి కలవలేదనే కారణంతో టీడీపీ ఎమ్మెల్యే నిర్ణయం
- వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లూ ఇవ్వని వైనం



టీబీ బోర్డుకు ఏపీ ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ రాసిన లేఖ

కర్నూలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ ప్రతినిధులు అభివృద్ధి పనుల్లో వాటాల కోసం వెంపర్లాడుతున్నారు. ఈ క్రమంలో తొలుత కాంట్రాక్టర్లను టార్గెట్ చేశారు. తమను కలవకుండా...తమతో మాట్లాడకుండా... బిల్లులు ఎలా తీసుకుంటారో చూద్దాం... అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ ఆధునికీకరణల పనులు సరిగా జరగలేదని, వెంటనే ఆ పనులు నిలిపివేయాలని ఆర్థిక శాఖకు అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాస్ సెప్టెంబరు 5వ తేదీన లేఖ రాశారు. ఆ లేఖ ఆధారంగా సెప్టెంబరు 13న ఏపీ ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ తుంగభద్ర బోర్డుకు లేఖ రాశారు. దీంతో కర్ణాటక ప్రభుత్వం బోర్డు అకౌంట్లను బ్లాక్ చేసింది. రెండు నెలలు అవుతున్నా.. ఇంత వరకు అకౌంట్లు తెరవకపోవడంతో బోర్డు పరిధిలో పని చేసే ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

బాబు హయాంలో అరకొర పనులు

అనంతపురం, కర్నూలు జిల్లాలకు సాగు, తాగు నీటిని అందిస్తున్న హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ కాల్వల ఆధునికీకరణకు నోచుకోక ఆయకట్టుకు నీరందని పరిస్థితులు నెలకొంది. దీంతో 2014 ఎన్నికలకు ముందు కర్నూలు జిల్లాకు హక్కుగా రావాల్సిన తుంగభద్ర జలాలను తెచ్చేందుకు తుంగభద్ర దిగువ కాలువను ఆధునికీకరణ చేయించి వాటా నీటిని తీసుకొచ్చే బాధ్యత తనదని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చినా అరకొర పనులు చేపట్టారు. టీబీ డ్యాం నుంచి ఎల్ఎల్‌సీ కాల్వ 0 కి.మీ నుంచి 70 కి.మీ వరకు 70 శాతం పనులు మాత్రమే చేసి మిగిలిపోయిన పనులు చేయకుండా చేతులెత్తేశారు. 2019 ఎన్నికల్లో ఏపీలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 70 కి.మీలోపు మిగిలిపోయిన 30 శాతం పనులతో పాటు, మొదటి విడతలోని 80 కి.మీ నుంచి 115 కి.మీ వరకు చేపట్టిన రూ.520 కోట్ల పది ప్యాకేజీ పనులను పూర్తి చేశారు. ఆ తరువాత రెండో విడత కింద రూ.410 కోట్లతో 11 నుంచి 20 ప్యాకేజీల కింద 115 కి.మీ నుంచి 205 కి.మీ వరకు ఆధునికీకరణ పనులను చేశారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా కాంట్రాక్టర్లకు బిల్లులు కాలేదు.

తమను కలవలేదనీ...

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరగా...ఆ పార్టీ ప్రజాప్రతినిధులు అధునికీకరణ బిల్లుల్లో కమీషన్ల కోసం ప్లాన్ చేశారు. ఈ క్రమంలోనే అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఓ మంత్రి సహకారంతో ఆర్థిక శాఖకు మాజీ మంత్రి కాల్వ శ్రీనివాస్ లేఖ రాశారు. అక్కడి నుంచి కర్ణాటక ఆర్థిక శాఖకు, అక్కడి నుంచి కర్ణాటక ట్రెజరీకి లేఖ వెళ్లడంతో టీబీ బోర్డు ఖాతాలను బ్లాక్ చేశారు. దీంతో కాంట్రాక్టర్లు అనంతపురం జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రిని కలిసేందుకు గత వారం రోజులుగా ప్రయత్నిస్తున్నా... అసెంబ్లీ సమావేశాలను సాకు చూపి వారిని కలవకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా నిలిపివేసేందుకు బోర్డు ఖాతాలు బ్లాక్ చేయడంతో బోర్డు పరిధిలోని ఉద్యోగులు, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ కాల్వల పరిధిలోని చిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా వేతనాలు, పింఛన్లు రాకపోవడంతో ఈ నెల 12న టీబీ డ్యాం పరిధిలోని ఉద్యోగులు టీబీ బోర్డు కార్యదర్శి ఆఫీస్ ఎదుట ఆందోళన చేశారు.

రాధాకృష్ణా.. చీకటి సంపాదనపై విచారణకు సిద్ధమా!

సీబీఐ, ఈడీ విచారణకు ఇద్దరం లేఖ రాద్దామా

ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు ఎంపీ విజయసాయిరెడ్డి సవాల్

సాక్షి, అమరావతి: 'రాధాకృష్ణా.. నీ చీకటి సంపాదనపై విచారణకు సిద్ధమా. సీబీఐ, ఈడీ విచారణకు ఇద్దరం లేఖ రాద్దామా' అని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుంబాక విజయసాయిరెడ్డి సవాల్ విసిరారు. ఆంధ్రజ్యోతి బ్రేక్‌ఫాస్ట్ న్యూస్‌లో వేమూరి రాధాకృష్ణ ఉవాచ అంటూ వ్యాఖ్యానాలు చేయటంపై విజయసాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. ఈ విషయమై రాధాకృష్ణను ఉద్దేశించి శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విజయసాయిరెడ్డి పోస్టు చేశారు. 'ఆంధ్రజ్యోతికి ఉత్తమ జర్నలిస్ట్ సంప్రదాయాలు పాటించమని, మా స్పందన కూడా ప్రసారం చేయాలని చెప్పా.. నువ్వు అసలు చిత్తశుద్ధి కలిగిన వృత్తిపరమైన పాత్రికేయుడివేనా?' అంటూ ఏబీఎన్ రాధాకృష్ణను ప్రశ్నించారు. 'కాంగ్రెస్, టీడీపీ కుట్రలో భాగంగా 12 నెలలు జైల్లో గడిపాను. నాపై ఆదాయానికి మించిన ఆస్తుల అభియోగాలు లేవు. నీలాగ మోసగాడినో, దోపిడీదారునో, బ్లాక్‌మెయిలర్‌నో, వీలర్ డీలర్‌నో కాదు. గుర్తుంచుకో!' అంటూ విజయసాయిరెడ్డి మండిపడ్డారు.

బ్రోకర్ల దగ్గర దండుకోలేదు

'నీలాగ మద్యం సిండికేట్ బ్రోకర్ల దగ్గర, ఖనిజాల సిండికేట్ బ్రోకర్ల దగ్గర ప్రముఖ రాజకీయ నాయకుల పేర్లు చెప్పి వారికి ఇవ్వాలంటూ నెలనెలా కోట్లకు కోట్లు నేను తీసుకోలేదు. ఇప్పుడు 2024లో విజయసాయిడ్డి అనే నేను నువ్వు చెప్పే భూదందాలు, భూముల ఆక్రమణలుపై సీబీఐ, ఈడీ విచారణకు సిద్ధం. నువ్వు సిద్ధమేనా వేమూరి రాధాకృష్ణా. ఇద్దరం కలసి జాయింట్‌గా కేంద్ర విచారణ సంస్థలతో విచారణకు పిటిషన్ పెట్టుకుందాం. సిద్ధమా!. సాధారణ విలేకరిగా ఇంత సంపద పోగేసుకున్నావ్. సీఏ చదివి.. ఆడిటర్‌గా ప్రాక్టీసుతో ఈ స్థాయికి నేను వచ్చాను. ఎవరెలా సంపాదించారో తెలుగు ప్రాంతాల బయట నాతో చర్చకు సిద్ధమా? రాధాకృష్ణా' అని విజయసాయిరెడ్డి సవాల్ విసిరారు. '22 ఏళ్ల క్రితం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సాధారణ విలేకరివి. ఆంధ్రజ్యోతి స్థాపకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు కేఎల్ఎన్ ప్రసాద్ వారసుల నుంచి ఆ పత్రికను సొంతం చేసుకుని 2002 అక్టోబర్‌లో మొదలెట్టి కొద్ది సంవత్సరాల్లోనే దాదాపు 20 ఎడిషన్లు పెట్టే స్థాయికి ఎదిగావు. నూజివీడు సీడ్స్ యజమాని మండవ ప్రభాకరరావు, విజయ ఎలక్ట్రికల్స్ నాటి యజమాని దాసరి జైరమేష్ వంటి పారిశ్రామికవేత్తలకు వాటాలు ఉన్నట్టు చెప్పి మరెందరో రహస్య పెట్టుబడిదారులను మోసం చేసి నువ్వు ఈ పత్రికను రూ.వేలాది కోట్ల సంపదగా మార్చుకున్న తీరు తెలుగు నేలలోనే అపూర్వం. అనితర సాధ్యం' అని ఎద్దేవా చేశారు.







గట్కా యుద్ధ విద్య



నవంబర్ 15, శిక్కు మత స్థాపకుడైన గురునానక్ జయంతి. ఈ సందర్భంగా దేశమంతా గురుద్వారాలలో వేడుకలు జరుగుతాయి. అంతే కాదు శిక్కులు తాము ప్రత్యేకంగా తీర్చిదిద్దుకున్న యుద్ధకళలను ప్రదర్శిస్తారు. శిక్కు యుద్ధకళను 'గట్కా' అంటారు. దీని మూలార్థం కర్రసాము అయినా ఈ యుద్ధకళలో రకరకాల రక్షణ ఆయుధాలతో విన్యాసాలు ఉంటాయి. 17వ శతాబ్దం నుంచి శిక్కులు ఈ యుద్ధకళను కాపాడుకుంటూ వస్తున్నారు. అమృత్‌సర్‌లో శుక్రవారం రోజు 'గట్కా'ను ప్రదర్శిస్తున్న శిక్కుయోధుడు.

● సినిమా చూద్దామా?

రోబోల ఎమోషన్స్ అన్ లిమిటెడ్



ట్రాన్స్‌ఫార్మర్స్.... ఈ పేరు ప్రపంచంలోని దాదాపు ఏమూలనున్న సినీ ప్రేక్షకుడికైనా సుపరిచితమే. 2007 నుండి సీరీస్‌గా వస్తున్న ఈ ట్రాన్స్‌ఫార్మర్స్ చిత్రాలు ఆరు నుండి అరవై ఏళ్ళ పిల్లల వరకు ప్రతి ఒక్కరినీ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ ట్రాన్స్‌ఫార్మర్స్ ఫార్మెట్‌లోని క్యారెక్టర్స్ అంటే చిన్న పిల్లలకు చాలా ఇష్టం. ఆప్టిమస్ ప్రైమ్, సెంటినల్ ప్రైమ్, మాక్సిమస్ ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే వున్నాయి. అందుకేనేమో ఈ ఫార్మెట్‌లోని పాత్రలు యానిమేషన్, గేమింగ్ రంగాలలో కూడా తమ ఉనికిని చాటుతున్నాయి. ఇక ఇదే సీరిస్‌లో భాగంగా ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్స్ వన్ అనే యానిమేషన్ చిత్రం విడుదలైంది. ఆప్టిమస్ ప్రైమ్, మెగాట్రాన్ పాత స్నేహితులు. వారి సంబంధం సైబర్ ట్రాన్ గతిని మార్చేస్తుంది. అదే ఈ సినిమా. భవిష్యత్తులో మనిషి జీవనానికి చేయూతయ్యే రోబోల మీద తీస్తున్న సినిమాలే ఈ ట్రాన్స్‌ఫార్మర్స్ చిత్రాలు. కాకపోతే మనుషులకు ఎటువంటి ఎమోషన్స్ కూడిన కథలు సినిమాలవుతాయో అంతకుమించి ఈ మర మనుషులతో చేయిస్తున్న విచిత్రాలే ఈ ట్రాన్స్‌ఫార్మర్స్. ఓవరాల్‌గా ట్రాన్స్‌ఫార్మర్స్ వన్ సినిమా మంచి యానిమేషన్స్‌తో పిల్లలతో పాటు పెద్దవాళ్ళను ఆకట్టుకుంటుంది. ఎందుకంటే మనుషులకు ఎమోషన్స్ లిమిటెడ్ అదే మర మనుషులకు యానిమేషన్ రూపంలో ఎమోషన్స్ అన్ లిమిటెడ్. వర్త్ టు వాచ్ మూవీ విత్ యువర్ కిడ్స్.

● మహనీయులు | ఆంధ్రకేసరి

అనుకున్నది సాధించిన ఆంధ్రకేసరి



చిన్నకష్టం వస్తేనే కొందరు అల్లాడిపోతారు. ఏ దారీ లేదనుకొని మానసికంగా కుంగిపోతారు. కానీ ఆ పిల్లాడు చిన్నతనంలోనే ఎన్నో కష్టాలు అనుభవించాడు. వారిది మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు అతణ్ని ప్రేమగా చూసుకునేవారు. అతనికి 12 ఏళ్ల వయసులో తండ్రి మరణించాడు. దీంతో ఆ తల్లీకొడుకుల్ని ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. తల్లి అతణ్ని తీసుకుని ఒంగోలుకు వచ్చి చిన్న హోటల్ నడుపుతూ కష్టపడి చదివించింది. ఆ పిల్లవాడు పెరిగి పెద్దయ్యి మెట్రిక్యులేషన్ పరీక్షలో పాసయ్యాడు. న్యాయవాద వృత్తిలో చేరాలని కలలుగన్నాడు. అయితే పరీక్ష ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడ్డాడు. ఆ సమయంలో తల్లి తన పట్టుచీర తాకట్టు పెట్టి ఫీజు కట్టేందుకు డబ్బు ఇచ్చింది. తల్లి చూపిన ఆదరణతో ఆయన బాగా చదువుకొని లాయర్ అయ్యాడు. ఇంగ్లండ్ వెళ్లి బారిస్టర్ పట్టా పొందాడు. తిరిగి స్వదేశానికి వచ్చి మద్రాసు హైకోర్టులో న్యాయవాది వృత్తిని ప్రారంభించాడు. ఆ తర్వాత ఆ వృత్తిని వదిలి, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్ పోలీసుల తుపాకీకి తన గుండె చూపించి, 'దమ్ముంటే కాల్చండి' అంటూ ధైర్యాన్ని చూపాడు. ఆయనే 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు. ఆంధ్ర రాష్ట్రానికి ఆయన తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారు. జీవితమంతా ప్రజాసేవలోనే గడిపారు. ఆయన పేరు మీదే ఒంగోలు జిల్లాకు 'ప్రకాశం' జిల్లా అని పేరు పెట్టారు. ఎన్ని కష్టాలు వచ్చినా కుంగిపోకుండా అనుకున్నది సాధించేదాకా పోరాడితే మీరు కూడా ఆయనంత వారవుతారు.

● విన్నారా

ఆ స్కూల్‌లో చేరితే... క్లాసులు పాఠాలూ ఉండవు







స్కూల్ అనగానే క్లాస్‌రూమ్‌లు, బల్లలు, బ్లాక్‌బోర్డులు, పాఠాలు చెప్పే టీచర్లు గుర్తుకొస్తారు. కానీ యూరప్‌లోని నెదర్లాండ్స్ దేశంలో ఉన్న 'అగోరా స్కూల్'లో మాత్రం అవేమీ ఉండవు. అక్కడున్న పిల్లలంతా తమకు నచ్చిన ఆటలు ఆడుకోవచ్చు, నచ్చినట్లు ఉండొచ్చు. అక్కడ గదుల్లో బల్లలు, కుర్చీలుంటాయి. కానీ అవేవీ మనకు మామూలు స్కూళ్లలో కనిపించేలా ఉండవు. అక్కడ పిల్లలు చూసేందుకు టీవీ, వాడేందుకు కంప్యూటర్లు ఉంటాయి.

అక్కడ తరగతులకు బదులుగా గ్రూప్‌లు మాత్రమే ఉంటాయి. ఒక్కో గ్రూప్‌లో 17 మంది దాకా ఉంటారు. రకరకాల వయసున్న వారు ఒకచోట చేరతారు. స్కూల్‌కి రాగానే ఆ రోజు వారు చేయాల్సిన పనులను, పూర్తి చేయాల్సిన లక్ష్యాలను రాసుకుంటారు. ఇవి కూడా అందరికీ ఒకేలా ఉండవు. ఎవరికి తగ్గట్టు వారికి వేరుగా ఉంటాయి. ఒకరు సంగీతం నేర్చుకోవాలనుకుంటే మరొకరు పుస్తకం చదవాలన్నది పనిగా పెట్టుకుంటారు. మరొకరు ఆ రోజుకు ఒక బొమ్మ గీయడాన్ని లక్ష్యంగా మార్చుకుంటారు. టీచర్లు వారు చేయాలనుకున్న పనిలో సాయం చేస్తారు... కొట్టడం, కోప్పడటం లాంటివి చేయరు.

ఆటల మీదే కాకుండా ఇతర అంశాల మీద దృష్టి పెట్టేవారు కూడా ఉంటారు. అలాంటి వారి కోసం అక్కడ రకరకాల విభాగాలున్నాయి. వంట నేర్చుకోవడం, శిల్పాలు చేయడం, చెక్కతో కళాకృతులు తయారు చేయడం, చిత్రలేఖనం, రోబోలు తయారు చేయడం.. ఇలా ఎవరికి నచ్చిన పని వారు నేర్చుకునే అవకాశం కల్పిస్తారు. కేవలం చదువుకోవాలనుకునే వారి కోసం 'సైలెంట్ రూమ్స్' ఉంటాయి. అందులోకి వెళ్లి, కూర్చుని నచ్చిన పుస్తకాలు చదువుకోవచ్చు.

రొటీన్ స్కూళ్లకు భిన్నంగా పిల్లలకు సృజనాత్మక విద్య నేర్పించాలనుకునే వారి కోసం 2014లో ఈ స్కూల్‌ని స్థాపించారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా పిల్లలు ఈ స్కూల్లో ఉంటారు. మొత్తం మూడు దేశాల్లో ఈ స్కూళ్లను మొదలుపెట్టారు. ప్రస్తుతం 1800 మందికిపైగా పిల్లలు అక్కడచదువుకుంటున్నారు.



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియకపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది. ఈ వారం కొన్ని పదాలు...

గేహము	ఇల్లు
గోననము	కొండచిలువ
గోదా	కుస్తీ చేయు ప్రదేశం
గోస్తని	ద్రాక్ష
గౌళి	బల్లి
గ్రహరాజు	చంద్రుడు
గ్రావము	కొండ
ఘంటిక	చిరు గంట
ఘటిక	24 నిమిషాల కాలం
ఘర్మం	చెమట
చంచల	మెరుపు
చంద్రకి	నెమలి
చక్షువు	కన్ను

● ఈ సామెత తెలుసుకోండి!

'చల్లకొచ్చి ముంత దాచినట్టు'

ఇప్పుడు మనకు పాలు, పెరుగు కావాలంటే దుకాణాల్లో కొంటున్నాం. ఒకప్పుడు ఇళ్లల్లో పాడి పశువులుంటే వాటి నుంచి పాలు తీసి పెరుగు తయారు చేసేవారు. దాన్ని చిలికి వెన్న తీసేవారు. వెన్న తీసేసిన తర్వాత ఆ పలుచగా మారిన పెరుగును 'చల్ల' అంటారు. దాన్ని కొందరు తాగేవారు. మరికొందరు అన్నంలో మజ్జిగలా కలుపుకొని తినేవారు. ఇంట్లో పాడి పశువులు లేనివారు తమ పక్కింటివారి దగ్గర చల్ల అడిగి తెచ్చుకునేవారు. ఇందుకోసం మాటిమాటికీ ఒక ముంత (చిన్నకుండ) తీసుకుని వాళ్లింటికి వెళ్లడం మొహమాటంగా ఉండేది. దీంతో కొందరు చల్ల కోసం వచ్చి ముంత వారికి కనబడకుండా దాచేవారు. వచ్చింది చల్ల కోసమే అయినా రకరకాల మాటలు మాట్లాడి ఆ తర్వాత అసలు విషయం చెప్పేవారు. ముఖ్యమైన పనుల కోసం ఎవరి వద్దకైనా వెళ్లి ఆ విషయాలు కాకుండా వేరే సంగతులు మాట్లాడే సందర్భంలో ఈ సామెత వాడతారు.



మన పొడుపు కథలు

1. ఆకాశంలో 60 గదులు. గది గదికో సిపాయి?
2. దాస్తే పిడికిలిలో దాగుతుంది. తీస్తే ఇల్లంతా జారుతుంది?
3. తెల్ల కోటు తొడుక్కున్న ఎర్రముక్కు దొర?
4. తోలు నలుపు తింటే పులుపు
5. కొమ్ములుంటాయి కానీ ఎద్దు కాదు. అంబారీ ఉంటుంది కానీ ఏనుగు కాదు?
6. అమ్మ తమ్ముడు కాదు. కానీ మీకు మేనమామ

1) తేనెపట్టు 2) దీపం వెలుగు 3) కొవ్వొత్తి 4) చింతపండు 5) నత్త 6) చందమామ

నోరూరించే కేక్ కథ విందామా?



పుట్టిన రోజంటే కేక్ కోయాల్సిందే! ఏదైనా వేడుక జరిగినా కేక్ కోయడం తప్పనిసరి. లోపల బ్రెడ్‌తో, పైన క్రీమ్‌తో నోరూరించే కేక్ అంటే అందరికీ ఇష్టమే. అయితే ఈ కేక్ చరిత్రేమిటో తెలుసుకుందామా?

కేక్ ఎప్పుడు ఎక్కడ పుట్టిందో కచ్చితమైన ఆధారాలు లేవు. అయితే క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో ఈజిప్టులో కేక్ తయారు చేసినట్లు చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. ఇవాళ మనం చూసే కేక్‌కు భిన్నంగా తేనె,గోధుమపిండితో దాన్ని తయారు చేసేవారు. అప్పట్లో సంపన్నులు వారింటి వేడుకల్లో అతిథులకు కేక్‌ను ఇచ్చేవారని, కేక్ రుచికరంగా మారేందుకు తేనె, తృణధాన్యాలు వాడేవారని చరిత్రకారులు అంటున్నారు. రోమ్ సామ్రాజ్యంలో సైతం కేక్ తయారీ ఉందని చరిత్ర చెబుతోంది. అప్పట్లో కేక్‌లు తయారు చేసి పూలు, ఇతర ఆకులతో అలంకరించేవారు. అందువల్లే ఆ కాలంలో అవి ఆలివ్ కేక్, ప్లమ్ కేక్‌గా ప్రసిద్ధి పొందాయి.

మొదట్లో కేక్ తయారీకి తేనె వాడేవారు. చక్కెర అందుబాటులోకి వచ్చిన తర్వాత చక్కెతో తయారుచేయడం మొదలుపెట్టారు. అయితే అప్పట్లో చక్కెర ఖరీదైన వస్తువు కావడం వల్ల కేక్‌లు కేవలం సంపన్నవర్గాల వారికే పరిమితమయ్యేవి. పుట్టిన రోజులు, పెళ్లిరోజుల సమయంలో కేకు కోసి అందరికీ పంచడం అప్పట్లో ఆనవాయితీగా మారి నేటికీ కొనసాగుతోంది.

1764లో డాక్టర్ జేమ్స్ బేకర్, జాన్ హానోన్ కలిసి కోకో గింజలను పొడి చేసి పేస్ట్‌లా మార్చి తొలిసారి చాక్లెట్ కేక్ తయారు చేశారు. ఇప్పుడు మనం చూస్తున్న కేక్ రూపానికి వారు అంకురార్పణ చేశారు. దీంతో కేక్‌ను వివిధ పదార్థాలతో తయారు చేయొచ్చన్న ఆలోచన అందరికీ వచ్చింది.

ఆ తర్వాత 1828లో డచ్‌కు చెందిన శాస్త్రవేత్త కోయెన్‌రాడ్ జోహన్నెస్ వాన్ హౌటెన్ కోకో గింజల్లో పలు రకాల పదార్థాలు కలిపి, అందులోని చేదును పోగొట్టి కేక్‌ను మరింత రుచికరంగా తయారు చేసే పద్ధతిని కనుగొన్నారు.

ఆ తర్వాత బ్రిటీష్ వంటవాళ్లు మరిన్ని ప్రయోగాలు చేసి రకరకాల ఫ్లేవర్లలో కేక్‌లు తయారుచేయడం మొదలుపెట్టారు. అందులో గుడ్డు, చక్కెర, వైన్, బాదం, జీడిపప్పు వంటివి కలిపి సరికొత్త ప్రయోగాలు చేశారు. 1947 తర్వాత మైక్రోవేవ్ అవెన్స్ రావడంతో కేక్‌ను బేక్ చేసే ప్రక్రియ సులభంగా మారింది. ప్రస్తుతం వందలాది ఫ్లేవర్లలో కేక్‌లు దొరుకుతున్నాయి. గుడ్డు తినడం ఇష్టపడని వారికోసం 'ఎగ్‌లెస్ కేక్' తయారుచేస్తున్నారు. రోజూ ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో కేక్‌లు తయారై అమ్ముడుపోతున్నాయి.



● పాడుదాం గేయం

పచ్చని చెట్టు

ఇదిగో ఇదిగో పచ్చని చెట్టు
ప్రకృతి భవితకు బంగారు మెట్టు
కొమ్మలు రెమ్మలు నిండుగ వేసే
చల్లని నీడను పుడిమికి పంచె

ఔషధమంటి వేపచెట్టు
ఊడలు వాలే మర్రిచెట్టు
కాయలు పంచే మామిడిచెట్టు
అన్నీ మనకే అందించే చెట్టు

చిలకలు వాలే జామచెట్టు
పిచుకలు నిలిచే రావిచెట్టు
ఉడతలు కదిలే కానుగచెట్టు
కంటికి ఇంపుగా కనిపించే చెట్టు

ఇదిగో ఇదిగో పచ్చని చెట్టు
ప్రకృతి భవితకు బంగారు మెట్టు
కొమ్మలు రెమ్మలు నిండుగ మొలిచె
చల్లనినీడను పుడిమికి పంచె

బిజినెస్ రీల్

ఏపీ, తెలంగాణ నుంచి ఎయిర్ ఇండియా కొత్త సర్వీసులు

శీతాకాల షెడ్యూల్‌లో 45 శాతం పెంపు



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ శీతాకాల షెడ్యూల్‌లో భాగంగా హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి తన విమాన సర్వీసులను గణనీయంగా పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పట్టణాల నుంచి వారానికి 173 విమాన సర్వీసులు నడుస్తుండగా, 250కు (45 శాతం అధికం) పెంచుతున్నట్టు తెలిపింది. విశాఖపట్నం, విజయవాడ, గ్వాలియర్‌తో హైదరాబాద్‌కు నేరుగా సర్వీసులు అందుబాటులోకి వస్తాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరు, కోచికి సర్వీసులు పెరగనున్నట్టు ప్రకటించింది. సర్వీసుల పెంపు ఈ ప్రాంతాల వారికి సౌలభ్యంగా ఉంటుందని ఎయిర్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అంకుర్ గార్గ్ పేర్కొన్నారు. ప్రతి వారం 200 సర్వీసులతో తమ నెట్ వర్క్‌లో హైదరాబాద్ మూడో అతిపెద్ద కేంద్రంగా ఉన్నట్టు చెప్పారు. హైదరాబాద్ నుంచి నేరుగా 17 దేశీయ విమానాశ్రయాలకు, సౌదీ అరేబియాలోని మూడు ప్రధాన ఎయిర్‌పోర్ట్‌లకు సర్వీసులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విజయవాడ నుంచి ఎయిర్ ఇండియా ఒక్కటే అంతర్జాతీయ సర్వీసులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి ప్రతి వారం 28 విమాన సర్వీసులను దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య ఎయిర్ ఇండియా నడుపుతోంది. ఇక దేశవ్యాప్తంగా ఈ శీతాకాల సీజన్‌లో ఎయిర్ ఇండియా 400 రోజువారీ విమాన సర్వీసులు నిర్వహించనున్నట్టు తెలిపింది. గతేడాది ఇదే సీజన్‌లో 325 రోజువారీ సర్వీసులు నిర్వహించింది.

వేలం వేస్తేనే దేశీ టెల్కోలకు అవకాశాలు

శాట్‌కామ్ స్పెక్ట్రంపై ట్రాయ్‌కి జియో లేఖ

న్యూఢిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్‌కి ఉపయోగించే స్పెక్ట్రంను వేలం వేస్తేనే విదేశీ దిగ్గజాలతో దేశీ టెల్కోలు పోటీపడేందుకు అవకాశాలు లభిస్తాయని టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్‌కి రాసిన లేఖలో రిలయన్స్ జియో పేర్కొంది. దేశీయంగా మూడు టెల్కోలు అనేక సంవత్సరాలుగా నిర్మించుకున్న సామర్థ్యాల కన్నా స్టార్‌లింక్, క్విపర్ శాట్‌కామ్ బ్యాండ్‌విడ్త్ అధికమని తెలిపింది. శాట్‌కామ్ సంస్థలు కేవలం టెరెస్ట్రియల్ కవరేజీ లేని మారుమూల ప్రాంతాల్లో మాత్రమే సేవలు అందిస్తాయి కాబట్టి వాటికి ప్రాధాన్యతనివ్వాలనడం సరికాదని జియో వ్యాఖ్యానించింది. స్టార్‌లింక్, క్విపర్, ఇతరత్రా శాట్‌కామ్ దిగ్గజాలు తాము పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో టెరెస్ట్రియల్ కమ్యూనికేషన్ సర్వీసులను కూడా అందించేందుకు పోటీపడతామని ఇప్పటికే వెల్లడించినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో స్పెక్ట్రంను వేలం వేయకుండా కేటాయించిన పక్షంలో వాటితో పోటీపడేందుకు దేశీ సంస్థలకు సమాన అవకాశాలు దొరకవని పేర్కొంది. అంతర్జాతీయ విధానాలకు తగ్గట్లుగా శాట్‌కామ్ స్పెక్ట్రంను వేలం వేయకుండా కేటాయించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతుండటంతో జియో లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-11-2024

విశాఖ	535-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

డివిడెండ్ల కంటే రాయల్టీలకే మొగ్గు

- లిస్టెడ్ కంపెనీలపై సెబీ నివేదిక
- 2014-23 మధ్య వార్షిక విశ్లేషణ
- 20 శాతానికంటే అధిక చెల్లింపులు!



సాధారణంగా చాలా కంపెనీలు టెక్నాలజీ వినియోగించుకున్నందుకో.. ట్రేడ్ మార్క్ వాడుకుంటున్నందుకో మాతృ సంస్థలకు రాయల్టీలు చెల్లిస్తుంటాయి. అయితే గత దశాబ్ద కాలంలో కొన్ని లిస్టెడ్ కంపెనీలు వాటాదారులకు డివిడెండ్ల చెల్లింపులకంటే రాయల్టీల చెల్లింపులపైనే మక్కువను ప్రదర్శించాయి. 2013-14 నుంచి 2022-23 మధ్య కంపెనీల వార్షిక తీరుపై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఒక నివేదికకు తెరతీసింది. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీలు ఒక ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన నికర లాభాల నుంచి కొంతమేర రాయల్టీల రూపేణా సంబంధిత పార్టీల(ఆర్‌పీలు)కు చెల్లిస్తుంటాయి. ఈ బాటలో 233 లిస్టెడ్ కంపెనీలు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌పీలకు రూ. 10,779 కోట్లు చెల్లించాయి. ఇవి 2013-14 ఏడాదిలో చెల్లించిన రూ. 4,955 కోట్లతో పోలిస్తే రెట్టింపునకుపైగా ఎగశాయి! లిస్టెడ్ కంపెనీలలో ప్రతీ 4 సందర్భాలలో ఒకసారి తమ నికర లాభాల్లో 20 శాతానికి మించి ఆర్‌పీలకు రాయల్టీగా చెల్లించాయి. ఇక మరికొన్ని సందర్భాలలో వాటాదారులకు డివిడెండ్లు పంచకపోయినా.. ఆర్‌పీలకు రాయల్టీ కోసం నిధులు వెచ్చించాయి. లేదా డివిడెండ్లకు మించి రాయల్టీలు చెల్లించాయి!

టర్నోవర్‌లో 5 శాతం

దేశీయంగా వివిధ రంగాలకు చెందిన 233 లిస్టెడ్ కంపెనీల వార్షిక సమాచారం ప్రకారం సెబీ తాజా నివేదికను రూపొందించింది. 2013-14 నుంచి 2022-23 మధ్య కాలంలో ఈ కంపెనీలు టర్నోవర్‌లో 5 శాతానికంటే తక్కువగా రాయల్టీలపై వెచ్చించాయి. సాధారణంగా టెక్నాలజీ బదిలీ, ఇతర సాంకేతిక సహకారం లేదా ట్రేడ్ మార్క్, బ్రాండ్ల వినియోగం తదితరాలకు సంబంధించి ఆయా కంపెనీలు తమ ఆర్‌పీలకు రాయల్టీలను చెల్లిస్తుంటాయి. దేశీయంగా లిస్టెడ్ కంపెనీలు హోల్డింగ్(మాతృ) సంస్థలకు లేదా అనుబంధ సంస్థలకు ఇలాంటి చెల్లింపులు చేపడుతుంటాయి. గత దశాబ్ద కాలంలో ఇలాంటి 1,538 సందర్భాలను తీసుకుంటే టర్నోవర్‌లో 5 శాతంలోపు రాయల్టీలకు వినియోగించాయి. ఇందుకు వాటాదారుల అనుమతి తీసుకోవలసిన అవసరంలేకపోవడం గమనార్హం! వీటిలో 1,353 సందర్భాలలో నికర లాభాలు ఆర్జిస్తున్న కంపెనీలుకాగా.. 185 సందర్భాలలో నష్టాలు నమోదు చేస్తున్న కంపెనీలు రాయల్టీలను చెల్లించాయి. వీటిలో 63 కంపెనీలు ఇందుకు రూ. 1,355 కోట్లను వెచ్చించాయి. వీటిలో ఐదేళ్లుగా నష్టాలు నమోదు చేస్తున్న 10 కంపెనీలు రూ. 228 కోట్లను ఆర్‌పీలకు చెల్లించాయి.

ఆందోళనకరం

ఆర్‌పీలకు రాయల్టీలు చెల్లించే అంశంపై కొన్ని కంపెనీలు సరైన సమాచారాన్ని వెల్లడించకపోవడం గమనార్హం! ఇదేవిధంగా రాయల్టీ చెల్లింపుల సమాచార వెల్లడిలో ఒకేరకమైన నిబంధనల అమలు లేకపోవడాన్ని సెబీ నివేదికలో ప్రస్తావించింది. నిజానికి వార్షిక నివేదికల్లో రాయల్టీ చెల్లింపుల రేటు, ఎందుకు చెల్లిస్తున్నదీ తదితర వివరాలు వెల్లడించకపోవడం ఆందోళనకర అంశమంది. గత పదేళ్లలో 79 కంపెనీలు ఆర్‌పీలకు నిరంతరంగా రాయల్టీలు చెల్లిస్తూ వచ్చాయి. 2018-19వరకూ ఆయా కంపెనీల టర్నోవర్, నికర లాభాల్లో వృద్ధికి అనుగుణంగా చెల్లింపులు చేపడుతూ వచ్చాయి. ఆపై చెల్లింపుల్లో మార్పులు చోటు చేసుకున్నట్లు నివేదికలో సెబీ ప్రస్తావించింది.

అనుమతులు కావాలి

2018-19 తదుపరి సెబీ తాజా నిబంధనలు అమల్లోకి వచ్చాయి. దీంతో కన్సాలిడేటెడ్ టర్నోవర్‌లో 5 శాతానికి మించిన రాయల్టీ చెల్లింపులకు వాటాదారుల అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ఫలితంగా రాయల్టీ చెల్లింపుల్లో మార్పులకు తెరలేచింది. అంతేకాకుండా ప్రాగ్జీ అడ్వయిజరీ సంస్థల ద్వారా రాయల్టీ అంశాలను సెబీ లేవనెత్తడం ప్రారంభించింది. ఆదాయం లేదా లాభాలతో రాయల్టీ చెల్లింపులకు సంబంధం లేకపోవడం, రాయల్టీ విలువలపై వివిధ ఏజెన్సీల అభిప్రాయాలు వేరువేరుగా వెలువడటం తదితర అంశాలను సెబీ ప్రస్తావించింది.

నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులంటేనే ఇష్టం

- 58% మందికి స్టాక్స్‌లో ఎక్స్‌పోజర్
- 39% మందికి ఫండ్స్‌లో పెట్టుబడులు
- ఏంజెల్ వన్‌కు చెందిన ఫిన్‌వస్ నివేదిక



న్యూఢిల్లీ: ఒకవైపు మ్యూచువల్ ఫండ్స్ ప్రతి నెలా పెద్ద మొత్తంలో పెట్టుబడులు ఆకర్షిస్తున్నప్పటికీ.. మరోవైపు మెజారిటీ ఇన్వెస్టర్లు ఇప్పటికీ నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులకే ఆసక్తి చూపిస్తున్నారు. ఈ విషయం ప్రముఖ బ్రోకరేజీ సంస్థ ఏంజెల్ వన్‌కు చెందిన 'ఫిన్‌వస్' అధ్యయనంలో వెల్లడైంది. 58 శాతం మంది స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటే, 39 శాతం మంది మ్యూచువల్ ఫండ్స్‌ను అనుసరిస్తున్నారు. దేశవ్యాప్తంగా 13 పట్టణాలకు చెందిన 1,600 మంది యువతీ, యువకుల పెట్టుబడుల ప్రాధాన్యతలు, ఆర్థిక అక్షరాస్యత, టెక్నాలజీ, ఫైనాన్షియల్ టూల్స్ వినియోగాన్ని విశ్లేషించిన అనంతరం ఫిన్‌వస్ నివేదికను విడుదల చేసింది.

- పొదుపునకు చాలా మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. 93 శాతం మంది తమ ఆదాయంలో ఎంతో కొంత ఆదా చేస్తుండగా, కొంత మంది 20-30 శాతం వరకు పొదుపు చేస్తున్నారు.
- ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా బంగారం కంటే స్టాక్స్‌లో పెట్టుబడులకే 45 శాతం మంది ప్రాధాన్యం చూపుతున్నారు.
- పెట్టుబడికి అధిక భద్రత ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్ల వైపు 22 శాతం మంది, రికరింగ్ డిపాజిట్ల వైపు 26 శాతం మంది మొగ్గు చూపిస్తున్నారు. అధిక రాబడులతోపాటు స్థిరమైన రాబడులకూ యువత ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఇది తెలియజేస్తోందని ఈ నివేదిక పేర్కొంది.
- యువతరం టెక్ సాయాన్ని తీసుకుంటోంది. 68 శాతం మంది ఆటోమేటెడ్ సేవింగ్ టూల్స్ వాడుతున్నారు.
- 85 శాతం మంది పెరిగిపోయిన జీవన వ్యయం .. ముఖ్యంగా ఆహారం, యుటిలిటీలు, రవాణా వ్యయాలను ప్రస్తావించారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

జేపీ ఇన్‌ఫ్రాటెక్‌కు లాభాలు

క్యూ2లో రూ. 88 కోట్లు



న్యూఢిల్లీ: దివాలా చట్ట ప్రక్రియలో చిక్కుకున్న జేపీ ఇన్‌ఫ్రాటెక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో నష్టాలను వీడి రూ. 88 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 588 కోట్లకుపైగా నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 258 కోట్ల నుంచి రూ. 223 కోట్లకు క్షీణించాయి. ఈ ఏడాది జూన్‌లో ముగ్గురు సభ్యులతో ఏర్పాటు చేసిన బోర్డు ద్వారా సురక్ష గ్రూప్ జేపీ ఇన్‌ఫ్రా(జేఐఎల్) నియంత్రణను చేజిక్కించుకుంది. సురక్ష ప్రమోటర్ సుధీర్ వి.వాలియా నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. జేఐఎల్‌ను సొంతం చేసుకునేందుకు సురక్ష గ్రూప్ బిడ్‌ను 2024 మే 24న దివాలా అపిలేట్ ట్రిబ్యునల్ ఎన్‌సీఎల్ఏటీ ఆమోదించిన సంగతి తెలిసిందే.

ఈఐడీ ప్యారీ లాభం వెనకడుగు

క్యూ2లో రూ. 592 కోట్లు



న్యూఢిల్లీ: షుగర్ తయారీ దిగ్గజం ఈఐడీ ప్యారీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24 శాతం క్షీణించి రూ. 592 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 782 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్పంగా(2 శాతం) పుంజుకుని రూ. 9,400 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 9,210 కోట్ల టర్నోవర్ సాధించింది. విడిగా చక్కెర తయారీ విభాగం లాభం నీరసించడంతో లాభాలు ప్రభావితమైనట్లు కంపెనీ సీఈవో ముత్తయ్య మురుగప్పన్ పేర్కొన్నారు. చెరకు పరిమాణం, రికవరీ తగ్గడానికితోడు.. డిస్టిల్లరీ విభాగ ముడివ్యయాలు పెరగడం, చక్కెర అమ్మకాలు మందగించడం ఇందుకు కారణమైనట్లు తెలియజేశారు. కాగా.. ఈ ఏడాది తొలి ఆరు నెలల(ఏప్రిల్-సెప్టెంబర్) కాలంలో కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 1,107 కోట్ల నుంచి రూ. 820 కోట్లకు క్షీణించింది.

నష్టాలలో యూఫ్లెక్స్

క్యూ2లో రూ. 65 కోట్లు



న్యూఢిల్లీ: ప్యాకేజింగ్ మెటీరియల్స్, సొల్యూషన్స్ దిగ్గజం యూఫ్లెక్స్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెలువరించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో లాభాలను వీడి దాదాపు రూ. 65 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 63 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. అయితే నిర్వహణ ఆదాయం 15 శాతం పుంజుకుని రూ. 3,781 కోట్లను అధిగమించింది. మొత్తం వ్యయాలు సైతం 16 శాతం పెరిగి రూ. 3,792 కోట్లకు చేరాయి. ఆదాయంలో ఫ్లెక్సిబుల్ ప్యాకేజింగ్ విభాగం నుంచి 14 శాతం అధికంగా రూ. 3,753 కోట్లు అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో యూఫ్లెక్స్ షేరు బీఎస్ఈలో 4.6% పతనమై రూ. 558 వద్ద ముగిసింది.

వీనస్ పైప్స్ లాభం అప్



క్యూ2లో రూ. 24 కోట్లు

న్యూఢిల్లీ: స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులు, ట్యూబుల తయారీ కంపెనీ వీనస్ పైప్స్ అండ్ ట్యూబ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 24 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 20 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 20 శాతం జంప్‌చేసి రూ. 229 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 191 కోట్ల టర్నోవర్ అందుకుంది. చమురు, గ్యాస్, ఇంజినీరింగ్, కెమికల్స్, విద్యుత్ రంగాల నుంచి పటిష్ట డిమాండ్ కారణంగా రూ. 340 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్‌ను సాధించినట్లు కంపెనీ ఎండీ అరుణ్ కొఠారి పేర్కొన్నారు.

వీనస్ పైప్స్ షేరు బీఎస్ఈలో 10% పతనమై రూ. 1,677 దిగువన ముగిసింది.

క్యూఎంఎస్ మెడికల్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 4.2 కోట్లు

హైదరాబాద్: హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్లు అందించే క్యూఎంఎస్ మెడికల్ అలైడ్ సర్వీసెస్ ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. చిన్న సంస్థల కోసం ఏర్పాటైన ఎస్ఎంఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా లిస్టయిన కంపెనీ నికర లాభం జులై-సెప్టెంబర్(క్యూ2)లో 65 శాతం జంప్‌చేసి రూ. 4.2 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2.6 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 30 శాతం ఎగసి రూ. 37 కోట్లను అధిగమించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. నిర్వహణ లాభం(ఇబిటా) 51% జంప్‌చేసి రూ. 7.6 కోట్లకు చేరింది. ఇబిటా మార్జిన్లు 17.5% నుంచి 20.3 శాతానికి బలపడ్డాయి.

నష్టాలు ప్రకటించిన శ్రీరామ్ ప్రాపర్టీస్



న్యూఢిల్లీ: రియల్టీ సంస్థ శ్రీరామ్ ప్రాపర్టీస్ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.99 లక్షల కన్సాలిడేటెడ్ నష్టాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.20 కోట్ల లాభాన్ని నమోదు చేయడం గమనార్హం. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.231 కోట్ల నుంచి రూ.155 కోట్లకు తగ్గిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్వల్పకాల ప్రతికూలతలు నెలకొన్నాయని, ఈ రంగానికి దీర్ఘకాలంలో మంచి అవకాశాలున్నాయని శ్రీరామ్‌ప్రాపర్టీస్ సీఎండీ మురళి ఎం తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మెరుగైన వృద్ధిని నమోదు చేస్తామని ప్రకటించారు. సంస్థ నిర్వహణలో 42 ప్రాజెక్టులు, 40.2 మిలియన్ చదరపు అడుగుల అభివృద్ధి స్థలం ప్రస్తుతానికి ఉంది.

మొబిలిటీ రంగంలో అపార అవకాశాలు: ఉబర్



న్యూఢిల్లీ: 'మొబిలిటీ రంగంలో భారత్ అతిపెద్ద మార్కెట్లలో ఒకటి. ఇక్కడి విపణి వేగంగా అభివృద్ధి చెందుతోంది. తమకు బహుళ-దశాబ్దాల అవకాశాన్ని అందించే నమ్మశక్యం కాని ముఖ్యమైన మార్కెట్. వేగంగా విస్తరిస్తున్నప్పటికీ మరింతగా చొచ్చుకుపోవాల్సినంత అవకాశాలు ఉన్నాయి' అని ఉబెర్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్ తెలిపారు. రైడ్-హెయిలింగ్ విషయానికి వస్తే భారత్ అతి తక్కువగా విస్తరించిందని అన్నారు. నగర ప్రయాణాలలో ఒక శాతం కంటే తక్కువ రైడ్-హెయిలింగ్ ప్లాట్‌ఫామ్‌లపై జరుగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా పరిణతి చెందిన నగరాల్లో ఇది 3-5 శాతంగా ఉందన్నారు. భారత్‌తో పాటు విదేశీ మార్కెట్లకు అవసరమైన పరిష్కారాలను బెంగళూరు, హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ బృందాలు అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. ఏదైనా మార్కెట్ లేదా విభాగంలో తీవ్రమైన పోటీ అనేది కొత్త ఆవిష్కరణలను ఆకర్షిస్తూ, ఈ రంగం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందనడానికి సంకేతమని ఆయన అన్నారు. కాగా, ఎదగడానికి కష్టతర మార్కెట్లలో భారత్ ఒకటి అని ఈ ఏడాది ప్రారంభంలో ఉబెర్ గ్లోబల్ సీఈఓ దారా ఖషోషాహి వ్యాఖ్యానించారు. ఇక్కడి ప్రజలు ఎక్కువ ఖర్చు కాకుండానే చాలా సేవలను కోరుకుంటారని అన్నారు.

విన్సిస్ ఐటీ లాభం జూమ్

ఏప్రిల్-సెప్టెంబర్‌లో రూ. 11 కోట్లు

హైదరాబాద్: సాంకేతిక శిక్షణ, ఐటీ డెవలప్‌మెంట్, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు అందించే విన్సిస్ ఐటీ సర్వీసెస్ ఇండియా ఈ ఏడాది(2024-25) తొలి ఆరు నెలల్లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. చిన్న సంస్థల కోసం ఏర్పాటైన ఎస్ఎంఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా లిస్టయిన కంపెనీ నికర లాభం ఏప్రిల్-సెప్టెంబర్‌లో 36 శాతం జంప్‌చేసి రూ. 11 కోట్లకు చేరింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 8 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 16 శాతం ఎగసి రూ. 92 కోట్లను అధిగమించింది. కన్సాలిడేటెడ్ ఫలితాలివి. నిర్వహణ లాభం(ఇబిటా) 53% జంప్‌చేసి రూ. 15 కోట్లను దాటింది.

వాహనాలకు పండుగ డిమాండ్

- రోడ్డెక్కిన 42,88,248 యూనిట్లు
- గతేడాదితో పోలిస్తే 11.76% వృద్ధి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా పండుగల సీజన్‌లో వాహనాల అమ్మకాలు జోరుగా సాగాయి. ఈ ఏడాది 42 రోజులపాటు సాగిన ఫెస్టివ్ పీరియడ్‌లో అన్ని విభాగాల్లో కలిపి ఏకంగా 11.76 శాతం వృద్ధితో 42,88,248 యూనిట్లు రోడ్డెక్కాయి. గతేడాది పండుగల సీజన్‌లో కస్టమర్లకు చేరిన వాహనాల సంఖ్య 38,37,040 యూనిట్లు. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) ప్రకారం.. ఒడిశాలో తుఫాను, దక్షిణాదిన అకాల వర్షాలతో పరిశ్రమ అంచనాలను చేరుకోలేకపోయింది. అన్నీ అనుకూలిస్తే పండుగల సీజన్‌లో పరిశ్రమ 45 లక్షల యూనిట్ల మార్కును చేరుకుంటుందని భావించింది. కాగా, ఈ ఏడాది పండుగల సీజన్‌లో ప్యాసింజర్ వాహనాల రిటైల్ విక్రయాలు 7 శాతం పెరిగి 6,03,009 యూనిట్లు నమోదయ్యాయి.

బలమైన గ్రామీణ డిమాండ్ నేపథ్యంలో టూవీలర్స్ అమ్మకాలు 14 శాతం దూసుకెళ్లి 33,11,325 యూనిట్లను తాకాయి. వాణిజ్య వాహనాల రిటైల్ సేల్స్ 1 శాతం పెరిగి 1,28,738 యూనిట్లు, త్రిచక్ర వాహనాలు 7 శాతం అధికమై 1,59,960 యూనిట్లకు ఎగశాయి. ట్రాక్టర్ల విక్రయాలు 2 శాతం క్షీణించి 85,216 యూనిట్లకు పడిపోయాయి' అని ఫెడరేషన్ వివరించింది. క్యాలెండర్ సంవత్సరం ముగియడానికి ఇంకా ఒకటిన్నర నెలలు మిగిలి ఉన్నందున 2024 స్టాక్‌ను విక్రయించడంపై దృష్టి పెట్టాలని తయారీ సంస్థలను ఎఫ్ఏడీఏ కోరింది.

హైదరాబాద్‌లో సైయెంట్-అలెగ్రో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంటెలిజెంట్ ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయెంట్, సెన్సింగ్ సొల్యూషన్స్ సంస్థ అలెగ్రో మైక్రోసిస్టమ్స్ కలిసి హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ఏర్పాటు చేశాయి. ఇది ప్రధానంగా ఆటోమోటివ్ పరిశ్రమకు కావాల్సిన కొత్త తరం మ్యాగ్నెటిక్ సెన్సార్లు, పవర్ సెమీకండక్టర్ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంపై దృష్టి పెడుతుంది. ఇందులో పోస్ట్-సిలికాన్ వేలిడేషన్, డిజైన్ వెరిఫికేషన్ తదితర విభాగాల్లో 100 పైచిలుకు నిపుణులైన ఇంజినీర్లు ఉంటారు. ఇరు సంస్థల భాగస్వామ్యం మరింత పటిష్టమయ్యేందుకు ఇది దోహదపడగలదని సైయెంట్ ఎండీ కృష్ణ బోదనపు తెలిపారు. భారత్‌లో ఆటోమోటివ్ మార్కెట్ విస్తరిస్తున్న నేపథ్యంలో వ్యాపార అవకాశాలు గణనీయంగా ఉంటాయని అలెగ్రో మైక్రోసిస్టమ్స్ సీఈవో వినీత్ నర్గోల్‌వాలా పేర్కొన్నారు.

అయిదో క్వార్టర్‌లోనూ స్మార్ట్‌ఫోన్స్ జోరు

- సెప్టెంబర్ త్రైమాసికంలో మార్కెట్ 6 శాతం వృద్ధి
- చైనా కంపెనీలదే హవా
- 72 శాతం మార్కెట్ వాటా

న్యూఢిల్లీ: దేశీయంగా స్మార్ట్‌ఫోన్ సరఫరా వరుసగా అయిదో త్రైమాసికంలో కూడా పెరిగింది. జూలై-సెప్టెంబర్ క్వార్టర్‌లో సుమారు 6 శాతం వృద్ధి చెంది 4.6 కోట్లకు చేరింది. 72 శాతం మార్కెట్ వాటాతో చైనా కంపెనీల హవా కొనసాగింది. 16 శాతం షేర్‌తో వివో అగ్రస్థానంలో ఉండగా, టాప్ 10 బ్రాండ్స్‌లో ఐకూ అత్యధిక వృద్ధి సాధించింది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం యాపిల్ మార్కెట్ వాటా 8.6 శాతంగా, శాంసంగ్ వాటా 12.3 శాతంగా ఉంది. వివో వాటా 13.9 శాతం నుంచి 15.8 శాతానికి పెరిగింది. అందుబాటు ధరలోని వై సిరీస్‌తో పాటు కొత్తగా ప్రవేశపెట్టిన టీ3, వీ40 సిరీస్‌ల దన్నుతో వరుసగా మూడో త్రైమాసికంలో కూడా వివో అగ్రస్థానంలో నిల్చింది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఒప్పో 13.9 శాతం, రియల్‌మీ 11.5 శాతం, షావోమీ 11.4 శాతం, పోకో 5.8 శాతం, మోటరోలా 5.7 శాతం, ఐకూ 4.2 శాతం, వన్‌ప్లస్ 3.6 శాతం మార్కెట్ వాటా దక్కించుకున్నాయి. యాపిల్ అత్యధికంగా 40 లక్షల యూనిట్లు సరఫరా చేసింది.



మిగతా విశేషాలు..

- రూ. 50,000 నుంచి రూ. 68,000 వరకు ధర శ్రేణి ఉండే ప్రీమియం సెగ్మెంట్ ఫోన్ల మార్కెట్ వార్షిక ప్రాతిపదికన అత్యధికంగా 86 శాతం వృద్ధి చెందింది. మొత్తం సరఫరా 2 శాతం నుంచి సుమారు 4 శాతానికి పెరిగింది. ఐఫోన్ 15/13/14, గెలాక్సీ ఎస్23, వన్‌ప్లస్ 12 ప్రధాన మోడల్స్‌గా నిల్చాయి. ఈ విభాగంలో యాపిల్ వాటా 71 శాతానికి పెరగ్గా శాంసంగ్ వాటా 30 శాతం నుంచి 19 శాతానికి పడిపోయింది.
- రూ. 16,000 నుంచి రూ. 35,000 ధర శ్రేణిలోని ఎంట్రీ-ప్రీమియం సెగ్మెంట్ 42 శాతం వృద్ధి సాధించింది. మొత్తం స్మార్ట్‌ఫోన్ల సరఫరాలో 28%వాటాను దక్కించుకుంది. ఒప్పో గణనీయంగా పెరగ్గా శాంసంగ్, వివోల మార్కెట్ వాటా తగ్గింది. ఈ విభాగంలో ఈ మూడింటి వాటా 53 %గా ఉంది.
- 5జీ స్మార్ట్‌ఫోన్ల సరఫరా 57% నుంచి 83%కి పెరిగింది. అదే సమయంలో సగటు విక్రయ ధర (ఏఎస్‌పీ) 20% తగ్గింది. 5జీ సెగ్మెంట్లో మాస్ బడ్జెట్ విభాగం (రూ. 8,000-రూ. 16,000 వరకు ధర) దాదాపు రెట్టింపై 50 శాతానికి చేరింది. షావోమీ రెడ్‌మీ 13సీ, యాపిల్ ఐఫోన్ 15, ఒప్పో కే12ఎక్స్, వివో టీ3ఎక్స్.. వై28 మోడల్స్ మూడో త్రైమాసికంలో అత్యధికంగా సరఫరా అయ్యాయి.



సెమీస్‌లో అభయ్

కౌలాలంపూర్: ఏస్ మలేసియా స్క్వాష్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత స్టార్ అభయ్ సింగ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 58వ ర్యాంకర్ అభయ్ సింగ్ 12–14, 11–5, 12–10, 11–8తో ప్రపంచ 53వ ర్యాంకర్, భారత్‌కే చెందిన వెలవన్ సెంథిల్ కుమార్‌పై గెలుపొందాడు. రెండో రౌండ్‌లో నాలుగో సీడ్, ప్రపంచ 27వ ర్యాంకర్ అబ్దుల్లా (ఖతర్)ను బోల్తా కొట్టించిన అభయ్ సెమీఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ అయిన్ యో ఎన్జీ (మలేసియా)తో తలపడతాడు. భారత్‌కే చెందిన రమిత్ టాండన్ పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. రమిత్ 9–11, 11–7, 8–11, 7–11తో యూసుఫ్ (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయాడు.

ఇంగ్లండ్‌దే సిరీస్

మూడో టి20 మ్యాచ్‌లోనూ విండీస్ ఓటమి



స్యామ్ కరన్

సెయింట్ లూసియా: సొంతగడ్డపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్న వెస్టిండీస్ జట్టు... ఇంగ్లండ్ చేతిలో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడిపోయి టి20 సిరీస్‌ను కోల్పోయింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జరిగిన మూడో టి20లో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో విండీస్‌ను ఓడించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3–0తో సిరీస్ చేజిక్కించుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (41 బంతుల్లో 54; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... రొమారియో షెఫర్డ్ (30; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఎవిన్ లూయిస్ (3), షై హోప్ (4), నికోలస్ పూరన్ (7), రోస్టన్ చేజ్ (7), హెట్‌మైర్ (2) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో పేసర్ సాఖిబ్ మహమూద్, జేమీ ఓవర్టన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ జట్టు 19.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి గెలిచింది. స్యామ్ కరన్ (26 బంతుల్లో 41; 3 ఫోర్లు, 1 సిక్స్), లివింగ్‌స్టోన్ (28 బంతుల్లో 39; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), విల్ జాక్స్ (32; 3 ఫోర్లు) రాణించారు. విండీస్ బౌలర్లలో అకీల్ హుసేన్ 4 వికెట్లు పడగొట్టాడు. సాఖిబ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య నాలుగో టి20 ఆదివారం జరుగుతుంది.

అంతర్జాతీయ క్రికెట్‌కు టిమ్ సౌతీ వీడ్కోలు

స్వదేశంలో ఇంగ్లండ్‌తో సిరీసే చివరిది

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ సీనియర్ పేస్ బౌలర్ టిమ్ సౌతీ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్ అనంతరం ఆటకు వీడ్కోలు పలకనున్నట్లు సౌతీ శుక్రవారం వెల్లడించాడు. ఈ నెల ఆఖరు నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరగనుంది. అందులో భాగంగా హామిల్టన్‌లో జరగనున్న ఆఖరి మ్యాచ్ అనంతరం 35 ఏళ్ల సౌతీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పనున్నాడు.



టెస్టుల్లో 300, వన్డేల్లో 200, టి20ల్లో 100 వికెట్లకు పైగా పడగొట్టిన ఏకైక బౌలర్‌గా రికార్డు సృష్టించిన సౌతీ... న్యూజిలాండ్ తరఫున అత్యధిక టెస్టు వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్‌గా నిలిచాడు. 'న్యూజిలాండ్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడాన్ని గొప్ప గౌరవంగా భావించా. అలాంటిది 18 ఏళ్ల పాటు కివీస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించినందుకు చాలా గర్వంగా ఉంది. ఆట నాకు ఎంతో ఇచ్చింది. వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయం అనుకుంటున్నా' అని సౌతీ పేర్కొన్నాడు. ఇటీవల భారత్‌తో సిరీస్‌కు ముందు టెస్టు కెప్టెన్సీకి వీడ్కోలు పలికిన సౌతీ... కివీస్ జాతీయ జట్టు తరఫున 100 టెస్టులు ఆడిన ఆరో ప్లేయర్‌గా ఘనత సాధించాడు. అతను 104 టెస్టుల్లో 385 వికెట్లు... 161 వన్డేల్లో 221 వికెట్లు... 126 టి20ల్లో 164 వికెట్లు పడగొట్టాడు.



రాహుల్



పంత్, గిల్

కేఎల్ రాహుల్‌కు గాయం

భారత బ్యాటర్ల సుదీర్ఘ సాధన

పెర్త్: ఆస్ట్రేలియాతో తొలి టెస్టులో ఓపెనర్‌గా ఆడే అవకాశం ఉన్న కేఎల్ రాహుల్ అనూహ్యంగా సాధనలో గాయపడ్డాడు. టెస్టు మ్యాచ్‌ను పోలిన పరిస్థితుల మధ్య (సిమ్యులేషన్) 'వాకా' మైదానంలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుండగా ఇది జరిగింది. 29 పరుగులు చేసిన అనంతరం పేసర్ ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌ను ఎదుర్కొనే క్రమంలో బంతి రాహుల్ మోచేతికి బలంగా తాకింది. దాంతో అతను నొప్పితో బాధపడుతూ మైదానం వీడాడు. గాయం తీవ్రత ఎలాంటిదనే విషయంపై స్పష్టత లేదు. అయితే 'రాహుల్ గాయాన్ని పరీక్షిస్తున్నాం. వివరాలు తెలిసేందుకు కొంత సమయం పడుతుంది' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత కారణాలతో కెప్టెన్ రోహిత్ శర్మ మొదటి టెస్టుకు దూరమైతే అతని స్థానంలో రాహుల్‌కు చోటు దక్కడం దాదాపు ఖాయమే. ఇలాంటి స్థితిలో గాయం టీమిండియా శిబిరంలో కాస్త ఆందోళన పెంచేదే. స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బెంగళూరులో జరిగిన తొలి మ్యాచ్ తర్వాత రాహుల్ తుది జట్టులో స్థానం కోల్పోయాడు. మరోవైపు విరాట్ కోహ్లి కూడా స్కానింగ్‌కు వెళ్లడంతో అతనికీ స్వల్ప గాయమైనట్లుగా సమాచారం. అయితే గాయం ఎలాంటి దానిపై స్పష్టత లేకపోగా... శుక్రవారం ప్రాక్టీస్ మ్యాచ్‌లో అతను ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆడాడు.

ప్రాక్టీస్ సాగిందిలా...

'వాకా'లో మూడు రోజుల పాటు నెట్స్‌లో సాధన చేసిన అనంతరం శుక్రవారం టీమిండియా ఆటగాళ్లు 'సిమ్యులేషన్' మ్యాచ్ ఆడారు. తొలి టెస్టులో తుది జట్టులో ఆడే అవకాశం ఉన్న ప్లేయర్లే ఇందులో బ్యాటింగ్‌కు దిగగా... 'ఎ' టీమ్ బౌలర్లు కొందరు బౌలింగ్ చేశారు. షార్ట్ పిచ్ బంతులు ఆడటంపైనే ఆటగాళ్లు ఎక్కువగా దృష్టి పెట్టారు. రాహుల్, యశస్వి జైస్వాల్ కలిసి ఓపెనింగ్ చేశారు. గాయపడి వెనుదిరిగే వరకు రాహుల్ చక్కగా బ్యాటింగ్ చేశాడు. దూకుడుగా ఆడే ప్రయత్నం చేసిన జైస్వాల్ స్లిప్‌లో క్యాచ్ ఇవ్వగా... కొన్ని చక్కటి షాట్లు ఆడిన కోహ్లి కూడా ముకేశ్ బౌలింగ్‌లో స్లిప్‌లోనే క్యాచ్ ఇచ్చాడు. రిషభ్ పంత్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లోనే జురేల్ కూడా స్లిప్ క్యాచ్‌కే వెనుదిరిగాడు. రెండు గంటల క్రీజ్‌లో పట్టుదలగా నిలిచిన గిల్‌ను సైనీ అవుట్ చేశాడు. బ్యాటర్లంతా మరోసారి క్రీజ్‌లోకి వచ్చిన రెండో ఇన్నింగ్స్ ఆడారు. ఈసారి ప్రసిధ్, నితీశ్ బౌలింగ్‌లో గిల్, జైస్వాల్, కోహ్లి, పంత్ స్వేచ్ఛగా ఆడారు. కోహ్లి ఆరంభంలో తడబడినా... ఆ తర్వాత చక్కటి డ్రైవ్‌లతో ఆకట్టుకున్నాడు. పంత్ మాత్రం మరోసారి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఈ తరహా బ్యాటింగ్ సాధన తర్వాతి రోజుల్లో కూడా కొనసాగనుంది.

టైసన్... అదే దూకుడు

'ఫేస్ ఆఫ్'లో ప్రత్యర్థి చెంప చెళ్లుమనిపించిన దిగ్గజ బాక్సర్

టెక్సాస్: ఆరు పదుల వయసు సమీపిస్తున్నా... తనలో దుందుడుకుతనం తగ్గలేదని బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ చాటుకున్నాడు. కెరీర్‌లో ఎన్నో ఘనతలు సాధించిన ఈ ప్రపంచ మాజీ హెవీ వెయిట్ చాంపియన్... సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, యువ బాక్సర్ జాక్ పాల్‌తో బౌట్‌లో తలపడనున్నాడు. ప్రధాన పోటీకి ముందు జరిగిన ఆటగాళ్ల ప్రత్యేక కార్యక్రమంలోనే రెచ్చిపోయిన టైసన్... జాక్ పాల్ చెంప చెళ్లుమనిపించాడు. సుదీర్ఘ కెరీర్‌లో 50 విజయాలు సాధించిన 58 ఏళ్ల టైసన్... అందులో 44 బౌట్‌లను నాకౌట్ చేశాడు. అసలు పోరుకు ముందు నిర్వహించిన 'ఫేస్ ఆఫ్' కార్యక్రమం సమయంలో నిర్వాహకులు అడుగుతున్న ప్రశ్నలకు విసుగెత్తిన టైసన్... ఎదురుగా ఉన్న ప్రత్యర్థిని చెంపదెబ్బ కొట్టాడు. ఇప్పటికే ఈ బౌట్‌పై విపరీతమైన అంచనాలు పెరిగిపోగా... టైసన్ ప్రవర్తనతో అది మరింత ఎక్కువైంది. శనివారం జరగనున్న ఈ బౌట్‌ను నెట్‌ఫ్లిక్స్‌లో 'పే పర్ వ్యూ' పద్ధతిలో ప్రసారం చేయనున్నారు. ఈ ఫైట్‌ను ప్రత్యక్షంగా 60 వేల మంది అభిమానులు... ప్రసార మాధ్యమాల ద్వారా కోట్లాది మంది వీక్షించనున్నారు. 2005లో బాక్సింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన టైసన్... ఆ తర్వాత పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించాడు. షెడ్యూల్ ప్రకారం టైసన్, జాక్ పాల్ మధ్య బౌట్ ఈ ఏడాది జూలైలోనే జరగాల్సి ఉన్నా... ఆ సమయంలో టైసన్ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతుండటంతో దాన్ని వాయిదా వేశారు. దూకుడు మీదున్న టైసన్‌కు... ప్రొఫెషనల్ బాక్సింగ్‌లో పది బౌట్లు నెగ్గిన 27 ఏళ్ల జాక్ పాల్ ఏమాత్రం పోటీనిస్తాడో చూడాలి. 'చివరి బౌట్‌లో కెవిన్ మెక్‌బ్రైడ్ చేతిలో ఓడిన తర్వాత జీవితంలో చాలా చూశాను. ఎన్నో ఎత్తుపల్లాలను ఎదుర్కొన్నాను. కొన్నాళ్లు జైలు జీవితం కూడా గడిపాను. అన్నిటికి మించి బాక్సింగ్‌నే ఇష్టపడతా. ఒకప్పటి టైసన్ ఇప్పుడు లేడు. నా జీవితంలో ఎక్కువ ఏమీ మిగిలి లేదు. అందుకే మంచి అనుభూతులు సొంతం చేసుకోవాలనుకుంటున్నా' అని ఫైట్‌కు ముందు టైసన్ అన్నాడు.





దేవాంక్

దేవాంక్ ధమాకా

15 పాయింట్లతో మెరిసిన పట్నా పైరేట్స్ రెయిడర్

నోయిడా: స్టార్ రెయిడర్ దేవాంక్ 15 పాయింట్లతో విజృంభించడంతో ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో పట్నా పైరేట్స్ ఆరో విజయం ఖాతాలో వేసుకుంది. లీగ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన పోరులో పట్నా పైరేట్స్ 52–31 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై విజయం సాధించింది. పట్నా తరఫున దేవాంక్ 10 రెయిడ్ పాయింట్లు, 5 బోనస్ పాయింట్లు సాధించగా... అయాన్ 11 పాయింట్లతో సత్తా చాటాడు. సందీప్ కుమార్ (8 పాయింట్లు), దీపక్ రాఠి (5 పాయింట్లు) కూడా రాణించడంతో పట్నా జట్టు ఘనవిజయం సాధించింది. మరోవైపు బెంగాల్ వారియర్స్ తరఫున నితిన్ కుమార్ (11 పాయింట్లు) ఒంటరి పోరాటం చేశాడు. తాజా సీజన్‌లో 10 మ్యాచ్‌లు ఆడిన పట్నా 6 విజయాలు, 4 పరాజయాలతో 33 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాలుగో స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 32–24 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. పింక్ పాంథర్స్ తరఫున అర్జున్ దేశ్వాల్ 9 పాయింట్లు, నీరజ్ నర్వాల్ 6 పాయింట్లతో రాణించారు. గుజరాత్ జెయింట్స్ తరఫున గుమాన్ సింగ్ 11 పాయింట్లతో పోరాడిన జట్టును గెలిపించలేకపోయాడు. 9 మ్యాచ్‌లాడిన జైపూర్ 5 విజయాలు, 3 పరాజయాలు, ఒక 'టై'తో 30 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఐదో స్థానానికి చేరింది. లీగ్‌లో భాగంగా నేడు జరగనున్న మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 8 గంటలకు), దబంగ్ ఢిల్లీతో బెంగళూరు బుల్స్ (రాత్రి 9 గంటలకు) తలపడనున్నాయి.


పీఓకేలో 'ట్రోఫీ' ప్రచారం కుదరదు!

పీసీబీని నిలువరించిన ఐసీసీ



దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య జట్టు హోదాలో పాకిస్తాన్ చేయనున్న 'ట్రోఫీ టూర్'పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) పరిమితులు విధించింది. సాధారణంగా ఏదైనా ఐసీసీ టోర్నీకి ముందు దేశంలోని ఆయా నగరాల్లో ట్రోఫీని ప్రదర్శించడం ఆనవాయితీ. అయితే ఈసారి పాకిస్తాన్ ప్రకటించిన నగరాల్లో నాలుగింటి విషయంలో భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. స్కర్దూ, మురీ, హున్జా, ముజఫరాబాద్ నగరాలు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లో భాగంగా ఉన్నాయి. 'పాక్ క్రికెట్ అభిమానులకు స్వాగతం... 2017లో పాక్ గెలుచుకున్న చాంపియన్స్ ట్రోఫీని చూసే అవకాశం సిద్ధంగా ఉంది. 16–24 నవంబర్ మధ్య మీ నగరాల్లో ట్రోఫీ వస్తోంది' అని ఈ నాలుగు నగరాల పేర్లతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రచారం చేసింది. అయితే వీటిల్లో ట్రోఫీ టూర్ ప్రతిపాదించడాన్ని తప్పుపట్టిన బీసీసీఐ... తగిన చర్యలు తీసుకోవాలని కూడా ఐసీసీని కోరింది. పీసీబీ ఉద్దేశపూర్వకంగా దీనిని చేసిందా లేదా అనే దానిపై తమకు స్పష్టత లేదని... అయితే తాము దీనిని అనుమతించే అవకాశం మాత్రం లేదని ఐసీసీ బోర్డు సభ్యుడొకరు వెల్లడించారు. 2025 ఫిబ్రవరి–మార్చిలో పాకిస్తాన్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీ జరగాల్సి ఉంది. అయితే తాము పాక్‌కు వెళ్లేది లేదని భారత్ చెప్పేయడంతో... తుది వేదికల ఎంపికపై ఇంకా కసరత్తు కొనసాగుతోంది.

ఎజాజ్‌కు దక్కని చోటు



వెల్లింగ్టన్: భారత గడ్డపై చారిత్రక టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడంలో కీలక పాత్ర పోషించిన న్యూజిలాండ్ స్పిన్నర్ ఎజాజ్ పటేల్‌కు తదుపరి టెస్టు సిరీస్‌లో జాతీయ జట్టులో చోటు దక్కలేదు. ఈ నెల 28 నుంచి ఇంగ్లండ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్ జట్టు శుక్రవారం 14 మందితో కూడిన జట్టును ప్రకటించింది. అందులో ఏకైక స్పిన్నర్‌గా సాంట్నర్‌కు మాత్రమే అవకాశం దక్కగా... ఎజాజ్ పటేల్‌ను ఎంపిక చేయలేదు. గాయం కారణంగా భారత్‌తో సిరీస్‌కు దూరమైన కేన్ విలియమ్సన్ కోలుకోవడంతో ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపికయ్యాడు.

న్యూజిలాండ్ టెస్టు జట్టు: లాథమ్ (కెప్టెన్), బ్లన్‌డెల్, కాన్వే, డఫీ, హెన్రీ, మిషెల్, రూర్కే, ఫిలిప్స్, రచిన్, సాంట్నర్, నాథన్ హారిస్ స్మిత్, టిమ్ సౌతీ, కేన్ విలియమ్సన్, విల్ యంగ్.

ఐపీఎల్ వేలంలో 574 మంది క్రికెటర్లు

ఈనెల 24న మధ్యాహ్నం గం. 3:30 నుంచి వేలం కార్యక్రమం



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మెగా వేలంలో రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ మార్క్యూ ప్లేయర్లుగా పాల్గొననున్నారు. ఈ ముగ్గురితో పాటు మరో నలుగురు భారత ఆటగాళ్లు కూడా ఈ జాబితాలో ఉన్నారు. షమీ, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, చహల్ మార్క్యూ ప్లేయర్లుగా వేలానికి రానుండగా... విదేశీ ప్లేయర్లలో మిషెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా), బట్లర్, లివింగ్‌స్టోన్ (ఇంగ్లండ్), మిల్లర్, రబడ (దక్షిణాఫ్రికా) ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. వీరంతా ప్రాథమిక ధర రూ. 2 కోట్లతో వేలంలోకి రానున్నారు. ఈ నెల 24, 25న జిద్దా వేదికగా ఐపీఎల్ మెగా వేలం జరగనుండగా... వేలంలో పాల్గొనే ఆటగాళ్ల జాబితాను తాజాగా కుదించారు. తొలుత విడుదల చేసిన జాబితాలో 1574 మంది ఆటగాళ్లు ఉండగా... దానిని 574 మందికి కుదించారు. ఇందులో 366 మంది భారత ప్లేయర్లు... 208 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తం 10 ఫ్రాంచైజీలు కలిసి అత్యధికంగా 204 మంది ప్లేయర్లను వేలంలో ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఇందులో 70 మంది విదేశీ ప్లేయర్లకు చోటు దక్కనుంది. వేలంలో పాల్గొననున్న వారిలో 42 ఏళ్ల ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ పెద్ద వయస్కుడు కాగా... 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ పిన్న వయసు ప్లేయర్. బిహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలో పాల్గొంటున్నాడు. మొత్తం 81 మంది ప్లేయర్లు కనీసం రూ. 2 కోట్ల ప్రాథమిక ధరతో వేలంలోకి రానుండగా.. మరో 27 మంది ఆటగాళ్లు రూ. 1.5 కోట్లు, 18 మంది ప్లేయర్లు 1.25 కోట్లు, 23 మంది కోటి రూపాయల కనీస ధరతో వేలంలో పాల్గొననున్నారు. భారత కాలమానం ప్రకారం నవంబర్ 24న మధ్యాహ్నం గం. 3:30 నుంచి వేలం ప్రక్రియ ప్రారంభం కానుంది.

రన్నరప్ ప్రజ్ఞానంద



కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ ఇండియా ర్యాపిడ్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు. 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రజ్ఞానంద, సో వెస్లీ (అమెరికా) 5.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... ప్రజ్ఞానందకు రెండో స్థానం, సో వెస్లీకి మూడో స్థానం లభించాయి. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ 7.5 పాయింట్లతో ర్యాపిడ్ టోర్నీ చాంపియన్‌గా నిలిచాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు నిహాల్ సరీన్ (4 పాయింట్లు) ఆరో ర్యాంక్‌లో, ఇరిగేశి అర్జున్ (3.5 పాయింట్లు) ఎనిమిదో ర్యాంక్‌లో, విదిత్ (3 పాయింట్లు) తొమ్మిదో ర్యాంక్‌లో, ఎస్ఎల్ నారాయణన్ (3 పాయింట్లు) చివరిదైన పదో ర్యాంక్‌లో నిలిచారు.

వంతికకు మూడో స్థానం

ఇదే టోర్నీ మహిళల ర్యాపిడ్ విభాగంలో భారత యువ క్రీడాకారిణి వంతిక అగర్వాల్ 5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. 7.5 పాయింట్లతో అలెక్సాండ్రా గొర్యాక్‌చినా (రష్యా) చాంపియన్‌గా అవతరించింది. 5.5 పాయింట్లతో నానా జాగ్‌నిడ్జె (జార్జియా) రన్నరప్‌గా నిలిచింది. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక (4.5 పాయింట్లు) ఐదో ర్యాంక్‌లో, దివ్య దేశ్‌ముఖ్ (3.5 పాయింట్లు) ఏడో ర్యాంక్‌లో, వైశాలి (3.5 పాయింట్లు) ఎనిమిదో ర్యాంక్‌లో, కోనేరు హంపి (3 పాయింట్లు) చివరిదైన పదో ర్యాంక్‌లో నిలిచారు.

విజయంతో ముగించిన బోపన్న-ఎబ్డెన్ జోడీ



ట్యూరిన్: భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్న 2024 సీజన్‌ను విజయంతో ముగించాడు. సీజన్ ముగింపు టోర్నమెంట్ ఏటీపీ ఫైనల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచింది. 'బాబ్ బ్రయాన్ గ్రూప్'లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించిన బోపన్న–ఎబ్డెన్ ద్వయం... శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 7–5, 6–7 (6/8), 10–7తో 'సూపర్ టైబ్రేక్'లో కెవిన్ క్రావిట్జ్–టిమ్ ప్యూట్జ్ (జర్మనీ) జంటను ఓడించింది. ఈ క్రమంలో బోపన్న (44 ఏళ్ల 8 నెలలు) ఏటీపీ ఫైనల్స్ టోర్నీలో విజయం సాధించిన అతి పెద్ద వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన క్రావిట్జ్–ప్యూట్జ్ జోడీ ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరుకుంది. 2023లో ఎబ్డెన్‌తో జతకట్టిన బోపన్న ఈ టోర్నీలో చివరిసారి అతనితో కలసి ఆడాడు. వచ్చే సీజన్‌లో వీరిద్దరు వేర్వేరు భాగస్వాములతో బరిలోకి దిగుతారు. ఓవరాల్‌గా బోపన్న–ఎబ్డెన్ జంట ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్‌తో కలిపి నాలుగు ఏటీపీ టోర్నీల్లో టైటిల్స్ గెల్చుకుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌ను కూడా సాధించింది.

టెన్నిస్‌కు ప్రజ్ఞేశ్ గుడ్‌బై



చెన్నై: ఒకే ఏడాది టెన్నిస్‌లోని నాలుగు గ్రాండ్‌స్లామ్ (ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) టోర్నమెంట్‌లలో ఆడిన ఆరో భారతీయ ప్లేయర్ ప్రజ్ఞేశ్ గుణేశ్వరన్ ప్రొఫెషనల్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. తమిళనాడుకు చెందిన 35 ఏళ్ల ప్రజ్ఞేశ్ తన రిటైర్మెంట్ విషయాన్ని శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించాడు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో ప్రజ్ఞేశ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. 2019లో ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆడిన ప్రజ్ఞేశ్ తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. అదే ఏడాది కెరీర్ బెస్ట్ 75వ ర్యాంక్‌ను అందుకున్న ప్రజ్ఞేశ్ 2010లో ప్రొఫెషనల్‌గా మారాడు. 6 అడుగుల 2 అంగుళాల ఎత్తు, 80 కేజీల బరువున్న ప్రజ్ఞేశ్ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) టూర్ సర్క్యూట్‌లో 11 మ్యాచ్‌ల్లో గెలిచి, 28 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. కెరీర్‌లో రెండు ఏటీపీ చాలెంజర్ టోర్నీల్లో విజేతగా నిలిచిన ప్రజ్ఞేశ్ ఎనిమిదిసార్లు డేవిస్‌కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

పాతికేళ్లలో రెట్టింపవనున్న
ప్లాస్టిక్ వ్యర్థాలు!

న్యూఢిల్లీ: ప్లాస్టిక్ భూతానికి ముకుతాడు వేసే ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదని తేలిపోయింది. ఇదే ధోరణి కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా వార్షిక ప్లాస్టిక్ వ్యర్థాల పరిమాణం 2050 నాటికి రెట్టింపవడం ఖాయమని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. అంతేగాక ప్లాస్టిక్ సంబంధిత వార్షిక గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల్లో కూడా 37 శాతం వృద్ధి నమోదవుతుందని హెచ్చరించిది. మెషీన్ లెర్నింగ్ సాయంతో ఈ అంచనాలు రూపొందించినట్టు అధ్యయన బృందం తెలిపింది. వీటికి అడ్డుకట్ట వేసేలా సమర్థ విధానాలను రూపొందించేందుకు ఐరాస ప్లాస్టిక్ సంధి ఒప్పందంలో భాగంగా నవంబర్ 25 నుంచి కొరియాలో జరగనున్న రెండో వార్షిక సదస్సు చక్కని అవకాశమని అభిప్రాయపడింది. ఇందులో 190కి పైగా దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తి కొన్నేళ్లుగా విపరీతంగా పెరిగిపోవడం తెలిసిందే. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీరని హాని కలిగిస్తున్నాయి. వాతావరణ మార్పులనూ వేగవంతం చేస్తున్నాయి. రీసైకిల్డ్ ప్లాస్టిక్ వాడకం, వ్యర్థాల సమర్థ నిర్వహణ తదితరాల ద్వారా ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలకు 90 శాతం, ఉద్గారాలకు కనీసం 30 శాతం దాకా అడ్డుకట్ట వేయవచ్చని అధ్యయనం అభిప్రాయపడింది. దీని ఫలితాలను జర్నల్ సైన్స్‌లో ప్రచురించారు.



11వ శతాబ్దానికి చెందిన అబ్బురపరిచే దేవ నర్తకి శిల్పం. ఈ శాండ్‌స్టోన్ విగ్రహం లండన్ మీదుగా అమెరికా చేరి సుదీర్ఘ కాలం తర్వాత ఎట్టకేలకు భారత్ తిరిగొచ్చింది.

అమెరికా నుంచి భారత్ తిరిగొచ్చిన... 1,400 పై చిలుకు
కళాకృతులు

భారత్ నుంచి స్మగ్లర్లు అక్రమంగా తరలించిన 1,400కు పైగా పురాతన కళాకృతులను అమెరికా తాజాగా తిరిగి అప్పగించింది. వీటి విలువ కోటి డాలర్ల పై చిలుకే. దక్షిణ, ఆగ్నేయాసియా దేశాలకు చెందిన కళాకృతులను మాతృదేశాలకు స్వాధీనం చేసే చర్యల్లో ఇది భాగమని మన్‌హాటన్ జిల్లా అటార్నీ కార్యాలయంలోని యాంటిక్విటీ స్మగ్లింగ్ విభాగం తెలిపింది. భారత్ నుంచి లండన్‌కు తరలించిన దేవ నర్తకి శిల్పం వంటి అపురూప కళాకృతులు వీటిలో ఉన్నాయి. దీన్ని శాండ్‌స్టోన్‌లో అత్యంత సుందరంగా మలిచారు. వీటిని న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ తదితర చోట్ల భద్రపరిచి ఉంచారు. నాన్సీ వెయినర్ వంటి అమెరికా స్మగ్లర్లతో పాటు భారత్‌కు చెందిన పలువురు గ్యాంగ్ లీడర్లను ఇప్పటికే అరెస్టు చేశారు. యాంటిక్విటీ విభాగం ఇప్పటిదాకా 46 కోట్ల డాలర్ల విలువైన 5,800కు పైగా కళాకృతులను స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకుంది. 16 మందికి పైగా స్మగ్లర్లకు శిక్షలు పడేలా చూసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఝాన్సీ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం
10 మంది చిన్నారుల మృతి

ఝాన్సీ: ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ మెడికల్ కాలేజీలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 10 మంది చిన్నారులు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మెడికల్ కాలేజీలో మంటలు చెలరేగడంతో జిల్లా సీనియర్ అధికారులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్లు మంటలను అదుపు చేస్తున్నాయి. సహాయచర్యలు కొనసాగుతున్నాయి. అగ్నికీలల నుంచి తప్పించుకోవడానికి పేషెంట్లు తోచిన దిక్కుకు పరుగెత్తడం వీడియోలో కనిపించింది. భారీ సంఖ్యలో పోలీసులు సహాయచర్యల్లో నిమగ్నమయ్యారు. ఝాన్సీ మెడికల్ కాలేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో 10 మంది చిన్నారులు మృతి చెందినట్లు తెలుస్తోందని జిల్లా కలెక్టర్ ప్రకటించారు.

ఐఐటీఎఫ్‌పై కాలుష్యం ప్రభావం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫేర్–24పై కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ మేళాలో పాల్గొనేందుకు వచ్చిన విదేశీ వ్యాపారులను వాతావరణ కాలుష్యం కలవరపెడుతోంది. కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోతున్నారు. మరోవైపు.. ఈ పరిస్థితిని తెలుసుకున్న పలు సంస్థలు ఐఐటీఎఫ్‌లో పాల్గొనేందుకు విముఖత చూపాయి. ట్రేడ్ ఫేర్‌లో తొలిరోజు శుక్రవారం మొత్తం 11 దేశాలు పాల్గొనాల్సివుంది. అయితే.. థాయిలాండ్, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్, యూఏఈ వంటి నాలుగు దేశాల దేశాల నుంచి కొంతమంది మాత్రమే ట్రేడ్ ఫేర్‌లో పాల్గొన్నారు. మిగతా ఏడు దేశాలు దూరంగా ఉన్నాయి. మరోవైపు.. ఇక్కడ దుమ్ము, ధూళిని అరికట్టేందుకు నిర్వాహకులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితితో తాము అనారోగ్యానికి గురవుతామని విదేశీ వ్యాపారులు ఆందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు.

శత్రువులపై భారతీయులు ఏకం కావాలి: గడ్కరీ

సాక్షి, న్యూఢిల్లీ: శత్రువులపై భారతీయులు అందరూ ఏకం కావాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గతంలో ఇచ్చిన 'విడిపోతే నష్టపోతాం'అనే నినాదాన్ని గడ్కరీ సమర్థించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ..'మన పూజా విధానాలు వేరుగా ఉండవచ్చు.. కొందరు దేవాలయాలకు, మరికొందరు మసీదులకు, మరికొందరు చర్చిలకు వెళతారు. కానీ చివరికి మనమంతా భారతీయులమే'అని అన్నారు. యోగి ఆదిత్యనాథ్ చేసిన 'బటేంగే తో కటేంగే'నినాదాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవద్దని... దేశ శత్రువులు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. భారతీయులందరూ ఐక్యంగా ఉండాలని... ఇది ఎవరినీ విభజించడానికి ఉద్దేశించినది కాదని వ్యాఖ్యానించారు. అయినా కొందరు ప్రజలు దీనిని తప్పుగా అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ప్రభుత్వమే తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని గడ్కరీ ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్‌కు ఏమీ తెలియదు: నడ్డా

థానే: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రాజ్యాంగం గురించి ఏమీ తెలియదని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడాన్ని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సమర్థించలేదనే విషయం కూడా తెలియకుండానే రాజకీయ సభల్లో రాజ్యాంగ ప్రతిని చూపుతుంటారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం గురించి ఏబీసీలు తెలియని రాహుల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణల్లో మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని.. మైనారిటీలక కట్టబెట్టాలని చూస్తున్నారని నడ్డా అన్నారు. 'మతం ఆధారంగా రిజర్వేషన్లను రాజ్యాంగం అనుమతించదని రాహుల్ గాంధీకి తెలియదు. రాజ్యాంగం గురించి ఏబీసీలు తెలియవు. తన ప్రేమ దుకాణాల్లో విద్వేషాన్ని అమ్ముతుంటారు'అని నడ్డా లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు.

స్పెయిన్‌లో నర్సింగ్ హోమ్‌లో మంటలు.. 10 మంది దుర్మరణం

మాడ్రిడ్: స్పెయిన్‌లోని జరగోజా సమీపంలోని ఒక నర్సింగ్ హోమ్‌లో మంటలు చెలరేగడంతో 10 మంది దుర్మరణం పాలయ్యారు. విల్లాఫ్రాంకా డి ఎబ్రోలోని నర్సింగ్ హోమ్‌లో శుక్రవారం ఉదయం ఫైర్ అలారం మోగింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేలోగా 10 మంది చనిపోయారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. మానసిక ఆరోగ్య సమస్యలు, డిమెంతియాతో బాధపడుతున్న వారు 82 మంది ఈ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్నారని స్థానిక మీడియా తెలిపింది. మంటల తర్వాత అలముకొన్న దట్టమైన పొగ మరణాలకు కారణమని మేయర్ వోల్గా రమిరెజ్ తెలిపారు. ఊపిరి ఆడక 10 మంది చనిపోయి ఉండొచ్చన్నారు. మృతులు మంటల్లో చిక్కుకోలేదని తెలిపారు.

సమాజాన్ని విభజిస్తున్నారు

మోదీపై శరద్ పవార్ ధ్వజం ● బీజేపీతో అంటకాగిన వారితో ఎలాంటి పొత్తులుండవని స్పష్టీకరణ

పుణె: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఉపన్యాసాలతో సమాజాన్ని విభజిస్తున్నారని మహావికాస్ అఘాడి (ఎంవీఏ) సీనియర్ నేత శరద్ పవార్ దుయ్యబట్టారు. అధికార మహాయుతిపై జనబాహుళ్యంలో నెలకొన్న అసంతృప్తి మహారాష్ట్రలో ఎంవీఏ అధికారంలోకి రావడానికి దోహదపడుతుందని విశ్వాసం వెలిబుచ్చారు. పార్టీని చీల్చిన అజిత్ పవార్‌తో ఎన్నికల అనంతరం తిరిగి జట్టుకడతారా? అని ప్రశ్నించగా.. బీజేపీతో అంటకాగిన వారితో ఎలాంటి పొత్తులుండవని పవార్ స్పష్టం చేశారు. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ శుక్రవారం పీటీఐకి ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు...

ప్రజాధనాన్ని ఎరవేస్తున్నారు..

అధికార మహాయుతి కూటమి (శివసేన–షిండే, ఎన్సీపీ– అజిత్ పవార్, బీజేపీ) వివిధ పథకాల కింద ప్రజాధనాన్ని వెదజల్లి ఓట్లను కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బలు తగలడంతో డబ్బును నమ్ముకుంది. అయితే ప్రజలు మహాయుతిని తిరస్కరిస్తారు.

యోగి మాటలను పట్టించుకోనక్కర్లేదు

యోగి అతిథ్యనాథ్ ఇచ్చిన బటేంగేతో కటేంగే (విడిపోతే.. నష్టపోతాం) నినాదాన్ని శరద్‌పవార్ తేలికగా తీసిపారేశారు. 'మతపరమైన నినాదాలను ఇవ్వడంలో యోగికి పేరుంది. యూపీ సీఎంను ఎందుకు పట్టించుకోవాలి. ఆయన వ్యాఖ్యలను నేను పట్టించుకోను. యోగి నినాదంపై ఒక్క మాట కూడా మాట్లాడదలచుకోలేదు'అని పవార్ స్పందించారు. కొందరు కాషాయం ధరించి.. ప్రజల్లో మతపరమైన విభజన తెస్తారు. దేశానికి వీళ్ల అన్యాయం చేస్తున్నారు.. అని పవార్ పేర్కొన్నారు.

కులం ఆధారంగా విభజిస్తున్నారనే ఆరోపణలపై..

విపక్షాలు సమాజాన్ని కులపరంగా విభజిస్తున్నాయనే ప్రధాని మోదీ ఆరోపణలను శరద్ పవార్ తిప్పికొట్టారు. 'ఆయన ప్రధానమంత్రి. కొన్ని వ్యాఖ్యలు చేస్తున్నారు. మా మిత్రపక్షాలపై ఆయన చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం. అనుచితం. మోదీ స్వయంగా సమాజాన్ని విభజిస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఆయన చేస్తున్న ఉపన్యాసాలను గమనించండి. రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన ఏయే అంశాలను లేవనెత్తుతున్నారో చూడండి. విస్తృత ప్రచారంలో ప్రజల్లో అధికార కూటమిపై తీవ్ర అసంతృప్తిని గమనించాను' అని శరద్ పవార్ పేర్కొన్నారు. మహావికాస్ అఘాడి బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, కలిసి ఉంటేనే సురక్షితంగా ఉంటామని మోదీ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు పిలుపిస్తున్న విషయం తెలిసిందే.



ప్రజామోదం పొందుతాం..

పశ్చిమ మహారాష్ట్రలో ఎన్సీపీ (ఎస్పీ) మంచి ప్రదర్శన కనబరుస్తుందని ఎన్నికల ప్రచారంలో తీవ్రంగా శ్రమిస్తున్న 83 ఏళ్ల శరద్ పవార్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో తమకు ప్రజామోదం లభిస్తుందని పేర్కొన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ముఖ్యంగా రైతులు, యువతరం. అవకాశం వచ్చినపుడల్లా మహావికాస్ అఘాడి పక్షాన నిలబడి తమ మద్దతు తెలుపుతారు'అని అన్నారు. మహారాష్ట్రలోని మొత్తం 288 సీట్లలో ఎంవీఏ ఎన్ని సీట్లు గెలుస్తుందని భావిస్తున్నారో చెప్పడానికి శరద్ పవార్ నిరాకరించారు. బంధువు అజిత్ పవార్‌తో ఎన్నికల అనంతరం ఏదైనా అవగాహనకు వస్తారా? అని అడగ్గా... బీజేపీతో అంటకాగిన వారితో తమకు ఎలాంటి పొత్తులుండవని శరద్ పవార్ స్పష్టం చేశారు. 2023లో అజిత్ పవార్ పక్షాన నిలిచి బీజేపీతో జట్టుకట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాయకులను ద్రోహులుగా పవార్ అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలిన తర్వాత అధికార మహాయుత కూటమి ప్రజాకర్షక పథకాలకు తెరతీసిందని పవార్ ధ్వజమెత్తారు. 'పరిస్థితి సానుకూలంగా లేదని వారికి అవగతమైంది. అందుకే ప్రజాధనాన్ని వెదజల్లుతున్నారు'అని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ 1,500 అందిస్తున్న లడ్కీ బహిన్ పథకం ప్రభావం అక్కడక్కడా ఉండొచ్చని.. అయితే మహిళలు శాంతి, భద్రత, సంక్షేమానికి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

హిజాబ్ ధరించని వారికి
మానసిక చికిత్స

ఇరాన్ వివాదాస్పద నిర్ణయం

అవి నిర్బంధ కేంద్రాలే ● హక్కుల సంఘాల ఆందోళన

టెహ్రాన్: హిజాబ్ చట్టాలను ఉల్లంఘించే మహిళల కోసం 'చికిత్స క్లినిక్'లను ప్రారంభిస్తామని ఇరాన్ ప్రకటించింది. మహిళా, కుటుంబ విభాగ అధిపతి మెహ్రీ తలేబి దరేస్తానీ ఈ మేరకు వెల్లడించారు. హిజాబ్ ధరించని వారికి ఈ క్లినిక్ శాస్త్రీయమైన మానసిక చికిత్స అందిస్తుందని పేర్కొన్నారు. క్లినిక్‌ను పర్యవేక్షించే ఏజెన్సీ నేరుగా సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీకి నివేదిస్తుందని తెలిపారు. దీన్ని ఇరానియన్లతో పాటు హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంతర్జాతీయంగా కూడా దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీన్ని భయంకర ప్రతిపాదనగా బ్రిటన్‌కు చెందిన ఇరానియన్ జర్నలిస్ట్ సిమా సాబెత్ అభివర్ణించారు. ఇస్లామిక్, ఇరాన్ చట్టాల్లో ఎక్కడా హిజాబ్ లేదని ఆ దేశ మానవ హక్కుల న్యాయవాది హుస్సేన్ రయీసీ మండిపడ్డారు. 'విమెన్, లైఫ్, ఫ్రీడమ్'నిరసన సమూహాలు దీనిపై ఆందోళనలు తీవ్రతరం చేస్తున్నాయి. హిజాబ్ చట్టం అమలుపై చూపిన శ్రద్ధను మౌలిక సదుపాయాల తదితరాల కల్పనలో ప్రభుత్వం చూపడం లేదని మండిపడుతున్నాయి. ఈ క్లినిక్‌లు నిర్బంధ కేంద్రాలుగా పని చేస్తాయని కార్యకర్తలు ఆక్షేపిస్తున్నారు. ''అది క్లినిక్ కాదు. మహిళల పాలిట జైలుగా మారుతుంది''అని ఓ యువతి అభిప్రాయపడింది. హిజాబ్ ఉల్లంఘనలపై ఇరాన్‌లో అణచివేత కొద్ది వారాలుగా మళ్లీ పెరిగింది. అరెస్టులు, యువతుల అదృశ్యం, సంబంధీకుల వ్యాపారాలు మూతపడటం వంటివి వెలుగు చూస్తున్నాయి. హిజాబ్ చట్టాలపై బహిరంగంగా నిరసన వ్యక్తం చేసిన ఒక వర్సిటీ విద్యార్థిని అదుపులోకి తీసుకుని మానసిక వైద్యశాలకు తరలించినట్లు వార్తలొచ్చాయి. అక్కడ ఖైదీల పట్ల చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, చిత్రహింసలు పెట్టడమే గాక బలవంతంగా మందులు వాడుతున్నారని ఆమ్నెస్టీ, ఇతర హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పెద్దల సేవలో తరిస్తున్నారు



బిలియనీర్ల చేతుల్లో ప్రధాని మోదీ కీలు బొమ్మ

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ ధ్వజం

మహాగమా: ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో పేద ప్రజలను బలిపెట్టి బిలియనీర్ల సేవలో తరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. సంపన్న మిత్రుల ప్రయోజనాల కోసమే మోదీ పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం జార్ఖండ్‌లోని గోడ్డా, బొకారో జిల్లాల్లో ఎన్నికల ప్రచారంలో రాహుల్ పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం విపక్ష 'ఇండియా'కూటమి అవిశ్రాంత పోరాటం సాగిస్తోందని చెప్పారు. మరోవైపు బీజేపీ–ఆర్ఎస్ఎస్ మాత్రం రాజ్యాంగాన్ని ముక్కలు చేసి చెత్తబుట్టలో పారేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దేశానికి ఆత్మ అయిన రాజ్యాంగాన్ని నాశనం చేయాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని విమర్శించారు. తాను రెడ్ బుక్ ప్రదర్శిస్తున్నానంటూ మోదీ తప్పుపడుతున్నారని ఆక్షేపించారు. రంగు ముఖ్యం కాదు, పుస్తకంలోని విషయం ముఖ్యం అని స్పష్టంచేశారు. రాజ్యాంగాన్ని మోదీ చదివారా? అని ప్రశ్నించారు. మోదీ నిజంగా చదివి ఉంటే సమాజంలో విద్వేషాలు వ్యాప్తి చేసేవారు కాదని, సమాజాన్ని విభజించి ఉండేవారు కాదని చెప్పారు. రాజ్యాంగాన్ని నాశనం చేసే శక్తి ఎవరికీ లేదని అన్నారు. ఇండియా కూటమి, బీజేపీ–ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. కులం, జాతి, మతం పేరిట సమాజాన్ని ముక్కలు చేయడానికి కాషాయ కూటమి కుట్రలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. బీజేపీ వ్యాప్తి చేస్తున్న విద్వేషం, హింసను ప్రేమతోనే నిర్మూలించగలమని పేర్కొన్నారు.

పగలు సుద్దులు.. రాత్రిపూట జల్సాలు

మోదీని గానీ, ఆయన 56 అంగుళాల ఛాతీని గానీ చూసి తాము భయపడడం లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. బిలియనీర్ల చేతుల్లో మోదీ ఒక కీలుబొమ్మ అని ఎద్దేవా చేశారు. పగటిపూట ప్రజలకు సుద్దులు చెప్పే ప్రధానమంత్రి రాత్రిపూట సంపన్నుల ఇళ్లల్లో వివాహాలకు హాజరై ఎంజాయ్ చేస్తుంటారని పేర్కొన్నారు. కేవలం బడా బాబులకు మేలు చేయడానికి ప్రభుత్వ రంగ సంస్థలు, కాలేజీలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, ఓడ రేవులను మోదీ ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. దేశ సంపదను 25 మంది పెట్టుబడిదారులకు కట్టబెట్టారని, కొందరు పారిశ్రామికవేత్తలు తీసుకున్న రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని పేర్కొన్నారు. పేదలు, రైతులు, దళితుల కోసం మోదీ చేసిందేమీ లేదని అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

చోరీల కట్టడికి
పోలీసుల కొత్త ప్రణాళిక

పిలవని పెళ్లిళ్లకూ వెళ్లి మరీ నిఘా

పాత తెలుగు సినిమాల్లో క్లైమాక్స్ చివర్లో డిష్యూం డిష్యూం ఫైటింగ్‌లు అయిపోయాక పోలీసులు వచ్చి శుభం కార్డు పడటం అందరం చూసే ఉంటాం. ఆగ్రా పోలీసులు మాత్రం పెళ్లిళ్లలో చిట్టచివర్లో కాకుండా ముందే వస్తారు. అదీ కూడా పిలవకుండానే వచ్చి పెళ్లిలో అత్యంత కీలకమైన, విలువైన వధువు నగలు, పెళ్లివారి నగదు వంటి వాటిపై నిఘా పెడతారు. ఎందుకంటే వాటిని కొట్టేసేందుకు చోరశిఖామణులు పెళ్లి మండపాల్లో తచ్చాడుతారని పోలీసులుకు బాగా తెలుసు. అందుకే మఫ్టీల్లో వచ్చిమరీ పటిష్ట భద్రత కల్పిస్తారు. ఇదంతా ఉచితమే. ఇలా అదనపు మొహరింపు వెనక ఒక పెద్దకారణమే ఉంది. ఈ వివరాలను ఆగ్రా సిటీ డెప్యూటీ పోలీస్ కమిషనర్ సూరజ్ రాయ్ వెల్లడించారు.

టీనేజర్లూ డేంజరే



''రాత్రిళ్లు దొంగలు పడటం సర్వసాధారణం. పట్టపగలు పెళ్లి పందిళ్లు, మండపాల్లో దొంగలు చేతవాటం చూపించడం ఈమధ్య మరీఎక్కువైంది. ముఖ్యంగా పెళ్లి నగలు, నగదుపై కన్నేసి కొట్టేసిన ఘటనలు చాలా జరిగాయి. అందుకే పోలీసు సిబ్బందిని సాధారణ దుస్తుల్లో వివాహవేడుకలకు బందోబస్తుగా మేమే పంపిస్తున్నాం. బంధువుల్లా కలిసిపోయి అందరిపైనా ఓ కన్నేస్తాం. వధూవరుల తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను ముఖ్యంగా గమనిస్తాం. ఎందుకంటే వాళ్ల దగ్గర ఉండే నగలు, నగదునే దొంగలు కొట్టేస్తున్నారు. సీసీటీవీ కెమెరాల సాయంతోనూ నిఘా కొనసాగుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆగ్రా జిల్లాలోని ప్రతి కీలకమైన వేడుకకు మేం పిలవకున్నా వెళ్తున్నాం. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులను గమనిస్తాం. కొన్ని సార్లు ఆ అనుమానాస్పద వ్యక్తుల వెంట వచ్చే టీనేజర్లనూ ఓ కంట కనిపెడతాం. ఎందుకంటే ఆ మధ్య ఒక పెళ్లిలో టీనేజీ పిల్లాడే కోట్ల విలువైన చోరీకి పాల్పడ్డాడు. పెళ్లిమంటపాలు, బాంకెట్ హాళ్లు, వివాహ వేదికలు ఇలా మొత్తం 18 క్లస్టర్లకు పోలీసులను పంపుతున్నాం. స్థానికులు సైతం తమ పెళ్లికి నిఘా కావాలంటే ముందస్తుగా సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదిస్తే ప్రతి పెళ్లికి కుదిరితే బందోబస్తును ఏర్పాటుచేస్తాం''అని ఆయన వివరించారు.

– ఆగ్రా

కార్మికులను ఆదుకునేందుకు
గనిలోకి వలెంటీర్లు

దక్షిణాఫ్రికాలో ముదురుతున్న వివాదం

దక్షిణాఫ్రికాలో బంగారు గనిలో అక్రమ మైనింగ్ ఉదంతం ముదురు పాకాన పడుతోంది. నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లో మూసేసిన స్టీల్‌ఫాంటీన్ గనిలో 4 వేల మంది దాకా కార్మికులు చిక్కుకుపోవడం తెలిసిందే. వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు భారీగా మోహరించారు. ఆహారం తదితరాలు అందకుండా అడ్డుకుంటున్నారు. ''దాంతో మరో దారిలేక వారే బయటకు వస్తారు. రాగానే అరెస్టు చేస్తాం. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలంటే ఇలాంటి కఠిన చర్యలు తప్పవు''అని అధికారులు చెబున్నారు. ఈ ఉదంతం దక్షిణాఫ్రికాలోనే గాక అంతర్జాతీయంగా కూడా సంచలనం సృష్టిస్తోంది. ప్రాణాలు నిలుపుకోవడానికి మరో దారి లేక కార్మికులు టూత్‌పేస్టు తింటూ, వెనిగర్ తాగుతున్నారన్న వార్తలు గుండెల్ని పిండేస్తున్నాయి. ఇంకొద్ది రోజులు గడిస్తే వాళ్లు పూర్తిగా నీరసించి స్పృహ తప్పవచ్చంటున్నారు. ప్రభుత్వ చర్యలు హత్యాయత్నానికి ఏమాత్రం తీసిపోవంటూ హక్కుల సంస్థలు మండిపడుతున్నాయి. జీవించే హక్కును కాలరాసే అధికారం సహా ఎవరికీ లేదని వాదిస్తున్నాయి. అధికారులు మాత్రం చిక్కుబడ్డ కార్మికుల్లో పలువురి వద్ద ఆయుధాలుండే ఆస్కారం కూడా ఉందని చెబుతున్నారు. మరోవైపు కార్మికుల్లో పలువురు అక్రమంగా దేశంలో ప్రవేశించిన వారే కావడంతో కఠిన శిక్షలకు భయపడి బయటికొచ్చేందుకు ససేమిరా అంటున్నారు.

ఈ నేపథ్యంలో కార్మికులను ఆదుకునేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. చాలామంది స్వచ్ఛంద కార్యకర్తలు ఆహారంతో పాటు నిత్యావసరాలు వెంట తీసుకుని భూగర్భ గనిలోకి ప్రవేశించారు. వారు 50 మందితో కూడిన బృందాలుగా లోనికి వెళ్తున్నారు. కార్మికులకు ఆహారం తదితరాలు అందించడమే గాక వారికి నచ్చజెప్పి బయటికి తీసుకొచ్చే పనిలో కూడా పడ్డారు. వాళ్లలో చాలామంది పూర్తిగా నీరసించిపోయిన స్థితిలో ఉండటంతో ఒక్కొక్కరిని బయటికి తీసుకొచ్చేందుకు గంటకు పైగా పడుతోందట. గనిలో పలు మృతదేహాలను కూడా వలెంటీర్లు గుర్తించినట్టు సమాచారం. అవి కుళ్లి కంపు కొడుతున్నట్టు చెబుతున్నారు! గత వారం రోజుల్లో 1,000 మంది దాకా కార్మికులు బయటికొచ్చి లొంగిపోయారు. దక్షిణాఫ్రికాలో అక్రమ మైనింగ్ భారీ ఎత్తున జరుగుతుంటుంది. ఫలితంగా ఖజానాకు వందలాది కోట్ల డాలర్ల మేరకు నష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా వాటిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. కొన్నేళ్లలో వందలాది గనులను మూసేయడంతో అప్పటిదాకా వాటిలో పని చేసిన కార్మికులు ఒక్కసారిగా రోడ్డున పడ్డారు. బతుకుదెరువు కోసం అక్రమ మైనింగ్‌కు పాల్పడే ముఠాల చేతిలో చిక్కుతున్నారు. ఆ క్రమంలో నెలల తరబడి భూగర్భంలో గడుపుతున్నారు.



బంగారు గని ప్రవేశద్వారం వద్ద భారీగా మోహరించిన పోలీసులు

– సాక్షి, నేషనల్ డెస్క్

రాజ్యాంగ సవరణలు - ముఖ్యాంశాలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

1వ సవరణ
(అమల్లోకి వచ్చిన తేదీ: 1951, జూన్ 18)

- సవరించిన ప్రకరణలు: 15, 19, 85, 87, 174, 176, 341, 342, 372, 376.
- కొత్తగా చేర్చినవి: 31 ఎ, 31 బి ప్రకరణలు, షెడ్యూల్ 9.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:

1. స్వేచ్ఛ, సమానత్వ, ఆస్తి హక్కులపై ప్రజా ప్రయోజనం దృష్ట్యా నియంత్రణ విధించారు.
2. భూ సంస్కరణలకు సంబంధించిన అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు. ఈ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. అసెంబ్లీల సమావేశ కాలాలు, న్యాయాధికారుల నియామకాలు.



2వ సవరణ (1953, మే1)

- సవరించిన ప్రకరణ– 81
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు:

1. ఇది పార్లమెంటులో రాష్ట్రాలకు కేటాయించిన సీట్ల (స్థానాలు) మార్పుకు సంబంధించిన సవరణ.

3వ సవరణ (1955, ఫిబ్రవరి 22)

- ఏడో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు:
- ముడిపత్తి, ఆహార ధాన్యాల ఉత్పత్తి, పశువులకు సంబంధించిన అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

4వ సవరణ (1955, ఏప్రిల్ 27)

- సవరించిన ప్రకరణలు: 31, 31 ఎ, 305. తొమ్మిదో షెడ్యూల్‌ని కూడా సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:

1. భారత ప్రభుత్వం లేదా రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్న ఆస్తులకు ఇచ్చే నష్ట పరిహారాన్ని కోర్టుల పరిధికి వెలుపల ఉంచారు.

5వ సవరణ (1955, డిసెంబర్ 24)

- ప్రకరణ 3ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
- రాష్ట్రపతి.. రాష్ట్రాల భౌగోళిక సరిహద్దులు, పేర్లను మార్చే బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రాల అభిప్రాయం కోసం పంపిస్తారు. వాటిపై సమాధానం చెప్పేందుకు రాష్ట్రాలకు నిర్ణీత సమయం ఇస్తారు.

6వ సవరణ (1956, సెప్టెంబర్ 11)

- సవరించిన ప్రకరణలు– 269, 286.
- ఏడో షెడ్యూల్‌లోని 1వ జాబితా, 2వ జాబితాకు సవరణలు చేశారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. అంతర్రాష్ట్ర వాణిజ్యంపై పన్నులు విధించే అధికారం పార్లమెంటుకు ఉంటుంది.

7వ సవరణ (1956, నవంబర్ 1)

- సవరించిన ప్రకరణలు: 1, 49, 80, 81, 82, 131, 153, 158, 168, 170, 171, 216, 217, 220, 222, 224, 230, 231, 232, 371.
కొత్తగా చేర్చిన ప్రకరణలు: 258 ఎ, 290 ఎ, 350 ఎ, 350 బి, 372 ఎ , 378 ఎ.
తొలగించిన ప్రకరణలు: 238, 242, 243, 259, 278, 306, 379, 391.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. రాష్ట్రాల పునర్విభజన ద్వారా 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలను ఏర్పాటు చేశారు.
2. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్ర శాసనసభల స్థానాల మార్పు.
3. హైకోర్టులో తాత్కాలిక అదనపు న్యాయమూర్తుల నియామకానికి అవకాశం కల్పించారు.
4. కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన అంశాల్లో మార్పులు చేశారు.
5. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, బొంబాయి రాష్ట్రాలకు సంబంధించి కొన్ని ప్రత్యేక అంశాలు చేర్చారు.
6. ఒకే వ్యక్తిని ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించే అవకాశం కల్పించారు.

8వ సవరణ (1960, జనవరి 5)

- సవరించిన ప్రకరణ: 334
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు:
- షెడ్యూల్ కులాలు, తెగలు, ఆంగ్లో ఇండియన్లకు లోక్‌సభ, శాసనసభల్లో కేటాయించిన స్థానాలను 1970 వరకు పొడిగించారు.

9వ సవరణ (1960, డిసెంబర్ 28)

- మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- పశ్చిమబెంగాల్ ఆమోదించింది.
- ముఖ్యాంశాలు:
- బేరూబరీ ప్రాంతాన్ని పాకిస్తాన్‌కు బదిలీ చేయడానికి ఈ సవరణ చేశారు.

10వ సవరణ (1961, ఆగస్టు 11)

- ప్రకరణ 240తో పాటు మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
- దాద్రానగర్ హవేలీని కేంద్రపాలిత ప్రాంతంగా భారతదేశంలో విలీనం చేశారు.

11వ సవరణ (1961, డిసెంబర్ 19)

- సవరించిన ప్రకరణలు: 66 (1), 71 (3)
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

ముఖ్యాంశాలు:

- రాష్ట్రపతి/ఉప రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీకి సంబంధించిన అంశాలను సవరించారు. రాష్ట్రపతి ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలు ఉన్నాయనే నెపంతో ఎన్నికలను వాయిదా వేయరాదు.

12వ సవరణ (1961, డిసెంబర్ 20)

- ప్రకరణ 240తోపాటు మొదటి షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- గోవా, డామన్–డయ్యూలను భారత్‌లో విలీనం చేశారు.

13వ సవరణ (1963, డిసెంబర్ 1)

- కొత్తగా ప్రకరణ 371ఎ చేర్చారు.
- నాగాలాండ్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

14వ సవరణ (1962, డిసెంబర్ 28)

- 239 ఎ, 241 ప్రకరణలతోపాటు 1, 4 షెడ్యూళ్లలోని అంశాలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
పాండిచ్చేరి (ప్రస్తుతం పుదుచ్చేరి)ని కేంద్ర పాలిత ప్రాంతంగా భారతదేశంలో చేర్చుకున్నారు. అలాగే ఈ కేంద్రపాలిత ప్రాంతానికి ప్రత్యేక శాసనసభను, మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, గోవాలకు శాసనసభలను, మంత్రివర్గాన్ని ఏర్పరిచారు.

15వ సవరణ (1963, అక్టోబర్ 5)

- సవరించిన ప్రకరణలు: 124, 128, 217, 222, 224, 226, 297, 311, 316 .
నూతనంగా ప్రకరణ 224 ఎ చేర్చారు. 7వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు

1. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచారు.
2. హైకోర్టులో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులను పునర్నియమించే అవకాశం కల్పించారు.
3. హైకోర్టు పరిధిని విస్తరించారు.
4. ఉద్యోగుల తొలగింపునకు సంబంధించి రాష్ట్రపతి, గవర్నర్ అధికారాలను సవరించారు.

16వ సవరణ (1963, అక్టోబర్ 5)

- 19, 84, 173 ప్రకరణలను, 3వ షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
ప్రకరణ 19లోని స్వేచ్ఛా హక్కుపై పరిమితులు. ఎంపీ, ఎమ్మెల్యే, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పదవీ ప్రమాణ స్వీకార ప్రక్రియలో మార్పు.

17వ ప్రకరణ (1964, జూన్ 20)

- ప్రకరణ 31 ఎ, 9వ షెడ్యూల్‌ని సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఎస్టేట్ పద నిర్వచనాన్ని మార్చారు. వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకుంటే మార్కెట్ విలువ చెల్లించాలి.

18వ సవరణ (1966, ఆగస్టు 27)

- ప్రకరణ 3ని సవరించారు.
- ప్రకరణ 3లోని 'రాష్ట్రం' అనే మాటను పునర్నిర్వచించారు. పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లను పునర్వ్యవస్థీకరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

19వ సవరణ (1966, డిసెంబర్ 11)

- సవరించిన ప్రకరణ–324
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ముఖ్యాంశాలు
ఎన్నికల వివాదాలకు సంబంధించి ఎన్నికల ట్రిబ్యునల్ ఏర్పాటు.

20వ సవరణ (1966, డిసెంబర్ 22)

- నూతనంగా ప్రకరణ 233 ఎ చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

ముఖ్యాంశాలు:

- ఈ సవరణ ద్వారా జిల్లా జడ్జీల నియామక ప్రాతిపదికను రాజ్యాంగంలో చేర్చారు.

21వ సవరణ (1967, ఏప్రిల్ 10)

- ఎనిమిదో షెడ్యూల్‌ను సవరించారు.
- సింధీని 15వ అధికార భాషగా 8వ షెడ్యూల్‌లో చేర్చారు.

22వ సవరణ (1969, సెప్టెంబర్ 25)

- 244 ఎ, 371 బి, 275 (1ఎ) ప్రకరణ లను కొత్తగా చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- మేఘాలయను స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాంతంగా ఏర్పాటు చేశారు.
- అసోం రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక ప్రాధాన్యాలు కల్పించారు.

23వ సవరణ (1970, జనవరి 23)

- 330, 332, 333, 334 ప్రకరణలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో షెడ్యూల్ కులాలు, తరగతులు, ఆంగ్లో ఇండియన్ల రిజర్వేషన్లను 1980 వరకు పొడిగించారు.

24వ సవరణ (1971, నవంబర్ 5)

- 13, 368 ప్రకరణలను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నయినా సవరించే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించారు.

25వ సవరణ (1972, ఏప్రిల్ 20)

- సవరించిన ప్రకరణ–31.
- కొత్తగా చేర్చిన ప్రకరణ– 31 సి.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.
- ముఖ్యాంశాలు
- 'నష్టపరిహారం' అనే పదం స్థానంలో 'కొంత మొత్తం' అనే పదాన్ని చేర్చారు. ఆదేశిక నియమాల్లోని 39 (బి), (సి) అమలుకు చట్టాలు చేస్తే వాటిని న్యాయస్థానాలు ప్రశ్నించరాదు.

26వ సవరణ (1971, డిసెంబర్ 28)

- సవరించిన ప్రకరణ–366; నూతనంగా చేర్చిన ప్రకరణ– 363 ఎ; తొలగించిన ప్రకరణలు– 291, 362.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- రాజవంశస్తులకు ఇచ్చే రాజభరణాలు, ప్రత్యేక సదుపాయాలను రద్దు చేశారు.

27వ ప్రకరణ (1972, ఫిబ్రవరి 15)

- 239 ఎ, 240 ప్రకరణలను సవరించారు; నూతనంగా ప్రకరణ 371 సి చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఈశాన్య రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించారు. ప్రకరణ 371 సి ప్రకారం మణిపూర్‌కు మంత్రిమండలి, అసెంబ్లీని ఏర్పాటు చేశారు.

28వ ప్రకరణ (1972, ఆగస్టు 29)


- నూతనంగా ప్రకరణ 312 ఎని చేర్చి.. ప్రకరణ 314ను తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఇండియన్ మాజీ సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు గల ప్రత్యేక హక్కులు, హోదాలను తొలగించారు.

29వ సవరణ (1972, జూన్ 9)

- తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- కేరళ రాష్ట్ర భూ సంస్కరణల చట్టాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

30వ సవరణ (1973, ఫిబ్రవరి 27)

- సవరించిన ప్రకరణ – 133
- సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లేందుకు గల రూ.20 వేల పరిమితిని తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.



31వ సవరణ (1973, అక్టోబర్ 17)

- సవరించిన ప్రకరణలు – 81, 330, 332.
- లోక్‌సభ సీట్ల సంఖ్యను 525 నుంచి 545కు పెంచారు. కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 25 నుంచి 20కి తగ్గించారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

32వ సవరణ (1974, జూలై 1)

- 371 ఎ ప్రకరణను సవరించి.. కొత్తగా 371 డి, 371 ఇ ప్రకరణలను చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.
- ఆరు సూత్రాల పథకాన్ని చేర్చారు.
- 371–ఇ ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

33వ ప్రకరణ (1974, మే 19)

- సవరించిన ప్రకరణలు– 101, 190.
- పార్లమెంటు, శాసనసభ్యుల రాజీనామా పత్రాన్ని సభాధ్యక్షుడు తప్పనిసరిగా ఆమోదించాలనే నిబంధనను తొలగించారు. సభ్యుడు ఇష్టపూర్వకంగా/స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నాడని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే స్పీకర్ లేదా చైర్మన్ రాజీనామాను ఆమోదించాలి.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

34వ ప్రకరణ (1974, సెప్టెంబర్ 7)

- తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- తొమ్మిదో షెడ్యూల్ అధికార పరిధిని పెంచారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

35వ సవరణ (1975, మార్చి 1)

- 80, 81 ప్రకరణలను సవరించి.. కొత్తగా ప్రకరణ 2 ఎ చేర్చారు.
- సిక్కింకు సహ రాష్ట్ర హోదా కల్పిస్తూ పదో షెడ్యూల్‌ను కొత్తగా చేర్చారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

36వ సవరణ (1975, ఏప్రిల్ 26)

- నూతనంగా ప్రకరణ 371 ఎఫ్ చేర్చి.. ప్రకరణ 2ఎను తొలగించారు.
- సిక్కింకు పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పించారు. సిక్కిం 22వ రాష్ట్రంగా ఏర్పడింది. పదో షెడ్యూల్‌ను తొలగించారు.
- రాష్ట్రాల ఆమోదం పొందింది.

37వ సవరణ (1975, మే 3)

- నూతనంగా 239ఎ, 240 ప్రకరణలు చేర్చారు. కేంద్ర పాలిత ప్రాంత హోదా గల అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రదేశ్ కౌన్సిల్ స్థానంలో లెజిస్లేటివ్ అసెంబ్లీ, కౌన్సిలర్ల స్థానంలో మంత్రిమండలి ఏర్పాటు.
- రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

38వ సవరణ (1975, ఆగస్టు 1)

- సవరించిన ప్రకరణలు: 123, 213, 239 బి 352, 356, 359, 360.
ముఖ్యాంశాలు:

1. రాష్ట్రపతి, గవర్నర్, లెఫ్టినెంట్ గవర్నర్ జారీచేసే ఆర్డినెన్స్‌లు కోర్టుల అధికారాల పరిధిలోకి రావని తీర్మానించారు.
2. రాష్ట్రపతి విధించే అత్యవసర పరిస్థితిని కోర్టుల అధికార పరిధి నుంచి తప్పించారు. న్యాయ సమీక్షకు గురికాదు.

- రాష్ట్రాల ఆమోదం పొందింది.

39వ సవరణ (1975, ఆగస్టు 10)

- 71, 329 ప్రకరణలతో పాటు తొమ్మిదో షెడ్యూల్‌ను సవరించారు.
- రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి , లోక్‌సభ స్పీకర్ ఎన్నికకు సంబంధించిన అంశాలు న్యాయసమీక్ష పరిధిలోకి రావు.
- తొమ్మిదో షెడ్యూల్‌లో నూతన చట్టాలను చేర్చారు.రాష్ట్రాల ఆమోదం అవసరం లేదు.

40వ ప్రకరణ (మే 27, 1976)

- 31 బి, 297 ప్రకరణలతో పాటు 9వ షెడ్యూల్‌ను సవరించారు.
- తన అధికార పరిధిలోని భౌగోళిక జలాలపై భారతదేశానికి పూర్తి హక్కు ఉంటుంది. దీనికి సంబంధించిన చట్టాలు చేసే అధికారాన్ని పార్లమెంటుకు కట్టబెట్టారు.
- తొమ్మిదో షెడ్యూల్‌లో నూతన చట్టాలను చేర్చారు.

శీతాకాలంలో వలస వెళ్లే పక్షులకు ఉదాహరణ?

ప్రాక్టీస్ టెస్ట్

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

1. రాజుకు రే చీకటి ఉందని డాక్టర్ నిర్ధారించాడు. మరి రాజు కిందివాటిలో దేనికి సంబంధించి ఉంటాడు?
   1) ఎక్కువ వెలుతురు, రాత్రుల్లో వస్తువు లను చూడలేడు.
   2) రంగు వస్తువులను, పగటిపూట వస్తువులను చూడలేడు.
   3) తక్కువ వెలుతురులో, రాత్రిపూట వస్తువులను చూడలేడు.
   4) రాత్రిపూట వస్తువులను చూస్తాడు, పగటిపూట వస్తువులను చూడలేడు.
2. మలేరియా పరాన్నజీవి జీవిత చక్రానికి సంబంధించి సరైంది?
   1) లైంగిక చక్రం దోమలో జరుగుతుంది. అలైంగిక చక్రం మానవుడిలో జరుగుతుంది.
   2) లైంగిక, అలైంగిక చక్రాలు మానవుడి లో జరుగుతాయి.
   3) అలైంగిక చక్రం దోమలో జరుగుతుంది. లైంగిక చక్రం మానవుడిలో జరుగు తుంది.
   4) లైంగిక, అలైంగిక చక్రాలు అవకాశాన్ని బట్టి వేటిలోనైనా జరగవచ్చు.
3. అండకోశానికి సంబంధించిన కణాలే ఒక దానితో ఒకటి సంయోగం చెంది ఏర్పడే కణం?
   1) సంయుక్త బీజం
   2) ద్వితీయ కేంద్రకం
   3) అంకురచ్ఛదం
   4) ప్రతిపాద కణం
4. మొక్క ఆహార కర్మాగారంగా దేన్ని పేర్కొంటారు?
   1) విత్తనం 2) అండకోశం
   3) వేరు 4) పత్రం
5. ప్రొజెస్టిరాన్ హార్మోన్ పని?
   1) గ్లైకోజన్‌ను గ్లూకోజ్‌గా మార్చడం.
   2) గాయిటర్ రాకుండా కాపాడడం.
   3) గర్భాశయ పెరుగుదల, జరాయువు ఏర్పడడం.
   4) నపుంసకత్వం రాకుండా ఉండడం.
6. సహజ శత్రువులైన కీటకాలను ప్రవేశపెట్టి కలుపు మొక్కలను నాశనం చేసే పద్ధతి?
   1) బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతి
   2) జీవక్రియా విధాన పద్ధతి
   3) భౌతిక పద్ధతి
   4) రసాయన పద్ధతి
7. స్పర్శ గ్రాహకాలు ఏ భాగాలపై ఎక్కువగా ఉంటాయి?
   1) వేళ్ల కొనలపై
   2) నొసటి ప్రాంతంలో
   3) పెదవులపై 4) 1, 3
8. కిందివాటిలో ఏ రుచికి చెందిన గ్రాహకాలు నాలుక వెనుక భాగంలో ఉంటాయి?
   1) తీపి 2) ఉప్పు
   3) పులుపు 4) చేదు
9. పాములు వాటి శాస్త్రీయ నామాలకు సంబంధించి సరైన జత?
   ఎ) తాచుపాము – రస్సెల్స్ వైపర్
   బి) కట్లపాము – ఓఫియోఫెగస్ హెన్న
   సి) ఎకిస్ కారినేటా– సాస్కేల్ వైపర్
   డి) రక్తపింజర– బంగారస్ ఫాసియేటస్
   1) ఎ, సి 2) సి, డి
   3) బి, డి 4) ఎ, డి
10. చిన్న పిల్లల్లో అతి సామాన్యంగా కలిగే చర్మ వ్యాధి గజ్జిని కలిగించే క్రిమి ఏ వర్గానికి చెందింది?
    1) ప్లాటి హెల్మింథిస్ 2) ప్రోటోజోవా
    3) ఆర్థ్రోపొడా 4) నిమాటిహెల్మింథిస్
11. కిందివాటిలో వేటిని బయోఎరువులుగా ఉపయోగిస్తారు?
    1) ఆకుపచ్చ శైవలాలు
    2) నీలి ఆకుపచ్చ శైవలాలు
    3) గోధుమ వర్ణపు శైవలాలు 4) పైవన్నీ
12. 'రూబియోలా' అనే మరో పేరు కలిగిన వ్యాధి?
    1) ఆటలమ్మ 2) తట్టు (పొంగు)
    3) పోలియో (శిశు పక్షవాతం)
    4) గవద బిళ్లలు
13. అలిసిపోవడం, శ్లేష్మంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం వంటి లక్షణాలను గుర్తించిన డాక్టర్ ఆ వ్యాధిగ్రస్తుడికి ఏ వ్యాధి ఉంది అని నిర్ధారిస్తాడు?
    1) కుష్టు 2) క్షయ
    3) మలేరియా 4) కోరింత దగ్గు
14. కిందివాటిలో ఏ రెండు ప్రవచనాలు సరైనవి?
    ఎ)చింతకాయ, మామిడి, నిమ్మ మొదలైన వాటిని పొగబెట్టడం ద్వారా నిల్వ చేస్తారు.
    బి) బ్యాక్టీరియా వేగంగా వృద్ధి చెందడానికి తగిన ఉష్ణోగ్రత 20°C- 40°C
    సి) ఈస్ట్‌లు ఆమ్ల ద్రావణంలో వృద్ధి చెందుతాయి.
    డి) ఎఫ్లోటాక్సిన్ కాలేయాన్ని పాడు చేస్తుంది.
    1) ఎ, బి 2) సి, డి
    3) బి, డి 4) ఎ, సి
15. మంచి కలపను ఇచ్చే ఇండియన్ రోజ్‌వుడ్ శాస్త్రీయ నామం?
    1) టిక్టోనియా గ్రాండిస్
    2) షొరియా రొబస్టా
    3) డాల్‌బర్జియా లాటిఫోలియా
    4) అజార్డికా ఇండికా
16. కేన్సర్‌కు సంబంధించి కిందివాటిలో ఏది సరైన జత?
    1) మాలిగ్నెంట్ – ఊపిరితిత్తులు ప్రమాదకరం కావు.
    2) కార్సినోమా– ఉపకళా కణాలకు వచ్చే కాన్సర్
    3) అపాయం చేయని వ్రణాలు – కార్సి నోమా
    4) ఇతర భాగాలకు సోకే గడ్డలు– బినైన్ గడ్డలు.
17. గోళ్లు, రోమాలు, కొమ్ములు వంటి జంతు నిర్మాణాలు ఏ కణజాలం నుంచి తయారవుతాయి?
    1) సంయోజక కణజాలం
    2) కండర కణజాలం
    3) అస్థి కణజాలం
    4) ఉపకళా కణజాలం
18. ప్రౌఢ మానవుడిలో ఉండే కుంతకాల సంఖ్య?
    1) 4 2) 8
    3) 10 4) 12
19. మానవుడి జీర్ణ క్రియలో సెల్యులోజ్ తంతువుల ఉపయోగం కానిది?
    1) ఆహారానికి బరువును చేకూర్చడం.
    2) పేగులో ఆహారం సులువుగా జారేట్లు చేయడం.
    3) ప్రొటీన్‌ల జీర్ణ క్రియలో ఉపయోగపడడం.
    4) జీర్ణమైన పోషకాలను సమర్థవంతంగా పీల్చుకునేటట్లు చేయడం.
20. ఇతర జంతువులతో పోల్చినప్పుడు నెమరువేసే జంతువుల్లో గ్లూకోజ్ మట్టం ఏ విధంగా ఉంటుంది?
    1) అతి ఎక్కువగా 2) సమానంగా
    3) అతి తక్కువగా 4) కొలవలేం
21. ఈ కిందివాటిలో ఏది ఆంత్ర రసంలో మాత్రమే ఉంటుంది?
    1) ఎమిలాప్సిన్ 2) ట్రిప్సిన్
    3) ఎంటిరోకైనేస్ 4) కీమోట్రిప్సిన్
22. కిందివాటిలో ఏ జీవి నీలం రంగు రక్తాన్ని కలిగి ఉంటుంది?
    1) వానపాము 2) కప్ప
    3) నత్త 4) బొద్దింక
23. కిందివాటిలో కీటకాహారి మొక్క కానిది?
    1) డ్రాసిరా 2) నెపంథిస్
    3) డైమోనియా 4) కస్కుటా
24. పత్ర రంధ్రాలు తెరుచుకోవడం, మూసుకోవడం కిందివాటిలో ఏ చర్యపై ఆధారపడి ఉంటాయి?
    1) విసరణ 2) బాష్పోత్సేకం
    3) కిరణజన్యసంయోగక్రియ
    4) వేరు పీడనం
25. కిందివాటిలో ఏ జీవి ద్రవ రూపంలో ఉన్న ఆహారాన్ని మాత్రమే తీసుకుంటుంది?
    1) నత్త 2) వానపాము
    3) ఈగ 4) చేప
26. సాధారణంగా శాఖాహార జంతువుల్లో ఏ దంతాలు లోపిస్తాయి?
    1) కుంతకాలు 2) రదనికలు
    3) చర్వణకాలు 4) అగ్రచర్వణకాలు
27. కిందివాటిలో ఏ జీవి విసర్జక పదార్థంగా యూరికామ్లాన్ని విసర్జిస్తుంది?
    1) కప్ప 2) చేప
    3) వానపాము 4) బొద్దింక
28. పట్టుపురుగులు–గొంగళి పురుగులు కిందివాటిలో ఏ రకం భక్షక విధానానికి ఉదాహరణ?
    1) ఏకరక భక్షణ 2) బహుళరక భక్షణ
    3) జాంతవ భక్షణ 4) సర్వ భక్షణ

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4
5) 3	6) 2	7) 4	8) 4
9) 2	10) 3	11) 2	12) 2
13) 2	14) 3	15) 3	16) 2
17) 4	18) 2	19) 3	20) 3
21) 3	22) 3	23) 4	24) 2
25) 3	26) 2	27) 4	28) 1

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

కుద్రేముఖ్ నేషనల్ పార్క్ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ



- 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా వన్య ప్రాణుల సంరక్షణను రాష్ట్ర జాబితా నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చారు.
- మన దేశంలో అంతరించిపోతున్న జంతువుల సంరక్షణకు 'వన్య మృగ సంరక్షణ చట్టం ప్రకారం (1972)' అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. అవి..

1. ప్రాజెక్టు టైగర్ - 1973
2. ప్రాజెక్టు క్రోకడైల్ - 1975
3. ఆపరేషన్ సీ టర్టిల్ - 1975
4. ప్రాజెక్టు ఎలిఫెంట్ - 1992
5. ప్రాజెక్టు స్నో లెపర్డ్ - 2009

- దేశంలో అంతరించిపోతున్న పులులను సంరక్షించేందుకు 1973, ఏప్రిల్ 1న ప్రాజెక్టు టైగర్/ఆపరేషన్ టైగర్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.
- టైగర్ టాస్క్ ఫోర్స్ సిఫార్సుల మేరకు దేశంలో జాతీయ పులుల సంరక్షణ అధీకృత సంస్థ (ఎన్‌టీసీఏ) ఏర్పడింది. ఇది 'ప్రాజెక్టు టైగర్', టైగర్ రిజర్వ్‌ల నిర్వహణను పునర్వ్యవస్థీకరించడంలో భాగంగా ఏర్పడింది. దేశంలో ప్రస్తుతం 50 టైగర్ రిజర్వులు ఉన్నాయి.
- దేశంలో తొలిసారిగా ఏర్పాటుచేసిన టైగర్ రిజర్వ్ బందీపూర్ టైగర్ రిజర్వ్ (కర్ణాటక).
- **దేశంలో అతి పెద్ద టైగర్ రిజర్వ్:** నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ (రాజీవ్‌గాంధీ టైగర్ రిజర్వ్).
- **దేశంలో అతి చిన్న టైగర్ రిజర్వ్:** ఒరంగ్ టైగర్ రిజర్వ్ (అసోం).
- **దేశంలో ఏర్పాటైన 48వ టైగర్ రిజర్వ్:** రాజాజీ టైగర్ రిజర్వ్ (ఉత్తరాఖండ్).
- **49వ టైగర్ రిజర్వ్:** ఒరంగ్ టైగర్ రిజర్వ్ (అసోం).
- **50వ టైగర్ రిజర్వ్:** కమ్లాంగ్ టైగర్ రిజర్వ్ (అరుణాచల్‌ప్రదేశ్).
- దేశంలో ప్రస్తుతం పులుల సంఖ్య 3,682
- ప్రస్తుతం దేశంలో పులుల లెక్కింపునకు ఉపయోగిస్తున్న పద్ధతి GIS (Global Imaging Satellite System). ప్రతి నాలుగేళ్లకోసారి పులులను లెక్కిస్తారు.
- పులులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం కర్ణాటక. తర్వాతి స్థానంలో ఉన్నది ఉత్తరాఖండ్.
- పులుల సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతం కజిరంగ (అసోం).

2. **ప్రాజెక్టు క్రోకడైల్:** ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ) సహకారంతో ఈ ప్రాజెక్టు భారతదేశంలో 1975లో ప్రారంభమైంది.

- దేశంలో అత్యంత వేగంగా అంతరిస్తున్న మొసళ్ల జాతి ఘరియల్. వీటిని చంబల్ వన్యప్రాణి కేంద్రం (National Chambal Gharial Wildlife Sanctuary)లో సంరక్షిస్తున్నారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
- మొసళ్ల సంరక్షణకు తమిళనాడులో 'మద్రాస్ క్రోకడైల్ బ్యాంక్ ట్రస్ట్' ఉంది.

3. **ఆపరేషన్ సీ టర్టిల్:** దీన్ని మన దేశంలో 1975లో ప్రారంభించారు.

- దేశంలోని తాబేళ్ల సంరక్షణ ప్రాంతాలు..
  1. **గహిర్మాత బీచ్:** ఇది ఒడిశాలో ఉంది. ఇక్కడ సంరక్షిస్తున్న తాబేళ్ల జాతి ఆలివ్ రిడ్లే. వీటిని మన దేశంలో నక్షత్ర తాబేళ్లు అంటారు.
  2. **ట్యుటికోరిన్ బీచ్:** ఇది తమిళనాడులో ఉంది. ఇక్కడ సంరక్షిస్తున్న తాబేళ్ల జాతి హాక్స్‌బిల్.

3. **ప్రాజెక్టు ఎలిఫెంట్:** ఏనుగుల సంరక్షణకు 8వ పంచవర్ష ప్రణాళికా కాలం (1992-97)లో 'ప్రాజెక్టు ఎలిఫెంట్'ను ప్రారంభించారు.

- ప్రస్తుతం దేశంలో దాదాపు 30 ఎలిఫెంట్ రిజర్వ్‌లు ఉన్నాయి. ఎలిఫెంట్ సెన్సస్ (2017) ప్రకారం 23 రాష్ట్రాల్లో 27,312 ఏనుగులు ఉన్నాయి. అత్యధికంగా కర్ణాటకలో 6,049 ఏనుగులు ఉన్నాయి. తర్వాతి స్థానంలో అసోం (5,719), కేరళ (3,054) ఉన్నాయి. ప్రాంతాల వారీ చూస్తే దక్షిణ భారతంలో అత్యధికంగా 11,960 ఏనుగులు ఉన్నాయి.

4. **ప్రాజెక్ట్ స్నో లెపర్డ్ (మంచు చిరుత):** మన దేశంలో మంచు చిరుతల సంరక్షణకు 2009, జనవరి 20న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- ఇందులో భాగంగా ఐదు రాష్ట్రాల్లో మంచు చిరుతలను కాపాడుతున్నారు. అవి..

1. జమ్ముకశ్మీర్ 2. హిమాచల్‌ప్రదేశ్
3. ఉత్తరాఖండ్ 4. ఉత్తరప్రదేశ్
5. అరుణాచల్‌ప్రదేశ్

దేశంలోని వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు

గతంలో అత్యధిక జీవ వైవిధ్యం గల భౌగోళిక ప్రాంతాలు ప్రస్తుతం మానవ కార్యకలాపాల వల్ల ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వాటిని ఎకలాజికల్ హాట్‌స్పాట్స్ అంటారు.

భారత్‌లోని ప్రధాన హాట్‌స్పాట్స్..

1. ఈశాన్య హిమాలయ ప్రాంతం.
2. పశ్చిమ కనుమలు.
3. ఇండో-బర్మా ప్రాంతం.

- జన్యుపరమైన తేడాలు, జాతుల్లో వైవిధ్యం, ఆవరణ వ్యవస్థలో భిన్న గుణాలన్నింటినీ కలిపి జీవవైవిధ్యం అంటారు.

(లేదా)

ఒక ప్రదేశంలోని వివిధ జీవజాతుల సంక్లిష్ట సహచరమే జీవవైవిధ్యం.

- జీవ వైవిధ్యం అనే పదాన్ని 1986లో అమెరికా శాస్త్రవేత్త వాల్టర్ రోసెన్ ప్రతిపాదించారు.
- ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం మే 22
- మన దేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) చెన్నైలో ఉంది. బయలాజికల్ డైవర్సిటీ యాక్ట్ (2002) అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2003లో ఎన్‌బీఏను ఏర్పాటు చేసింది.
- జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం రెండు రకాల వ్యూహాలను రూపొందించింది. అవి..

1. ఆవాసాంతర రక్షణ
2. ఆవాసేతర రక్షణ

1. **ఆవాసాంతర రక్షణ:** ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జీవజాతులను అవే సహజ సిద్ధ పరిసరాల్లో సంరక్షించడాన్ని ఆవాసాంతర రక్షణ అంటారు. ఇందులో భాగంగా చేపట్టే కార్యక్రమాలు..
   1. బయోస్పియర్ రిజర్వ్‌లు
   2. జాతీయ పార్కులు
   3. వన్య మృగ సంరక్షణ కేంద్రాలు
2. **ఆవాసేతర రక్షణ:** ఏదైన ఒక భౌగోళిక ప్రాంతంలో అంతరించిపోయే స్థితిలో ఉన్న జీవ జాతులను వాటి సహజసిద్ధ పరిసరాలకు వెలుపల మానవ ప్రమేయంతో సంరక్షించే విధానాన్ని ఆవాసేతర రక్షణ అంటారు. ఇందులో భాగంగా చేపట్టే కార్యక్రమాలు..
   1. జంతు ప్రదర్శనశాలలు, బొటానికల్ గార్డెన్ల ఏర్పాటు.
   2. జన్యు బాంకుల ఏర్పాటు.
   3. బీజద్రవ్య బ్యాంకుల ఏర్పాటు.

1. **బయోస్పియర్ రిజర్వ్‌లు(జీవావరణ మండలాలు):** జీవరాశుల మధ్య సమగ్రతను కాపాడటం, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య అధ్యయనం, జీవవైవిధ్య పరిరక్షణ తదితర లక్ష్యాల సాధనకు ప్రభుత్వం బయోస్పియర్ రిజర్వ్‌లను ఏర్పాటు చేసింది.

- బయోస్పియర్ రిజర్వ్‌ల సరిహద్దును పార్లమెంట్ నిర్ణయిస్తుంది. వీటిలో పర్యటనకు ఎలాంటి అనుమతులూ ఉండవు. కానీ పరిశోధనకు ప్రోత్సాహం ఉంటుంది.
- మన దేశంలో తొలి బయోస్పియర్ రిజర్వ్‌ను 1986లో నీలగిరి ప్రాంతంలో (తమిళనాడు) ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మన దేశంలో 18 బయోస్పియర్ రిజర్వ్‌లు ఉన్నాయి.
- మన దేశంలో చివరిసారిగా (2011లో) పన్నా బయోస్పియర్ రిజర్వ్‌ను ప్రకటించారు. ఇది మధ్యప్రదేశ్‌లో ఉంది.
- యునెస్కో జాబితాలో చేర్చిన భారత బయోస్పియర్‌ల సంఖ్య పది.

2. **జాతీయ పార్కులు:** వృక్ష, జంతు జాతులను; ప్రకృతి సముదాయాన్ని సంరక్షించి అభివృద్ధి చేసే ప్రాంతాలను జాతీయ పార్కులు అంటారు. ఉదా: కుద్రేముఖ్ (కర్ణాటక).

- మన దేశంలో 1936లో తొలి జాతీయ పార్క్ (Hailey National Park)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీన్ని జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది ఉత్తరాఖండ్‌లో ఉంది.

బయోస్పియర్ రిజర్వ్‌లు	ఉన్న ప్రాంతం
1. నీలగిరి (1986)	తమిళనాడు/కేరళ/కర్ణాటక
2. నందాదేవి (1988)	ఉత్తరాఖండ్
3. నోక్రెక్ (1988)	మేఘాలయ
4. మానస్ (1989)	అసోం
5. సుందర్‌బన్స్ (1989)	పశ్చిమబెంగాల్
6. గల్ఫ్ ఆఫ్ మన్నార్ (1989)	తమిళనాడు
7. గ్రేట్ నికోబార్ (1989)	అండమాన్, నికోబార్
8. సిమ్లిపాల్ (1994)	ఒడిశా
9. దిబ్రూ-సైఖోవా(1997)	అసోం
10. దిహాంగ్-దిబంగ్ (1998)	అరుణాచల్ ప్రదేశ్
11. పంచమర్హి (1999)	మధ్యప్రదేశ్
12. కాంచనగంగ (2000)	సిక్కిం
13. అగస్త్యమలై (2001)	కేరళ/తమిళనాడు
14. అచానక్‌మర్-అమర్ కంటక్ (2005)	ఛత్తీస్‌గఢ్ మధ్యప్రదేశ్
15. గ్రేట్ రాణ్ ఆఫ్ కచ్ (2008)	గుజరాత్
16. కోల్డ్ డెజర్ట్ (శీతల ఎడారి) (2009)	హిమాచల్ ప్రదేశ్
17. శేషాచలం కొండలు (2010)	ఆంధ్రప్రదేశ్
18. పన్నా (2011)	మధ్యప్రదేశ్

They act just like human beings!



Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. When we moved (1)/ we have to put (2)/ our furniture in storage (3)/ for a while. (4) No error (5)
2. She knows that (1)/ child (2)/ had been telling (3)/ stories again. (4) No error (5)
3. The only stipulation is (1)/ that the topic you choose (2)/ must be related (3)/ to yours studies. (4) No error (5)
4. We are learning to (1)/ step back from ourselves (2)/ and identity (3)/ our strengths and weaknesses. (4) No error (5)
5. Books provides (1)/ with ideas (2)/ and a stimulus (3)/ for play. (4) No error (5)
6. Children from (1)/ certain backgrounds tend for (2)/ stereotyped by (3)/ their teachers. (4) No error (5)
7. The team coach (1)/ forced to step into stop (2)/ the two athletes from (3)/ coming to blows. (4) No error (5)
8. She stationed (1)/ at the window (2)/ to await for (3)/ his return. (4) No error (5)
9. The procession (1)/ made it's stately progress (2)/ through the streets (3)/ of the city. (4) No error (5)
10. The remains (1)/ of the building (2)/ stand as a stark remainders (3)/ of the fire. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. These _____ are intended to smooth the ___ to a peace treaty.
    1) negotiations; path
    2) talks; pavement
    3) arbitration; road
    4) dialogues; process
    5) confrontations; dispute
12. We tried to contact all ___ students, but one or two ____ the net.
    1) former; missed
    2) passed; forgotten
    3) failed; overlooked
    4) previous; forgot
    5) former; skip
13. The findings of the report _____ slanted in favour of the manufacturers.
    1) are been 2) were been
    3) had been 4) has been
    5) is been
14. The rise in _____ is a clear _____ that the government's policies are not working.
    1) popularity; signature
    2) population; progress
    3) prices; signal
    4) people; symptom
    5) places; pause
15. Chest pains can be a _____ of heart problems.
    1) recurring tension
    2) warning signal
    3) mounting pressure
    4) indicator 5) pulsation

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. As with people some monkeys are lazy, like those who sleep all day in the zoo, and some are industrious, like the little fellows who collect pennies for the organ-grinder.
B. If you invite them to dinner, they can sit quite comfortably in real chairs and use a knife and fork exactly as you.
C. As a matter of fact, Monkeys are like people, when certain kinds of monkeys are domesticated, they act just like human beings.
D. They smoke cigars, drink beer and look almost human when dressed.
E. Sometimes he even leads them in singing, first howling some weird notes, then signaling his companions to join in the chorus.
F. In speaking of monkeys which act like human beings, mention should be made of the Brazilian monkey which often balances himself on the top of a tree and makes a speech to the monkeys below him.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) D
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F

Directions (Q. No. 21 - 25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

21. When I arrived, I have the sensation that she had been expecting me.
    1) has 2) will have
    3) will be having 4) had
    5) No correction required
22. We are concrete seeking new ways of expanding our membership.
    1) evidently 2) firstly
    3) vastly 4) currently
    5) No correction required
23. You will perhaps discover, that practice does help, that success does come with effort and determination and a positive mindset.
    1) has come
    2) will come
    3) would come
    4) will be coming
    5) No correction required
24. The brightest persons in a class are not always the good students.
    1) comparable 2) winner
    3) best 4) active
    5) No correction required
25. I hired a cleaning lady who comes in twice a month and is now in disposable.
    1) indisposable 2) indisputable
    3) indispensable 4) incorrigible
    5) No correction required

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Delivering mail to small villages in India was once a difficult, **perilous** and exciting job. The postman traveled on foot, often wading through swamps or crawling through jungles in order to reach the many villages on his route.

The Indian mailman might sometimes encounter a fierce tiger or panther along the way, yet the only weapon he carried was a sharp spear. He never went to work without his bells, which he would shake in order to **ward off** evil spirits. Wild animals or evil spirits, nothing ever interrupted his work.

The Indian letter carrier was an honoured and respected person; he was treated with great courtesy. So wise he thought to be that he was frequently called upon to solve the village disputes.

It is certainly evident that only a very brave man would take a job that **compelled** him to fight off wild animals in order to get his work done. You can understand why everyone in India looked upon the man who delivered mail as a true national hero.

26. Which statement is true?
    a. Mailmen in India were considered heroes.
    b. Some people in India used to believe in evil spirits.
    1) Only a 2) Only b
    3) Both a and b
    4) Neither a nor b
    5) Either a or b
27. Which statement is false?
    a. The letter carrier was often asked to settle disputes in the villages that he visited.
    b. An Indian mailman used to carry modern weapons as protection against wild animals.
    1) Only a 2) Only b
    3) Both a and b
    4) Neither a nor b
    5) Either a or b
28. The synonym of **ward off** is
    1) Encourage 2) Protest
    3) Keep 4) Deflect
    5) Depend
29. The antonym of **perilous**
    1) Hazardous 2) Bounty
    3) Terrifying 4) Harmless
    5) Detrimental
30. The antonym of **compelled**
    1) Obliged 2) Constrained
    3) Bound 4) Chained
    5) Liberated

Directions (Q. No. 31-40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A professor at an eastern college _____ (31) that the special sense the visually challenged people _____ (32) on is connected in some way with ___ (33) hearing. The professor _____ (34) described 1500 tests in which blind people and people with normal sight, but blindfolded, _____ (35) to avoid walking into walls. The visually challenged passed the tests with greater ____ (36) than those who could see. The blind would _____ (37) forward confidently, sensing the wall when they were as much as fifteen feet _____ (38) it. They claimed that their ears sent them a warning _____ (39) that the wall was near. This seems quite possible, for when their ears were covered so that they could not hear; they often ran right _____ (40) the wall. You can imagine how valuable this strange power must be to the blind. Do you think that it is nature's way of making up to them for their lost sight?

31. 1) believes 2) deem
    3) judge 4) accept 5) doubt
32. 1) grasp 2) depend
    3) relay 4) reel
    5) realize
33. 1) there 2) they
    3) their 4) them 5) that
34. 1) lately 2) newly 3) just
    4) recently 5) freshly
35. 1) attempt 2) attempting
    3) attempts 4) will attempt
    5) attempted
36. 1) ease 2) difficulty
    3) effort 4) relieve
    5) alleviate
37. 1) stepping 2) stride
    3) tramp 4) tumble
    5) amble
38. 1) through 2) thorough
    3) from 4) away 5) apart
39. 1) memo 2) letter
    3) meaning 4) message 5) point
40. 1) inside 2) outside
    3) inwards 4) in 5) into

Directions (Q. No. 41-42): choose the wrongly spelt word from the five options given.

41. 1) Cemetery 2) Scenary
    3) Scenario 4) Composure
    5) Predicament
42. 1) Stationery 2) Stationary
    3) Impeccabal 4) Juggernaut
    5) Delicious

Directions (Q. No. 43-45): In each of the following four sets of words a set is either synonymous or antonymous, identify that set and mark your answer.

43. 1) Luscious; Sacrilege
    2) Prophecy; Luxurious
    3) Somersault; Impediment
    4) Obnoxious; Abhorrent
    5) None of these
44. 1) Atrocious; Oblige
    2) Entourage; Tourist
    3) Ensemble; Entangle
    4) Pilfer; Embezzle
    5) None of these
45. 1) Ensconce; Shelve
    2) Acrimonious; Corrigible
    3) Sanctimonious; Succulent
    4) Corrigendum; Adjudicate
    5) None of these

Answers

1) 2; 2) 1; 3) 4; 4) 3;
5) 1; 6) 2; 7) 2; 8) 3;
9) 2; 10) 3; 11) 4; 12) 1;
13) 3; 14) 3; 15) 2; 16) 4;
17) 2; 18) 5; 19) 3; 20) 1;
21) 4; 22) 4; 23) 5; 24) 3;
25) 3; 26) 3; 27) 2; 28) 4;
29) 4; 30) 5; 31) 1; 32) 2;
33) 3; 34) 4; 35) 5; 36) 1;
37) 2; 38) 3; 39) 4; 40) 5;
41) 2; 42) 3; 43) 4; 44) 4;
45) 1.